అనుదినం... జనస్వరం
నవతెలంగాణ
www.navatelangana.com
సమగ్ర తెలుగు దినపత్రిక
మంగళవారం 20-08-2024
సంపుటి : 10 సంచిక : 232
Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar
14 పేజీలు వెల : 6.50

ఏచూరికి స్వల్ప అస్వస్థత

ఎయిమ్స్‌లో చేరిక



న్యూఢిల్లీ : సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. గత రెండు రోజుల నుంచి కాస్తా నీరసంగా ఉన్నారు. దీంతో సోమవారం నాడు ఢిల్లీలోని పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఇంటికి వెళ్తూ మార్గమధ్యలో ఎయిమ్స్‌లో చూపించుకున్నారు. వైద్యులు ఆయనను అడ్మిట్ అవ్వమని సూచించారు. వైద్యుల సూచన మేరకు ఆయన ఆస్పత్రిలో చేరారు. ఆయన ఆరోగ్యం బాగానే ఉందని, వైద్యపరీక్షలు చేస్తున్నామని వైద్యులు తెలిపారు.

సౌర వెలుగులు మరింత భారం

ప్రయివేటు ఉత్పత్తిదారులకు కొమ్ముకాస్తున్న కేంద్ర సర్కార్

ప్రభుత్వ అనాలోచిత విధానాలే కారణం | మాడ్యూల్స్ దిగుమతులపై ఆంక్షలు

కృత్రిమ కొరత సృష్టించి ధరల పెంపు

అసాధారణ లాభాలు దండుకుంటున్న కంపెనీలు

పంచభూతాలతో పక్కా వ్యాపారం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం, తన అనుయాయులకు అధికలాభాలు కట్టబెట్టాలనే కాంక్షతో మితిమీరిన ఆంక్షలు విధించి, జనం జేబులు కొల్లగొట్టేందుకు సహకారాన్ని అందిస్తోంది. దానిలో భాగంగానే సోలార్ విద్యుదుత్పత్తికి కీలకమైన పీవీ మాడ్యూల్స్‌ను నేరుగా విదేశాల నుంచి దిగుమతి చేసుకోరాదని ఆంక్షలు విధించింది. దానితో అతితెలివి ప్రదర్శించే కార్పొరేట్ కంపెనీలు ఆ మాడ్యూల్స్‌కు అవసరమైన విడిభాగాలను వేర్వేరుగా భారతదేశంలోకి దిగుమతి చేసుకొని, ఇక్కడ అసెంబుల్డ్ చేసి, 90 శాతం లాభాలతో దేశీయంగా విక్రయించేస్తున్నాయి. దీనితో సోలార్ విద్యుత్ యూనిట్ ధరలు అమాంతం పెరిగి, సామాన్యులకు భారంగా మారతాయని విద్యుత్‌రంగ నిపుణుల ఎంత మొత్తుకున్నా మోడీ సర్కార్ పెడచెవిన పెడుతుండటం ఆందోళన కలిగించే అంశమే!



నవతెలంగాణ-న్యూఢిల్లీ

ఓ వైపు సౌర విద్యుత్ ఉత్పత్తిని పెంచాలని లక్ష్యంగా నిర్దేశించుకున్న మోడీ ప్రభుత్వం మరోవైపు దానిని నీరుకార్చేలా ఆదేశాలు జారీ చేస్తోంది. దేశీయంగా మాడ్యూల్స్ ఉత్పత్తి సామర్థ్యం తగినంతగా లేదు. దీనితో దిగుమతులపై ఆంక్షలు విధించింది. అదే సమయంలో మాడ్యూల్స్ విడిభాగాలను వేర్వేరుగా దిగుమతులు చేసుకొనేందుకు అనుమతించింది. దీంతో దేశీయ ఉత్పత్తిదారులు విదేశాల నుంచి విడిభాగాలను తక్కువ ధరలకు కొనుగోలు చేసి, వాటితో మాడ్యూల్స్ అసెంబుల్ చేసి అధిక ధరలకు అమ్మేస్తూ, లాభాలు గడిస్తున్నారు. అవే సౌర విద్యుత్ మాడ్యూల్స్‌ను నేరుగా దిగుమతి చేసుకుంటే తక్కువ ధరకే అందుబాటులోకి వస్తాయి. దాన్ని కాదని, విడిభాగాల దందాను మోడీ సర్కార్ ప్రోత్సహిస్తోంది. కనీసం దేశీయంగా ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకునే వరకైనా, పూర్తిస్థాయి విదేశీ మాడ్యూల్స్ దిగమతికి అనుమతించాలని విద్యుత్‌రంగ నిపుణులు సూచిస్తున్నారు. ఆ సూచనను కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం పరిగణనలోకి తీసుకోవట్లేదు. దేశంలోని సోలార్ పీవీ మాడ్యూల్ పరిశ్రమలో దేశీయ కంపెనీలు అసాధారణ లాభాలు దండుకుంటున్నాయనీ, దీనివల్ల రాబోయే కాలంలో సౌర విద్యుత్ ఛార్జీలు మోయలేనంత భారం కాబోతున్నాయని విద్యుత్ రంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు. కానీ దీనిపై పునరుద్పాదక ఇంధన వనరుల మంత్రిత్వ శాఖలో ఏ మాత్రం చలనం కనిపించడం లేదు. ప్రభుత్వ అనుమతి పొందిన దేశీయ ఉత్పత్తిదారుల జాబితా నుంచే సోలార్ ప్రాజెక్టులు మాడ్యూల్స్‌ను పొందాల్సి ఉంటుందని నిబంధన విధించింది. ఈ జాబితా రాకముందే దేశీయ ఉత్పత్తిదారుల లాభాపేక్షపై కేంద్ర విద్యుత్, పునరుద్పాదక ...3లో

ఆ ఐదు కంపెనీలదే హవా

వారీ ఎనర్జీస్, అదానీ సోలార్, నాస్కామ్‌లో లిస్ట్ అయిన రెన్యూ పవర్, అమెరికాకు చెందిన ఫస్ట్ సోలార్, టాటా పవర్ కంపెనీలు ప్రభుత్వ జాబితాలో ఉన్నాయి. మొత్తం ఉత్పత్తి సామర్థ్యంలో వీటి వాటా దాదాపు యాభై శాతం వరకూ ఉంటుంది. విదేశీ పోటీదారులతో పోలిస్తే దేశీయ ఉత్పత్తిదారులు సోలార్ మాడ్యూల్స్‌పై 90 శాతం అదనంగా వసూలు చేస్తున్నారు. ఈ ధరల వ్యత్యాసం ఇటీవలి సంవత్సరాలలో మరింత అధికమవుతోంది. ముఖ్యంగా చైనా నుండి దిగుమతి అవుతున్న మాడ్యూల్స్‌తో పోలిస్తే దేశీయ కంపెనీల మాడ్యూల్స్ ధర చాలా ఎక్కువగా ఉంది. 2021-22 తొలి త్రైమాసికంలో ధరల వ్యత్యాసం 6 శాతం మాత్రమే ఉండగా 2023-24 తొలి త్రైమాసికంలో యాభై శాతానికి చేరింది. క్రిసిల్ డేటా ప్రకారం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ఈ వ్యత్యాసం దాదాపు రెట్టింపు అయింది.

ప్రతి ఆడబిడ్డను గౌరవించాలి

వినూత్నంగా రాఖీ వేడుకలను నిర్వహించిన సీతక్క



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాఖీ పండుగను పురస్కరించుకుని మంత్రి సీతక్క మంచి సందేశం ఇచ్చారు. సమాజంలో ప్రతి ఆడబిడ్డను గౌరవించాలన్న సందేశంతో రక్షాబంధన్ వేడుకను చేపట్టారు. సోమవారం ఉదయం సీఎం రేవంత్ నివాసంలో రేవంత్ రెడ్డికి రాఖీ కట్టిన సీతక్క ఆ తర్వాత అసెంబ్లీ ఆవరణలో స్పీకర్ ప్రసాద్ కుమార్, మంత్రులు, ఎంఎల్‌ఏలు, అసెంబ్లీ సిబ్బంది, మీడియా ప్రతినిధులకు రాఖీలు కట్టారు. మంత్రి హోదాను ...13లో



రాజ్యసభ అభ్యర్థిగా సింఘ్వీ నామినేషన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీ తరపున రాజ్యసభ అభ్యర్థిగా అభిషేక్ మను సింఘ్వీ నామినేషన్ దాఖలు చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని అసెంబ్లీ ప్రాంగణంలో ఉప ఎన్నికల అధికారికి ఆయన నామినేషన్ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షీతో పాటు సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి సీఎల్పీ కార్యాలయానికి వచ్చి కొద్ది సేపు మంత్రులతో గడిపారు. రాజ్యసభలో తొమ్మిది రాష్ట్రాలకు చెందిన 12 స్థానాలకు సెప్టెంబరు 3న ఉప ఎన్నికలు ...13లో

తెలంగాణ తల్లి స్థానంలో రాజీవ్ విగ్రహమా ?

భవిష్యత్తులో రాజీవ్, ఇందిరా పేరుతో ఉన్న పథకాలను మారుస్తాం

ఎయిర్‌పోర్టుకు తెలంగాణ మహనీయుడి పేరు పెడతాం : కేటీఆర్




నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం స్థానంలో రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని పెట్టొద్దనీ, ఆ నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కల్వకుంట్ల తారకరామారావు కోరారు. సోమవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ తల్లికి కేటాయించిన స్థానంలో ఏర్పాటు చేస్తున్న రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని తాము అధికారంలోకి రాగానే తరలిస్తామని స్పష్టం ...13లో

గురుకుల పాఠశాలలకు కొత్త హంగులు

రూ.5 వేల కోట్లతో 30 ప్రదేశాల్లో 120 పాఠశాలల నిర్మాణం



పాఠశాలల స్థల సేకరణ, డిజైన్లు త్వరగా పూర్తి చేయాలి

29 లోగా వసతుల కల్పనపై చెక్ లిస్టు ఇవ్వాలి

హాస్టల్లో చదివే ప్రతీ విద్యార్థి మంచంపైనే పడుకోవాలి : సమీక్ష సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ స్కూల్ భవనాల నిర్మాణాల కోసం ఆయా నియోజకవర్గాల్లో కావలసిన స్థలాన్ని సంబంధిత జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకొని స్థలాన్ని సేకరించి డిజైన్లు వేయించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విద్యాశాఖ ...6లో

లైంగిక దాడే...

శరీరంపై తీవ్రమైన గాయాలు

కోల్‌కతా వైద్యురాలి పోస్ట్‌మార్టం నివేదిక

నిందితుడికి లై డిటెక్టర్ టెస్ట్..సీబీఐకి హైకోర్టు అనుమతి

ట్రైనీ వైద్యురాలి డైరీలో ఏముంది..? 3లో..



వైద్య సిబ్బంది రక్షణకు సమగ్ర చట్టం తేవాలి

సీపీఐ(ఎం) డిమాండ్

న్యూఢిల్లీ : వైద్య సిబ్బంది రక్షణకు తక్షణమే ఒక సమగ్ర చట్టాన్ని రూపొందించాల్సిన అవసరం వుందని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో పేర్కొంది. కోల్‌కతాలోని ఆర్‌జీ కార్ ఆస్పత్రిలో యువ వైద్యురాలు పనిచేసే చోట అత్యంత దారుణంగా, పాశవికంగా లైంగికదాడి జరిగి, హత్య చేయడంపై దేశవ్యాప్తంగా డాక్టర్లు ముఖ్యంగా జూనియర్ డాక్టర్ల నిరసనలు, ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఆందోళనలు, నిరసనలు చూస్తుంటే యువ మహిళా బాధితురాలికి సంఘీభావం తెలియచేయడమే కాకుండా డాక్టర్లు ఎంత అభద్రతా వాతావరణంలో, ఏ మాత్రం సురక్షితంగా లేని పరిస్థితుల్లో పనిచేస్తున్నారో వెల్లడవుతోందని పొలిట్‌బ్యూరో పేర్కొంది. ఈ మేరకు ఒక ప్రకటన జారీ చేసింది. వైద్య సిబ్బంది నిరసనలు, ఆందోళనలకు ప్రజా మద్దతు కూడా విస్తృతంగా లభిస్తోంది. వైద్య సిబ్బంది రక్షణకు సమగ్ర చట్టాన్ని తీసుకురావాలన్న డిమాండ్‌పై అత్యవసరంగా స్పందించడానికి బదులుగా మోడీ ప్రభుత్వం ఈ విషయంపై విచారణకు కమిటీని ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడం దురదృష్టకరమని పొలిట్‌బ్యూరో ...13లో

నేరచరితులపై కేంద్రం ఆరా

ఎంపీ, ఎమ్మెల్యేల ప్రత్యేక కోర్టులపై నిపుణుల ప్రతిపాదనలకు ఆహ్వానం

10 ప్రత్యేక కోర్టుల్లో పెండింగ్ కేసులు 13లో.



కాళేశ్వరంలో అవకతవకలు నిజమే

పీసీ ఘోష్ కమిషన్‌కు 'విజిలెన్స్' మధ్యంతర నివేదిక

త్వరలో పూర్తిస్థాయి నివేదికివ్వండి : సీవీ ఆనంద్‌కు చైర్మెన్ ఆదేశం 13లో.



ట్రిపుల్ తలాక్ నేరమే

చట్టం తీసుకురావడం సరైనదే

సుప్రీంలో సమర్థించుకున్న కేంద్రం

వివరాలు 14లో...



ఫొటో మధుర జ్ఞాపకాలకు ప్రతీక

అది భావాన్ని పలికిస్తుంది



ఫొటోలు లేకపోతే న్యూస్ పేపరే లేదు

ఆ వృత్తి కష్టమైనదే..

వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

ఉత్తమ ఫొటోగ్రాఫర్లకు అవార్డులు

ప్రపంచ ఫొటోగ్రఫీ వేడుకల్లో మంత్రి పొంగులేటి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నేడు తీసిన ఫొటో రేపటికి ఓ మధుర జ్ఞాపకానికి ప్రతీకగా ఉంటుందని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ వేడుకలు సోమవారం గ్రీన్ పార్క్ హోటల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ...13లో

స్వాతంత్ర్య సమరయోధుల పేరుతో భూదోపిడీ

4542 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా | యథేచ్ఛగా అక్రమ రిజిస్ట్రేషన్లు, బ్యాంకు లోన్లు


పేదవాడికి నివాసముండేందుకు గుడిసెంత జాగా కోసం ఎన్నో పోరాటాలు.. ప్రతిఘటనలు ఎదుర్కోవాల్సి వస్తోంది.. కానీ, కబ్జాదారులు మాత్రం ఎకరాలకు ఎకరాలు ప్రభుత్వ భూములను మింగేస్తున్నారు. అయితే, ఇవి ఏమీ ప్రభుత్వ అధికార యంత్రాంగానికి పట్టడం లేదు. ఇందులో దారుణమేమంటే.. దేశం కోసం పోరాడిన స్వాతంత్ర్య యోధుల పేరుతో భూదోపిడీ జరగడం. ఇందులో కబ్జాదారులకు రెవెన్యూ అధికారుల సహకారమూ ఉండటం గమనార్హం. నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి మరీ బ్యాంకు రుణాలు పొందిన ఘటన నల్లగొండ జిల్లా దామరచర్ల మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

ప్రభుత్వ పెద్దల అండదండలు

గతంలో పట్టాలు రద్దు చేసినా..

భూముల్లోనే తిష్ట

15 ఏండ్లుగా సాగుతున్న భూబాగోతం



నవతెలంగాణ-మిర్యాలగూడ

బడా రాజకీయ నాయకుల అండదండలతో పాటు కొంత మంది రెవెన్యూ అధికారుల చేతివాటం ప్రదర్శించి నిజమైన యోధులకు టోకరా వేస్తూ నకిలీ సమరయోధులు 4542 ఎకరాలకుపైగా ప్రభుత్వ భూములను దోచేశారు. గతంలో స్థానికుల ఫిర్యాదుతో అధికారులు విచారించి పట్టాలు రద్దు చేసినా అక్రమార్కులు మాత్రం అక్కడే తిష్టవేశారు. 15 ఏండ్లుగా ఈ భూబాగోతం జరుగుతోంది. ప్రస్తుతం ఈ సమస్య లోకాయుక్తకు చేరింది. దామరచర్ల రెవెన్యూ పరిధిలోని సర్వే నెం.420లో 262.82 ఎకరాలు, సర్వే నెం.597లో 272. 27 ఎకరాలు, 686లో 12.24, 761లో 412.28, 1100లో 132.08, 621లో 31.25, 735లో 35.28, 1121లో 25.37, 693లో 11, 714లో 8.32, 1104లో 8.32, 341లో 7.35 ఎకరాలు కాగా మొత్తం 41 సర్వే నెంబర్లలో 4542 ఎకరాలు ప్రభుత్వ, బంచరా యి, బంజరు, ఖరజుఖాతా, మహాసూరకు సంబంధించిన భూములు ఉన్నాయి. వాటిపై కొన్నేండ్లుగా కబ్జాదారుల కన్నుపడింది.ఆ భూములను తమ వరం చేసుకునేందుకు కొందరు స్వాతంత్ర్య సమరయోధుల పేరిట నకిలీ పట్టాలు సృష్టించి కాజేశారు. దానికి అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, రాష్ట్ర విభజన అనంతరం గత ప్రభుత్వ పెద్దల అండదండలు ఉండటంతో వారికి అడ్డూ అదుపు లేకుండా పోయింది.

రద్దు చేసినా.. కబ్జాలోనే

స్వాతంత్ర్య సమరయోధుల పేర్లలో తప్పుడు పట్టాలు సృష్టించడంతోపాటు స్థానికులు ఫిర్యాదు చేయడంతో భూ ఆక్రమణలు జరిగినట్టు వెలుగులోకి వచ్చింది. దీంతో రంగంలోకి దిగిన అధికారులు.. చట్టవిరుద్ధంగా జారీ అయిన పట్టాలను రద్దు చేస్తూ 1/12782/2010 ద్వారా.. ఆర్‌డీవో జె3/1387/2010 ద్వారా విచారణ చేశారు. నకిలీ పట్టాలను రద్దు చేశారు. పట్టాలు రద్దుచేసి 15 ఏండ్లు కావొస్తున్నప్పటికీ కబ్జాలో ఉన్న నకిలీ స్వాతంత్ర్య యోధులు మాత్రం భూములను వీడటం లేదు. దశాబ్దాలుగా తిష్టవేసిన నకిలీదారులు భూములను వీడకపోవడంతో అనుమానాలు ...13లో

హాజరు పట్టికలను పరిశీలించాలి

- మంత్రి దామోదర రాజనర్సింహ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నిరంతరం ఆస్పత్రులను సందర్శిస్తూ ఆస్పత్రి సిబ్బంది హాజరు పట్టికలను పరిశీలించాలని టాస్క్‌ ఫోర్స్‌ కమిటీని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. ప్రతి 15 రోజులకు ఒకసారి నివేదికను సమర్పించాలని సూచించారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ప్రజారోగ్య, టీవీవీపీలపై ఆయన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. సిబ్బంది వేతనాలు ప్రతి నెలా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో వైద్యారోగ్యశాఖ కార్యదర్శి డాక్టర్‌ క్రిస్టీనా జెడ్‌ చొంగ్తూ తదితరులు పాల్గొన్నారు.

మంకీపాక్స్‌ చికిత్స కోసం ప్రత్యేక వార్డులు

ముందస్తు జాగ్రత్తలో భాగంగా మంకీపాక్స్‌ చికిత్స కోసం ప్రత్యేక వార్డులను ఏర్పాటు చేయాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన హైదరాబాద్‌లోని సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఢిల్లీ, కేరళలో 15 చొప్పున 30 కేసులు నమోదయ్యాయనీ, తెలంగాణలో ఒక్క కేసు నమోదు కాలేదని తెలిపారు. గాంధీ, ఫీవర్‌ ఆస్పత్రిలో ప్రత్యేక వార్డులను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

భద్రతా చర్యలు తీసుకోండి :

మంత్రి దామోదరకు జూడాల వినతి

ప్రభుత్వాస్పత్రులు, మెడికల్‌ కాలేజీల్లో సిబ్బంది కోసం అవసరమైన భద్రతా చర్యలు తీసుకోవాలని వైద్యారోగ్యశాఖ మంత్రి తెలంగాణ జూనియర్‌ డాక్టర్స్‌ అసోసియేషన్‌ (టీజూడా) కోరింది. ఈ మేరకు సోమవారం రాష్ట్ర సచివాలయంలో మంత్రి దామోదర రాజనర్సింహకు జూడాల నాయకులు వినతిపత్రం సమర్పించారు. అందులో భాగంగా జీవో నెంబర్‌ 103 ప్రకారం రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ ఆస్పత్రులతో పాటు ప్రభుత్వ మెడికల్‌ కళాశాల్లో ఎస్పీఎఫ్‌ ఫోర్సుతో భద్రత ఏర్పాట్లను ప్రవేశపెట్టాలని వారు మంత్రిని కోరారు.

కేటీఆర్‌కు రాఖీ కట్టిన కృతిక

- చేసిన సహాయాన్ని మరవని రుద్రరచన
- జోహాద్‌ఖాన్‌ తల్లి కూడా



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తమకు అండగా నిలిచిన బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కల్వకుంట్ల తారకరామారావుకు పలువురు సోదరీమణులు సోమవారం హైదరాబాద్‌లోని నందినినగర్‌లోని ఆయన ఇంట్లో రాఖీలు కట్టారు. కుక్కల దాడిలో గాయపడి కేటీఆర్‌ సాయంతో కోలుకున్న ఐదేండ్ల కృతిక కేటీఆర్‌కు రాఖీ కట్టి ధన్యవాదాలు తెలిపింది. తన ఇంజినీరింగ్‌ విద్యకు పూర్తి ఆర్థిక సహాయం అందించినందుకు కృతజ్ఞతగా ప్రస్తుతం కాగ్నిజెంట్‌ కంపెనీలో సాఫ్ట్‌వేర్‌గా పనిచేస్తున్న అనాథ విద్యార్థిని రుద్రరచన కేటీఆర్‌కు రాఖీ కట్టారు. గతేడాది ఆమె సీఎం సహాయ నిధికి మూడు నెలల జీతాన్ని విరాళంగా ఇచ్చిన విషయం విదితమే. జూబ్లీహిల్స్‌ నియోజకవర్గంలోని బోరబండకు చెందిన ఐదేండ్ల జోహాన్‌ ఖాన పుట్టుకతో వినికిడి సమస్యతో బాధపడుతుండగా కేటీఆర్‌ సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకుని చికిత్సకు సహాయం అందించారు. దీంతో అతను అందరితోపాటు వింటున్నాడు..మాట్లాడుతున్నాడు. దీనికి కృతజ్ఞతగా జోహాన్‌ఖాన్‌ తల్లి సోమవారం కేటీఆర్‌ ఇంటికెళ్లి రాఖీ కట్టింది.

రైతు రుణమాఫీపై చర్చకు రెడీ

- హరీశ్‌ రావుకు కోదండరెడ్డి సవాల్‌

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో రైతు రుణమాఫీ పై చర్చించేందుకు సిద్ధమని జాతీయ కిసాన్‌ కాంగ్రెస్‌ ఉపాధ్యక్షులు కోదండ రెడ్డి తెలిపారు. సోమవారం గాంధీభవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. పదేండ్ల బీఆర్‌ హయాంలో, ఎనిమిది నెలల కాంగ్రెస్‌ పాలనలో రైతులకు చేసిన దానిపై గణాంకాలతో వస్తామని తెలిపారు. 2018-24 వరకు వ్యవసాయేతర భూములకు రైతు బంధు కింద గత బీఆర్‌ఎస్‌ సర్కార్‌ 25,676 కోట్లు ఇచ్చిందని విమర్శించారు. అందులో బీఆర్‌ఎస్‌ పార్టీ నాయకులకు ఎక్కువ మొత్తంలో డబ్బు చెందింది. రైతుతులకు రూ.2 లక్షల కన్న ఎక్కువ రుణం ఉంటే.. పైన ఉన్న మొత్తం చెల్లిస్తే.. 2 లక్షలు ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందని స్పష్టం చేశారు.

రాజ్‌భవన్‌లో రాఖీ పౌర్ణమి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాపిత బ్రహ్మ కుమారీస్‌ సోదరీమణులతో పాటు రాజ్‌భవన్‌ మహిళా సిబ్బంది గవర్నర్‌కు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. వేడుక ఆసాంతరం మహిళలు, పురుషులు పరస్పర గౌరవభావంతో మెలగాలనే సందేశంతో నిర్వహించారు.

ఫోన్‌ట్యాపింగ్‌ కేసులో..

- అదనపు ఎస్పీ భుజంగరావుకు మధ్యంతర బెయిల్‌

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్‌ట్యాపింగ్‌ కేసులో నిందితుడైన అదనపు ఎస్పీ భుజంగరావుకు మధ్యంతర బెయిల్‌ను నాంపల్లి కోర్టు సోమవారం మంజూరు చేసింది. తన ఆరోగ్య పరిస్థితి బాగాలేదనీ, గుండెకు సంబంధించిన వ్యాధితో తాను బాధపడుతున్నాననీ, దీనికి మెరుగైన చికిత్సను పొందటానికి గానూ తనకు బెయిల్‌ మంజూరు చేయాలని భుజంగరావు కోర్టును అభ్యర్థించారు. ఆయన అభ్యర్థనను పరిశీలించిన న్యాయమూర్తి 15 రోజుల పాటు మధ్యంతర బెయిల్‌ను ఇస్తూ ఆదేశాలు జారీ చేశారు. కాగా, ఈ కేసులో ఇతర నిందితులైన డీఎస్పీ ప్రణీత్‌రావు, టాస్క్‌ఫోర్స్‌ మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు, మరో అదనపు ఎస్పీ తిరుపతన్నల బెయిల్‌ పిటిషన్లు కోర్టు పరిశీలనలో ఉన్నాయి.

22న నిరసన ర్యాలీ

- ఎమ్మెల్సీ మహేష్‌ కుమార్‌ గౌడ్‌

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం వేధింపులకు నిరసనగా ఈ నెల 22న అమరవీరుల స్థూపం నుంచి ఈడి కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్టు ఎమ్మెల్సీ, టీపీసీసీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ మహేష్‌ కుమార్‌ గౌడ్‌ తెలిపారు. సోమవారం గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అదానీ తన షేర్ల విలువ కత్రిమంగా పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. సెబి చైర్‌పర్సన్‌ మాధవి భర్తకు అదానీ కంపెనీ షేర్ల బదలాయింపు జరిగిందని తెలిపారు. ఈ వ్యవహారంపై జేపీసీ వేయడానికి కేంద్రం ముందుకు రావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.


దుర్గకు ముఖ్యమంత్రి రేవంత్‌ రెడ్డి బాసట

- బాలికకు అన్ని విధాలా అండగా నిలవాలని కలెక్టర్‌కు ఆదేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తల్లి ఆత్మహత్యతో ఒంటరిగా మిగిలిపోయిన బాలిక దుర్గకు అన్ని విధాలా అండగా నిలుస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌ రెడ్డి ప్రకటించారు. నిర్మల్‌ జిల్లా తానూర్‌ మండలం బేల్‌తరోడా గ్రామానికి చెందిన ఒంటరి మహిళ మేర గంగామణి (36) శనివారం రాత్రి ఆత్మహత్య చేసుకుంది. దీంతో ఆమె ఏకైక కుమార్తె దుర్గ (11) అనాథగా మిగిలింది. తల్లి అంత్యక్రియలకు డబ్బుల్లేకపోవడంతో దుర్గ భిక్షాటన చేసింది. విషయం ముఖ్యమంత్రి రేవంత్‌ రెడ్డి దృష్టికి రావడంతో ఆయన వెంటనే స్పందించారు. బాలికకు విద్య,వైద్య ఇతర అవసరాలకు అండగా నిలవాలని ఆ జిల్లా కలెక్టర్‌ అభిలాష్‌ అభినవ్‌ను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశం మేరకు బాలికకు ఉచిత విద్య అందించేందుకు గురుకుల పాఠశాలలో చేర్చుతామని కలెక్టర్‌ వెల్లడించారు. వైద్య, ఇతర సమస్యలేమైనా ఉంటే వాటిని వెంటనే పరిష్కరిస్తామని కలెక్టర్‌ తెలిపారు.

సీఎం రేవంత్‌ నివాసంలో రాఖీ వేడుకలు



హైదరాబాద్‌ జూబ్లిహిల్స్‌లోని సీఎం రేవంత్‌ రెడ్డి నివాసంలో రాఖీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్‌ దీపాదాస్‌ మున్షీ, మంత్రి సీతక్క, ఎంపీ కావ్య, ఎమ్మెల్యేలు పర్ణిక రెడ్డి, రాగమయి, కార్పొరేషన్‌ చైర్‌ పర్సన్లు బండ్రు శోభారాణి, నెరేళ్ల శారద, కాల్వ సుజాత తదితరులు ముఖ్యమంత్రికి రాఖీ కట్టారు.

కరెంటు బిల్లులు ఇక్కడా కట్టొచ్చు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కరెంటు బిల్లుల్ని చెల్లించేందుకు మరిన్ని థర్డ్‌పార్టీ యాప్‌లు ముందుకు వచ్చాయని టీజీఎస్పీడీసీఎల్‌ తెలిపింది. ఇప్పటికే వినియోగదారులకు కరెంటు బిల్లుల చెల్లింపుల్లో మరింత సౌకర్యంగా ఉండేందుకు యూపీఐ పేమెంట్స్‌ను పునరుద్ధరించామన్నారు. ఫోన్‌పే, భీం యాప్‌, కెనరా బ్యాంక్‌, పేటీయం, గూగుల్‌ పే యాప్‌ల ద్వారా బిల్లుల చెల్లింపు కోసం ఏర్పాట్లు చేశామనీ, మరో వారం రోజుల్లో మరిన్ని థర్డ్‌ పార్టీ ఏజెన్సీలకు కూడా బిల్లు చెల్లింపు సదుపాయం కల్పిస్తామని వివరించారు.

రక్షాబంధన్

చిన్నారులు రాఖీ కడుతుంటే ప్రధాని మోడీ నవ్వులు



పాఠశాలల విద్యార్థులతో కలిసి రక్షా బంధన్‌ను జరుపుకున్న రాష్ట్రపతి ముర్ము



జమ్మూ కాశ్మీర్‌లో ఆర్మీ జవానుకు రాఖీ కడుతున్న బాలికలు



లైంగిక దాడే...

కోల్‌కతా వైద్యురాలి పోస్ట్‌మార్టం నివేదిక

కోల్‌కతా : కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన లైంగికదాడి, హత్యకు సంబంధించిన పైశాచిక ఘటనలో బాధితురాలి పోస్ట్‌మార్టం నివేదిక దిగ్భ్రాంతి కలిగించే వాస్తవాలను బయట పెట్టింది. 'ఇండియా టుడే' పత్రికకు లభించిన అటాప్సీ నివేదిక ప్రకారం వైద్యురాలిపై లైంగిక దాడి జరిగిందని, ఆమె శరీరంపై తీవ్ర గాయాలు ఉన్నాయని రూఢీ అయింది. మృతురాలి తల, ముఖం, మెడ, చేతులు, జననేంద్రియంపై 14 గాయాలు ఉన్నాయని ఆ నివేదిక తెలిపింది.

'బాధితురాలి గొంతు నొక్కడంతో ఉక్కిరిబిక్కిరి అయి మరణించింది. దీనిని హత్యగానే పరిగణించాలి. ఆమెను బలత్కారం చేయడాన్ని బట్టి చూస్తే లైంగిక దాడి జరిగిందనే భావించాలి. జూనియర్ వైద్యురాలి జననేంద్రియంపై తెల్లని, చిక్కటి, జిగట ద్రవం కన్పించింది. ఊపిరితిత్తుల్లో రక్తం గడ్డకట్టింది. రక్తస్రావం జరిగింది. శరీరంలో ఫ్రాక్చర్స్ ఏమీ లేవు. రక్త నమూనాలను, శరీరంలోని ఇతర ద్రవాలను మరిన్ని విశ్లేషణల కోసం పంపారు' అని పోస్ట్‌మార్టం నివేదిక వివరించింది. కాగా కోల్‌కతా ఘటనను సుమోటోగా తీసుకున్న సుప్రీంకోర్టు మంగళవారం విచారణ చేపట్టనుంది.

లై డిటెక్టర్ టెస్ట్‌కు హైకోర్టు అనుమతి

జూనియర్ వైద్యురాలిపై లైంగికదాడికి పాల్పడి హత్య చేసిన నిందితుడికి లై డిటెక్టర్ టెస్ట్ నిర్వహించనున్నారు. ఈ కేసు దర్యాప్తు చేస్తున్న సీబీఐ విన్నపానికి కోల్‌కతా హైకోర్టు అనుమతినిచ్చింది.

ఆగస్టు 9న ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లో నైట్ డ్యూటీలో ఉన్న 31 ఏండ్ల పోస్ట్ గ్రాడ్యుయేట్ ట్రైనీ డాక్టర్‌పై లైంగికదాడికి పాల్పడి హత్య చేశారు. హాస్పిటల్ సెమినార్ హాల్‌లో ఆమె మృతదేహాన్ని గుర్తించారు. కాగా, ఆ హాస్పిటల్‌లో వాలంటీర్‌గా పని చేస్తున్న సంజయ్ రాయ్‌ను నిందితుడిగా అనుమానించి పోలీసులు అరెస్ట్ చేశారు. నేరం జరిగిన రోజు రాత్రి 11 గంటల సమయంలో మద్యం సేవించడానికి ఆస్పత్రి వెనుక ప్రదేశానికి అతడు వెళ్లాడు. అతను అక్కడ మద్యం సేవిస్తూ పోర్న్ చూసేవాడని సంబంధిత వర్గాలు తెలిపాయి. మరోవైపు అదే రోజు రాత్రి సంజయ్ రాయ్ చాలాసార్లు ఆస్పత్రి ప్రాంగణంలోకి ప్రవేశించాడని పోలీసులు తెలిపారు. నేరం చేసిన తర్వాత సాక్ష్యాలను ధ్వంసం చేయడానికి, సంఘటనా స్థలంలోని రక్తం మరకలను కడిగేందుకు ప్రయత్నించినట్టు పోలీసులు గుర్తించారు. ఆ తర్వాత ఉదయం 4:45 గంటలకు సెమినార్ గది నుంచి అతడు బయటకు వెళ్లినట్టు సీసీటీవీ ఫుటేజ్ ద్వారా నిర్ధారించారు.

ఆ డైరీలో ఏముంది..?

లైంగికదాడి, హత్య ఘటనకు సంబంధించి తాజాగా మరో విషయం వెలుగులోకి వచ్చింది. తమ కుమార్తె డైరీలో ఓ పేజీ చిరిగి ఉందని బాధితురాలి తండ్రి చెబుతున్నారు. "మా అమ్మాయి బ్యాగులో ఎప్పుడూ పర్సనల్ డైరీ ఉంటుంది. దాన్ని మేం ఎప్పుడూ చదవలేదు. హాస్పిటల్ నుంచి వచ్చాక తను రోజూ మాతో అన్ని విషయాలు పంచుకుంటుంది. ఘటన తర్వాత తన డైరీని చూస్తే అందులో ఓ పేజీ కొంత చిరిగి ఉంది. దానికి సంబంధించిన



ఫొటో నా వద్ద ఉంది" అని బాధితురాలి తండ్రి ఓ జాతీయ మీడియాకు వెల్లడించారు. అయితే, అందులో ఏముందనే విషయాన్ని బయటపెట్టేందుకు ఆయన నిరాకరించారు. ఆ విషయాలను బహిరంగంగా చర్చించొద్దని సీబీఐ తమకు సూచించినట్టు తెలిపారు.

నాల్గో రోజూ సీబీఐ ఇంటరాగేషన్

వరుసగా నాల్గవ రోజైన సోమవారం కూడా సీబీఐ అధికారులు ఆర్‌జికార్ మెడికల్ కాలేజీ మాజీ ప్రిన్సిపల్ డాక్టర్ సందీప్ ఘోష్‌ను ప్రశ్నించారు. శుక్ర, శనివారాల్లో అర్ధరాత్రి వరకు అనేక గంటల పాటు విచారణ సాగింది.

సీబీఐ ప్రశ్నలివే

ఈ హత్యను ఆత్మహత్య అని డిక్లేర్ చేయడానికి ఎందుకు అంత తొందరపడ్డారు ?, మీరు కూడా డాక్టరే కదా, సంఘటనా స్థలంలో సాక్ష్యాధారాలు సురక్షితంగా వుంచాలని మీకు తెలియదా? నేరమని తెలిసి కూడా అవన్నీ తారుమారు కావడానికి ఎలా అనుమతించారు? ఎవరి సలహా మీద కుటుంబానికి సమాచారం అందించారు, అందులో వాస్తవాలను ఎందుకు దాచిపెట్టారు?, కుటుంబానికి సమాచారం అందించేందుకు అంత ఆలస్యం ఎందుకైంది? కుమార్తె మృత దేహాన్ని చూపించడానికి ఎందుకు అంత ఆలస్యం జరిగింది ? ఆస్పత్రిలో భద్రతా ఏర్పాట్లు ఏమున్నాయి? సంఘటన జరిగిన వెంటనే మీరెందుకు రాజీనామా చేశారు? దానికి గల కారణాలేంటి? అంటూ పలు ప్రశ్నలను సీబీఐ అధికారులు వేశారు. అయితే సందీప్‌ఘోష్ వీటికి ఇంకా సంతృప్తికరమైన సమాధానాలు ఇవ్వాల్సి వుందని అధికారులు పేర్కొంటున్నారు.

కొనసాగుతున్న నిరసనలు

మరోవైపు బాధితురాలికి న్యాయం చేయాలని, నిందితుడిని ఉరి తీయాలని, ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా నిరసనలు, ఆందోళనలు కొనసాగుతునే వున్నాయి.

న్యాయం జరిగేలా జోక్యం చేసుకోండి

- 'కోల్‌కతా కేసు'పై పద్మ అవార్డు గ్రహీతలు
- ప్రధాని మోడీకి 70 మంది లేఖ

న్యూఢిల్లీ : గత వారం కోల్‌కతాలోని ఒక ఆస్పత్రిలో యువ వైద్యురాలిపై జరిగిన దారుణమైన లైంగికదాడి, హత్య కేసులో కనీసం 70 మంది పద్మ అవార్డు గ్రహీతలు స్పందించారు. ప్రధాని మోడీ వ్యక్తిగతంగా జోక్యం చేసుకుని న్యాయం చేయాలని లేఖ రాశారు. "మన దేశాధినేతగా ఈ ఆందోళనకరమైన పరిస్థితిని పరిష్కరించటానికి మీ తక్షణ, వ్యక్తిగత జోక్యాన్ని మేము వేడుకుంటున్నాము. ఇటువంటి క్రూరత్వ చర్యలు ఆరోగ్య సంరక్షణ, వైద్య నిపుణుల సేవ పునాదులను కదిలిస్తాయి. హింసను.. ముఖ్యంగా మహిళలు, బాలికలు, హింసను పరిష్కరించాల్సిన తక్షణ అవసరాన్ని ఎత్తి చూపుతాయి" అని పద్మ అవార్డు గ్రహీత డాక్టర్లు ప్రధానికి రాసిన లేఖలో పేర్కొన్నారు. పద్మ అవార్డు గ్రహీత డాక్టర్లలో రేడియాలజిస్ట్ డాక్టర్ హర్ష్ మహాజన్, ఎయిమ్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ రణదీప్ గులేరియా, ఐసీఎంఆర్ మాజీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ బలరామ్ భార్గవ, న్యూరాలజిస్ట్ డాక్టర్ ఎం.వి పద్మ శ్రీవాస్తవతో పాటు పలువురు ఉన్నారు. ఆరోగ్య సంరక్షణ నిపుణులను రక్షించటానికి ప్రస్తుత చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్‌లను కఠినంగా వర్తింపజేయటం, లైంగిక హింసకు పాల్పడేవారికి కఠినమైన, కాలపరిమితితో కూడిన శిక్షలు, ఆస్పత్రులు, వైద్య సంస్థలలో మెరుగైన భద్రతా చర్యలు వంటి చర్యలను వారు సూచించారు. "వైద్యులు, వైద్య నిపుణులు, వైద్య సంస్థలపై హింసా నిరోధక బిల్లు, ఆరోగ్య సంరక్షణ కార్మికుల రక్షణ కోసం ఒక ప్రత్యేక చట్టాన్ని త్వరగా రూపొందించి, అమలు చేయాలని మేము కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతున్నాము. బిల్లు 2019 నుంచి సిద్ధంగా ఉన్నది. కానీ ఆమోదం ఇంకా పార్లమెంట్‌లో ప్రవేశపెట్టబడలేదు. ఈ విషయంలో ఆర్డినెన్స్‌ను తక్షణమే తీసుకురావచ్చని మేము గట్టిగా నమ్ముతున్నాం. ఆరోగ్య సంరక్షణలో పని చేస్తున్న వారందరి కోసం బిల్లును త్వరగా ఆమోదించాలి. దేశంలోని వ్యవస్థలు నిర్భయంగా, బాధపడే రోగుల సేవలో పనిచేయగలవు" అని లేఖ వివరించింది. కాగా, ఇప్పటికే ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) అన్ని ఆస్పత్రుల భద్రతా ప్రోటోకాల్‌లను విమానాశ్రయాలలో అందించిన భద్రత స్థాయికి పెంచటంతో పాటు, హింస నుంచి ఆరోగ్య కార్యకర్తలను రక్షించటానికి కేంద్ర చట్టాన్ని డిమాండ్ చేస్తూ ప్రధానికి లేఖ రాసింది.

మమతకు విశ్వసనీయత శూన్యం

కోల్‌కతా ఘటనలో నిందితులను దాచే ప్రయత్నం : బృందా కరత్



న్యూఢిల్లీ : కోల్‌కతా ట్రైనీ వైద్యురాలి లైంగికదాడి, హత్య కేసులో మమతా బెనర్జీ ప్రభుత్వానికి విశ్వసనీయత శూన్యమని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బృందా కరత్ సోమవారం పేర్కొన్నారు. పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ తనను తాను రక్షించుకోవడంతో పాటు, నిందితులను దాచాలనుకుంటున్నారన్నారు. టీఎంసీ ఎంపీల వాంగ్మూలాలు వింటుంటే తామే వైద్యులమంటూ తప్పుడు స్టేట్‌మెంట్లు ఇస్తున్నారని, కేసు వాస్తవికత గురించి వెల్లడించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటన్నింటి దృష్ట్యా ఈ విషయంలో మమతా బెనర్జీ ప్రభుత్వానికి విశ్వసనీయత శూన్యమని స్పష్టం చేస్తున్నాయన్నారు. రాజ్యసభ ఎంపీ సుఖేందు రారు ఈ కేసులో కీలక పాత్ర పోషించడానికి ప్రయత్నించారు, అయితే పోలీసులు వెంటనే ఆయనకు కూడా సమన్లు జారీ చేశారన్నారు.

మైసూరులో మైసూరు మెడికల్ కాలేజీ, రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌కి చెందిన డాక్టర్లు, అండర్ గ్రాడ్యుయేట్లు అందరూ గాంధీ స్క్వేర్ వరకు ఆదివారం ప్రదర్శన నిర్వహించి, మానవహారం నిర్మించారు. డాక్టర్లు, వైద్య సిబ్బంది, సంస్థలను హింస నుండి కాపాడేందుకు తక్షణమే కేంద్ర రక్షణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. విశాఖపట్నంలో బీచ్ రోడ్‌లో ఆదివారం డాక్టర్లు, జూనియర్ డాక్టర్లు, వైద్య విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులు చేబూనారు.

డాక్టర్ గుర్తింపు వివరాలను సోషల్ మీడియాలో వెల్లడించడం, ముఖ్యమంత్రి మమతను బెదిరించారన్న ఆరోపణలపై కోల్‌కతాలో ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు. బీకాం సెకండ్ ఇయర్ చదువుతున్న ఆ విద్యార్థి కీర్తి శర్మ, ముఖ్యమంత్రిని హత్య చేయాలంటూ పోస్టులు పెట్టాడు. పైగా బాధితురాలి ఫోటోను వివరాలను కూడా వెల్లడించాడని పోలీసులు చెప్పారు.

కోల్‌కతాలో వరుసగా నిరసనలు జరుగుతున్న నేపథ్యంలో బెంగాల్ సమాజంలోని వివిధ వర్గాల ప్రముఖులతో అత్యవసర సమావేశాన్ని బెంగాల్ గవర్నర్ సి.వి.ఆనంద్ బోస్ ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు తీసుకున్న చర్యల వివరాలను వారికి తెలియచేసి, వారి అభిప్రాయాలు కోరేందుకు ఈ సమావేశం నిర్వహించారు.

మరోవైపు సీనియర్ డాక్టర్లు కునాల్ సర్కార్, సువర్ణ గోస్వామిలు సోమవారం పోలీసులు ముందు హాజరయ్యారు. వారు ఈ ఘటనపై సోషల్ మీడియాలో పోస్టులు షేర్ చేసినందుకు అదుపులోకి తీసుకున్నారు. తామేమీ నేరం చేయలేదని, న్యాయం చేయాలని కోరామని డాక్టర్ సర్కార్ వ్యాఖ్యానించారు.

కలకత్తా హైకోర్టు న్యాయవాదుల నిరసన ప్రదర్శన

బాధితురాలికి న్యాయం జరగాలని డిమాండ్ చేస్తూ కలకత్తా హైకోర్టు న్యాయవాదులు సోమవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. నిందితుడిని వెంటనే అరెస్టు చేయాలని, శిక్ష విధించాలని కోరుతున్నారు. ఈ కేసులోని అన్ని కోణాలను సీబీఐ విచారించాలని, విచారణ ఎంత వేగంగా జరుగుతుందనేది న్యాయస్థానంపై ఆధారపడి వుందని మరో న్యాయవాది నరేంద్ర పేర్కొన్నారు.

ఉపాధ్యాయ ఉద్యమంలో బలరాం సేవలు ఎనలేనివి

- ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయాలి : ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి
- చౌటుప్పల్‌లో స్థూపం ఆవిష్కరణ

సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు



నవతెలంగాణ-చౌటుప్పల్

నల్లబెల్లి బలరాం ఆశయ సాధన కోసం కృషి చేయాలని, ఉపాధ్యాయ ఉద్యమంలో ఆయన సేవలు ఎనలేనివని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో సోమవారం టీఎస్ యూటీఎఫ్ ఉమ్మడి నల్లగొండ జిల్లా మాజీ అధ్యక్షులు నల్లబెల్లి బలరాం స్మారక స్థూపాన్ని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములుతో కలిసి ఆయన ఆవిష్కరించారు. స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నర్సిరెడ్డి మాట్లాడుతూ.. ఉపాధ్యాయ ఉద్యమానికి, ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణలో, ప్రజాతంత్ర ఉద్యమాల బలోపేతంలో బలరాం కృషి ఎంతో ఉందన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా యూటీఎఫ్ ఉద్యమ వ్యాప్తి కోసం బలరాం అహర్నిశలూ పనిచేశారని తెలిపారు.

చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ.. బలరాం మరణం ప్రజాతంత్ర ఉద్యమాలు, ప్రభుత్వరంగ వ్యవస్థలకు తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యుటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.రాజశేఖర్‌రెడ్డి, నాయకులు ఎడ్ల సైదులు, ముక్కెర్ల యాదయ్య, కంచి రవికుమార్, టప్రా రాష్ట్ర ఉపాధ్యక్షులు లింగ అరుణమ్మ, నాయకులు టి.బుచ్చిరెడ్డి, అవ్వారు గోవర్ధన్, నాగభూషణం, కుటుంబ సభ్యులు నల్లబెల్లి మాణిక్యం, క్రాంతి, దీప్తి, సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు ఎమ్‌డి.పాషా, మున్సిపల్ కార్యదర్శి బండారు నర్సింహ, మండల కార్యదర్శి గంగదేవి సైదులు, సీపీఐ(ఎం) మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ గోపగోని లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టును ఆశ్రయించిన సిద్ధరామయ్య

'ఫ్రెండ్లీ' గవర్నర్ ఆదేశాలు ఇచ్చారన్న సిద్ధూ

- అత్యవసర విచారణ చేపట్టిన న్యాయస్థానం
- సీఎం తరఫున అభిషేక్ మను సింఘ్వి వాదనలు

బెంగళూరు : ముడా కుంభకోణం కేసులో తనను విచారించేందుకు అనుమతిస్తూ రాష్ట్ర గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ ఇచ్చిన ఆదేశాలకు వ్యతిరేకంగా కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సోమవారం హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు ఆయన తన న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి ద్వారా రాష్ట్ర హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై న్యాయస్థానం అత్యవసర విచారణ జరిపింది. తనకు వ్యతిరేకంగా 'ఫ్రెండ్లీ' గవర్నర్ ఆదేశాలు జారీ చేశారని, వాటిలో పస లేదని సిద్ధరామయ్య కోర్టుకు తెలిపారు. ముఖ్యమంత్రి తరఫున సింఘ్వి, గవర్నర్ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు విన్పిస్తారు.



సిద్ధరామయ్యను విచారించేందుకు రాష్ట్ర లోకాయుక్త (అంబుడ్స్‌మన్)కు అనుమతి ఇస్తూ గవర్నర్ జారీ చేసిన ఆదేశాలు రాష్ట్రంలో పెను రాజకీయ వివాదానికి దారితీశాయి. ముఖ్యమంత్రి రాజీనామా చేయాల్సిందేనని బీజేపీ డిమాండ్ చేయగా, ఆయనపై వచ్చిన ఆరోపణలను కాంగ్రెస్ తోసిపుచ్చింది. అవి రాజకీయ దురుద్దేశంతో కూడుకున్నవని మండిపడింది. సిద్ధరామయ్యను విచారించేందుకు అనుమతి కోరుతూ సామాజిక కార్యకర్తలు టీజే అబ్రహం, మైసూరుకు చెందిన స్నేహమయి కృష్ణ, బెంగళూరుకు చెందిన ప్రదీప్ కుమార్ ఎస్‌పీ గవర్నరుకు పిటిషన్లు సమర్పించిన విషయం తెలిసిందే. అబ్రహం గత నెలలో పిటిషన్ సమర్పించగా గవర్నర్ వెంటనే స్పందించి సిద్ధరామయ్యకు షోకాజ్ నోటీసు జారీ చేశారు. సిద్ధరామయ్య ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయన భార్యకు ముడా నష్టపరిహార భూమి కేటాయించిందని, ఈ వ్యవహారంలో అవకతవకలు జరిగాయని ఆయనపై అభియోగాలు మోపారు. ఈ కుంభకోణంతో సిద్ధరామయ్య బావమరిది మల్లికార్జున స్వామి దేవరాజ్, ముడాకు చెందిన ఉన్నతాధికారులకూ సంబంధం ఉందన్న ఆరోపణలు ఉన్నాయి.

ఇడ్వని వాన

వచ్చే మూడ్రోజులకు వర్షసూచన

- 606 ప్రాంతాల్లో వర్షపాతం
- 26 చోట్ల భారీ వర్షం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



రాష్ట్రంలో వరుసగా మూడోరోజూ వాన ఇడ్వకుండా కొట్టింది. ఉదయం పూట మేఘాలన్నీ కమ్ముకుని సాయంత్రం, రాత్రి సమయాల్లో వర్షం పడుతున్నది. సోమవారం ఉదయం 8:30 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు 608 రెయిన్ గేజ్ సెంటర్లలో వర్షపాతం నమోదైంది. 26 ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. తెలంగాణ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ నివేదిక ప్రకారం రాష్ట్రంలో సిద్దిపేట, నిజామాబాద్, నల్లగొండ, యాదాద్రిభువనగిరి, నిర్మల్, గద్వాల, జగిత్యాల, జనగాం, మేడ్చల్-మల్కాజిగిరి, రాజన్నసిరిసిల్ల జిల్లాల్లో పలుచోట్ల భారీ వర్షం కురిసింది. సిద్దిపేట జిల్లా దూల్‌మిట్టలో అత్యధికంగా 10.80 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్, నల్లగొండ జిల్లా గుర్రంపోడ్ మండలం జున్నుట్లలోనూ పది సెంటీమీటర్లకుపైగా వాన పడింది. రాష్ట్రంలో వచ్చే మూడు రోజుల పాటు కూడా పలు జిల్లాలో తేలికపాటి నుంచి మోస్తరు వానలు, అక్కడక్కడా భారీ వర్షాలు పడే సూచనలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి డాక్టర్ కె.నాగరత్న తెలిపారు. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో హెచ్చరిక జారీ చేశారు. ఆ జాబితాలో ఆదిలాబాద్, కొమ్రంభీమ్ ఆసిఫాబాద్, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాలున్నాయి. జీహెచ్‌ఎంసీ పరిధిలో వచ్చే 48 గంటల పాటు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలికపాటి నుంచి మోస్తరు వర్షం ఉరుములు, మెరుపులతో కురిసే అవకాశముంది. 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే సూచనలు కనిపిస్తున్నాయి.

సౌర వెలుగులు మరింత భారం

(మొదటి పేజీ తరువాయి)

ఇంధన వనరుల శాఖ మాజీ మంత్రి ఆర్‌కే సింగ్, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎస్‌జేవీఎన్ లిమిటెడ్ సందేహాలు వ్యక్తం చేశాయి. దేశీయ కంపెనీలు అధిక లాభాలు పొందాలని చూస్తాయని, ఫలితంగా విద్యుత్ రేట్లు పెరుగుతాయని హెచ్చరించాయి. ఆర్టీఐ చట్టం ద్వారా 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' పత్రిక సేకరించిన పత్రాలు ఈ విషయాలను బయటపెట్టాయి.

మాజీ మంత్రి ఏమన్నారంటే...

మంత్రిత్వ శాఖ ఆదేశాల ప్రకారం ప్రభుత్వ సహాయంతో నడుస్తున్న లేదా దానితో సంబంధమున్న సోలార్ ప్రాజెక్టులు జాబితాలోని మాడ్యూల్స్‌ను మాత్రమే ఉపయోగించాల్సి ఉంటుంది. దిగుమతి చేసుకునే మాడ్యూల్స్ వాడకాన్ని నిషేధించడం, తద్వారా దిగుమతులపై ఆధారపడడాన్ని తగ్గించడమే ఈ ఆదేశాల వెనుక ఉద్దేశమని ప్రభుత్వం చెబుతోంది. అయితే దీనిపై అభ్యంతరాలు వ్యక్తం కావడంతో 2023 మార్చిలో ఈ ఆదేశాల అమలును ప్రభుత్వం ఓ సంవత్సరం పాటు వాయిదా వేసింది. దేశీయంగా ఉత్పత్తి సామర్థ్యం తక్కువగా ఉన్నందున ఆంక్షలు విధించడం సరికాదని, దీనివల్ల ఆశించిన మేరకు అదనపు సౌర విద్యుత్తును ఉత్పత్తి చేయలేమని అప్పటి కేంద్ర మంత్రి ఆర్‌కే సింగ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిబంధనల కారణంగా కొందరు ఉత్పత్తిదారులు అసాధారణ ధరలు వసూలు చేసి ప్రజలను దోచుకునే ప్రమాదం ఉన్నదని, అధిక చార్జీలు చెల్లించాల్సి రావడంతో సౌర విద్యుత్ మోయలేని భారంగా మారుతుందని ఆయన హెచ్చరించారు.

ధరల వ్యత్యాసం ఇలా...

దిగుమతులతో పోలిస్తే దేశీయ సౌర మాడ్యూల్స్ ధర 90 శాతం అధికంగా ఉంటోంది. జూన్‌లో



దిగుమతి చేసుకున్న మాడ్యూల్స్ ధర వాట్‌కు 9.1 సెంట్స్ ఉండగా దేశీయ మాడ్యూల్స్ ధర 18 సెంట్స్‌కు చేరింది. 2021-22 నుంచి ఈ వ్యత్యాసం పెరుగుతూనే ఉంది. అప్పుడు దిగుమతుల కంటే దేశీయ ధరలు 6 శాతం అధికంగా ఉన్నాయి. మాడ్యూల్ తయారీదారులు చైనా నుండి సెల్స్‌ను దిగుమతి చేసుకుంటారని, వాటిని దేశంలో కేవలం అసెంబుల్ మాత్రమే చేస్తారని సింగ్ తెలిపారు. ప్రస్తుతం మన దేశంలో సెల్ ఉత్పత్తి సామర్థ్యం పది గిగావాట్ల కంటే తక్కువగానే ఉంది. దేశీయ ఉత్పత్తిదారులు మాడ్యూల్స్‌ను అధిక ధరలకు విక్రయించి భారీగా లాభాలు దండుకుంటున్నారని సింగ్ ఆరోపించారు. 'చైనాలో ప్రస్తుతం సెల్స్ ధర ఆరు సెంట్లు. దానిపై 25 శాతం సుంకం విధించిన తర్వాత ధర 7.5 సెంట్లు అవుతుంది. ఫ్యాబ్రికేషన్ ఖర్చు ఏడెనిమిది సెంట్స్ కంటే ఎక్కువేమీ ఉండదు. దీనిని బట్టి చూస్తే మాడ్యూల్స్ 16 సెంట్స్‌కు లభించాలి. కానీ మన దేశంలో మాడ్యూల్స్ ఉత్పత్తిదారులు 23-24 సెంట్స్ వసూలు చేస్తున్నారు. ఇది అధిక లాభాలు దండుకోవడమే అవుతుంది. మాడ్యూల్ ధర ఎక్కువైతే విద్యుత్ చార్జీలు కూడా పెరుగుతాయి' అని మాజీ మంత్రి సింగ్ వివరించారు. సింగ్ ఒక్కరే నిరసన గళం వినిపించలేదు. 55 శాతం కేంద్ర ప్రభుత్వ వాటాలు ఉన్న ప్రభుత్వ రంగ సంస్థ ఎస్‌జేవీఎన్ లిమిటెడ్ కూడా మరో తొమ్మిది నెలల పాటు ఆదేశాలను పక్కన పెట్టాలని ప్రభుత్వాన్ని కోరింది. 50 గిగావాట్ల సౌర విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలన్న ప్రభుత్వ లక్ష్యం ఈ ఆదేశాల కారణంగా దెబ్బ తింటుందని, రాబోయే ప్రాజెక్టుల టారిఫ్‌పై కూడా ప్రభావం పడుతుందని తెలుపుతూ అప్పటి ఎస్‌జేవీఎన్ సీఎండీ గీతా కపూర్ పునరుద్ఘాటక ఇంధన వనరుల మంత్రిత్వ శాఖకు ఓ లేఖ రాశారు. అయినప్పటికీ మంత్రిత్వ శాఖ తన ఆదేశాలను తిరిగి జారీ చేస్తూ ఏప్రిల్ 1వ తేదీ నుండి అమలు చేస్తామని ప్రకటించింది.

అంతర్జాతీయ ఉత్పతిదారులనూ చేర్చాలి

జాబితాలో అంతర్జాతీయ ఉత్పత్తిదారులను కూడా చేర్చాలని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎనర్జీ ఎకనమిక్స్ అండ్ ఫైనాన్షియల్ అనాలసిస్, జేఎంఎం రిసెర్చ్ సంస్థ కోరాయి. 'భారత మార్కెట్‌లో అధిక సామర్థ్యం కలిగిన దేశీయ మాడ్యూల్స్ సరఫరా 20-22 గిగావాట్లు మాత్రమే ఉంటుంది. ఏటా 30-35 గిగావాట్ల సౌర విద్యుత్తును ఉత్పత్తి చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. మిద్దెలపై సౌర విద్యుత్ పలకల ఏర్పాటుకు మరో ఐదు గిగావాట్లు అవసరం. దేశీయ కంపెనీల మాడ్యూల్స్ సరఫరా ఈ స్థాయిలో లేనందున 2026 మార్చి వరకూ విదేశీ ఉత్పత్తిదారులను అనుమతించాలి' అని ఆ సంస్థలు విడుదల చేసిన నివేదిక కోరింది. 2026 నాటికి సౌర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని 90-100 గిగావాట్లకు పెంచాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని మంత్రిత్వ శాఖ కార్యదర్శి భూపేందర్ ఎస్. భల్లా తెలిపారు. ఇప్పటి వరకూ పీఎల్ఐ పథకం కింద 48.3 గిగావాట్ల మాడ్యూల్ ఉత్పత్తి సామర్థ్యానికి మంత్రిత్వ శాఖ ప్రోత్సాహకాలు ప్రకటించింది. వీటిలో ఆ ఐదు కంపెనీలకే రూ.5,685 కోట్ల మేర ప్రోత్సాహకాలు ప్రకటించడం గమనార్హం.

సంపాదకీయం

ప్రభు భక్తి



జమ్మూకశ్మీర్, హర్యానా అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం శుక్రవారం ప్రకటించింది. ఆర్టికల్ 370 రద్దు తర్వాత తొలిసారి మొత్తం 90 స్థానాలకు వచ్చే నెల 18 నుంచి మూడు దశల్లో అక్కడ శాసనసభా సమరం జరగనుంది. హర్యానాలోనూ అవే 90 స్థానాలకు మాత్రం ఒకే దశలో పోలింగ్ జరగనుంది. అసలు ఎన్నికలు నిర్వహించేదే రెండే రాష్ట్రాల్లోనే అయినప్పుడు ఒక్క జమ్మూకశ్మీర్లో మూడు విడతల పోలింగ్ నిర్వహించడంలో అంతర్యం ఏమిటి? వాస్తవానికి ఈ ఏడాది నవంబరులో మహారాష్ట్రతోపాటు హర్యానా ఎన్నికలు జరగాల్సి ఉంది. వచ్చే ఏడాది జనవరిలో జార్ఖండ్ అసెంబ్లీ గడువు ముగుస్తుంది. జమ్మూకశ్మీర్‌లో భారీస్థాయిలో బలగాలను మోహరించాల్సిన అవసరం ఉన్నందున మహారాష్ట్రను పక్కనబెట్టారట. అంతే కాదంట మహారాష్ట్రలో వినాయకచవితి, నవరాత్రులు, దీపావళి వంటి పండుగలున్నాయని, ఓటర్ జాబితాను అప్‌డేట్ చేయడానికి వర్షాలు అడ్డుపడ్డాయి అంటూ అనేక కారణాలు చెప్పుకొచ్చారు సీఈసీ రాజీవ్‌కుమార్. మరి, జార్ఖండ్‌ను ఢిల్లీతో కలిపి జరుపుతామనడంలోని లోగుట్టు పెరుమాళ్లకే ఎరుక కావాలి.

ప్రత్యేక ప్రతిపత్తి తొలగింపు తరవాత జమ్మూకశ్మీర్ జీడీపీ గణనీయంగా పెరిగిందని, ఉగ్రదాడులు తగ్గిపోయాయని అధికారగణం సెలవిస్తోంది. శాంతిభద్రతల పరంగా అక్కడ కొత్తయుగం ఆరంభ మైందనీ ఊదరగొడుతోంది. కశ్మీరం సర్వతోముఖాభివృద్ధికి కేంద్రం రూ.80వేల కోట్ల ప్యాకేజీని ప్రకటించింది. అయినా ఎందుకో వారిని అభద్రతాభావం వెంటాడుతోంది. అందుకే ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో సైతం కశ్మీర్ లోయలోని స్థానాలకు పోటీచేసే సాహసమే బీజేపీ చేయలేకపోయింది. జమ్మూకశ్మీర్ ప్రత్యేకప్రతిపత్తిని ఎత్తివేసి, రాష్ట్రంగా ఉన్న దాన్ని కేంద్రపాలితంగా మార్చేసిన నిర్ణయాన్ని సుప్రీంకోర్టు తప్పుబట్టకుండా, ఎన్నికలు మాత్రం ఈ ఏడాది సెప్టెంబరు ముప్పైలోగా జరగాలంటూ ఆదేశించిన విషయం తెలిసిందే. వాస్తవానికి అక్కడి పార్టీలు, ప్రజలు ఎంతోకాలంగా ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్న విషయాన్ని కేంద్ర ఎన్నికల సంఘం తమ శంఖులో పోసి అదే తీర్థమన్నట్టు చెప్పుకొచ్చారు.

2014లో రాష్ట్రంగా ఉన్నప్పుడు జరిగిన చివరి ఎన్నికల్లో ముఫ్తీమహ్మద్ సయీద్ నాయకత్వంలోని పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ (పీడీపీ) అతిపెద్దపార్టీగా అవతరించింది. బీజేపీ-పీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడింది. ఆయన మరణానం తరం 2016లో కుమార్తె మహబూబా ముఫ్తీ సీఎం అయ్యారు. ఆ సంకీర్ణ సర్కారు ముచ్చట మూన్నాళ్ల చందమే అయ్యింది. 2018లో ప్రభుత్వం కూలిపోయి, గవర్నర్ పాలన మొదలైంది. మరుసటి ఏడాది ఆగస్టులో కేంద్రప్రభుత్వం 370 ప్రయోగించింది. ఆ ప్రాంతాన్ని రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా మార్చింది. ఎన్నికల సంఘం ప్రకటనకు ఒకరోజు ముందే లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా చర్యలపై వచ్చిన అభ్యంతరాలను ఇదే ఎన్నికల సంఘం తేలికగా కొట్టిపారేసింది. జమ్మూకశ్మీర్ విషయంలో కేంద్రం తీసుకున్న ప్రతీ చర్యకు ఈ ఎన్నికల్లో ప్రజలు సమాధానం చెబుతారు. ప్రత్యేక ప్రతిపత్తి రద్దుకు పాలకులు చెప్పిన కారణాలను చూపెట్టి వారి ఆకాంక్షలు ఏమేరకు నెరవేరాయో బేరీజు వేసుకుంటారనడంలో సందేహం లేదు.

అయినా హర్యానా శాసనసభకు నవంబర్ మూడున కొత్త శాసనసభ ఏర్పడేలా కాకుండా రెండు నెలలకు పైగా ముందుకు లాగారు. అదేసూత్రం మహారాష్ట్రకు ఎందుకు వర్తింప చేయలేదో తెలియదు. అదేమంటే ఎన్నికల కార్యక్రమాన్ని ఎన్నికల కమిషన్ నిర్ధారిస్తుంది అంటారు. కానీ ఎన్నికల కమిషన్ ప్రభుభక్తి చాటుకునే పనిలో ఉన్నదన్న విషయం జగమెరిగిన సత్యం. అంతా అధికార పార్టీ కనుసన్నల లోనే జరుగుతుందనేది కూడా ఎవరూ కాదనలేని పచ్చి నిజం. అందుకే ఉత్తరప్రదేశ్ పది శాసనసభా స్థానాలకు ఉప ఎన్నికలు జరగవలసి ఉంది. కానీ ఆ షెడ్యూలు ఇంకా ప్రకటించలేదు.

90 స్థానాలున్న హర్యానాలో ఈ మారు కాంగ్రెస్‌ది పైచేయి అవుతుందని విశ్లేషణలు వెలువడుతున్నాయి. 2019లో మెజారిటీ లేకున్నా దుష్యంత్ చౌతాలాతో పొత్తు పెట్టుకొని ముఖ్యమంత్రిగా ఖట్టర్ కొనసాగగలిగారు. కానీ ఇటీవలి లోక్‌సభ ఎన్నికలకు నెలరోజుల ముందు ఆ కూటమి కూలింది, ఖట్టర్ స్థానంలోకి నయాబ్‌సింగ్ సైనీ వచ్చారు. లోక్‌సభ ఎన్నికల్లో సగం స్థానాలు గెలుచుకున్న కాంగ్రెస్ పట్ల ప్రజాదరణ పెరిగిందని సర్వేలు కూడా అంటున్నాయి. నిరుద్యోగం, అగ్నివీర్, రైతు ఉద్యమాలు, మహిళా రెజ్లర్ల అంశం ఓటర్లను ప్రభావితం చేసేలా ఉన్నాయి. యూపీ మాజీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను కాపాడుకోవడంకోసం బీజేపీ పెద్దలు మహిళా రెజ్లర్లతో అన్యాయంగా వ్యవహరిం చారన్న ఆగ్రహం ఖాప్ పంచాయితీల్లో వెల్లడవుతోంది. ఆ ఉద్యమానికి సారథ్యం వహించిన వినేశ్ ఫోగట్‌మీద ఒలింపిక్స్‌లో అనర్హత వేటుపడ టమూ ఓటర్లమీద పనిచేయవచ్చు. జమ్మూకశ్మీర్, హర్యానా ఎన్నికల్లో స్థానికాంశాలే ప్రధానంగా పనిచేసినప్పటికీ, ఫలితాల ప్రభావం అన్నింటా ఉంటుంది.

> నిరుద్యోగం, అగ్నివీర్, రైతు ఉద్యమాలు, మహిళా రెజ్లర్ల అంశం ఓటర్లను ప్రభావితం చేసేలా ఉన్నాయి. యూపీ మాజీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను కాపాడుకోవడంకోసం బీజేపీ పెద్దలు మహిళా రెజ్లర్లతో అన్యాయంగా వ్యవహరించారన్న ఆగ్రహం ఖాప్ పంచాయితీల్లో వెల్లడవుతోంది. ఆ ఉద్యమానికి సారథ్యం వహించిన వినేశ్ ఫోగట్‌మీద ఒలింపిక్స్‌లో అనర్హత వేటుపడటమూ ఓటర్లమీద పనిచేయవచ్చు. జమ్మూకశ్మీర్, హర్యానా ఎన్నికల్లో స్థానికాంశాలే ప్రధానంగా పనిచేసినప్పటికీ, ఫలితాల ప్రభావం అన్నింటా ఉంటుంది.

సెబీ చీఫ్ లాలూచీ బహిర్గతం



అమెరికాకు చెందిన పరిశోధన సంస్థ హిండెన్‌బర్గ్ విడుదల చేసిన తాజా నివేదిక సెబీ ప్రధాన అధికారి మాధబి పురి బుచ్ పాత్ర గురించి తీవ్రమైన ప్రశ్నలు ముందుకు తెచ్చింది. అదానీ గ్రూపు వివిధ నిబంధనల ఉల్లంఘనలకు, షేర్ల రేట్ల విషయంలో మాయాజాలానికి పాల్పడిందనే ఆరోపణలపై దర్యాప్తు చేస్తున్న ఆ నియంత్రణ సంస్థకి ఆమె బాధ్యత వహిస్తున్నారు.

హిండెన్‌బర్గ్ నివేదిక ప్రకారం సెబీ చైర్‌పర్సన్ బుచ్ 2015లో 'గ్లోబల్ డైనమిక్ ఆపర్చునిటీ ఫండ్' అన్న దాంట్లో పెట్టుబడులు పెట్టారు. సరిగ్గా ఆమె సెబీ పూర్తి కాలపు సభ్యురాలిగా బాధ్యత స్వీకరించడానికి ముందే 2017లో ఆమె వాటిని తన భర్త ఖాతాకు బదలాయించారు. ఆ నిధులను నిర్వహించేది ఆమె భర్త అయినా 2018లో బుచ్ స్వయంగా ఇచ్చిన మెయిల్‌తో వాటి నుంచి బయటపడ్డారు. పెట్టుబడులు మళ్లీ ప్రారంభమయ్యాయి.

విదేశాల్లోని ఈ సంస్థలో బుచ్ పెట్టుబడులు పెట్టినట్టు ఒక సమాచార వేగు ఇచ్చిన ప్రకటన ఆధారంగా హిండెన్‌బర్గ్ నిర్ధారించింది. గౌతమ్ అదానీ సోదరుడైన వినోద్ అదానీ నిర్వహిస్తున్న 'బెర్ముడా మారిషస్ ఫండ్'లో అది భాగంగా ఉంది. అప్పటికే గౌతమ్ అదానీపై సెబీ దర్యాప్తు సాగుతున్నా పెట్టుబడులు పెట్టారు.

తొలి నివేదిక సంచలనం-సుప్రీం కోర్టు

హిండెన్‌బర్గ్ 2023 జనవరిలో విడుదల చేసిన నివేదిక సంచలనం కలిగించిన సంగతి గుర్తు చేసుకోవాలి.

> బీజేపీ, మోడీ ప్రభుత్వం సెబీ చీఫ్‌పై వచ్చిన ఈ ఆరోపణలను వెనక్కు కొట్టడానికి ప్రయత్నిస్తున్నాయి. భారతదేశ స్టాక్ మార్కెట్‌ను ఆర్థిక వ్యవస్థను అస్థిరపరచడానికి కాంగ్రెస్ పార్టీ, ఇతర ప్రతిపక్షాలు విదేశీ సంస్థలతో కుమ్మక్కు అవుతున్నాయని ఆరోపిస్తున్నాయి.
> సెబీ చీఫ్‌కు వత్తాసుగా ఇలాంటి దారుణమైన వినాశకరమైన సమర్థనకు దిగడం చిన్నశ్రేణి మదుపరులలో గానీ, ప్రజలలోకానీ విశ్వాసం పాదుకొల్పడం సాధ్యం కాదు. ఒక నయా ఉదారవాద వ్యవస్థలో నియంత్రణ సంస్థలను బడా కంపెనీలు ఏ విధంగా గుప్పిట పెట్టుకోగలవో బుచ్ ఉదంతం బహిర్గతం చేస్తోంది.

అదానీ గ్రూప్ చాలా బాహాటంగా దశాబ్దాల తరబడి స్టాక్ మార్కెట్ మాయాజాలానికి పాల్పడిందని, లెక్కలు తారుమారు చేసిందని ఆ నివేదిక ఆరోపించింది. ఫోరెన్సిక్ విశ్లేషణ తర్వాత అదానీ గ్రూప్ అనేక విదేశీ సంస్థల పేరుతో తన స్వంత నిధులనే అటూ ఇటూ తిప్పి తమ కంపెనీలలో పెట్టుబడి పెట్టిందీ కళ్లకు కట్టినట్లు వివరాలు నమోదు చేసింది. అదానీ గ్రూపు చట్ట ఉల్లంఘనల పట్ల తగు విధంగా వ్యవహరించడంలో సెబీ వైఫల్యం ఉందేమో దర్యాప్తు చేయడానికి 2023 మార్చిలో సుప్రీంకోర్టు ఆరుగురు సభ్యులతో నిపుణుల బృందాన్ని నియమించింది. అంతేకాక ప్రభుత్వ రంగ సంస్థల తరపున వున్న వాటాలకు సంబంధించిన వ్యవహారాలలో ఏమైనా ఉల్లంఘనలు జరిగాయేమో నిర్దిష్టంగా విచారించాలని ఆదేశించింది. అదానీ కంపెనీలకు సంబంధిత పక్షాలు నడిపిన లావాదేవీల సమాచారం వెల్లడించడంలో వైఫల్యాలు, షేర్ల రేట్లలో కుంభకోణాలు ఏమైనా ఉన్నాయేమో చూడాలని ఆదేశించింది.

ఈ ఉల్లంఘనల పైన, అదానీ కంపెనీకి విదేశీ పెట్టుబడుల ప్రవాహం పైన జరిపిన సెబీ దర్యాప్తులో ఏ తప్పూ కనుగొనలేకపోయిందని 2023 మే లో కోర్టుకు నిపుణుల కమిటీ తెలియజేసింది. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమంటే అదానీ గ్రూపునకు సంబంధించిన వివిధ ఉల్లంఘనల ఆరోపణలపై సెబీ అంతకన్నా ముందే దర్యాప్తు జరుపుతున్నది. ఈ విషయంలో ఎలాంటి తీవ్ర ఉల్లంఘనలు ఉన్నట్లు నిరూపించడంలో విఫలం కావడం బట్టి చూస్తే సెబీ వైఫల్యం అనుమానాస్పదమని, ప్రశ్నార్థకమని హిండెన్‌బర్గ్ తాజా నివేదిక స్పష్టం చేస్తోంది. బుచ్ స్వయానా వినోద్ అదానీకి సంబంధించిన విదేశీ సంస్థలో పెట్టుబడులు పెట్టడమే ఇందుకు కారణం అవుతుంది.

ఎప్పుడూ చెప్పలేదే?

హిండెన్‌బర్గ్ నివేదిక లోని ఆరోపణలను అసంబద్ధమైనవని వ్యక్తిగత శీలహననమేనని చైర్‌పర్సన్ బుచ్, అలాగే సెబీ ఖండించాయి. ఈ ఫండును నెలకొల్పిన అనిల్ అహుజా తన భర్తకు బాల్యమిత్రుడు కావడం వల్లనే పెట్టుబడులు పెట్టామని బుచ్ ఒక ప్రకటనలో చెబుతున్నారు. ఆ పెట్టుబడులు పెట్టిన విషయం తమకు సరైన సమయంలోనే తెలియచేశారని, అలాగే అవసరమైనప్పుడు ఆమె ఆ వ్యవహారాలకు దూరంగా ఉన్నారని సెబి అంటున్నది. అయితే ఆమె అదానీకి సంబంధించిన దర్యాప్తులలో దూరంగా ఉన్నారని చెప్పగల నిర్దిష్టమైన సమాధానం లేదు. బుచ్ విదేశీ నిధులకు సంబంధించి తన భాగస్వామ్యాన్ని సుప్రీంకోర్టుకు గాని ఆరుగురు నిపుణుల బృందానికి కానీ 2023 మార్చిలో కోర్టు నియమించిన బృందానికి గాని ఆమె తెలియజేసినట్లు సమాచారం లేదు. అదానీ గ్రూపుపై వచ్చిన 22 ఆరోపణలలో 20 విషయాలను దర్యాప్తు ముగించినట్లు మాత్రమే సెబీ సుప్రీంకోర్టుకు తెలిపింది. మిగిలిన వాటి దర్యాప్తును మరో రెండు మూడు నెలల్లో ముగించనున్నట్టు తెలియజేసింది. మరో సమస్యపై కూడా దర్యాప్తు ముగించినట్టు ఇక ఒకటి మాత్రమే మిగిలినట్టు సెబీ 2024 జనవరిలో కోర్టుకు తెలియజేసింది. అదానీ గ్రూపు కంపెనీలకు వ్యతిరేకంగా ఎలాంటి ఆధారాలు దొరికినట్టు చెప్పనేలేదు. చైర్‌పర్సన్‌గా బుచ్ ఆ కంపెనీలపై దర్యాప్తు జరుగుతున్న సమయంలోనే రెండుసార్లు అదానీతో సమావేశమైన విషయాన్ని కూడా వెల్లడించలేదు. దీన్నిబట్టి చూస్తే ఆమెపై వచ్చిన తీవ్ర ఆరోపణలకు ప్రాధాన్యత లభిస్తున్నది. సెబీ చీఫ్ వ్యక్తిగత అంత:కరణ, అలాగే ఒక స్వతంత్ర నియంత్రణ సంస్థ అధిపతి నుంచి ఆశించే ఉన్నత స్థాయి ప్రమాణాలకు సంబంధించిన సమస్య ఇది. ఈ రెండు కోణాలరీత్యా మాధబి బుచ్ తన స్థానం నుంచి తక్షణం తప్పుకోవాల్సి ఉంటుంది.

> అదానీ గ్రూపు చట్ట ఉల్లంఘనల పట్ల తగు విధంగా వ్యవహరించడంలో సెబీ వైఫల్యం ఉందేమో దర్యాప్తు చేయడానికి 2023 మార్చిలో సుప్రీంకోర్టు ఆరుగురు సభ్యులతో నిపుణుల బృందాన్ని నియమించింది. అంతేకాక ప్రభుత్వ రంగ సంస్థల తరపున వున్న వాటాలకు సంబంధించిన వ్యవహారాలలో ఏమైనా ఉల్లంఘనలు జరిగాయేమో నిర్దిష్టంగా విచారించాలని ఆదేశించింది. అదానీ కంపెనీలకు సంబంధిత పక్షాలు నడిపిన లావాదేవీల సమాచారం వెల్లడించడంలో వైఫల్యాలు, షేర్ల రేట్లలో కుంభకోణాలు ఏమైనా ఉన్నాయేమో చూడాలని ఆదేశించింది.

కేంద్ర సమర్థన-వాస్తవాల నిర్ధారణ


బీజేపీ, మోడీ ప్రభుత్వం సెబీ చీఫ్‌పై వచ్చిన ఈ ఆరోపణలను వెనక్కు కొట్టడానికి ప్రయత్నిస్తున్నాయి. భారతదేశ స్టాక్ మార్కెట్‌ను ఆర్థిక వ్యవస్థను అస్థిరపరచడానికి కాంగ్రెస్ పార్టీ, ఇతర ప్రతిపక్షాలు విదేశీ సంస్థలతో కుమ్మక్కు అవుతున్నాయని ఆరోపిస్తున్నాయి.

సెబీ చీఫ్‌కు వత్తాసుగా ఇలాంటి దారుణమైన వినాశకరమైన సమర్థనకు దిగడం చిన్నశ్రేణి మదుపరులలో గానీ, ప్రజలలోకానీ విశ్వాసం పాదుకొల్పడం సాధ్యం కాదు. ఒక నయా ఉదారవాద వ్యవస్థలో నియంత్రణ సంస్థలను బడా కంపెనీలు ఏ విధంగా గుప్పిట పెట్టుకోగలవో బుచ్ ఉదంతం బహిర్గతం చేస్తోంది.

కనుక ఈ సరికొత్త సాక్ష్యాల నేపథ్యంలో సుప్రీంకోర్టు అదానీ గ్రూపు సాగించిన దారుణమైన నియమోల్లంఘనలనూ స్టాక్ మార్కెట్ మాయాజాలాలనూ కూడా కోర్టు ఆధ్వర్యంలో దర్యాప్తు చేయించడం మరింత శ్రేయస్కరం అవుతుంది. లేదంటే ఈ మొత్తం వ్యవహారంపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ దర్యాప్తు జరపటం ఏకైక మార్గంగా వుంటుంది.

- ఆగస్టు 14 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం

హేతువాది డా.నరేంద్ర దభోల్కర్



డా. నరేంద్ర దాభోల్కర్ వృత్తిరీత్యా వైద్యుడు. సాంఘిక కార్యకర్త, హేతువాది. వైద్యుడిగా సుమారు 12 ఏండ్లు పనిచేసిన అయన సామాజిక కార్యకర్తగా సేవలందించారు. సామాజిక న్యాయంకోసం పోరాడారు. ఒకే వూరు, ఒకే బావి కార్యక్రమంతో అతని సాంఘిక పోరాటం మొదలైంది. మహారాష్ట్రలోని చాలా గ్రామాల్లో ఈ 21వ శతాబ్దంలో కూడా అస్పృశ్యులకు వేరే బావి ఉండేది. దానికి వ్యతిరేకంగా ఒకేవూరు ఒకేబావి నినాదంతో ఉద్యమించారు.

అలా ఉద్యమిస్తూనే అయన మూఢనమ్మకాల నిర్మూలన కోసం సమయం కేటాయించేవారు. గ్రామాల్లో మూఢ నమ్మకాల నిర్మూలన కోసం "మహారాష్ట్ర అంధశ్రద్ధ నిర్మూలన సమితి"ని 1989లో స్థాపించారు. మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా ఉపన్యాసాలు ఇస్తూ ప్రజలను జాగురూకులను చేసేవారు. తమని తాము బాబాలమని, మాంత్రికులమని చెప్పుకునే వాళ్లను ఎదిరించేవారు. మాయలు మంత్రాలూ చేసి రోగాలను నయం చేస్తామనే దొంగ బాబాలను ఎండగట్టేవారు.

వ్యవస్థాపక సభ్యులుగా అయన సతారా జిల్లాలో 'పరివర్తన్' (మార్పు) సంస్థను ప్రారంభించారు. ఈ సంస్థ అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం పనిచేసింది. ఈ వర్గాల వారూ మనలో ఒకరనీ, మనలాగే వాళ్లూ స్వాభిమానంతో, అభివృద్ధి పథంలో సాగాలన్నది ఈ సంస్థ ఆశయం. దభోల్కర్ 'ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రేషనలిస్ట్ అసోసియేషన్'కు (భారతీయ హేతువాద సంస్థ) ఉపాధ్యక్షుడుగానూ పనిచేశారు. ప్రఖ్యాత మరాఠీ వారపత్రిక 'సాధన'కు సంపాదకులుగానూ సేవలందించారు.

20 ఏండ్లుగా దళితుల సమాన హక్కుల కోసం ఆయన పెద్దపోరాటమే చేశారు. దేశంలోని కుల వ్యవస్థకు, కులమతాలద్వారా ప్రేరేపింపబడే హింసను వ్యతిరేకించేవారు. అయన కృషివల్లనే మరాట్వాడా విశ్వవిద్యాలయం.. 'అంబేద్కర్ విశ్వవిద్యాలం'గా పేరు మార్పు జరిగింది.

ఆశారాం బాపూని ఎండగట్టే విషయంలో ఆయన కృషి ఎంతో ఉంది. అది 2013 మార్చి.. మహారాష్ట్ర అంతటా కరువు విలయతాండవం చేస్తున్న రోజులు. ప్రజలకు దాహం తీర్చుకోవడానికి గుక్కెడు నీళ్లు కూడా కరువయ్యాయి. అటువంటి పరిస్థితుల్లో ఆశారాంబాపూ, ఆయన శిష్యులు హోలీ పండుగ రోజు, నాగపూర్ మున్సిపల్ కార్పొరేషన్ నుంచి ట్యాంకర్లతో నీళ్లు తెప్పించుకుని రంగులు చల్లుకుంటూ, జలకాలాడుతూ.. తాగు నీటిని వృథా చేయడాన్ని అయన ప్రశ్నించారు.

చేతబడి మూఢనమ్మకాల వ్యతిరేక బిల్లు: మూఢనమ్మకాలకు, చేతబడులకు వ్యతిరేకంగా చట్టం చేయాలన్న ఓ బిల్లును రాష్ట్ర అసెంబ్లీలో ప్రవేశపెట్టించడం వెనుక కృషి దభోల్కర్‌దనే చెప్పాలి. అయన నేతృత్వంలో 'మహారాష్ట్ర అంధ్ నిర్మూలన సమితి' ఈ బిల్లుని తయారుచేసి దానిని అసెంబ్లీలో ప్రవేశపెట్టించింది. దానికి చట్ట రూపం తెచ్చేలా చేసేందుకు చాలా ప్రయత్నాలు చేసారు. దాంతో దభోల్కర్ మతవిరోధి అనీ, ఈ బిల్లు హిందూమతానికి వ్యతిరేకమని బీజేపీ, శివసేనలతోపాటు కొన్ని ఇతర రాజకీయ పార్టీలు వ్యతిరేకించాయి.

తరువాత అయన 'ఫ్రాన్స్ ప్రెస్ ఏజెన్సీ'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో తన బిల్లుని గురించి చెబుతూ మొత్తం బిల్లులో దేవుడు, మతం అనే పదాలే లేవని స్పష్టంచేశారు. అయన హత్యకు కొన్ని రోజుల ముందు అంటే 2013 ఆగస్టు 6న దభోల్కర్ మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీలో ఈ బిల్లును ఏడుసార్లు ప్రవేశ పెట్టినప్పటికీ దీనిపై చర్చ జరగలేదనీ, ప్రగతిశీల భావాలు గలవాళ్ళని అప్పటి ముఖ్యమంత్రి పృథ్వీరాజ్ చౌహాన్ నిరుత్సాహపరిచారని అన్నారు. ఈ బిల్లు మోసపూరిత దోపిడీకి వ్యతిరేకంగా తేబడిందే తప్ప, దేవుడికి, మతానికి వ్యతిరేకంకాదని స్పష్టంచేశారు. అయితే 2013 ఆగస్టు 20న అయన హత్య జరిగిన తరువాతి రోజు మహారాష్ట్ర క్యాబినెట్ 'చేతబడులు, మూఢాచారాల' వ్యతిరేక ఆర్డినెన్సు తెచ్చి, పార్లమెంట్ ఆమోదం కోసం పంపింది. ఈ ఆర్డినెన్సును 29 సవరణలతో 18 డిసెంబర్ 2013 నాడు పార్లమెంట్ ఆమోదం తెలిపింది.

ఆయనకు అనేకసార్లు బెదిరింపులు వచ్చాయి. చివరకు 2013 ఆగస్టు 20న ఉదయం మార్నింగ్ వాక్‌కు వెళ తుండగా... 7.30 ప్రాంతంలో ఇద్దరు వ్యక్తులు దభోల్కర్‌ను అతి సమీపం నుంచి తుపాకీతో కాల్చి మోటారు సైకిలుపై పారిపోతారు. అయన అక్కడికక్కడే చనిపోతారు. హిందూ మతవాద "సనాతన్ సంస్థ" ఈ హత్యకు కుట్ర పన్నిందని పోలీసుల పరిశోధనలో తేలింది. తరువాతి కాలంలో ఈ 'సనాతన్ సంస్థ' ఎం.ఎం కల్బుర్గీ, గోవింద్ పన్సారే, గౌరి లంకేశ్‌ల హత్యలకూ కారణమని తేలింది.

దభోల్కర్ హత్య జరిగిన పదేళ్ళకి, స్పెషల్ సీబీఐ కోర్టు 2013 మే 10న ఇద్దరికి యావజ్జీవ కారాగార శిక్షతోపాటు చెరో రూ.5 లక్షల జరిమానా విధించింది. అయితే అసలు కుట్రదారుడైన వీరేంద్ర సింగ్ శరత్చంద్ర తవాడే, అతని ఇద్దరు సహచరులను సరైన సాక్ష్యాధారాలను చూపలేక పోయిందన్న సాకుతో సీబీఐ కోర్టు విడుదల చేసింది.

ఏది ఏమైనప్పటికీ దేశం ఒక సంఘ సంస్కర్తను, హేతువాదిని కోల్పోయింది. 'ఆల్ ఇండియా పీపుల్స్ సైన్స్ నెట్‌వర్క్' అయన హత్య జరిగిన 20 ఆగస్టును 'నేషనల్ సైంటిఫిక్ టెంపర్ డే' గా నిర్వహిస్తున్నది.

(దభోల్కర్ పదకొండవ వర్ధంతి సందర్భంగా...)

- పి. జయ ప్రకాశ్, 8374851426

అమెరికా జోక్యం-ప్రపంచ ప్రజాస్వామ్య విధ్వంసం



సంగిరెడ్డి హనుమంత రెడ్డి
9490204545

ప్రజాస్వామ్య ప్రోత్సాహం సాకుతో అమెరికా ప్రజాస్వామ్య జాతీయ ధర్మసంస్థ (నేషనల్ ఎండోమెంట్ ఫర్ డెమోక్రసీ-ఎన్ఈడీ) జోక్యం, విధ్వంసక ప్రయత్నాల నుండి అంతర్జాతీయ సమాజం జాగ్రత్తగా ఉండాలి. అప్పుడే ప్రజాస్వామ్యం, అభివృద్ధి, శాంతి, అంతర్జాతీయ న్యాయం సాధ్యమవుతాయి. ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, మానవ హక్కుల ముసుగులో విదేశాల అంతర్గత అంశాల్లో చొరబాటు, విధ్వంస ప్రయోజనాలకు అమెరికా ఎన్ఈడీని వాడుకుంటోంది. ఇది ఆ దేశాల సార్వభౌమాధికారం, అభివృద్ధి, ప్రయోజనాల, అంతర్జాతీయ చట్టం, అంతర్జాతీయ భద్రత సంబంధాల ప్రాథమిక నిబంధనల తీవ్ర ఉల్లంఘన. ప్రపంచ శాంతి, స్థిరత్వాన్ని తీవ్రంగా దెబ్బతీసింది.

అమెరికా ప్రభుత్వం నుండి నిధులు పొందుతున్న ఎన్ఈడీ అమెరికా కేంద్ర నిఘా సంస్థ (సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ-సీఐఏ) రహస్య కార్యకలాపాలను అమలుచేస్తోంది. సీఐఎ, అమెరికా సమాఖ్య ప్రభుత్వ పౌర విదేశీ నిఘా సేవా సంస్థ. ప్రపంచం పదిదిక్కుల నుండి అన్ని దేశాల జాతీయ భద్రత సమాచార సేకరణ, వ్యవహార ఆచరణ కార్యక్రమాల పద్ధతీకరణ, విశ్లేషణ దీని విధులు. అమెరికా ఎన్ఈడీని తెల్ల చేతితొడుగులా పరిగణిస్తోంది. వైద్యశాలల, పరిశ్రమల, హోటళ్ళ, వితరణ సంస్థల శుభ్రతకు తెల్ల చేతితొడుగులు సంకేతం. ఇతర దేశాల్లో రాజ్యాధికార అణచివేత, అంతర్గత వ్యవహారాల్లో జోక్యం, విభజన, ఘర్షణల ప్రేరేపణ, కార్పొరేట్ల ఆయుధాల అమ్మకానికి, విదేశాల ప్రకృతి, మానవ వనరుల దోపిడీకి యుద్ధాలు చేయించడం, ప్రజల అభిప్రాయాన్ని తప్పుదారి పట్టించడం, సైద్ధాంతిక, సాంకేతిక చొరబాట్ల నిర్వహణ వంటివి చాలాకాలంగా అమెరికా కొనసాగిస్తున్న అతిక్రమణ చర్యలు. "దశాబ్దాలుగా సీఐఏ రహస్యంగా చేస్తున్న పనులను ఎన్ఈడీ బహిరంగంగా చేస్తుంది. దాంతో సీఐఎ రహస్య చర్యల నిర్వహణల కళంకాన్ని తొలగిస్తుంది" అని అమెరికా పండితుడు, రచయిత, పాత్రికేయుడు, అమెరికా విదేశాంగ విధాన విమర్శకుడు 85 ఏళ్ల వయసులో 2018 డిసెంబర్ 9 న మరణించిన విలియం బ్లమ్ పేర్కొన్నారు.

అంతర్జాతీయ శాంతి కార్నెగీ ధర్మసంస్థ (కార్నెగీ ఎండోమెంట్ ఫర్ ఇంటర్నేషనల్ పీస్) నివేదిక ప్రకారం, అన్ని ఎన్ఈడీ నిధులు అమెరికా కాంగ్రెస్ (పార్లమెంటు) నుండి వచ్చాయి. అంతర్జాతీయ శాంతి కార్నెగీ ధర్మసంస్థ ఐరోపా, దక్షిణ, తూర్పు ఆసియా, మధ్య ప్రాచ్యం, అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో అంతర్జాతీయ వ్యవహారాల నిష్పక్షపాత తాత్విక సంస్థ. ఎన్ఈడీ దీర్ఘకాలిక లక్ష్యం అమెరికా శత్రువుల ప్రత్యర్థులను అంటే అమెరికా మిత్రులను శక్తివంతం చేయడం, విదేశీ ప్రభుత్వాలను మార్చగల వారి సామర్థ్యాన్ని పెంచడం అని ఎన్ఈడీ నిర్దేశకుల బోర్డ్ అధ్యక్షుడు కెన్నెత్ వోలాక్ ఒకసారి అమెరికా కాంగ్రెస్‌కు చెప్పారు. ఇరాన్ ప్రభుత్వ కూల్చివేతకు, ఇరాన్‌లో శాంతిభద్రతల భంగానికి, అశాంతి ప్రేరేపణకు మానవ హక్కుల ఉద్యమం ద్వారా ఎన్ఈడీ చేసిన ప్రయత్నాలను ఇరాన్ మీడియా, బీఎన్ఈడీ, ట్రోజన్ హార్స్‌గా పేర్కొంది. గ్రీకు పురాణగాథల్లో ప్రఖ్యాతి గాంచిన యుద్ధం ట్రోజన్‌లో దాడులకు గురైన కంచుయుగపు నగరం ట్రాయ్‌లో ప్రవేశించడానికి గ్రీకులు దాచిపెట్టుకున్న బోలు కొయ్య గుర్రాన్ని గ్రీకు పురాణాల్లో ట్రోజహార్స్ అంటారు. ఎన్ఈడీ అమెరికా అనుకూల మీడియా సంస్థలకు మద్దతిచ్చింది. అరబ్ దేశాల్లో ప్రజాస్వామ్య కార్యకర్తల ముసుగులో అరబ్‌దేశాల వ్యతిరేక శక్తులను ప్రోత్సహించింది. ప్రజాస్వామ్యం, స్వేచ్ఛల కోసం పనిచేస్తున్నట్టు నటిస్తున్న రాజకీయ సమూహాలకు ఆర్థిక సహాయం చేసింది. ఎన్ఈడీ చాలా కాలంగా యూరప్‌లో చొరబడింది. యూరోపియన్ యూనియన్ అధికారులకు సహకరిస్తూ, యూరోప్ స్వతంత్ర మీడియా సంస్థలకు ఆర్థిక సహాయం చేస్తూ, ప్రజల అభిప్రాయాన్ని అమెరికాకు అనుకూలంగా మలుచుకుంటున్నది.

> ఇతర దేశాలను అస్థిరపర్చడానికి ఎన్ఈడీ విభజన ఘర్షణలను ప్రేరేపించింది. టిబెట్ చైనాతో 23మే1951న 17 అంశాల ఒప్పందం కుదుర్చుకుంది. 24అక్టోబర్1951న 14వ దలైలామా ఈ ఒప్పందాన్ని ఆమోదించారు. అయితే ఒత్తిడి వల్ల ఆమోదించానని తర్వాత అన్నారు. టిబెట్ చైనా స్వయంప్రతిపత్తి ప్రాంతంగా, నైరుతి చైనా భాగంగా అంతర్జాతీయంగా గుర్తించబడింది. ఎన్ఈడీ అక్కడ 'టిబెట్ స్వాతంత్ర్యం' కార్యకలాపాలకు మద్దతునిస్తోంది. ఎన్ఈడీ వ్యూహాలను మారుస్తూనే ఉంది. శాంతి, అభివృద్ధి, ఉభయ విజయ సహకార చారిత్రక పోకడలకు వ్యతిరేకంగా మరింత ముందుకు సాగింది. దాని నిజ స్వభావం, అసంఖ్యాక దుశ్చర్యలను అమెరికా ప్రజలతో సహా ప్రపంచ సమాజం తీవ్రంగా ఖండించింది.

ఎన్ఈడీ చైనా అంతర్గత విషయాల్లో జోక్యం చేసుకుంటోంది. తైవాన్ వేర్పాటువాద శక్తులకు మద్దతిస్తోంది. చైనా ప్రత్యేక పాలనా ప్రదేశం హాంకాంగ్‌లో చైనా వ్యతిరేక శక్తులతో కుమ్మక్కైంది. చైనా వ్యతిరేక సంస్థ 'వరల్డ్ ఉయ్ఘర్ కాంగ్రెస్' కు మద్దతిచ్చింది. చైనా స్వయంప్రతిపత్తి ప్రాంతం జిన్జియాంగ్ లోపల, వెలుపల ఉయ్ఘర్ ప్రజల సమిష్టి ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నానని చెప్పుకునే బహిష్కృత ఉయ్ఘర్ సమూహాల అంతర్జాతీయ సంస్థ వరల్డ్ ఉయ్ఘర్ కాంగ్రెస్. ఇతర దేశాలను అస్థిరపర్చడానికి ఎన్ఈడీ విభజన ఘర్షణలను ప్రేరేపించింది. టిబెట్ చైనాతో 23 మే 1951న 17 అంశాల ఒప్పందం కుదుర్చుకుంది. 24 అక్టోబర్ 1951న 14వ దలైలామా ఈ ఒప్పందాన్ని ఆమోదించారు. అయితే ఒత్తిడి వల్ల ఆమోదించానని తర్వాత అన్నారు. టిబెట్ చైనా స్వయంప్రతిపత్తి ప్రాంతంగా, నైరుతి చైనా భాగంగా అంతర్జాతీయంగా గుర్తించబడింది. ఎన్ఈడీ అక్కడ 'టిబెట్ స్వాతంత్ర్యం' కార్యకలాపాలకు మద్దతునిస్తోంది. ఎన్ఈడీ వ్యూహాలను మారుస్తూనే ఉంది. శాంతి, అభివృద్ధి, ఉభయ విజయ సహకార చారిత్రక పోకడలకు వ్యతిరేకంగా మరింత ముందుకు సాగింది. దాని నిజ స్వభావం, అసంఖ్యాక దుశ్చర్యలను అమెరికా ప్రజలతో సహా ప్రపంచ సమాజం తీవ్రంగా ఖండించింది.

అమెరికా అనుకూల విదేశీ రాజకీయ నాయకులు, పార్టీలకు మద్దతు ఇవ్వడానికి అమెరికా పన్ను చెల్లింపుదారుల డబ్బును చాలా వృధాచేసిందని, విదేశీ ఎన్నికల కార్యకలాపాలకు దొంగచాటుగా నిధులు సమకూర్చిందని, ఇటువంటి ఎన్నికల అవకతవకలను ప్రజాస్వామ్య ప్రోత్సాహంగా చిత్రీకరించిందని అమెరికా కాంగ్రెస్ పూర్వసభ్యుడు రాన్ పాల్ అన్నారు. రష్యా విదేశాంగ మంత్రిత్వ శాఖ 2015 లో ఎన్ఈడీని అవాంఛనీయ సంస్థల జాబితాలో చేర్చింది. రష్యాలో దాని కార్యకలాపాలను నిషేధించింది. ప్రతి దేశానికి తన జాతీయ వాస్తవాలకు, ప్రజల అవసరాలకు సరిపోయే అభివృద్ధి మార్గాన్ని అనుసరించే హక్కు ఉంది. అమెరికా ఎన్ఈడీని విదేశీ జోక్య సాధనంగా ఉపయోగించే జుగుప్సాకర చర్యలను ప్రపంచ ప్రజలు నిరసిస్తున్నారు." అని సామాజిక శాస్త్రాల చైనా విద్యాసంస్థలో అమెరికా అధ్యయనాల సంస్థ సహచర పరిశోధకుడు వాంగ్ కంగ్యూ అన్నారు.





రుణమాఫీ కాలేదంటూ రైతుల ఆందోళన

- నంగునూరులో సీఎం దిష్టిబొమ్మతో శవయాత్ర
- జగిత్యాలలో రిలే నిరాహారదీక్ష, డీఏఓ హామీతో విరమణ

నవతెలంగాణ-నంగునూరు/మల్లాపూర్

రైతులందరికీ రుణమాఫీ కాలేదని, ఎలాంటి షరతులు లేకుండా ప్రతిఒక్కరికీ రుణమాఫీ చేయాలని రైతులు ఆందోళనలు నిర్వహించారు. సిద్ధిపేట నియోజకవర్గం నంగునూరు మండలం అక్కెనపల్లి గ్రామంలో రుణమాఫీ కాలేదంటూ రైతులు అందరూ కలిసి సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహించి దహనం చేశారు. సోమవారం ఉదయం గ్రామంలోని రైతులు ఒక చోట కలిసి సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాడె కట్టారు. ప్రధానవీధుల్లో తిరుగుతూ 'సీఎం డౌన్ డౌన్', 'అబద్దాల సీఎం రాజీనామా చేయాలి' అంటూ అంటూ నినాదాలు చేస్తూ దిష్టిబొమ్మ శవయాత్ర కొనసాగించారు.

గ్రామంలో 550 మంది రైతులు రుణాలను తీసుకుంటే 130 మందికే రుణమాఫీ అయిందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోలేని రేవంత్ రెడ్డి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని రైతులు డిమాండ్ చేశారు. అనంతరం ప్రధాన కూడలిలో దిష్టిబొమ్మను దహనం చేశారు. రైతులకు బీఆర్ఎస్ నాయకులు మద్దతు పలికి దిష్టిబొమ్మ శవయాత్రలో పాల్గొన్నారు.

జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం రాఘవపేట గ్రామంలో రైతులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. విషయం తెలుసుకున్న మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి, తహసీల్దార్ వీర్‌సింగ్, అగ్రికల్చర్ ఆఫీసర్ లావణ్య అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడారు. రైతుల సమస్యలను జిల్లా కలెక్టర్, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. దాంతోపాటు వారం రోజుల్లో సమస్యలు ఉన్న రైతుల వద్దకు అధికారులు వచ్చి సర్వే చేపట్టి వివరాలు సేకరిస్తారని తెలిపారు. ముత్యంపేటలోని ఇండియన్ బ్యాంకులో సాంకేతిక సమస్య కారణంగా లక్షలోపు రుణాలు మాఫీ కాలేదని, వాటిని కూడా ప్రభుత్వం దృష్టికి పంపినట్టు అధికారులు తెలిపారు. అర్హులైన రైతులందరికీ రుణమాఫీ వర్తిస్తుందని జగిత్యాల డీఏఓ వాణి చెప్పారు. అధికారుల హామీ మేరకు రైతులు నిరాహార దీక్ష విరమించారు. అనంతరం అధికారులు రైతులతో కలిసి రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు దేశెట్టి నగేష్, తోట శ్రీనివాస్, ద్యాగ రాజశేఖర్, బైరి రవికుమార్, రకేష్, దేవరెడ్డి, సతీష్, రమేష్, ఎర్రన్న, శంకర్, ఎదులపురం రాజశేఖర్, రాములు, నారాయణ, అమీన్, నర్సయ్య పాల్గొన్నారు.



వైద్యురాలి మృతిపై నిరసన ర్యాలీలు

- కొవ్వొత్తులతో నివాళి
- నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్

నవతెలంగాణ- విలేకరులు

వైద్యురాలిపై లైంగికదాడి, హత్యకు నిరసనగా తోటి వైద్యులు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించారు. కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. దారుణానికి ఒడిగట్టిన నిందితులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు.

హైదరాబాద్ మలక్‌పేట్‌లో దంత వైద్యుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైద్యురాలి మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. వనస్థలిపురం విశ్రాంత ఉద్యోగులు, సీనియర్ సిటిజన్స్, తెలంగాణ అధ్యయన వేదిక, మహిళా మండలి, ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో ప్రశాంత్ నగర్ చౌరస్తాలో నల్ల బ్యాడ్జీలు పెట్టుకుని నిరసన తెలిపారు. అనంతరం పనామా బస్టాప్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. వరంగల్, హనుమకొండ జిల్లాల్లో సీఐటీయూ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. 50వ డివిజన్ జులైవాడ జంక్షన్‌లో, హనుమకొండలోని 53, 55, 56 మున్సిపల్ అడ్డాలలో, గోపాలపూర్ క్రాస్ జంక్షన్‌లో, కాజీపేటలో మున్సిపల్ కార్మికులు క్యాండిల్స్‌తో ప్రదర్శన నిర్వహించారు.

లైంగికదాడి, హత్యకు గురైన వైద్యురాలి ఆత్మకు శాంతి చేకూరాలని తెలంగాణ పాస్టర్స్ అసోసియేషన్ అధ్వర్యంలో నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద మిర్యాలగూడ డివిజన్ పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండల కేంద్రంలో సీపీఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. జూనియర్ వైద్యురాలి హత్య ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం చేపట్టారు.

నేడు బీజేపీ వర్క్‌షాపు

- హాజరుకానున్న కేంద్రమంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు

నవతెలంగాణ బ్యూరో -హైదరాబాద్


రాష్ట్ర స్థాయిలో సభ్యుల నమోదుకు సంబంధించిన బీజేపీ వర్క్‌షాపును మంగళవారం సికింద్రాబాద్‌లోని క్లాసిక్ గార్డెన్‌లో నిర్వహించనున్నట్టు ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. ప్రేమేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ జాతీయ నాయకులు విజయ రహత్కర్, పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్, ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరవుతారని పేర్కొన్నారు. ఆ వర్క్‌షాపునకు సంబంధించిన సన్నాహక సమావేశం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం జరిగినట్టు తెలిపారు.

అందులో రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్ తివారీ, గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు, దుగ్యాల ప్రదీప్‌కుమార్, ఎంపీలు ఎం.రఘునందన్‌రావు, మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే ఎం.ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌తో యువకుని ఆత్మహత్య!

- రూ.2 కోట్ల వరకు అప్పులు

నవతెలంగాణ-పెన్‌పహాడ్



ఆన్‌లైన్‌లో బెట్టింగులు పెట్టి అప్పులపాలైన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సోమవారం సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలంలో వెలుగులోకి వచ్చింది. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నల్లగొండ జిల్లా కేంద్రంలోని చౌరస్తా వద్ద ఉన్న తడకమళ్ల కిరాణం షాపు యజమాని సోమయ్య కుమారుడు సాయికుమార్(28) కూడా కిరాణా వ్యాపారం చేస్తున్నాడు. అతను కొన్ని నెలలుగా ఆన్‌లైన్ బెట్టింగ్‌ల్లో డబ్బులు పెట్టి రూ.2 కోట్ల అప్పులు చేశాడు. ఆ అప్పులు తీర్చలేక ఈ నెల 17న శనివారం సెల్ఫీ వీడియో తీసుకుని.. హాలియా చెక్ పోస్ట్ 14వ మైలు సాగర్ లెఫ్ట్ కెనాల్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. నీటి ప్రవాహంలో కొట్టుకుపోయి.. సోమవారం సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలంలోని దోసపహాడ్ గ్రామ శివారులోని కాలువలో మృతదేహం లభ్యమైంది. మృతుని అన్న సంతోష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రవీందర్ తెలిపారు.

రుణమాఫీ సమస్యలపై పరిష్కార కేంద్రాలు

- బీజేపీ కుట్రలు చేస్తోంది
- దేశంలో ఎక్కడా లేనివిధంగా అమలు
- పదేండ్ల బీఆర్ఎస్ పాలన మోసపూరితం : మంత్రులు ఉత్తమ్, జూపల్లి విమర్శ
- సాంకేతిక సమస్యలనూ సెటిల్ చేస్తామని వ్యాఖ్య



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా రుణమాఫీ సమస్యలపై పరిష్కార కేంద్రాలు ఏర్పాటు చేస్తామని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. సాంకేతిక సమస్యలను సెటిల్ చేసి, ఇంకా రాని రైతులకు సైతం రుణమాఫీ వర్తింపజేస్తామని హామీనిచ్చారు. ఈ పథకం విషయంలో బీజేపీ సైతం కుట్రలు చేస్తున్నదని విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని జలసౌధలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ టీ జీవన్‌రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులను పదేండ్లు మోసం చేసిందన్నారు. 2014 తర్వాత రుణమాఫీ గురించి మాట్లాడలేదని విమర్శించారు. రైతులను రుణవిముక్తులను చేయాలని తాము సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నామని గుర్తు చేశారు. సాంకేతిక కారణాలతో కొందరికి రుణమాఫీ జరగలేదనీ, వారికి కూడా నూటికి నూరు శాతం మాఫీ చేస్తామని ప్రకటించారు .రాజకీయ దురుద్దేశంతోనే విపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నామని ఆగ్రహం వ్యక్తం చేశారు. 1.20 లక్షల మంది రైతులకు ఆధార్ నెంబర్లు సరిగ్గా లేవన్నారు. అందుకే వారికి రుణమాఫీ జరగలేదని చెప్పారు. వాటిని సవరించే ప్రక్రియను ప్రారంభించామన్నారు. ప్రతీ మండలంలో మండల వ్యవసాయధికారులకు బాధ్యతలు అప్పగించామని, వారు రుణమాఫీ కానీ రైతుల వివరాలను తీసుకుని పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తే మాఫీ చేస్తామన్నారు. కొన్ని ఖాతాల్లో వివరాలతో పాటు రేషన్‌కార్డులు సరిగ్గా లేకపోవడంతో సమస్యలు ఎదురయ్యాయని వివరించారు. రైతుల దగ్గరకు వ్యవసాయ అధికారులు స్వయంగా వెళ్లి వారి వివరాలను పరిశీలించి రుణమాఫీ సిఫారసు చేస్తారని వివరించారు. అర్హత ఉన్న ప్రతీ రైతుకు కచ్చితంగా రుణమాఫీ చేస్తామన్నారు. ఈసారి సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించారు. తమ ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందన్నారు. ప్రకృతి విపత్తుతో నష్టపోయిన రైతులను బీఆర్ఎస్ ఎప్పుడూ ఆదుకోలేదనీ, కాంగ్రెస్ ప్రభుత్వం సాయం చేసిందని గుర్తు చేశారు. రైతుల మేలుకోసం కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఏమాత్రం ఆలోచించలేదని చెప్పారు. రైతులను గందరగోళపరిచేందుకు ప్రయత్నిస్తున్నదన్నారు. బీఆర్ఎస్ పెద్దలు సైతం అదే పనిలో ఉన్నారని ఆరోపించారు. ఇప్పటివరకు 22.37 లక్షల మంది రైతులకు రూ. 18 వేల కోట్లు మాఫీ కింద సాయం చేశామన్నారు. క్యాబినెట్ తీర్మానం ప్రకారం రూ. 31 వేల కోట్లను రైతు ఖాతాల్లో వేస్తామని తెలిపారు.రూ. 2 లక్షల కంటే ఎక్కువగా అప్పు తీసుకుంటే, పై మొత్తాలను చెల్లిస్తే వెంటనే రుణమాఫీ అమల్లోకి వస్తుందన్నారు.

మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పుల కోసమే మళ్లీ అప్పులు చేయాల్సి వస్తోందన్నారు. బావాబామ్మర్దులు ఇష్టానుసారం మాట్లాడుతున్నారని కేటీఆర్, హరీశ్‌రావులపై పరోక్ష విమర్శలు చేశారు. బీఆర్ఎస్ చేసిన అప్పుల్లో 90 శాతం అప్పులకు వడ్డీ కడుతున్నామని వివరించారు.

ఎమ్మెల్సీ టీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ పంటరుణాల ప్రక్రియ ఇంకా కొనసాగుతూనే ఉందన్నారు. రూ. 2 లక్షల రుణమాఫీ చేసిన సర్కారు, దేశంలో మరేదీ లేదని అభిప్రాయపడ్డారు. రూ. 2 లక్షల మేర రుణాలు ఉన్నవారి సంఖ్య రాష్ట్రంలో 8 లక్షలు ఉందని గుర్తు చేశారు. అనర్హులు అంటూ ఎవరూ ఉండరని స్పష్టం చేశారు.

“ధరణి” సమస్యలకు త్వరలో పరిష్కారం



- దేశానికి ఆదర్శంగా కొత్త రెవెన్యూ చట్టం
- వీఆర్ఏ, వీఆర్వోలకు న్యాయం చేస్తాం : మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

నవ తెలంగాణ బ్యూరో, హైదరాబాద్

ధరణి సమస్యలకు త్వరలో పరిష్కారం లభించనుందనీ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. నూతన రెవెన్యూ చట్టం ముసాయిదాపై సోమవారం హైదరాబాద్‌లోని టూరిజం ప్లాజాలో తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) ఏర్పాటు చేసిన చర్చావేదికలో కొత్త చట్టంపై మంత్రి కీలక వ్యాఖ్యలు చేశారు. భూ సమస్యలు తలెత్తని ఆదర్శవంతమైన నూతన రెవెన్యూ చట్టం-2024ను తీసుకొస్తున్నామని ప్రకటించారు. “చట్టాలు సరిగ్గా రూపొందించకుంటే వాటి ఫలితాలు ఎలా ఉంటాయో బీఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చిన 2020 రెవెన్యూ చట్టమే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం. గతంలో మాదిరిగా పొరపాట్లు జరగకుండా, భవిష్యత్ తరాలకు ఇబ్బందులు కలగకుండా కొత్త చట్టాన్ని రూపొందిస్తున్నాం. సామాన్యుని నుంచి మేధావి వరకు అన్నీ వర్గాల అభిప్రాయాలను తీసుకుంటున్నాం. అధికారంలో ఉన్నా లేకున్నా మనం తీసుకొచ్చిన చట్టాలు పదిమందికి ఉపయోగపడేలా శాశ్వతంగా చరిత్రలో నిలిచేలా రూపొందించాలి. ఆ దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వెళ్తున్నది” అని పేర్కొన్నారు. రెవెన్యూ కోర్టులను ఏర్పాటు చేసి రైతులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వి.లచ్చి రెడ్డి, ధరణి కమిటీ సభ్యులు సునీల్ తదితరులు పాల్గొన్నారు.

కీలక స్థానాల్లో ఆర్ఎస్ఎస్ వారిని నింపడానికే లేటరల్ ఎంట్రీ

- రిజర్వేషన్ల రద్దుకోసమే బీజేపీ కుట్రలు : కేవీపీఎస్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

లేటరల్ ఎంట్రీ ముసుగులో కీలక స్థానాల్లో ఆర్ఎస్ఎస్ ప్రయివేటు మనుషులతో ఖాళీ ఐఏఎస్ పోస్టులు భర్తీ చెయ్యటం ద్వారా రిజర్వేషన్లకు గండి కొట్టి, సామాజిక న్యాయాన్ని సమాధి చేయనున్న బీజేపీ మనువాద విధానాలను కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. తక్షణమే ఈ ఆలోచనలను ఉపసంహరించుకోవాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు, జాన్ వెస్లీ టి స్కైలాబ్ బాబు సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రాజ్యాంగ బద్ధంగా ఏర్పడిన యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమీషన్‌ను పక్కన పెట్టి లేటరల్ ఎంట్రీ పేరుతో ఆర్ఎస్ఎస్ ప్రయివేటు మనుషులతో దొడ్డి దారిన నింపేందుకు మతోన్మాద మోడీ ప్రభుత్వం ప్రయత్నించడం తక్షణమే విరమించాలని డిమాండ్ చేశారు. 24 కేంద్ర మంత్రిత్వ శాఖల్లోని జాయింట్ సెక్రటరీ, డైరెక్టర్, డిప్యూటీ సెక్రటరీ వంటి 45 పోస్టులకు లేటరల్ ఎంట్రీ ద్వారా భర్తీ చెయ్యడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. సామాజిక తరగతులకు చెందిన వారు ఉన్నత స్థానాల్లోకి రాకూడదని బీజేపీ యోచిస్తున్నదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వంలోని విభాగాల్లో ఉన్నతస్థాయి పోస్టుల్లో రిజర్వేషన్లు పూర్తిగా గాలికి వదిలేయడం కులదురంకార చర్య తప్ప మరోకటి కాదని విమర్శించారు.

భావోద్వేగాలకు ప్రతీక వార్తా చిత్రాలు

- సమాచార,పౌరసంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



తెలంగాణ రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల సంఘం రాష్ట్ర స్థాయి వార్త ఫొటో ప్రదర్శనను ప్రారంభించి ప్రసంగిస్తున్న పొంగులేటి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వార్తాచిత్రాలకు బలమైన భావోద్వేగాలను రేకెత్తించే శక్తి ఉంటుందని రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. 185వ ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని దేశోద్ధారక భవన్‌లో సోమవారం తెలంగాణ రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల సంఘం రాష్ట్ర స్థాయి వార్త ఛాయాచిత్రాల ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పత్రికల్లో వచ్చిన వార్తా కథనాలను మర్చిపోయినా, గత సంఘటనల గురించి భవిష్యత్ తరాలకు అవగాహన కల్పించే సామర్థ్యాన్ని చిత్రాలు కలిగి ఉంటాయని తెలిపారు. వార్తా చిత్రాలు పదాల కంటే వేగంగా ప్రజలను ప్రభావితం చేస్తాయనీ, నేటి వార్తా ప్రపంచంలో ఫొటో జర్నలిజం ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నదన్నారు. వార్తలను, సమాచారాన్ని సేకరించడం, విశ్లేషించడం, ప్రజలకందించడంలో జర్నలిస్టులు సమాజంలో కీలక పాత్ర పోషిస్తారని తెలిపారు. జర్నలిస్టులు, ఫొటో జర్నలిస్టులు సత్యాన్ని తెలియజేసే ప్రయత్నంలో వార్తలను, చిత్రాలను అత్యున్నత పాత్రికేయ ప్రమాణాలకు అనుగుణంగా ఉంచాలన్నారు. ప్రెస్ అకాడమీ చైర్మెన్ కె.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రానికి చెందిన ఫొటో జర్నలిస్టులు విజువల్ జర్నలిజం ప్రాముఖ్యతను తమ చిత్రాల ద్వారా చూపించారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం అధ్యక్షులు కె. విరహత్ అలీ, ప్రధాన కార్యదర్శి కె.రామనారాయణ, ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ జాతీయ కార్యదర్శి వై.నరేందర్ రెడ్డితో కలసి అంతకు ముందు మంత్రి ఛాయా చిత్రాలను వీక్షించారు ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.హరి, ఉపాధ్యక్షులు పి.రాంమూర్తి, కోశాధికారి అనిల్ కుమార్ కర్ణకోటి, కార్యవర్గ సభ్యులు నక్క శ్రీనివాస్, పి.మోహన చారి, ఎంఏ. సర్వర్, నగర గోపాల్, ఛాయాచిత్ర ప్రదర్శన కన్వీనర్ ఏ.మహేష్ కుమార్, సభ్యులు డి.సుమన్ రెడ్డి, ఎస్. శ్రీధర్, హరిప్రేమ్, సంజయ్ చారి తదితరులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాఖీ కట్టిన చిన్నారులు

- శస్త్రచికిత్సలు చేయించినందుకు కుటుంబ సభ్యుల కృతజ్ఞతలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వినికిడి సమస్యతో బాధపడుతూ ప్రభుత్వ సహాయంతో శస్త్రచికిత్స చేయించుకున్న పలువురు చిన్నారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సోమవారం రాఖీలు కట్టి తమ అభిమానం చాటుకున్నారు. సీఎం ఆదేశాలతో హైదరాబాద్ కోఠిలోని ఈఎన్‌టీ ఆస్పత్రిలో కోచ్లియర్ ఇంప్లాంట్ సర్జరీలు ఇటీవల పెద్ద సంఖ్యలో జరుగుతున్నాయి. ఖరీదైన వినికిడి యంత్రాలు, సర్జరీలు చేయించుకున్నవారికి ఎల్‌వోసీ, సీఎంఆర్ఎఫ్ ద్వారా ప్రభుత్వం అండగా నిలిస్తోంది. చికిత్సల అనంతరం ఉచితంగా వినికిడి యంత్రాలతో పాటు ఏడాది పాటు ఆడిషన్ వెర్బర్ థెరపీ అందిస్తున్నారు. ఇటీవల సర్జరీలు చేయించుకున్న పలువురు చిన్నారులు ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆనంద్ ఆచార్య, వైద్యురాలు డీకే వీణ ఆధ్వర్యంలో సోమవారం సచివాలయానికి వచ్చి ముఖ్యమంత్రికి రాఖీలు కట్టారు. తమ పిల్లలకు శస్త్రచికిత్సలు చేయించినందుకు వారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

చివరి ఆయకట్టు వరకు నీరందించాలి

- అద్దంకి-నార్కట్‌పల్లి హైవేపై రైతుల బైటాయింపు
- రైతులతో మాట్లాడిన తహసీల్దార్

నవతెలంగాణ- మాదుగులపల్లి



వరదకాలువ కింద ఆయకట్టు చివరి భూములకూ నీరందించాలని కోరుతూ అఖిలపక్ష రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు సోమవారం నల్లగొండ జిల్లా మాడుగుల మండల కేంద్రంలోని అద్దంకి- నార్కట్‌పల్లి హైవేపై ధర్నా చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ.. 18 రోజుల కిందట వరద కాలువకు మంత్రులు నీటిని విడుదల చేశారన్నారు. కానీ వరద కాలువల్లో పెద్దపెద్ద చెట్లు, రాళ్లు ఉండటంతో గండ్లు పడ్డాయన్నారు. వాటిని పూడ్చేందుకు అధికారులు వారం రోజులు సమయం తీసుకున్నారన్నారు. తూముల నిర్వహణను ఇరిగేషన్ అధికారులు పట్టించుకోకపోవడం వల్ల పై భాగంలో ఉండే రైతులు ఇష్టారీతిగా నీటిని తరలించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో చివరి ఆయకట్టులో ఉన్న మాడుగులపల్లి, దాచారం, చెరువుపల్లి, ఇందుగుల కొంత భాగం, మగ్రిగూడెం, తోపుచెర్ల చివరి పొలాలకు నీరు అందడం లేదన్నారు. చివరి ఆయకట్టు వరకు నీటిని చేర్చే విధంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని, రైతుల్ని ఆదుకోవాలని కోరారు. చివరి ఆయకట్టు వరకు నీరందించని పక్షంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. రైతుల ధర్నాతో హైవేపై సుమారు మూడు కిలోమీటర్ల మేరకు ట్రాఫిక్ నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న తహసీల్దార్ రైతుల వద్దకు వచ్చి సమస్యను పరిష్కరిస్తామని హామీనివ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో రైతులు అశోక్‌రెడ్డి, శ్రీకర్, మల్లారెడ్డి, వెంకటరెడ్డి, భూపతిరెడ్డి, చారి, సుధాకర్ రెడ్డి, అశోక్, వెంకన్న వెంకటరెడ్డి, రాంరెడ్డి, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

- మినీ నుంచి ప్రమోషన్ పొందిన వారికి సమాన వేతనమివ్వాలి
- మార్చి, ఏప్రిల్ పెండింగ్ వేతనాలివ్వాలి : తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్


నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మినీ నుంచి మెయిన్ సెంటర్లకు ప్రమోషన్ పొందిన అంగన్‌వాడీ టీచర్లకు మెయిన్ టీచర్లతో సమానంగా వేతనం ఇవ్వాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర అధ్యక్షులు కె.సునీత, ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వారికి పెండింగ్‌లో ఉన్న మార్చి, ఏప్రిల్ నెలల వేతనాలను కూడా చెల్లించాలని కోరారు. సోమవారం ఈ మేరకు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు లేఖ రాశారు. జులై నెల వేతనాలు చెల్లించినందుకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలోని నాలుగు వేల మంది మినీ నుండి మెయిన్‌కు ప్రమోషన్ పొందిన అంగన్‌వాడీ టీచర్లకు మళ్లీ పాత వేతనాలే వేయడం దారుణమని పేర్కొన్నారు. దీంతో టీచర్లు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని వాపోయారు. రెండు నెలల పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలని, ఇలాంటి సమస్య భవిష్యత్తులో పునరావృతం కావొద్దని కోరారు. ఒకసారి మెయిన్ టీచర్స్ గా గుర్తించిన తర్వాత ఇలాంటి సమస్యలేంటి? అసలు వారిని ప్రభుత్వం మెయిన్ టీచర్స్ గా గుర్తించిందా? గుర్తించలేదా? సర్కారు మోసం చేస్తున్నదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు.

కేంద్రం వక్ఫ్ సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలి

- తెలంగాణ ముస్లిం నేతల తీర్మానం
- సీఎం దృష్టికి తీసుకెళ్తాం : ప్రభుత్వసలహాదారు షబ్బీర్ అలీ హామీ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో



కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ బిల్లును తిరస్కరించాలని తెలంగాణ రాష్ట్ర ముస్లిం నాయకులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ప్రస్తుతం ఈ బిల్లు జాయింట్ పార్లమెంటరీ కమిటీ పరిశీలనలో ఉన్నదనీ, ఈ కమిటీ కూడా ఈ బిల్లును తిరస్కరించాలని విజ్ఞప్తి చేశారు. ముస్లింల మనోభావాల్ని దెబ్బతీసేలా అనేక అంశాలను కేంద్రం ఈ బిల్లులో ప్రతిపాదించిందని వివరించారు. సోమవారంనాడిక్కడి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ అధ్యక్షతన ముస్లిం నాయకులు, మత పెద్దల సమావేశం జరిగింది. పలువురు సామాజిక సంస్థల ప్రతినిధులు, న్యాయ నిపుణులు, జర్నలిస్టులు, ఇతర ప్రముఖులు దీనిలో పాల్గొన్నారు. వీరంతా ఐక్యంగా కేంద్రం ప్రతిపాదించిన వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకించారు. కేంద్రం తెచ్చింది కేవలం సవరణ మాత్రమే కాదనీ, ప్రస్తుతం ఉన్న చట్టాన్ని పూర్తిగా మార్చేసే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. వక్ఫ్ ఆస్తుల నియంత్రణ, పరిపాలన, నిర్వహణలో జోక్యం చేసుకోవడం ద్వారా దేశవ్యాప్తంగా వక్ఫ్ సంస్థలను నిర్వీర్యం చేసే కుట్ర దీనివెనుక ఉన్నదని అభిప్రాయపడ్డారు. దీనిపై ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ మాట్లాడుతూ బిల్లును జేపీసీకి పంపాలని బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంలో ప్రధాన భూమిక పోషించిన ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో ఈ బిల్లును ప్రవేశపెట్టడానికి ముందు... రాహుల్‌గాంధీ ఇండియా కూటమి ఎంపీలందరితో సమావేశాన్ని ఏర్పాటు చేసి, కచ్చితమైన చర్య తీసుకున్నారని చెప్పారు. ప్రతిపక్షాలు బలహీనంగా ఉన్నప్పుడు రాఫెల్, ట్రిపుల్ తలాక్, హిండెన్‌బర్గ్ వంటి సమస్యలపై జేపీసీ ఏర్పాటుకు బీజేపీ ఎప్పుడూ తలవంచలేదని ఆయన గుర్తుచేశారు. వక్ఫ్ బోర్డు, సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్‌లో ముస్లిమేతరులను తప్పనిసరిగా చేర్చాలనే ప్రతిపాదనపై ముస్లిం నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దేవాలయాల నిర్వహణలో హిందూయేతరులను చేర్చేందుకు కేంద్రం ఎండోమెంట్ చట్టాన్ని సవరిస్తుందా అని ప్రశ్నించారు. ముస్లిం సమాజాన్ని రెచ్చగొట్టడం, వివిధ వర్గాల మధ్య చిచ్చు పెట్టడమే బీజేపీ ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని ఆరోపించారు. వక్ఫ్ సంస్థల నిర్వహణకు ప్రస్తుత చట్టం సరిపోతుందని అభిప్రాయపడ్డారు. వక్ఫ్ కంటే ఎక్కువ ఆస్తులు క్రిస్టియన్ వర్గాలకు ఉన్నాయనీ, బీజేపీ తదుపరి లక్ష్యం అదే కానున్నందున వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో క్రైస్తవ సంఘాల మద్దతు తీసుకోవాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ అభిప్రాయాలన్నింటినీ సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని షబ్బీర్ అలీ చెప్పారు. దీనిపై ఆగస్టు 29న వక్ఫ్ బోర్డు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి వక్ఫ్ సవరణకు వ్యతిరేకంగా సవివరంగా తీర్మానం చేయనున్నట్టు తెలంగాణ వక్ఫ్ బోర్డు చైర్మెన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీ తెలిపారు. సమావేశంలో అమీర్-ఎ-జామియా నిజామియా ముఫ్తీ ఖలీల్ అహ్మద్, అమీర్ మిలాత్-ఇ-ఇస్లామియా మౌలానా జాఫర్ పాషా హుస్సామీ, జమియత్ ఉల్మా అధ్యక్షుడు ముఫ్తీ ఘ్యాస్ రెహ్మనీ, అహ్సాన్ బిన్ మహ్మద్ అల్హమూమీ (ఇమామ్, ముఫ్తీ), షాహి ముఫ్తీ పాల్గొన్నారు. హఫీజ్ సయ్యద్ సాదిక్ మొహియుద్దీన్ (యునైటెడ్ ముస్లిం ఫోరమ్), ముఫ్తీ మహమూద్ జుబేర్ (జమియత్ ఉలమా-తెలంగాణ), ఏఐఎంపీఎల్‌బీ ప్రెసిడెంట్ మౌలానా ఖలీద్ సైఫుల్లా రహ్మనీ, ఎమ్మెల్సీ అమీర్ అలీ ఖాన్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహ్మద్ అజహరుద్దీన్, ఉమర్ అబిదీన్ బోర్డు చైర్మెన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీ, తాహెర్ బిన్ హమ్దాన్ (ఉర్దూ అకాడమీ), మహ్మద్ ఒబేదుల్లా కొత్వాల్ (మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్), సయ్యద్ గులాం అఫ్జల్ బియాబానీ (హజ్ కమిటీ), మహ్మద్ ఫహీమ్ ఖురేషి (టీఎమ్ఆర్ఈఐఎస్)తో పాటు పలు సామాజిక సేవా సంఘాల చైర్మెన్లు, నాయకులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్-65 డెత్‌రోడ్డును 'సేఫ్'గా మారుద్దాం



- ఆర్‌అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణం మరింత వేగంగా ముందుకు సాగాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో జాతీయ రహదారులపై రోడ్లు, భవనాల శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పలు జాతీయ రహదారుల నిర్మాణాల స్థితిగతులపై ఆరాతీసి చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. మంత్రి మాట్లాడుతూ ఎన్‌హెచ్-65ని ఆరు లేన్లుగా విస్తరించేందుకుగాను సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)ను తయారు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇందుకుగాను కన్సల్టెంట్ల నియామకానికి సంబంధించిన టెండర్ల ప్రక్రియ నడుస్తున్నదన్నారు. త్వరితగతిన కన్సల్టెంట్లను నియమించి డీపీఆర్ సిద్ధం చేస్తామని ప్రకటించారు. ఇక ఎన్‌హెచ్-65పై రూ.422.12 కోట్లతో చేపట్టిన 17 బ్లాక్ స్పాట్ల పనులను నాణ్యత దెబ్బతినకుండా త్వరితగతిన పూర్తిచేయాలని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులను ఆదేశించారు. మన్నెగూడ జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి టెండర్ ప్రక్రియ పూర్తయిందనీ, కాంట్రాక్టర్ పనులు ప్రారంభించేందుకుగాను అపాయింటెడ్ డేట్‌ను ఈ వారంలో ఖరారు చేస్తామన్నారు. పనులు మొదలు పెట్టేందుకుగాను కొన్ని చోట్ల అటవీ అనుమతులు కూడా వచ్చినందున నిర్మాణ ప్రక్రియకు ఏ ఇబ్బంది లేదని చెప్పారు. నాగ్‌పూర్-విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణానికి సంబంధించి టెండర్ ప్రక్రియ పూర్తయినందున అపాయింటెడ్ డేట్ వచ్చేలోగా పెండింగ్‌లో ఉన్న భూసేకరణను పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తర భాగానికి కావాల్సిన 4797 ఎకరాల భూసేకరణ ప్రక్రియ దాదాపు పూర్తయ్యిందన్నారు. మహబూబాబాద్ జిల్లాలో 173.07 ఎకరాల భూమిని కేటాయించి పరిష్కారం చూపించామని చెప్పారు. మిగిలిన భూసేకరణ పనులను కూడా సెప్టెంబర్ 15 నాటికి పూర్తి చేస్తామని తెలిపారు. రైతుల భూములకు మంచి ధరలను ఇప్పించేందుకు ప్రయత్నిస్తున్నామనీ, రైతులు అధైర్యపడకుండా భూసేకరణకు సహకరించాలని కోరారు. ఈ సమీక్షలో రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి దాసరి హరిచందన, హైదరాబాద్ పీడీ నాగేశ్వర్ రావు, గజ్వేల్ పీడీ ఎన్‌హెచ్‌ఏఐ మధుసూధన్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర సాధనలో కోదండరామ్ పాత్ర కీలకం

రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి

- రవీంద్రభారతిలో రెవెన్యూ ఉద్యోగుల ఆత్మీయ అభినందన సభ



నవతెలంగాణ-కల్చరల్

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ప్రొఫెసర్ కోదండరామ్ పాత్ర కీలకమని, ఉద్యమంలో ప్రజల మద్దతు కూడగట్టి సకల జనుల సమ్మె, మిలియన్ మార్చ్ సాగర హారం వంటి కార్యక్రమాలను విజయవంతం చేశారని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి అన్నారు. శాసనమండలి సభ్యునిగా ప్రమాణస్వీకారం చేసిన కోదండరామ్‌కు హైదరాబాద్ రవీంద్ర భారతి ప్రధాన వేదికపై సోమవారం తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల ఆధ్వర్యంలో ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. సభలో చిన్నారెడ్డి మాట్లాడుతూ.. కోదండరామ్ కృషిని విస్మరించి పదేండ్ల కేసీఆర్ ప్రభుత్వం కుటుంబ అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇచ్చారని విమర్శించారు. నాటి బీఆర్ఎస్ అవకాశ రాజకీయాలను కోదండరామ్ వ్యతిరేకించారని గుర్తు చేశారు. ఆయన సేవలు తెలంగాణ సమాజానికి అవసరమని భావించి కాంగ్రెస్ ప్రభుత్వం ఎమ్మెల్సీ పదవి ఇచ్చిందని అన్నారు. భవిష్యత్‌లో ఇంకా ఉన్నత స్థానంలో ఉంటారన్నారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ.. కోదండరామ్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నా సామాజిక ఉద్యమాల్లో పాల్గొనేవారని చెప్పారు. ప్రొఫెసర్ విశ్వేశ్వరరావు మాట్లాడుతూ.. కోదండరామ్ పదవిలో ఉన్నా లేకున్నా ప్రజా సమస్యలపై పోరాడే శక్తి గల నాయకుడు అని ప్రశంసించారు. డిప్యూటీ కలెక్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు లచ్చిరెడ్డి అధ్యక్షత వహించగా.. కార్యదర్శి రామకృష్ణ సభకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ రామచంద్ర నాయక్, కాంగ్రెస్ కిసాన్ సెల్ జాతీయ నాయకులు కోదండ రెడ్డి, ఉన్నత విద్యామండలి పూర్వ చైర్మెన్ పాపి రెడ్డి, నజాఫ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ ఆప్యాయతలకు ప్రతీక రక్షాబంధన్

ప్రేమ, ఆప్యాయత, అనురాగాలకు ప్రతీక రక్షాబంధన్ అని తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం తెలిపారు. తెలంగాణ జన సమితి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు ఎం.నరసయ్య ఆధ్వర్యంలో సోమవారం నాంపల్లిలోని పార్టీ కార్యాలయంలో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా జరిగాయి. కోదండరాంకు సోదరీమణులు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ఈ వేడుకలు వేదికగా నిలిచి మానవీయ విలువలను పెంపొందిస్తున్నాయని అభిప్రాయపడ్డారు. కోదండరాంకు రాఖీలు కట్టిన వారిలో తెలంగాణ జన సమితి మహిళా నాయకురాలు ఎం.గీతాంజలి, పుష్పలత, శాంతాబాయి, శివలక్ష్మి, సూరపు రెడ్డి రాణి, మంజుల, సాజిద్ ఖాన్, దేవేంద్ర, రేఖ, జయంతి, ఉష, శిరీషలు ఉన్నారు.

జ్యోతికి మెరుగైన చికిత్సనందించండి

- గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు మంత్రి ఆదేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్‌లో ఆధార్ ఉన్న కారణంగా గాంధీ ఆస్పత్రిలో తన కూతురుకు ఆరోగ్యశ్రీ కింద చికిత్స చేయడం లేదంటూ ఒక తండ్రి సామాజిక మాధ్యమాల్లో చేసిన పోస్టుకు వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ స్పందించారు. హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రి సూపరిం టెండెం ట్ డాక్టర్ రాజకుమారితో మాట్లాడి బాధితురాలు జ్యోతి (25)కు మెరుగైన చికిత్సనందించాలని ఆదేశించారు. ప్రమాదవశాత్తు ఐదు అంతస్తుల నుంచి జారీపడ్డ జ్యోతిని చికిత్స కోసం 108 అంబులెన్స్‌లో గాంధీకి తీసుకొచ్చారు. వెంటనే ఆమెకు స్కానింగ్ చేయగా వెన్ను ఎముక, ఎడమ కాలు విరిగిందనీ, శస్త్రచికిత్స చేయాలని డాక్టర్లు సూచించినట్టు ఆమె తండ్రి తెలిపారు.

ఆర్ఎస్ఎస్ కోసమే ప్రైవేటు ఐఏఎస్‌లు

- డీవైఎఫ్ఐ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేంద్ర బీజేపీ ప్రభుత్వం లెటరల్ విధానంలో కేంద్ర ప్రభుత్వ కీలక శాఖల్లో ఆర్ఎస్ఎస్ విధానాలను అమలు చేసేందుకే ప్రయివేటు ఐఏఎస్‌లను నియమించేందుకు సిద్ధపడుతోం దనిభారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కోటా రమేష్,ఆనగంటి వెంకటేష్ సోమవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఈ చర్య రాజ్యాంగ వ్యతిరేకమనీ, రిజర్వేషన్లను సమాధి చేయడమేనని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ శాఖల్లో మనువాద భావజాలాన్ని, ఆర్ఎస్ఎస్‌కు చెందిన వ్యక్తుల ద్వారా నింపేందుకు కుట్ర చేస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా విద్యా ఉపాధి అవకాశాలు కోసం కోట్లాదిమంది నిరుద్యోగ యువత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇలాంటి సమయంలో ఉపాధి అవకాశాలను దెబ్బ కొట్టే విధంగా కేంద్ర ప్రభుత్వ శాఖల్లో వీలైనంత ఎక్కువ మందిని తమ అనుయాయులను నియమించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధపడటం ధారుణమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ 24 ప్రభుత్వ శాఖల్లో తమకు ఇష్టం వచ్చిన వ్యక్తులను నింపుకునేందుకు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు.

అనాథాశ్రమంలో ఘోరం

ఏపీలో ఫుడ్ పాయిజన్‌తో ముగ్గురు విద్యార్థులు మృతి

- 83 మందికి అస్వస్థత
- మృతులు, అస్వస్థతకు గురైన వారంతా గిరిజన విద్యార్థులే
- ఉన్నత స్థాయి విచారణకు ముఖ్యమంత్రి ఆదేశం
- ఘటనపై సీపీఐ(ఎం) ఏపీ శాఖ దిగ్భ్రాంతి



పాంగి శ్రద్ధ జాషువా నిత్య



విశాఖ కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న బాలికను పరామర్శిస్తున్న ఏపీ హోం మంత్రి అనిత

విజయవాడ : వాళ్లు అమాయక గిరిజనులు ... అందులోనూ అమ్మా, నాన్న లేని చిన్నారులు! అందరూ ఉన్నా పూట గడవడం కష్టమైన మరికొందరు పిల్లలు.... దినదిన గండంగా మారిన బతుకులకు తిండి పెట్టి, చదువు చెప్పిస్తామంటే ఎంతటి భరోసా...! కానీ, ఎవరి పొరపాటో ... ఆ అనాథాశ్రమంలో కలుషితాహారం విషం చిమ్మింది. కేరింతలు కొడుతూ విందుభోజనం చేసిన కాసేపటికే అభం, శుభం తెలియని ఆ పసిపిల్లలు కడుపు పట్టుకుని తల్లడిల్లిపోయారు. ఒకరి.... తరువాత ఒకరిగా 95 మంది విద్యార్థులు కుప్పకూలిపోయారు. వీరిలో ఎనిమిది సంవత్సరాల లోపు చిన్నారులు ముగ్గురు మృతి చెందారు. మిగిలిన వారు వివిధ ఆస్పత్రుల్లో చికిత్సపొందుతున్నారు. తీవ్ర అస్వస్థతకు గురైన 14మందిని మెరుగైన వైద్యం కోసం కెజిహెచ్‌కు తరలించారు. అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నంలోని పరిశుద్ధాత్మ అగ్ని స్తుతి ఆరాధన ట్రస్ట్ అనాథాశ్రమంలో జరిగిన ఈ ఘోరం సోమవారం వెలుగులోకి రాగానే రాష్ట్ర వ్యాప్తంగా కలకలం రేపింది. రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా స్పందించడంతో అధికార యంత్రాంగం ఉరుకులు, పరుగులు పెట్టింది. ఈ ఘటనపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉన్నత స్థాయి విచారణకు ఆదేశాలు జారీ చేశారు. ఈ ఘటనపై సీపీఐ(ఎం) ఏపీ శాఖ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది.

ఏం జరిగింది?

శనివారం మధ్యాహ్నం నక్కపల్లి మండలానికి చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ వారు అనాథాశ్రమంలోని విద్యార్థులకు సమోసా, చాక్లెట్లు అందించారు. కోటవురట్ల మండలం పొందూరు గ్రామంలో ఒకరి పెదకర్మ సందర్భంగా వండిన పలావు, వైట్‌రైస్, సాంబారు, పన్నీర్ కర్రీ, పునుకుల కర్రీని రాత్రికి విద్యార్థులకు పెట్టారు. మధ్యాహ్న భోజనం తరువాత మిగిలిన పదార్థాలను అనాథాశ్రమానికి పంపినట్లుగా చెబుతున్నారు. అవి తిన్న తరువాత విద్యార్థులు అస్వస్థతకు గురవడం మొదలైంది. అయితే, జిల్లా కలెక్టర్ విడుదల చేసిన ప్రకటనలో చర్చి ఫాదర్ ఏర్పాటు చేసిన పేరెంట్స్‌మీట్‌లో ఏర్పాటు చేసిన విందుభోజనం తిని విద్యార్థులు అస్వస్థతకు గురయినట్లు తెలిపారు. ఈ సంఘటనలో చింతపల్లి మండలం బలబద్రం గ్రామానికి చెందిన కొర్ర శ్రద్ధ (7), నిమ్మలపాలెం గ్రామానికి చెందిన తంబెళ్లి ఝాషువా(7), రెల్లెల పాలెంకు చెందిన గెమ్మెలి నిత్య (భవాని-8) మృతి చెందారు. వీరు ఆస్పత్రికి వెళ్లకుండా తమ ఇళ్లకు వెళ్లారని కలెక్టర్ పేర్కొన్నారు. వీరిలో ఝాషువా శనివారం సాయంత్రం మృతి చెందారు. ఆదివారం కూడా మరణాలు కొనసాగడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో అనకాపల్లి జాయింట్ కలెక్టర్ జాహ్నవి అనాథాశ్రమాన్ని సందర్శించారు. అక్కడి వసతి సౌకర్యాలపై అసహనం వ్యక్తం చేశారు. అనంతరం ట్రస్టుకు చెందిన అనాథాశ్రమాన్ని ఆర్‌డిఒ జైరావు సీజ్ చేశారు. ఫాదర్ అరుణ్‌కుమార్‌పై కేసులు నమోదు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. విద్యాశాఖతో పాటు, ఇతర శాఖల అనుమతులు లేకుండి నిర్వహిస్తున్న ట్రస్ట్‌పై చర్యలు తీసుకుంటామని చెప్పారు. అస్వస్థతకు గురైన వారిలో 14 మంది విశాఖ కెజిహెచ్‌లో, 18 మంది అనకాపల్లి జిల్లా నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిల, ఎనిమిది మంది అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిలో కొంతమంది పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది.

రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా : ఏపీ ముఖ్యమంత్రి

ఈ ఘటనపై ఉన్నత స్థాయి విచారణకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారు. మృతి చెందిన విద్యార్థుల కుటుంబ సభ్యులకు, సంరక్షకులకు రూ.10 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. ఏపీ విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌తో ఫోన్‌లో మాట్లాడి ఘటన వివరాలు, విద్యార్థులకు అందిస్తున్న వైద్య సహాయం గురించి అడిగి తెలుసుకున్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే : జగన్

ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని, సరైన పర్యవేక్షణ కొరవడిందనడానికి ఈ ఘటనే ఉదాహరణగా నిలుస్తుందని వైసీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విమర్శించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని హితవు పలికారు.

రూ.25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం కల్పించాలి : సీపీఐ(ఎం) ఏపీ శాఖ

మరణించి విద్యార్థుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని, వారి కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం కల్పించాలని సీపీఐ(ఎం) ఏపీ కమిటీ కమిటీ డిమాండ్ చేసింది. ఈ ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఈ మేరకు సీపీఐ(ఎం) ఏపీ కార్యదర్శి వి.శ్రీనివాసరావు సోమవారం ప్రకటన విడుదల చేశారు. మరణించిన విద్యార్థులకు సంతాపం ప్రకటించారు. వారి కుటుంబాలకు సానుభూతి తెలిపారు.

గురుకుల పాఠశాలలకు కొత్త హంగులు

(మొదటిపేజీ తరువాయి)

అధికారులను ఆదేశించారు. ఈ వార్షిక సంవత్సరం రూ. 5 వేల కోట్లతో 30 కాంప్లెక్స్‌లో 120 గురుకుల పాఠశాల భవనాల నిర్మాణం చేపట్టడానికి కావలసిన అన్ని చర్యలను తీసుకోవాలని సూచించారు. సోమవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల పాఠశాలల ఉన్నత అధికారులతో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్రంలో చదువుతున్న విద్యార్థులను రాష్ట్ర, దేశ సంపదగా ఇందిరమ్మ రాజ్యంలో ఏర్పడిన ప్రజా ప్రభుత్వం భావిస్తున్నదని చెప్పారు. మానవ వనరులను అభివృద్ధి చేసుకోవటానికి బడ్జెట్‌లో విద్యకు పెద్దపీట వేశామని గుర్తు చేశారు. ప్రభుత్వ విద్యావ్యవస్థను బలోపేతం చేయటానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. అందుకు తగ్గట్టుగా అధికారుల పనితీరు ఉండాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో 15 నుంచి 25 ఎకరాలు, పట్టణ ప్రాంతాల్లో 10 నుంచి 15 ఎకరాలు ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల ఏర్పాటుకు స్థల సేకరణ చేయాలన్నారు. ఎనిమిది నెలల్లో ఈ భవనాలను పూర్తి చేయటానికి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నదని వివరించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరం 100శాతం అడ్మిషన్లు పూర్తి చేయాలన్నారు.

ప్రతి విద్యార్థికి మంచం

ఇందిరమ్మ రాజ్యంలోని ప్రజా ప్రభుత్వంలో ప్రభుత్వ హాస్టల్, గురుకుల పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థి మంచంపైనే పడుకోవాలని తాము నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. రాష్ట్రంలోని 1,029 ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల పాఠశాలల్లోని విద్యార్థులకు ఇప్పటివరకు మంచాలు, పరుపులు, చద్దర్లు ఎన్ని ఉన్నాయి? ఇంకా ఎంత మందికి కావాలి అనే జాబితాను త్వరగా తయారు చేసి ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు. వాటిని పరిశీలించి వెంటనే కొనుగోలు చేయటానికి కావాల్సిన నిధులు మంజూరు చేస్తామని వెల్లడించారు. ప్రతి గురుకుల పాఠశాలతో పాటు ప్రభుత్వ హాస్టల్‌లోని విద్యార్థినీ, విద్యార్థులకు మూత్రశాలలు, స్నానాల గదులు, మంచినీటి సౌకర్యం, విద్యుత్, డోర్లు, కిటికీలు వాటి నుంచి దోమలు రాకుండా ఉండడానికి మెష్ జాలీ ఏర్పాటు చేయాలన్నారు. వీటన్నిటిని క్రోడీకరిస్తూ విద్యార్థుల సౌకర్యాల కల్పనపై చెక్ లిస్టు తయారు చేయాలని సూచించారు. చెక్ లిస్టును ప్రతి హాస్టల్లో ప్రదర్శించాలన్నారు. గురుకులాల భవనాల అద్దె డబ్బులను త్వరలోనే చెల్లిస్తామనీ, అయితే భవనాల యజమానులు విద్యార్థుల సౌకర్యాల కల్పనకు నిబంధనల ప్రకారం వ్యవహరించాల్సి ఉంటుందని తెలిపారు. చెక్ లిస్టును ఈ నెల 29 లోగా సమర్పించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు.

ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌ల విడుదలపై సానుకూలం

విదేశాల్లో చదువుతున్న విద్యార్థులకు ఓవర్సీస్ స్కాలర్‌షిప్ రెండో విడత నిధులను వెంటనే విడుదల చేయాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన విజ్ఞప్తికి భట్టి సానుకూలంగా స్పందించారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ శాఖలో పెండింగ్‌లో ఉన్న ఓవర్సీస్ స్కాలర్‌షిప్ బకాయిల జాబితాను తనకు అందజేయాలని అధికారులకు సూచించారు. విదేశాల్లో చదువుతున్న విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి ఏడాది నిర్ణీత గడువులోగా ఓవర్సీస్ స్కాలర్‌షిప్ నిధులను విడుదల చేయించుకునే బాధ్యత అధికారులదేనని గుర్తు చేశారు. ఈ వార్షికోత్సవంలో బీసీలకు 800, ఎస్సీ ఎస్టీ మైనార్టీలకు 500 మంది విద్యార్థులకు చొప్పున ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లు మంజూరు చేస్తామని ప్రకటించారు.

పెద్దాపూర్ పాఠశాలపై సమీక్ష

జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గురుకుల పాఠశాలను సందర్శించిన తర్వాత అక్కడ తీసుకున్న చర్యల గురించి గురుకులాల సెక్రటరీ రమణకుమార్‌ను ఆరా తీశారు. విద్యార్థులకు మంచాలు, పరుపులు యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేయాలన్నారు. ఆ పాఠశాలలో ఒక్క విద్యార్థి కూడా కింద పడుకోటానికి వీలులేదనీ, ప్రస్తుతం ఉన్న భవనాలు సరిపోకుంటే ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలని సూచించారు. పాఠశాల మైదానం ల్యాండ్ లెవెల్ చేయాలనీ, విద్యార్థినీ విద్యార్థులకు అందుబాటులోనే మూత్రశాలలు, బాత్రూంల నిర్మాణం చేపట్టాలన్నారు. పాఠశాల చుట్టూ ప్రహరీ, కావాల్సిన భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. నూతన భవనాల నిర్మాణం కోసం కావాల్సిన ప్రతిపాదనలు పంపించాలని చెప్పారు. ఈ సమీక్షా సమావేశంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ సుల్తానియా, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశం, డిప్యూటీ సీఎం సెక్రటరీ కృష్ణ భాస్కర్, అలుగు వర్షిని, శరత్, తదితరులు పాల్గొన్నారు.

పంటలు తొలగించే ప్రయత్నం చేయడంతో..

- ఫారెస్ట్ అధికారులు, గిరిజనులకు మధ్య వాగ్వాదం
- ఐదుగురు గిరిజనుల అరెస్ట్



నవతెలంగాణ-సిరికొండ

నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలంలోని రావుట్ల బీట్ కంపార్ట్‌మెంట్ 397లో ఫారెస్ట్ భూమిలో గిరిజనులు వరి, పత్తి సాగుచేయడంతో ఆ పంటను ఫారెస్టు అధికారులు జేసీబీ సహకారంతో సోమవారం తొలగించే ప్రయత్నం చేశారు. వరి, పత్తి పంటలను తొలగించే క్రమంలో ఆ భూమి మాదేనంటూ తండావాసులు ఫారెస్ట్ అధికారులను అడ్డుకున్నారు. దాంతో ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు.

జలాశయాల్లో పూడికతీతను పకడ్బందీగా చేపట్టాలి

- ఈపీసీ విధానాన్ని అనుసరించాలి
- ప్రభుత్వంపై భారం పడకుండా చూడాలి : క్యాబినెట్ సబ్‌కమిటీ భేటీలో మంత్రి ఉత్తమ్



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్రంలోని జలాశయాల్లో పూడికతీత పనులను పకడ్బందీ ప్రణాళికతో చేపట్టాలని నీటిపారుదల శాఖ మంత్రి, జలాశయాల పూడికతీత క్యాబినెట్ సబ్‌కమిటీ చైర్మెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇంజినీర్లను ఆదేశించారు. ఈ పనులను ఈపీసీ విధానంలో చేపడితేనే నిర్ణయించిన సమయానికి పూర్తవుతాయని చెప్పారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో జరిగిన క్యాబినెట్ సబ్‌కమిటీ సమావేశానికి అధ్యక్షత వహించగా, సభ్యులు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, నీటి పారుదల, రెవెన్యూ, ఖనిజాభివృద్ది శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో కాంట్రాక్టర్లను ఆహ్వానించడం ద్వారా పనులను అత్యంత పారదర్శకంగా చేపట్టాలని సూచించారు. ఖనిజాభివృద్ధి సంస్థ జలాశయాల్లో ఉన్న ఇసుక, మట్టి నిల్వలను అంచనా వేసి మంచి రేటు వచ్చేలా చూడాలన్నారు. వీటి ద్వారా వచ్చే ఆదాయంతో రిజర్వాయర్ల నిర్వహణ చేపట్టాలని సూచించారు. తద్వారా పభుత్వం మీద ఆర్థిక భారం పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జలాశయాలలో ఒకేసారి పూడికతీత పనులను చేపట్టి, అత్యంత వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అన్నీ ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పూడికతీత పనులను విజయవంతంగా పూర్తి చేసి, జలాశయాల్లో నీటి నిల్వలు పెరిగేలా కృషి చేయాలని అభిప్రాయపడ్డారు.

మోడీ ప్రభుత్వ హయాంలో మహిళలపై దాడులు, హత్యలు



నవతెలంగాణ-సంగారెడ్డి

- ప్రజా సమస్యల పరిష్కారానికి అలుపెరుగని పోరాటాలు
- జిల్లాలో పేదలందరికీ ఇండ్ల స్థలాలివ్వాలి
- ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలి : సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

మోడీ ప్రభుత్వ హయాంలో మహిళలపై లైంగికదాడులు, హత్యలు పెరిగాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం సీపీఐ సంగారెడ్డి జిల్లా నిర్మాణ కౌన్సిల్ సమావేశం సంగారెడ్డి పట్టణంలోని స్థానిక కెమిస్ట్ భవన్‌లో నిర్వహించారు. అంతకుముందు కొల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై లైంగికదాడి, హత్యను నిరసిస్తూ స్థానిక ఐబీ నుంచి కొత్త బస్టాండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ.. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు రక్షణ కరువైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితులపై మైనార్టీలపై దాడులు, కులం, మతం పేరుతో చిచ్చులు రేపుతుందన్నారు. పెట్టుబడిదారులకు కొమ్ము కాస్తూ దేశాన్ని విచ్ఛిన్నం చేయడం కోసం కేంద్ర ప్రభుత్వం పనిచేస్తుందని ఆరోపించారు. సీపీఐ ప్రభుత్వ భాగస్వామ్యంలో ఉన్నప్పటికీ ప్రజా సమస్యలు పరిష్కరించకపోతే ప్రశ్నిస్తామని అన్నారు. సంగారెడ్డి జిల్లాలో కమ్యూనిస్టు పార్టీకి పూర్వ వైభవాన్ని తీసుకు రావడం కోసం నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని తెలిపారు. పేదలందరికీ ఇండ్ల స్థలాలు, రేషన్ కార్డులు, నూతన పెన్షన్లు ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వంలా కాకుండా ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పాటుపడాలని, లేనియెడల సీపీఐ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఆందోళన, పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈటి నరసింహ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వి.ప్రకాష్ రావు, సంగారెడ్డి జిల్లా కార్యదర్శి జలాలుద్దీన్, మెదక్ జిల్లా కార్యదర్శి ఎంఎ. ఖలేద్, సంగారెడ్డి జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమీకృత గురుకులాలకు నిర్మాణ డిజైన్ల రూపకల్పన

- ఆరింటితో ఆర్‌అండ్‌బీ సిద్ధం
- రూ.2 వేల కోట్లు కేటాయింపు
- ఐదేండ్లలో పూర్తి
- సర్కారు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చాకే ముందుకు
- పైలెట్‌గా కొడంగల్, మధిరలో శ్రీకారం

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల విద్యాలయాలను అధునాతనంగా రూపుదిద్దాలని సర్కారు నిర్ణయించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకుల పాఠశాలలను వేర్వేరు ప్రాంతాల్లో కాకుండా ఒకేచోట ఇంటిగ్రేటేడ్ రెసిడెన్షియల్ క్యాంపస్ (సమీకృత గురుకుల విద్యాలయాలు)లను ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు ప్రభుత్వ ఆదేశం మేరకు రోడ్లు, భవనాల శాఖ డిజైన్లను రూపొందించింది. సుమారు ఆరు డిజైన్లను ఆర్‌అండ్‌బీ తయారు చేసినట్టు సమాచారం. వీటిని ఆర్కిటెక్టులు రూపొందించగా, ఆర్‌అండ్‌బీ శాఖ ఉన్నతాధికారులు తుది పరిశీలనలో ఉన్నాయి.

త్వరలోనే ప్రభుత్వం పరిశీలించి ఆమోదించాకే ఖరారవుతుంది. అయితే, ఈ ప్రాజెక్టు కోసం ఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో రూ. 2 వేల కోట్లను కేటాయించిన విషయం తెలిసిందే. పైలట్ ప్రాజెక్టుగా సీఎం రేవంత్ రెడ్డి నియోజకవర్గం కొడంగల్, భట్టి విక్రమార్క అసెంబ్లీ నియోజకవర్గం మధిరలో నిర్మించనున్న విషయం తెలిసిందే.



ఎడ్యుకేషనల్ హబ్‌గా...

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించ తలపెట్టిన సమీకత గురుకుల విద్యాలయాల నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. పేద, నిరుపేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, జనరల్ గురుకులాలన్నీ ఒకే చోట నిర్మించాలని సర్కారు భావిస్తున్నది. ప్రతి నియోజకవర్గ కేంద్రంలో సుమారు 20 ఎకరాల్లో ఎడ్యుకేషనల్ హబ్‌లు నిర్మించేందుకు సన్నాహాలు చేస్తోంది. కొడంగల్, మధిర నియోజకవర్గాల్లో పైలెట్ ప్రాజెక్టులుగా చేపట్టనున్నారు. రానున్న రోజుల్లో మరిన్ని నియోజకవర్గాల్లో శ్రీకారం చుట్టనున్నారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించడంతో పాటు, అవసరమైతే విరాళాలు కూడా సేకరించాలని ప్రభుత్వ ఆలోచన. అన్ని రకాల గురుకులాలను కలిపి ఒకే చోట ఎడ్యుకేషనల్ హబ్‌గా నిర్మించాలనేది సర్కారు అభిప్రాయం. గురుకులాలన్నీ ఒకే చోట ఉంటే వాటి నిర్వహణ, పర్యవేక్షణ, అజమాయిషీ సులభమవుతుందనీ, మెరుగైన ఫలితాలు ఆశించవచ్చని ప్రభుత్వం సమాలోచనలు చేస్తున్న విషయం తెలిసిందే. ఎక్కువ మంది విద్యార్థులు ఒకే ప్రాంగణంలో చదువుకోవటం ద్వారా వారిలో ప్రతిభా పాటవాలు, పోటీతత్వం పెరుగుతుందని సర్కారు చెబుతున్నది.

కులమతాలకతీతంగా చదువు

ప్రతి నియోజకవర్గం కేంద్రంలో సుమారు 20 ఎకరాల్లో ఎడ్యుకేషనల్ హబ్ నిర్మించాలని ప్రభుత్వ భావన. నియోజకవర్గ కేంద్రంలో 20 ఎకరాల భూమి ఒకే చోట అందుబాటులో లేకపోతే, అదే సెగ్మెంట్‌లోని మరో పట్టణం లేదా మండల కేంద్రంలో నిర్మించేందుకు ప్రణాళిక రచన చేస్తున్నది. ఇప్పటికే 20 ఎకరాలకు పైగా విస్తీర్ణమున్న గురుకులాల్లో మిగతా భవనాలు కూడా నిర్మించే అవకాశాలను వేగంగా పరిశీలిస్తున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణం కోసం రాష్ట్రవ్యాప్తంగా అనువైన స్థలాలను గుర్తించాలని అధికారులను కోరగా, వారు స్థల సేకరణ కూడా పూర్తి చేసినట్టు సమాచారం. అయితే, ఈ గురుకులాల భవనాల నిర్మాణ బాధ్యతలను ఆర్‌అండ్‌బీ శాఖకు అప్పగించగా, ఆ శాఖ ఉన్నతాధికారులు డిజైన్ల రూపకల్పనలో నిమగ్నమయ్యారు.

రూ.2 వేల కోట్ల కేటాయింపు

రాష్ట్ర ప్రభుత్వం తాజా బడ్జెట్లో ఈ కార్యక్రమానికి రూ. 2 వేల కోట్లు కేటాయించిన విషయం విదితమే. ఈ అంచనాలు మరింత పెరగనున్నాయని సమాచారం. అలాగే కార్పొరేట్ సంస్థలు, ఆయా కంపెనీల సీఎస్ఆర్ నిధులతో పాటు దాతల నుంచి విరాళాలు సేకరించాలని సర్కారు సమాలోచనలు చేస్తున్నది.

రాఖీ పండుగనాడు కూడా మహిళా నేతలపై నిందలా?

- ముందు మహిళలను గౌరవించడం నేర్చుకో : కేటీఆర్ వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించిన సీతక్క

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాఖీ పండుగనాడు కూడా మహిళా కమిషన్ చైర్మెన్‌పైనా, తనపైనా నిందలు వేయడం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు తగదని స్త్రీ, శిశుసంక్షేమ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ(సీతక్క) పేర్కొన్నారు. ఆస్తులు, అంతస్తులతో నిమిత్తం లేకుండా మహిళలను గౌరవించడం నేర్చుకోవాలని సూచించారు. అధికారంలో ఉన్నప్పుడు మహిళల భద్రతను గాలికొదిలేసి ఇప్పుడు గాలి మాటలు మాట్లాడటం తగదని హితవు పలికారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో మహిళా భద్రత అంత లక్షణంగా ఉండే మహిళలపై లక్షన్నరకు పైగా దాడులెందుకు జరిగాయని ప్రశ్నించారు. మహిళా భద్రతకి తమ ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని గుర్తు చేశారు. డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాల కట్టడి కోసం తమ ప్రభుత్వం చేపట్టిన చర్యలు కేటీఆర్‌కు కనిపించడం లేదా అని ప్రశ్నించారు.

తమ ప్రభుత్వం వచ్చాక లైంగిక దాడుల కేసుల్లో ఇప్పటికే 24 మంది దోషులకు శిక్షలు పడేలా చేశామని తెలిపారు. బాధిత మహిళల కుటుంబాలకు తమ ప్రభుత్వం అండగా ఉంటున్న విషయాన్ని గుర్తుచేశారు. బీఆర్ఎస్ హయాంలో ఎన్ని బాధిత కుటుంబాలను పరామర్శించారో చెప్పాలని ప్రశ్నించారు. విచ్చలవిడిగా పబ్బులు, క్లబ్బులు, డ్రగ్స్ వ్యాపారం జరిగినా నియంత్రించని అసమర్థ పాలన కేసీఆర్‌దని పేర్కొన్నారు. మహిళలను బ్రేక్ డాన్సర్లు, రికార్డింగ్ డాన్సర్లతో పోల్చడం కేటీఆర్ చెప్పినట్టు చిన్న విషయం కానే కాదనీ, కోట్ల మంది శ్రామిక, సామాన్య మహిళలని కించ పరచడమే అవుతుందని పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలోనే మహిళా పోలీస్ స్టేషన్లను ప్రారంభించిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిదని తెలిపారు. వరంగల్లో అమ్మాయిలపై యాసిడ్ దాడి జరిగితే కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏం జరిగిందో అందరికి తెలుసుననీ, అప్పట్లో దటీజ్ వైయస్సార్ అని అంతా అభినందించారని గుర్తుచేశారు. చరిత్రలో మొట్ట మొదటి సారిగా ఒకేసారి 138 మంది మహిళా ఎస్ఐలను, 2400 మంది మహిళా పోలీస్ కానిస్టేబుల్‌లను రిక్రూట్ చేసి శిక్షణ ఇస్తున్నామని తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఎల్బీనగర్ -మహేశ్వరం
మంగళవారం | ఆగస్టు 20, 2024 | www.navatelangana.com

అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడిగా టి.శివ



నవతెలంగాణ,అబ్దుల్లాపూర్ మెట్

తెలంగాణ అంబేద్కర్ సంఘం అబ్దుల్లాపూర్ మెట్ మండల అధ్యక్షుడిగా టి. శివ నియామక మయ్యారు. తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై. శ్రీహరి ఆదేశాల మేరకు రాష్ట్ర కమిటీ ఏకగ్రీవంగా తీర్మానం చేసి అందుకు సంబంధించిన నియామక పత్రాన్ని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా టి. శివ మాట్లాడుతూ సమాజంలో బడుగు బలహీన వర్గాల ప్రజలు,పేద మధ్యతరగతి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడుతానని తెలిపారు. గ్రామ, గ్రామానికి వెళ్లి అంబేద్కర్ ఆశయాలు, ఆలోచనల విధానాలు ప్రజల్లోకి తీసుకెళ్తానని తెలిపారు. అంబేద్కర్ సంఘం బలోపేతం కోసం తన వంతు బాధ్యతను నిర్వర్తిస్తానని అన్నారు. ప్రతి ఒక్కరూ చదువుకుంటే జ్ఞానం వస్తుందని, దింతో రాజ్యాధికారం సాధించుటకు సులువుగా ఉంటుందని తెలిపారు.

మలక్‌పేట్‌లో దంత వైద్యుల నిరసన



నవతెలంగాణ-మలక్ పేట్

కోలకతాలో మహిళా వైద్యురాలి పై జరిగిన హత్యాచార సంఘటనకు నిరసనగా మలక్ పేట్ లోని దంత వైద్యుల ఆధ్వర్యంలో సోమవారం ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు. సమాజం లో వైద్యుల పట్ల గౌరవం పెరగాలి తప్ప ఇలాంటి సంఘటనలు జరగటం బాధాకరం అన్నారు. దోషుల పై విచారణ త్వరగతగతిన పూర్తి చేసి కఠినం గా శిక్షించాలని డిమాండ్ చేశారు. వైద్యురాలి మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో రాష్ట్ర దంత మహిళా అధ్యక్షురాలు డాక్టర్ కె.భార్గవి , స్టూడెంట్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మంజూరు , ఎ ఐ డి ఎస్ ఎ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ నాగరాజు ,ఎ ఐ డి ఎస్ ఎ సహాయ కార్యదర్శి డాక్టర్ మమత , డాక్టర్

పెద్ద అంబర్‌పేట మున్సిపల్ చైర్ పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం..

- సంతకాల సేకరణతో
జిల్లా కలెక్టర్‌కు అందజేత



నవతెలంగాణ-పెద్దఅంబర్‌పేట్

పెద్ద అంబర్ పేట మున్సిపాలిటీ చైర్పర్సన్ పీఠం దక్కించుకునేందుకు కీలక పరిణామాలు చోటు చేసుకుంటు న్నాయి. పెద్ద అంబర్‌పేట మున్సిపల్ చైర్పర్సన్ గా ఉన్న స్వప్నపై అవిశ్వాసం పెట్టేందుకు పార్టీలకతీతంగా పలువు రు కౌన్సిలర్లు సంతకాల సేకరణ చేసి సోమవారం జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. మున్సిపాలిటీ మొత్తం 24 మంది కౌన్సిలర్లు ఉండగా మెజార్టీగా 17 మంది సభ్యులు అవిశ్వాసాన్ని గట్టు ఎక్కించేందుకు కావాల్సిన సంతకాలు చేశారు. సంతకాలు చేసిన వారిలో కౌన్సిలర్లు గ్యారల శ్రీనివాస్, వడ్డేపల్లి విద్యావతి, పసుల రాజేందర్, దండం కృష్ణారెడ్డి, పండుగల జయశ్రీ, చెల్లారు మురళీధర్ రెడ్డి, సిద్ధాంకి కృష్ణ రెడ్డి, కందాడ అనుపమ, పబ్బతి లక్ష్మణ్, శ్రీధర్ రెడ్డి, తొండాపు రోహిణి, పాశం అర్చన, కోటేశ్వర రావు, రామావత్ పరశురాం, జోర్కా గీత, ఓరుగంటి సుజాత, చెవుల హరిశంకర్ లు ఉన్నారు. మున్సిపాలిటీలో ఉన్న 24 మంది కౌన్సిలర్లలో 17 మంది ఈ సంతకాల సేకరణలో పాల్గొని తమ మద్దతును ప్రకటించడంతో చైర్పర్సన్ ఇంకా కొత్తవారికి అవకాశం దక్కే అవకాశం పక్కాగా కనిపిస్తోంది.

ప్రజావాణిలో వచ్చిన అర్జీల పరిష్కారంపై అధికారులు దృష్టి సారించాలి

- కమిషనర్ ఆమ్రపాలి కాటా



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రజావాణిలో వచ్చిన అర్జీల పరిష్కారంపై అధికారులు దృష్టి సారించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాట అధికారులను ఆదేశించారు. సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డితో కలిసి కమిషనర్ ఆమ్రపాలి కాట ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆమ్రపాలి కాట మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తు లను ఆయా విభాగాల అధికారులు వేగవంతంగా పరిష్కరించాలని సూచించారు. జాప్యం చేయకుండా ఎప్పటికప్పుడు ఆయా సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 25 విన్నపాలు రాగా టేలిఫోన్, ద్వారా 4 విన్నపాలు వచ్చాయి. అందులో 25 విన్నపాలలో టౌన్ ప్లానింగ్ 11, రెవెన్యూ 6, అడ్మిన్ 2, ఎల్ డబ్ల్యూ ఎస్ 2, లేక్స్ 2, ఇంజనీరింగ్ విభాగానికి 2 విన్నపాలు వచ్చాయని తెలిపారు. వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. జీహెచ్ఎంసీ పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 30 విన్నపాలు వచ్చాయి. అందులో కూకట్ పల్లి జోన్‌లో 12, సికింద్రాబాద్ జోన్‌లో 10, ఎల్బీనగర్ జోన్‌లో 4, చార్మినార్ జోన్‌లో 2, ఖైరతాబాద్, శేరిలింగంపల్లి జోన్‌లలో ఒక్కటి చొప్పున విజ్ఞప్తులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిష నర్లు సత్యనారాయణ, యాదగిరి రావు నళిని పద్మావతి సీసీపీ శ్రీనివాస్, అడిషనల్ సీసీపీ గంగాధర్, ఆయా విభాగాల వాల్యుయేషన్ అధికారి మహేష్ కులకర్ణి, చీఫ్ ఎంటమాలజి డాక్టర్ రాంబాబు, యస్ ఈ హౌసింగ్ జాయింట్ కమిషనర్ ఎస్.బీ.ఎం కష్ణ కుమారి తదితరులున్నారు.

గిరిజన సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతిరూపం తీజ్ పండగ

- మేయర్ పారిజాత నర్సింహారెడ్డి



నవతెలంగాణ, బడంగ్‌పేట్

తెలంగాణ రాష్ట్రంలో గిరిజన సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతిరూపంగా ఎంతో ఉత్సాహంగా తీజ్ ఉత్సవాలను ఘనంగా జరుపుకుంటారని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. సోమవారం మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అల్మాస్ గూడ గ్రామంలో గిరిజనులు తీజ్ పండగ ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పాల్గొని ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజనులకు ప్రత్యేక పండుగగా తీజ్ ఉత్సవాలను ఎంతో ప్రతిష్టాత్మకంగా జరుపుకోవటం జరుగుతుందని తెలిపారు. పూర్వ కాలం నుండి గిరిజన యువతులు, మహిళలు ఆనవాయితీగా ఈ ఉత్సవాలను ఎంతో ఘనంగా నిర్వహించటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బోయపల్లి రాఘవేందర్ రెడ్డి, నాయకులు మధుసూదన్ రెడ్డి,ప్రతాప్ రెడ్డి, గిరిజన వివిధ కాలనీల ప్రజలు యువతి, యువకులు మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ హత్యను నిరసిస్తూ ఆందోళన..



నవతెలంగాణ-పెద్ద అంబర్ పెట్

కోల్‌కతాలో డాక్టర్ హత్యను నిరసిస్తూ సీపీఐ అనుబంధ ప్రజాసంఘాలు యువజన, విద్యార్థి, మహిళా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రావి నారాయణ రెడ్డి కాలనీ ఫేస్ -3 భూపోరాట కేంద్రం అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల యాదిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు స్థానిక కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు అజ్మీర్ హరిసింగ్ నాయక్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు తగిలి మధు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు భూక్యా వినోద్, ఎన్ఎఫ్ఐ డబ్ల్యు జిల్లా సహాయ కార్యదర్శి వట్టి నవనీత, బీకేసి జిల్లా అధ్యక్షులు దాసరి ప్రసాద్, మండల పార్టీ నాయకులు పుల్లయ్య, సైదులు, ఆవుల యాదగిరి, దేవమ్మ, అన్నసూయ నాగరాజు కవిత సుభద్ర వీరేష్ గణేష్, భాను, నరేష్, సువర్ణ, క్రాంతి, మోహన్, రఘువేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కోదండరాంకి హార్థిక శుభాకాంక్షలు



నవతెలంగాణ-హాయత్‌నగర్-అబ్దుల్లాపూర్ మెట్

గవర్నర్ కోటలో ఎమ్మెల్సీగా నియమితులైన ప్రొఫెసర్ కోదండ రాంను సామాజిక జన జాగృతి సమితి అధ్యక్షులు తొంట బాబు ఆధ్వర్యంలో పలువురు తెలంగాణ ఉద్యమ కారులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్చం అందజేసి హార్థిక శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన వెంట తెలంగాణ ఉద్యమ కారులు రాచర్ల వెంకన్న, ఓబీసీ తెలంగాణ ఉద్యమ కన్వీనర్ శ్రీనివాస్ రావులు వున్నారు.

కర్మన్‌ఘాట్ ఆలయంలో షెడ్లు ప్రారంభం



నవతెలంగాణ,చంపాపేట్

నేటి ఆధునిక ప్రపంచంలో దూరాలోచనలకు దూరంగా ఉండి నిత్య జీవితంలో ఆధ్యాత్మికతను అలవర్చుకొని భగవంతునికి చేరువకావాలని ఆలయ చైర్మెన్ నల్ల రఘుమారెడ్డి అన్నారు. సోమవారం రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్ నియోజకవర్గం చంపాపేట్ డివిజన్ శ్రీ కర్మన్ ఘాట్ హనుమాన్ దేవస్థానంలో దాతల సహకారంతో చేపట్టిన అభివృద్ధి పనులు వంటశాల ఆధునీకరణ భక్తుల సౌకర్యార్థను టీం షెడ్లు, శ్రీ సత్యనారాయణ వ్రతం మండపం , చుట్టూ గ్రానైట్ ఫ్లోరింగ్, శ్రీ జగన్నాథ స్వామి ఆలయం ప్రాగణంలో నూతన టైల్స్ వేయడం స్వామి వారి వ్రతం రథశాల చెప్పులు భద్రపరుచు స్టాండ్ వంటి పనులు పూర్తి అయిన సందర్భంగా స్థానిక ప్రధాన అర్చకులు కార్పొరేటర్ సుజాత, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ సతీమణి అనురాధ పలు దాతలు అత్యంత వైభవంగా ప్రధానార్చకులు వేదమంత్రాలతో కలిసి పలు షెడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. నేటి సమాజంలో ఆధ్యాత్మికతకు చేరువ కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆలయ అభివృద్ధి స్వామివారికి భక్తులకు చేరువ చేయడానికి భక్తి పరమైన కార్యక్రమాలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు సహకారాలు అందజేయడం గొప్ప విషయమన్నారు. ఇలాంటి కార్యక్రమంలో ప్రజలందరూ భక్తిని అలవర్చుకొని ప్రశాంతమైన జీవితాన్ని గడిపేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన సూచించారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా కమిటీ సభ్యులు ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. భక్తులందరూ అత్యంత వైభవంగా పూజా కార్యక్రమాల్లో స్వామి వారికి ఆశీర్వాదాలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నరేందర్ రెడ్డి మధుసూదన్ సాగర్, మధుసూదన్ రెడ్డి, కిరణ్ కుమార్, యాదగిరి, ఆనంద్ కుమార్ గౌడ్, తిరుమలేష్, సురేష్ గౌడ్, ముద్దా కళ్యాణ్ చక్రవర్తి, సాంబరాజు, శైలజ, రాణాశౌర్య సింగ్, పోతుల రాజశేఖర్ రెడ్డి, బాలరాజు, యశ్వంత్, యుక్తముకి, బొక్క రామ్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, పండితులు అర్చకులు సిబ్బంది జూనియర్ అసిస్టెంట్ వెంకటయ్య అభిమానులు భక్తులు తదితరులు పాల్గొన్నారు

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



నవతెలంగాణ చంపాపేట్

వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన అవసరమని వాహనదారులకు రాఖీ పౌర్ణమి ప్రత్యేక శుభాకాంక్షలు తెలుపుతూ రాచకొండ డీసీపీ శ్రీనివాసులు, ట్రాఫిక్ ఏసీపీ ఆదేశం మేరకు ట్రాఫిక్ సిఐ సర్వర్ అహ్మద్ అన్నారు. సోమవారం రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్ నియోజకవర్గం చంపాపేట్ డివిజన్ సాగర్ రింగ్ రోడ్ చౌరస్తా రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన వాహనదారులకు ప్రత్యేక డ్రైవ్‌లో రాఖీ పౌర్ణమి సందర్భంగా వాహనదారులకు బొట్టుపెట్టి మిఠాయిలు పంచుతూ రాఖీలు కట్టారు. ఎలిమెంట్ ధరించాలని సూచనలు చేశారు. రోడ్డు దాటేటప్పుడు అటూ ఇటూ చూసి వాహనాలు రానప్పుడే దాటాలన్నారు. జీబ్రా లైన్, రాంగ్ రూట్, రోడ్డుపై పరిగెట్టొద్దని సూచించారు. వాన దారులకు అవగాహన కల్పిస్తూ క్షేమంగా పోయి లాభంగా రావాలని రోడ్డు భద్రత కాపాడాలని వాహనదారులతో ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ ట్రాఫిక్ సిబ్బంది సీఐలకు వాహనదారులు రక్షాబంధన్ పురస్కరించుకొని ప్రత్యేక అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సైలు సంతోష్, ట్రాఫిక్ పోలీస్ మహిళలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లైంగిక దాడి దోషులను శిక్షించాలి



నవతెలంగాణ వనస్థలిపురం

వనస్థలిపురం డివిజన్ పరిధిలోని ప్రశాంత్ నగర్ రోడ్ నెంబర్ 2 లో వైద్యురాలిపై జరిగిన దాడికి నిరసనగా వనస్థలిపురం విశ్రాంత ఉద్యోగులు, సీనియర్ సిటిజన్స్, తెలంగాణ అధ్యయన వేదిక, మహిళా మండలి, ప్రగతిశీల మహిళా సంఘం, ఇతర అనేక ప్రజా సముదాయాలు సంయుక్త ఆధ్వర్యంలో ప్రశాంత్ నగర్ రోడ్ నెంబర్ 2 చౌరస్తాలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. తదనంతరం కొవ్వొత్తుల ర్యాలీ పనామా బస్ స్టాప్ వరకు నిర్వహించారు. ఆగస్టు 9 వ 2024 ఆర్‌జీ కార్ మెడికల్ కళాశాలకు సంబంధించిన వైద్యశాలలో నైట్ డ్యూటీ చేస్తున్న డాక్టర్‌పై అమానుషంగా దాడి చేసి లైంగిక దాడి చేసి పాశవికంగా హత్య చేయడం జరిగింది. పోస్ట్ మార్టం నివేదికలో గొంతు నులిమి నట్టుగా, ముఖం గోడకేసి కొట్టడం వలన ఛిద్రమైనట్టుగా, జననేంద్రియాల నుండి ముక్కు, చెవులు, కళ్ళనుండి రక్త స్రావం జరిగినట్లు వెల్లడయింది. సామూహిక దాడిలో పాల్గొన్న నిందితులను వెంటనే అరెస్టు చేసి చట్టపరంగా కఠినంగా శిక్షించాలని వారు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు మార్గ నిర్దేశికత్వం ప్రకారం పని చేసే చోట్ల మహిళలకు భద్రత కల్పించాలని కోరుతూ మహిళల, బాలికలపై రోజు రోజుకు పెరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని, సమాజంలో పెరుగుతున్న హింసకు కారణాలను సమూలంగా తొలిగిస్తే తప్ప ఈ అత్యాచార పర్వం ఆగదని వారు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో కట్టా భగవంత రెడ్డి, జగన్మోహన్ రెడ్డి, డాక్టర్ కేశవరావు, ప్రభాకర్ రెడ్డి, యుగంధర్ రెడ్డి, రంగయ్య చౌదరి, నిర్మల చౌదరి, ఝాన్సీ పి ఓడబ్ల్యు, అనసూయ పిఓడబ్ల్యూ, ప్రేమలత బాలచందర్, విజయలక్ష్మి , బ్రహ్మచారి,మానవ వికాస వేదిక సభ్యులు సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండుగగా శ్రీ భక్త మార్కండేయస్వామి రథయాత్ర



నవతెలంగాణ, బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం జల్ పల్లి మున్సిపాలిటీ శ్రీ రామ కాలనీ పద్మశాలి పరస్పర సహాయ సహకార పొదుపు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం శ్రీ భక్త మార్కండేయ స్వామి రథయాత్ర కన్నుల పండుగగా నిర్వహించారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా పద్మశాలి పరస్పర సహాయ సహకార పొదుపు సంఘం ఆధ్వర్యంలో గత ఆరు సంవత్సరాలుగా శ్రీ భక్త మార్కండేయ స్వామి రథయాత్ర ఘనంగా నిర్వహిస్తున్నామని సంఘ సభ్యులు తెలియజేశారు. ఈ రథయాత్రలో సంఘ సభ్యులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సంఘం కమిటీ సభ్యులు రథయాత్రను పద్మశాలి సంఘం భవనం నుండి ప్రారంభించి శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయం వరకు కొనసాగించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

నవతెలంగాణ, చంపాపేట్

భారతీయ సంస్కృతి, సంప్రదాయానికి ప్రతిరూపంగా భావించే రక్షాబంధన్ వేడుకను గురువారం జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఆడపడుచులు పుట్టింటికి చేరుకుని తమ సోదరులకు ప్రేమతో, కలకాలం సంతోషంగా జీవించాలని ఆకాంక్షిస్తూ రాఖీలు కట్టి దీవించారు. దీనికి ప్రతిగా సోదరులు నూతన వస్త్రాలు, బహుమతులను కానుకగా అందజేశారు. అనంతరం కుటుంబ సభ్యులంతా సమీప ఆలయాలకు తరలివెళ్లి ప్రత్యేక పూజలు జరిపారు. రంగారెడ్డి జిల్లా చంపాపేట్ డివిజన్ దుర్గా భవాని నగర్ స్వగృహంలో రక్షాధారణ, కార్యక్రమాలు చేపట్టారు. రాఖీలు కట్టి ఆత్మీయ భావాన్నిపంచారు. అన్న తమ్ముళ్ల అక్క చెల్లెలు సంఘాలు రాఖీ పండుగను భారతీయ సంప్రదాయానికి నిలువుటద్దంగా భావించి ఘనంగా జరుపుకున్నారు. పలు రకాల రాఖీలు కట్టి స్వీట్లను పంచి పెట్టారు. రక్షాబంధన్ వేడుకలను జరుపుకున్నారు. ప్రతి ఒక్కరూ వివిధ రంగుల్లో, ఆకర్షణీయమైన రూపాల్లో కళకళలాడుతూ రాఖీలు దర్శనమిచ్చాయి. నూతన వస్త్రాలను ధరించి, ప్రత్యేక పూజలు చేసి సోదరీమణులు తమ సోదరులకు రాఖీలు కట్టడం ఆనవాయితీగా వస్తోంది. చెడుపై విజయాలను సాధిస్తూ, ఎల్లవేళలా నాకు రక్షగా ఉండాలని సోదరీమణులు ఆకాంక్షించగా, సోదరులు ఆ హామీని నిలబెడ్తామని ఆశీర్వదిస్తూ కానుకలను సమర్పించుకున్నారు. ప్రతి ఇంట్లోనూ రక్షాబంధన్ వేడుకల సందడే కనిపించింది.

హయత్‌నగర్ కోర్టులో విధుల బహిష్కరణ

- హయత్ నగర్ కోర్ట్ బార్ అసోసియేషన్



నవతెలంగాణ-హాయత్‌నగర్

కూకట్పల్లి కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న సంతోష్ అనే న్యాయవాదిని బోరబండ సబ్-ఇన్‌స్పెక్టర్ జమాల్ అనే పోలీస్ అధికారి బనియన్, లుంగీ పైనే ఇంటి నుండి దారుణంగా ఈడ్చుకెళ్లి న్యాయవాది పై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ, న్యాయవాదుల పై నిత్యం పోలీసుల దౌర్జన్యాలకు నిరసనగా "తెలంగాణ అడ్వకేట్స్ ఫెడరేషన్" ఇచ్చిన పిలుపు మేరకు హయత్ నగర్ కోర్టులో సోమవారం రోజున "విధులు బహిష్కరించి" కోర్ట్ ప్రాంగణం, కోర్టు గేటు ముందు హైవే పై కృష్ణవేణి హాస్పిటల్ ముందు రాస్తారోకో ధర్నా చేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో హాయత్ నగర్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు, టీపీసీసీలా, హ్యూమన్ రైట్స్, ఆర్టీఐ డిపార్ట్మెంట్ రాష్ట్ర కన్వీనర్ బొడ్డు బిక్షపతి గౌడ్ జనరల్ సెక్రటరీ నందుటి సంతోష్ కుమార్ గౌడ్, ట్రెజరర్ తూర్పు నూరు ఈశ్వర్ గౌడ్, జాయింట్ సెక్రటరీ బండి నరేష్, లైబ్రేరి యన్ మేకల సతీష్, గేమ్స్ సెక్రెటరీ మసీదు శివకుమార్, లేడీ రిప్రజెంటివ్ తూము సరిత, కార్యవర్గ సభ్యులు పొట్లపల్లి యాదయ్య గౌడ్, తూమ్ నాగిరెడ్డి, వేదం సాయికృష్ణ, సోమ పంగు రాజేష్, సునగంటి జయసుధ, ప్రియ మాధురి, సీనియర్ న్యాయవాది మోడెమ్ ప్రభాకర్ గౌడ్, సీనియర్, జూనియర్, మహిళా న్యాయవాదులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శ్రీ వీరాజనేయ భక్త సమాజం నూతన అధ్యక్షుడిగా సామ బాబుల్ రెడ్డి



నవతెలంగాణ, బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కేంద్రంలో ఉన్న శ్రీ వీరాంజనేయ భక్త సమాజం గణేష్ ఉత్సవ కమిటీ నూతన అధ్యక్షుడిగా సామ బాబుల్ రెడ్డి ఎన్నికయ్యారు. ఆదివారం గ్రామ ప్రజలు ప్రత్యేక సమావేశం నిర్వహించి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా యాదగిరి, ప్రభాకర్, కర్రె లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా లాల్ సందీప్ యాదవ్, కోశాదికారిగా బెల్ద జగదీశ్వర్ రాజు,సంయుక్త కార్యదర్శులుగా బంగారు రాహుల్, సామ సుధాకర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా మొర యాదగిరి, మరాఠీ శివ కుమార్, బి.భీమ్, పెద్దబావి మధుకర్ రెడ్డి, నరేందర్ గౌడ్, అంకంగారీ శ్రీనివాస్ రెడ్డిలను ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు సామ సంజీవ రెడ్డి, భీమిడి జంగారెడ్డి,పెద్దబావి సుదర్శన్ రెడ్డి,గుర్రం మల్లారెడ్డి, మాజీ సర్పంచ్ నడికుడి యాదగిరి,బంగారు ప్రభాకర్, పెద్దబావి శ్రీనివాస్ రెడ్డి,కర్ర బల్వంత్, లిక్కి కృష్ణారెడ్డి, గట్టు మహిపాల్, చిత్రం శ్రీను, రామిడి రమేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ-చంపాపేట్

బీఆర్ఎస్ మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ తారక రామారావు కు హైదరా బాద్ ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి రాఖీ కట్టి మిఠాయి తినిపిస్తూ యాకుత్ పురా నియోజకవర్గం ఐ ఎస్ సదన్ డివిజన్ మాజీ కార్పొరేటర్ రెడ్డి రక్షాబంధన్ ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

ఇబ్రహీంపట్నం బీజేపీ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే నోముల దయానంద గౌడ్ నివాసంలో తనకు రాఖీ కడుతున్న సోదరి

నవతెలంగాణ-తుర్కయంజాల్



నవతెలంగాణ-పెద్దఅంబర్‌పెట్

పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ పరిధిలో రాఖీ పండుగ సందర్భంగా అన్న, తమ్ముళ్లకు రాఖీలు కడుతున్న చెల్లెలు..





రాఖీ పండుగ వేడుకల్లో పాల్గొన్న బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సంతోష్ కుమార్

నవతెలంగాణ-అంబర్‌పేట



నవతెలంగాణ,చంపాపేట్

భారతీయ సంస్కృతి, సంప్రదాయానికి ప్రతిరూపంగా భావించే రక్షాబంధన్ వేడుకను సోమవారం భారతీయ జనతా పార్టీ భాగ్యనగర్ జిల్లా హైదరాబాద్ అధ్యక్షులు సంరెడ్డి సురేందర్ రెడ్డి కుటుంబ సభ్యులతో ఆనందంగా జరుపుకున్నారు.

ఇంటింటా రాఖీ సంబరాలు

నవతెలంగాణ,అబ్దుల్లాపూర్ మెట్

రాఖీ పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని ప్రతి గ్రామంలోని ఇంటింటా రాఖీ ఉత్సవాలు ప్రజలు సంతోషంగా జరుపుకున్నారు. అన్న చెల్లెలు అనుబంధానికి ప్రతీకగా, సాంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతిరూపంగా పల్లెలు వెల్లువిరిసాయి. మండలంలోని అనాజీపూర్ గ్రామంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్‌రెడ్డి, లాస్య రెడ్డి దంపతులకు ఆయన సోదరీమణులు మమత, రూపలు రాఖీ కట్టి అన్న చెల్లెల అనుబంధాన్ని చాటుకున్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మేడ్చల్-మల్కాజిగిరి-ఉప్పల్
మంగళవారం | ఆగస్టు 20, 2024 | www.navatelangana.com

మేయర్ నివాసంలో ఘనంగా రాఖీ ఉత్సవాలు



నవతెలంగాణ-బోడుప్పల్

బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ నివాసంలో రాఖీ పౌర్ణమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించుచున్నారు. మేయర్ తోటకూర అజయ్ యాదవ్ సోదరి డాక్టర్ సరితా యాదవ్ సోదరులకు రాఖీ కట్టి ఆశీర్వదించారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ.. అక్క తమ్ముళ్ళ అనుబంధానికి రాఖీ పండుగ నిదర్శనమన్నారు. అన్నగా, తమ్ముడిగా అక్కచెల్లెళ్ళకు కొండంత భరోసానిచ్చే విధంగా రాఖీ నిలుస్తుందన్నారు. ఈ వేడుకలలో మేయర్ దంపతులతో పాటు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కేటీఆర్‌కు రాఖీ కట్టిన కార్పొరేటర్ బన్నాల గీత



నవతెలంగాణ-ఉప్పల్

రాఖీ పండుగను పురస్కరించుకొని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ చిల్కానగర్ డివిజన్ మహిళా నాయకురాలతో కలిసి బీఆర్ఎస్ భవన్‌లో రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుభద్ర, ఆండాలు, అనసూయ, సత్యవతి, లక్ష్మి, షైనాజ్, జయమ్మ, శారద, ఉమా, విజయలక్ష్మి, కనకధార, అంజలి, హేమలత, రాహులమ్మ ,కుమారి, రూప, రేణుకా, విజయ, సెట్ ట్రాక్, బాలు యాదవ్, గణేష్ ముదిరాజ్, బంటి గౌడ్, తదితరులున్నారు.

ప్రాజెక్టుల పేరుతో ఇసుక అక్రమ దందా



- ఒక్కో లారీకి రూ. 40 వేలు
- నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం
- నిఘా లేదు.. నియంత్రణ లేదు
- దాచుకోవడం.. దోచుకోవడమే లక్ష్యం
- పాలకుల పేరుతో పైరవీలు

నవతెలంగాణ-ఉప్పల్

రాష్ట్రంలో ప్రతి పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు నాణ్యమైన ఇసుకను అందించి ఇండ్లు కట్టుకునే విధంగా తెలంగాణ మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆన్‌లైన్‌లో ప్రతి ఒక్కరూ ఇసుకను బుక్ చేసుకునే సదుపాయాన్ని కల్పించారు. ప్రభుత్వం ఆన్‌లైన్ విధానంతో ప్రజలకు తక్కువ ధరలకే ఇసుకను అందించాలనే సంకల్పంతో ముందుకెళ్తోంది. కొంతమంది చోటా, మోటా నాయకులు ప్రభుత్వ సంకల్పాన్ని నీరుగారుస్తున్నారు. కంచె చేను మేసే విధంగా చిన్నస్థాయి నాయకులు, పాలకుల పేరు చెప్పి యథేచ్ఛగా ఇసుకను అక్రమ రవాణా కొనసాగిస్తున్నారు.

ఒక్కో లారీకి రూ. 40 వేలు దండుకుటున్న మధ్య వర్తులు

రాష్ట్రంలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎస్ఎస్ ఎంఎంఎస్ పోర్టల్‌లో మధ్యాహ్నం 12:00 గంటలకు 12 టైర్ల లారీకి 26 మెట్రిక్ టన్నులకు రూ.10700 రూపాయలు, 14 టైర్ల లారీకి 32మెట్రిక్ టన్నులు రూ.13300, 16 టైర్ల లారీకి 35 మెట్రిక్ టన్నుల రూ.14400తో బుక్ చేసుకోవాలి. కానీ ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి ప్రభుత్వ పనులకు ఇసుకను తరలిస్తున్నామని చెప్పి కొంతమంది ఎలాంటి అనుమతి లేకుండా, వే బిల్లు లేకుండా, లారీలలో అధిక లోడ్ తీసుకొని నగరంలోని పలు ఇసుక అడ్డాలలో రూ. 40వేలకుపైగా విక్రయిస్తున్నారు. ముఖ్యంగా నల్గొండ జిల్లాలోని వంగమర్తి క్వారీలో బయట స్టాక్ యార్డులో 2 లక్షల టన్నులకు క్వాంటిటీ నిలువ ఉన్నది. కానీ డీడీలు పెట్టడం లేదు. వంగమర్తి క్వారీ నుండి యాదాద్రి పవర్ ప్లాంట్‌కు మాత్రమే గవర్నమెంట్ వర్క్ అని టీజీఎండీసీ డైలీ డెలివరీ ఇచ్చేవారు. కానీ ఇప్పుడు ఆన్‌లైన్ డీడీ పెట్టనివ్వకుండా, వంగమర్తి క్వారీ నుండి పెద్ద పెద్ద కంపెనీల పేరుతో నగరంలో ఇసుక అక్రమ విక్రయాలు జరుగుతున్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని పలు క్వారీ నుండి ఇదే అక్రమ దందా కొనసాగుతుంది.

జీరో ఇసుక దందాకు నియంత్రణ కరువు

రాష్ట్రంలో జయశంకర్ భూపాలపల్లి, కరీంనగర్, ములుగు భద్రాద్రి కొత్త గూడెం జిల్లా లో ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ ఇసుకను అక్రమంగా తరలిస్తున్నా అధికారులు నిఘా పెట్టడం లేదు. దీంతో అక్రమార్కులకు అడ్డు, అదుపు లేకుండా పోతోంది. ములుగు, భద్రాద్రి జిల్లాలో చెక్ పోస్టులను సైతం వే బిల్ లేకుండా దాటుతున్నారు.

కాంట్రాక్టర్ల అక్రమ వసూళ్లపై చర్యలు ఎక్కడ ?

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పంకేనా, మహాదేవపూర్ 1,పెద్దాముపేట, క్వారీలలో, ములుగు జిల్లాలో కొండాపూర్, ధర్మారం, అంకన్న గూడం, రామచంద్ర పురం భద్రాద్రి జిల్లా పోతిరెడ్డిపల్లి క్వారీలలో లోడింగ్, బకెట్ పేరుతో సుమారుగా రూ.10వేలు వసూల్ చేస్తున్నారు. ఒక్కొక్క లారీకి రూ.10వేల అంటే సుమారుగా ప్రతి క్వారీలో 200లారీలు లోడ్ చేస్తున్నారు. ఈ లెక్కన ఒక్క క్వారీ నుండి రూ.20 లక్షల అక్రమ దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. ప్రభుత్వ ఖజానాకు గండి పడుతున్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న తీరు పలు అనుమానాలకు దారితీస్తోంది.

జీరో ఇసుక అక్రమ రవాణాను అధికారులు అరికట్టాలి



జయశంకర్ భూపాలపల్లి, నల్గొండ, ములుగు, భద్రాద్రి కొత్త గూడెం జిల్లాల నుండి పలు క్వారీల నుండి చెక్ పోస్టులను దాటి ఇసుకను తరలిస్తున్నారు. అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలి.

-రామంతాపూర్ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు, ప్రతాప్ రెడ్డి

లోడింగ్ వసూళ్లపై చర్యలు తీసుకోవాలి



క్వారీలలో అక్రమంగా ఒక్కొక్క లారీ వద్ద లోడింగ్ పేరుతో రూ.5500, బకెట్ రూ.2000, జేసీబీ, కాంట, సీరియల్ పేరుతో రూ.10000 వసూళ్ల చేస్తున్నారు. దీంతో లారీ యజమానికి ఏమీ మిగలడం లేదు. ఫైనాన్స్ కట్టలేక పోతున్నాం. **-లారీ యజమాని రవి**

అక్రమ ఇసుకపై చర్యలు తీసుకుంటాం

ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి పెట్టి, తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రజలకు నాణ్యమైన ఇసుకను సరఫరా చేస్తాం.

-ఎండీ సురేంద్ర మోహన్

ఘనంగా 9వ డిస్ట్రిక్ట్ క్యాబినెట్ 320సీ ఇన్స్టాలేషన్ కార్యక్రమం



నవతెలంగాణ-కాప్రా

9వ డిస్ట్రిక్ క్యాబినెట్ 320సీ 2024-25 ఇన్స్టాలేషన్ కార్యక్రమాన్ని సాకేత్ కాలనీలోని ఓర్ల కన్వెన్షన్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నూతన డిస్ట్రిక్ గవర్నర్‌గా వెన్నెల కృష్ణప్రసాద్ ఎన్నికయ్యారు. తనకు డిస్ట్రిక్ గవర్నర్‌గా అవకాశం లభించడం సంతోషంగా ఉందని తన సతీమణి గీతతో కలిసి సభావేదికపై సంతోషాన్ని వెలిబుచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యతిథులుగా అంతర్జాతీయ డైరక్టర్ ఘట్టమనేని బాబురావు, ఇన్స్టాలేషన్ ఆఫీసర్ రూమల్ల సునీల్ కుమార్, విశిష్ట అతిథులుగా దీపక్ భట్టాచార్జి, ఎస్.నరేందర్ రెడ్డి, హనుమండ్ల రాజిరెడ్డి, హరీష్ రెడ్డి, మల్టీపుల్ 320 గవర్నర్లు, వైస్ గవర్నర్లు, పాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్లు పాల్గొన్నారు. క్యాబినెట్ ఇన్స్టాలేషన్ కార్యక్రమానికి ఫస్ట్ వాయిస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కొమ్మారెడ్డి ఇన్నారెడ్డి, సెకండ్ వాయిస్ డిస్టిక్ గవర్నర్ కళ్లెం కృష్ణారెడ్డి, డిస్ట్రిక్ట్ క్యాబినెట్ సెక్రటరీ గుంటుక శేఖర్ రెడ్డి, క్యాబినెట్ ట్రెజరర్ రామారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రెసిడింగ్ ఆఫీసర్‌గా ఎన్నికైన డిస్ట్రిక్ట్ గవర్నర్ కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ.. తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి సామాజిక సేవలు నిర్వహిస్తూ లైయన్స్ సేవలను రాష్ట్రస్థాయిలో అగ్రభాగాన నిలిపేందుకు కృషి చేస్తానన్నారు. తనకు సామాజిక సేవ ఎంతో ఇష్టమన్నారు. డిస్టిక్ ఇన్స్టాలేషన్ సందర్భంగా 40 అల్మారాలను, 30 కుట్టు మిషన్లను, అంధులకు దారిచూపే చేతి కర్రలను అందజేశారు. ఈ కార్యక్రమంలో 320సీ జిల్లా లయన్ సభ్యులు 1000 మంది పాల్గొన్నారు.

21న భారత్ బంద్‌ను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-ఘట్కేసర్

ఎస్సీ వర్గీకరణ చేసుకునే వెసులుబాటును రాష్ట్రాలకు కల్పిస్తూ ఆగస్టు 1న సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ, కోర్టు నిర్ణయాల్లో రాజకీయ జోక్యంను వ్యతిరేకిస్తూ దళిత సంఘాల పిలుపు మేరకు ఆగస్టు 21న నిర్వహించే భారత్ బంద్‌కు వ్యాపార, వాణిజ్య రంగాలు, విద్యా సంస్థలు, ప్రయివేటు, ఆర్టీసీ యాజమాన్యం సహకరించి విజయవంతం చేయాలని జాతీయ మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్పల నర్సింగ్ రావు పేర్కొన్నారు. సోమవారం ఆయన ఘట్కేసర్ మండల కేంద్రంలో మాట్లాడుతూ.. రాజ్యాంగ సవరణ జరగకుండా వర్గీకరణ ఎలా సాధ్యమని ప్రశ్నించారు. దళితులను రాజ్యాధికారం నుండి దూరం చేసే ఈ కుట్రలను తిప్పికొట్టాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా బంద్‌ను శాంతియుతంగా జరపాలని కోరారు.

పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో జంజీరాల పూజ



నవతెలంగాణ - జవహర్‌నగర్

అంబేద్కర్ నగర్ భక్త మార్కండేయ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో సోమవారం రాఖీ పండగ సందర్భంగా గణపతి పూజా, శివాలయంలో ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. అనంతరం జంజీరాల పౌర్ణమిని పురస్కరించుకొని జంజీరాల పూజ, నూతన జంజీరాల ధారణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ నగర్ భక్త మార్కండేయ పద్మశాలి సంఘం అధ్యక్షుడు మార్గం చంద్రమౌళి, గౌరవ అధ్యక్షులు కటకం శ్రీనివాస్, ఉపాధ్యక్షులు మచ్చ ఏక్ నాథ్, కార్యదర్శి కారంపూడి చంద్రశేఖర్, కార్యవర్గ సభ్యులు గంగాధర్, గాజుల యాదగిరి, సతీష్, నరేష్, కాళిదాస్, రవి, సతీష్ పెంట, దండే లింగం, బాలరాజ్, భాను కుమార్, పద్మశాలి కుల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌లో సత్తా చాటిన గోవింద్ గుప్తా



నవతెలంగాణ-మేడ్చల్

భువనగిరి పట్టణంలో ఎమ్మెస్సార్ గార్డెన్‌లో ఆదివారం నిర్వహించిన జాతీయస్థాయి మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్షిప్ పోటీల్లో మేడ్చల్ పట్టణానికి చెందిన యూనివర్సల్ 369 అకాడమీ విద్యార్థి గోవింద్ గుప్తా ఉత్తమ ప్రతిభ కనబర్చాడు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. 11 ఏండ్ల వయస్సులో కుమ్మితే అండర్ 12ఇయర్స్ విభాగంలో మొదటిసారి గోవింద్ గుప్తా గ్రాండ్ ఛాంపియన్షిప్ సాధించినట్లు తెలిపారు. 12 ఇయర్స్ విభాగంలో ఇప్పటివరకు ఎవరూ గ్రాండ్ ఛాంపియన్షిప్ సాధించలేదన్నారు. మేడ్చల్ పట్టణానికి చెందిన యూనివర్సల్ 369 అకాడమీ స్టూడెంట్ ఛాంపియన్షిప్ సాధించడం గొప్ప విషయమని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అభినందనలు తెలిపారు. ఉత్తమ శిక్షణ ఇచ్చి ఈ స్థాయికి తీసుకొచ్చిన కరాటే మాస్టర్ సాయికుమార్‌ను అభినందించి రూ.2వేలు నగదు అందజేసి గోవింద్ గుప్తాను అభినందించారు.

ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు



రక్షాబంధన్ సందర్భంగా ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డికి నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయి జన్ శేఖర్ సోమవారం రాఖీ కట్టారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సాయి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. **-నవతెలంగాణ-కాప్రా**



రాఖీ పండుగ సందర్భంగా మీర్‌పేట్ హెచ్ బీ కాలనీ డివిజన్ కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్‌కు ఆయన చెల్లెళ్లు ప్రేమలత, జ్యోత్స్న, లత, లావణ్యలు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

-నవతెలంగాణ-కాప్రా



బోడుప్పల్‌లో సోదరుడికి రాఖీ కడుతున్న సోదరి

బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలో సోమవారం రాఖీ పౌర్ణమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. అక్కా చెల్లెళ్లు అన్నదమ్ములకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తమ అనుబంధాలను వ్యక్త పరిచారు. **-నవతెలంగాణ, బోడుప్పల్**



రాఖీ పండగ సందర్భంగా చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవియాదవ్ తమ స్వగృహంలో తన సోదరులకు సోమవారం రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సోదరులను ఆశీర్వదించారు.

-నవతెలంగాణ-కాప్రా

అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీ : కుండ భానుచందర్





నవతెలంగాణ-మేడ్చల్

అన్నాచెల్లెళ్ల అనుబంధానికి రాఖీ ప్రతీకని గుండ్లపోచంపల్లి మున్సిపల్ యువనాయకుడు కుండ భానుచందర్ అన్నారు. సోమవారం ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి రాఖీ వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఆడబిడ్డ ఎక్కడ ఉన్నా రాఖీ పండగకు తమ పుట్టింటికి వచ్చి అన్నదమ్ములకు రాఖీలు కట్టి మీకు మేము అండగా ఎప్పుడూ ఉంటామని ధైర్యాన్ని ఇస్తారని తెలిపారు. ఆడపడుచులందరూ అత్తగారి ఇంటి నుండి పుట్టినిల్లు చేరడంతో వారి ఇంట్లో సంతోషాలతో కళకల్లాడుతుందని పేర్కొన్నారు.

అక్క చెల్లెళ్లు రాఖీలు కడితే వారికి చీరలు, కానుకలు, డబ్బులు ఇచ్చి వారి కాళ్లకు నమస్కరించి ఆశీర్వాదం తీసుకుంటారని చెప్పారు.



రాఖీ పౌర్ణమి ఉత్సవాలను వెల్దండ మండల పరిధిలోని కొట్ర గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హరీష్‌కు తమ సోదరీలు సరిత, మమతలు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

-నవతెలంగాణ, హైదరాబాద్ సిటీ డెస్క్



రాఖీ పండగ సందర్భంగా చారకొండ మాజీ సర్పంచ్ రాంకొండకు, ఆయన సోదరుడు అజయ్ కుమార్‌కు వారి సోదరి రాణి సోమవారం రాఖీ కట్టారు. ఈ సందర్భంగా పండగ శుభాకాంక్షలు తెలిపారు.

-నవతెలంగాణ, హైదరాబాద్ సిటీ డెస్క్



రాఖీ పండగ వేడుకలను మాడ్గుల మండల కేంద్రంలోని అన్నెపాక శ్రీను నివాసంలో వారి కుటుంబ సభ్యులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిన్న కుమార్తె వెన్నెల తన సోదరులు గట్టు మల్లు, వినోద్ కుమార్‌లకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. స్వీట్ తినిపించి తన తమ్ముళ్లను ఆశీర్వదించారు. **-నవతెలంగాణ, హైదరాబాద్ సిటీ డెస్క్**



రక్షాబంధన్ సందర్భంగా తన సోదరుడికి రాఖీ కడుతున్న మాజీ కార్పొరేటర్ పావని మణిపాల్ రెడ్డి

-నవతెలంగాణ-కాప్రా



రాఖీ పండగ వేడుకలను ఐతపాక యాదయ్య నివాసంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు సోదరీమణులు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

-నవతెలంగాణ,హైదరాబాద్ సిటీ డెస్క్



తన సోదరుడికి రాఖీ కడుతున్న సోదరి

ప్రజావాణికి 29 ఫిర్యాదులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 29 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి జె.ఎల్.బి హరిప్రియకి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ వాటిని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

వినతుల పై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలనీ, అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్
మంగళవారం | ఆగస్టు 20, 2024 | www.navatelangana.com

అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ టి.రఘునాథస్వామి



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఎన్నాళ్ళయినా, ఎన్నేండ్లయినా చెరిగిపోని బంధం అన్నా చెల్లెళ్ళ అనుబంధం అనీ, అంతటి గొప్ప అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ అని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ టి.రఘునాథస్వామి అన్నారు. కలెక్టరేట్‌లోని డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయంలో డీఎంఅండ్‌హెచ్‌ఓకు కార్యాలయ మహిళా అధికారులు, ఉద్యోగులు రాఖీ కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డీఎంఅండ్‌హెచ్‌ఓ మాట్లాడుతూ తనపై అభిమానంతో రాఖీలు కట్టిన సోదరీమణులకు ధన్యవాదాలు తెలిపారు. రాఖీ పండుగ అన్నాచెల్లెళ్ల బంధానికి ప్రతీక అనీ, ఇలాంటి పండుగను అంద రూ ప్రేమ, అభిమానాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. జిల్లాలోని ఉద్యోగులు, ప్రజలందరికీ రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ మహిళల ఆరోగ్యం, భద్రతకు కృషి చేస్తానన్నారు.

ఘనంగా కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ జన్మదిన వేడుకలు

- శుభాకాంక్షలు తెలిపిన నాయకులు



నవతెలంగాణ-దుండిగల్

తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు, చేవెళ్ల పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ పుట్టినరోజు సందర్భంగా సోమవారం వారిని నిజాంపేట్ గ్రామ పెద్దలు లీడర్ నర్సింహా రెడ్డి, డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, కార్పొరేటర్లు మేకల వెంకటేష్,చిట్ల దివాకర్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బొర్రా చందు ముదిరాజ్, చంద్రగిరి సతీష్, నాయకులు, అభిమానులు, తదితరులు శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా ఫతేనగర్ అమ్మ వారి ఆలయ 28వ వార్షికోత్సవ వేడుకలు



నవ తెలంగాణ - బాలానగర్

కూకట్ పల్లి నియోజకవర్గం మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ లోని జవహర్ లాల్ కాలనీలో వెలిసిన శ్రీ కనక దుర్గాదేవి, శీతల దేవి, కాళికాదేవి ఆలయంలో సోమవారం రాఖీ పౌర్ణమి శుభ సందర్భంగా శ్రావణమాసం శుభ సందర్భంగా అమ్మవారి 28వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అన్న ప్రసాదం వితరణ గావించి భక్తులు వేల సంఖ్యలో అమ్మ దివ్య శుభాశీస్సులు పొందినారు. సాయంత్రం అమ్మవారిని ఫతేనగర్ పూరవీధుల నుండి ఊరేగింపు జరిపారు. రాత్రి మహిళా భక్తులందరికి పసుపు బొట్టు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ఆలయ కమిటీ మరియు దేవస్థానం ధర్మకర్తల మండలి వారి ఆధ్వర్యంలో ఆలయ పూజారి దోర్భల కాశీనాథ శర్మ పర్యవేక్షణలో జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సహకరించి విజయవంతం చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు

మల్లారెడ్డికి రాఖీ కట్టిన మాజీ కోఆప్షన్ సభ్యురాలు షేక్ రుక్సానా యూనీస్ పాషా





నవతెలంగాణ- మేడ్చల్

రాఖీ పండుగ సందర్భంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి, మల్కాజ్ గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిలను మేడ్చల్ మండల మాజీ కో ఆప్షన్ సభ్యురాలు షేక్ రుక్సానా యూనిస్ పాషా, బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు సద్ది రమాదేవిలు సోమవారం వేర్వేరుగా వారి నివాసంలో కలిసి రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మెన్ సద్ది సురేష్ కుమార్ రెడ్డి,మాజీ వార్డు సభ్యులు షేక్ యూనిస్ పాషా పాల్గొన్నారు.

'ఎల్ఆర్ఎస్'లో కదలిక

- అనధికార లే అవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు కార్యాచరణ
- మూడున్నరేండ్ల పెండింగ్‌కు మోక్షం
- అక్టోబర్ 31 నాటికి ప్రక్రియ పూర్తి
- అధికార యంత్రాంగం కసరత్తు ప్రారంభం



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల్లో మళ్లీ కదలిక వచ్చింది. అక్టోబర్ చివరి నాటికి ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో అధికార యంత్రాంగం ఆ వైపుగా కసరత్తు ప్రారంభించింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని 4 కార్పొరేషన్లు, 9 మున్సిపాల్టీలు, 61 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. కార్పొరేషన్లు, మున్సిపాల్టీల నుంచి 1,39, 030 దరఖాస్తులు రాగా, గ్రామ పంచాయతీల నుంచి 4, 897 దరఖాస్తులు వచ్చాయి. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిశీలించాలని ఆదేశాలు జారీ చేయడంతో అధికారులు కార్యాచరణ ప్రారంభించారు.

మూడున్నరేండ్లుగా పెండింగ్..

2020 ఆగస్టు 31 నుంచి అక్టోబర్ 31వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించారు. 2020 ఆగస్టు 26 కంటే ముందుగా కొనుగోలు చేసిన ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవడానికి ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. కాగా అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన లే అవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణను వ్యతిరేకిస్తూ అప్పట్లో కొందరు హైకోర్టును ఆశ్రయించడంతో ఎల్ఆర్ఎస్ ప్రక్రియ పెండింగ్‌లో పడింది. అయితే అప్పటికే కొందరు నిర్మాణాలు చేపట్టడంతో వారు సమర్పించిన అఫిడవిట్‌ల ఆధారంగా కొన్ని ప్లాట్లను క్రమబద్ధీకరించారు. మిగతావి మూడున్నరేండ్లుగా పెండింగ్‌లో ఉన్నాయి. క్రమబద్ధీకరణకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో దరఖాస్తుదారుల నిరీక్షణ ఫలించింది. ఇదిలా ఉండగా ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకోని వారు వేల సంఖ్యలో ఉన్నట్టు సమాచారం.

నాలుగు దశల్లో పరిశీలన

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను వివిధ నిబంధనల ప్రకారం సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ ద్వారా ఆన్‌లైన్‌లో వడపోస్తారు. ఆయా ఆస్తులు నిషేధిత జాబితాలో ఉంటే దరఖాస్తుదారులకు సమాచారం అందుతుంది. పూర్తి స్థాయిలో పత్రాలు సమర్పించకపోయినా సమాచారం అందుతుంది. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను రెవెన్యూ, ఇరిగేషన్, పట్టణ ప్రణాళిక, పంచాయతీ శాఖల అధికారుల బృందం పరిశీలిస్తుంది. ఈ బృందాలు క్షేత్ర స్థాయికి వెళ్లి మొబైల్ యాప్ జీపీఎస్ ద్వారా పరిశీలిస్తాయి. నాలాలు, చెరువులు, కుంటలు, వారసత్వ సంపద, శిఖం, దేవాదయ, ఇనాం భూములు ఉంటే పరిశీలించి అభ్యంతరాలు ఉంటే నమోదు చేసుకుంటారు. అనంతరం తహశీల్దార్లు కూడా వాటిని పరిశీలిస్తారు. అర్హత ఉన్న వాటిని వెంటనే పరిశీలించి కావాల్సిన పత్రాలతో పాటు ఫీజు చెల్లించేలా సంబంధిత దరఖాస్తుదారుడికి నోటీసు జారీ చేస్తారు. దరఖాస్తుదారుడి అన్ని వివరాలు సక్రమంగా ఉంటే క్రమబద్ధీకరించి ఉత్వర్వులు జారీ చేస్తారు. మాస్టర్ ప్లాన్, రోడ్ల విస్తరణ, జోనల్ నిబంధనలు ఇలా.. అన్నీ సవ్యంగా ఉంటేనే అధికారులు ఫీజు నిర్ణయిస్తారు. దరఖాస్తుదారులు నిర్ణీత ఫీజు చెల్లించిన తర్వాత స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ల స్థాయిలో, అంతిమంగా కలెక్టర్ దరఖాస్తులను పరిశీలించి ఆమోదిస్తారు. లోపాలుంటే తిరస్కరిస్తారు.

నిధులు సమకూరే అవకాశం

నిధుల్లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న మున్సిపాల్టీలు, గ్రామ పంచాయతీలకు ఎల్ఆర్ఎస్ రూపంలో పెద్ద మొత్తంలో నిధులు సమకూరే అవకాశం ఉంది. ప్లాటు మార్కెట్ విలువలో 14శాతం ఫీజు వసూలు చేయనున్నారు. చాలా పట్టణాలు, విలువైన ప్రాంతాల్లోనే అనధికారిక ప్లాట్లు ఉండటంతో 13 మున్సిపాల్టీలతోపాటు 61 గ్రామ పంచాయతీలకు రూ.కోట్లలో ఆదాయం సమకూరుతుందని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి. దీంతో మున్సిపాల్టీలు, గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగవంతం చేసేందుకు అవకాశం ఉంటుంది.

వినాయక మండపానికి భూమి పూజ



పాల్గొన్న డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్

నవతెలంగాణ-దుండిగల్

నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, సీనియర్ నాయకులు బొర్రా చందు ముదిరాజ్‌తో కలిసి నిజాంపేట్ అంగన్వాడీ పక్కన నూతనంగా నిర్మిస్తున్న వినాయక మండపం భూమి పూజలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక యువకులు ప్రవీణ్, సంజీవ్,శ్రీను, చంద్రప్రకాష్, రాజు, సిద్దు, సాయి రామ్, శ్రవణ్ పాల్గొన్నారు.

బోరబండ ఎస్సై జమీల్ తీరుపై నిరసన



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

బోరబండ ఎస్సై జమీల్ తీరును నిరసిస్తూ కోర్టు వద్ద ధర్నా చేశారు. వివరాల్లోకి వెళ్తే..సంతోష్ అనే న్యాయవాది బోరబండలో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. ఆ ఇంట్లో మద్యం అమ్ముతున్నారని సమాచారం తెలుసుకున్న పోలీసులు ఉదయం 6:30 మెరుపు దాడి చేశారు. ఇంటి ఓనరు ఫస్ట్ ఫ్లోర్‌లో ఉండగా సంతోష్ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉంటున్నారు. తాళం నా దగ్గర లేదని, ఓనర్ మొదటి ఫ్లోర్‌లో ఉన్నారని పోలీసులకు చెప్పినా వినకుండా న్యాయవాది సంతోష్‌ను పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లారు. తాను అడ్వకేట్‌నని చెప్పినా వినకుండా థర్డ్ డిగ్రీ ఉపయోగించారు. సీనియర్ అడ్వకేట్ సైదులుతో మాట్లాడించినా పోలీసులు మర్యాద లేకుండా ప్రవర్తించారు. కూకట్‌పల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి లెటర్ ప్యాడ్ పూచితో సంతోష్‌ను పోలీస్ స్టేషన్ నుండి వదిలారు. ఓ లాయర్ పై చేయి చేసుకున్న ఎస్సైని సస్పెన్షన్ చేయాలని న్యాయవాదుల డిమాండ్ చేశారు. ఎస్సై జమీల్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

అనుబంధానికి ప్రతీక రాఖీ



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద సోమవారం నియోజకవర్గానికి చెందిన మహిళా సోదరీమణులు, నాయకురాళ్లు ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్‌ను కలిసి "రాఖీలను" కడుతూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సదర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భారతదేశ సంస్కృతి, సాంప్రదాయాలలో ప్రతీ పండుగలలో ఒక పరమార్థం దాగివుందని, సోదరభావాన్ని పెంచే ఈ రాఖీ పర్వదిన వేళ మహిళా సోదరులందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తున్నానన్నారు.

కూనం శ్రీశైలం గౌడ్‌కు రాఖీ కట్టిన విద్యార్థులు



కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో రాఖీ పౌర్ణమి సందర్భంగా సోమవారం గాజులరామారం, పీపీ నగర్ లోని ఏ.ఎం.ఎస్ పాఠశాల విద్యార్థులు మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలం గౌడ్‌ను షాపూర్ నగర్‌లోని తన నివాసం వద్ద కలిసి రాఖీ కట్టి రక్షా బంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రషీద్, స్కూల్ ప్రిన్సిపాల్ సయ్యద్ ఇమ్రాన్, విద్యార్థులు పాల్గొన్నారు.

కూనం శ్రీశైలం గౌడ్‌కు రాఖీ కట్టిన మహిళలు



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, రాఖీ పౌర్ణమి సందర్భంగా పలువురు మహిళలు మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలం గౌడ్‌ను షాపూర్ నగర్‌లోని తన నివాసం వద్ద కలిసి, రాఖీ కట్టి రక్షా బంధన్ శుభాకాంక్షలు తెలిపారు. అనుబంధాల వేడుకను ఆనందోత్సాహలతో జరుపుకోవాలని మాజీ ఎమ్మెల్యే ఆకాంక్షిస్తూ మహిళలందరికీ రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అక్కా చెల్లెళ్లందరికీ ప్రజా ప్రభుత్వం ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని, మహిళల రక్షణ, సంక్షేమం, సాధికారత విషయాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజీపడరని మాజీ ఎమ్మెల్యే శ్రీశైలం గౌడ్ పేర్కొన్నారు.

ఆత్మీయ అనుబంధాల వేడుక రక్షాబంధన్

- కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ



ఆత్మీయ అనుబంధాల వేడుక రక్షాబంధన్ అని సూరారం 129 డివిజన్ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ అన్నారు. సోమవారం రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకొని సూరారం డివిజన్ కార్పొరేటర్ కార్యాలయంలో డివిజన్ మహిళా అధ్యక్షురాలు హేమలత రెడ్డి ఆధ్వర్యంలో మహిళలతో కలిసి కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణను కలిసి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ డివిజన్ ప్రజలందరికీ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో డివిజన్ మహిళ అధ్యక్షురాలు హేమలత రెడ్డి విజయ సుభద్ర తేజశ్రీ లావణ్య ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మాజీ కార్పొరేటర్ గౌరీష్‌కు రాఖీ కట్టిన ముస్లిం మహిళలు



కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం వెంకటేశ్వర నగర్‌లోని ముస్లిం సోదరీమణులు మాజీ కార్పొరేటర్ గౌరీష్‌ను చింతల్‌లోని ఆయన కార్పొరేట్ కార్యాలయంలోలో కలిసి రాఖీ కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. అన్నా చెల్లెల అనుబంధాల వేడుకను ఆనందోత్సహలతో జరుపుకోవాలని మాజీ కార్పొరేటర్ కె.యం.గౌరీష్, కార్పొరేటర్ పారిజాతం ఆకాంక్షిస్తూ డివిజన్ మహిళలందరికీ రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భగవాన్ రెడ్డి, సయేదా , అజ్జు, సనా మహిళా సోదరీమణులు పాల్గొన్నారు.

అనుబంధానికి ప్రతీక రాఖీ : తూము శ్రావణ్ కుమార్



నవతెలంగాణ - కూకట్‌పల్లి

రక్షాబంధన్ సందర్భంగా మూసాపేట్ మాజీ కార్పోరేటర్ తూము శ్రావణ్ కుమార్‌కు ఆయన అక్కా చెల్లెళ్లతో పాటు డివిజన్‌లోని మహిళా సోదరీమణులు రాఖీ కట్టి, రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. రాఖీ కట్టిన ఆడపడుచులకు శ్రావణ్ కుమార్ సతీమణి కానుకలను అందజేశారు. ఈ సందర్భంగా తూము శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ..సోదర సోదరీమణుల అనుబంధానికి ప్రతీక రాఖీ పౌర్ణమి వేడుకని,తన మీద ప్రేమాభిమానాలతో రాఖీ కట్టడానికి వచ్చిన వారందరికీ ధన్యవాదములు తెలిపారు.

కేటీఆర్‌కు రాఖీ కట్టిన కార్పొరేటర్ రోజాదేవి



శేర్లింగంపల్లి నియోజకవర్గం వివేకానంద నగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు రాఖీ పౌర్ణమి పండగ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావును కలిసి రాఖీ కట్టారు.

ఆడపడుచులందరు సుఖ సంతోషాలతో జీవించాలి: ఎమ్మెల్యే





రాఖీ పౌర్ణమి సందర్భంగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు క్యాంపు కార్యాలయంలో, నియోజకవర్గానికి సంబంధించిన మహిళలు, పెద్ద ఎత్తున పాల్గొని ఎమ్మెల్యే కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్ రావు కు రాఖీ కట్టారు. ముందుగా మాధవరం కృష్ణారావు సోదరిమణి రమాదేవి రాఖీ కట్టి సోదరుడిని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వచ్చిన సోదరీమణులకు ఎమ్మెల్యే మాధవరం చీరలు కానుక అందించారు. సోదర సోదరీమణుల ఆప్యాయతను తెలిపే పండుగ అని అన్నారు.

ప్రతి ఆడబిడ్డను గౌరవిద్దాం : టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం



నవతెలంగాణ - బాలానగర్

కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలో రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని కాంగ్రెస్ మహిళా సోదరీమణులందరు టీపీసీసీ అధికార ప్రతినిధి, పీసీసీ సభ్యులు డా. సత్యం శ్రీరంగం నివాసంలో కలిసి రాఖీలు కట్టి, స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ కుల, మతాలంటూ ఎలాంటి తారతమ్యం లేకుండా అన్నా చెల్లెళ్లకు ప్రతీకగా రాఖీ పండుగ నిలుస్తుందని, రక్త సంబంధం ఉన్నా లేకున్నా అన్నా చెల్లెళ్లు, అక్క తమ్ముళ్ల మధ్య అనుబంధాన్ని, అనురాగాన్ని పంచే పండుగ రక్షా బంధన్ అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి పుష్ప రెడ్డి, ఉపాధ్యక్షురాలు దుర్గారాణి, మేడ్చెల్ మల్కాజ్‌గిరి జిల్లా మహిళా అధ్యక్షురాలు రాజనోల లక్ష్మీ, మేడ్చెల్ జిల్లా మహిళా వైస్ ప్రెసిడెంట్ జ్యోతి, మేడ్చల్ జిల్లా మహిళా జనరల్ సెక్రటరీ రఫియా బేగం, కాంగ్రెస్ పార్టీ సీనియర్ మహిళా నాయకురాలు స్వరూప గౌడ్, ఏ బ్లాక్ మహిళా అధ్యక్షురాలు రమాదేవి, బి బ్లాక్ మహిళా అధ్యక్షురాలు సంధ్య, డివిజన్ మహిళా అధ్యక్షురాలు మారుతీ, రేణుక, జోజోమ్మ, భారతమ్మ, రాధా, విజయ లక్ష్మి, క్రిష్ణ వేణి, జ్యోతి, పొన్నం రజిత, ఎం. వరలక్ష్మి, జ్యోతి, సంధ్య, అరుణ, లక్ష్మి అరవింద, జయమ్మ, సుందరి, స్వప్న సుకన్య, పుష్పలత, విక్టోరియా పెద్ద ఎత్తున మహిళా సోదరీమణులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ పండల సతీష్ గౌడ్‌కు రాఖీలు కట్టిన బ్రహ్మకుమారీలు



కూకట్‌పల్లి నియోజకవర్గం మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలోని బీఆర్ఎస్ కార్యాలయంలో సోమవారం ఓం బ్రహ్మకుమారి ఈశ్వరి విశ్వవిద్యాలయం నుండి రక్షాబంధన్ సందర్భంగా బ్రహ్మకుమారీలు కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ కు రాఖీలు కట్ట సోదర ఆత్మీయతను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో మాధవో, పూర్ణ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మహిళలకు రక్షణ : ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గూడ ఐలయ్య గౌడ్



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

మహిళలకు కాంగ్రెస్ పార్టీతోనే రక్షణ సాధ్యమని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గూడ ఐలయ్య గౌడ్ అన్నారు. సోమవారం రాఖీ పండగ పురస్కరించుకొని జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి మగ్దూంనగర్‌లోని పార్టీ కార్యాలయంలో మాజీ కౌన్సిలర్ గూడ వరమ్మ ఆధ్వర్యంలో రాఖీ వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో రక్షాబంధన్‌కు ఒక చరిత్ర ఉందని, ప్రతి మహిళ ఎంతో గొప్పగా జరుపుకునే పండగ అన్నారు. మహిళల సంక్షేమం కోసం మహిళాజ్యోతి, గృహ జ్యోతి (కరెంటు) ఉచిత ఆర్టీసీ బస్సు, డ్వాక్రా సంఘాల వారికి వడ్డీ లేనిరుణాలు, సబ్సిడీ గ్యాస్ సిలిండర్ వంటి పథకాలను సీఎం రేవంత్ రెడ్డి అమలు చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో మహిళా నాయకురాళ్ళు సత్యలక్ష్మి,లక్ష్మిబాసుపల్లి అచ్యుత,తదితరులు పాల్గొన్నారు. అనంతరం రాఖీలు కట్టి స్వీట్లు పంచుకొని శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

శంభీపూర్ కృష్ణకు రాఖీ కట్టిన మహిళామణులు



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం శంభీపూర్‌లోని కార్యాలయం లో సోమవారం రాఖీ పండగ సందర్భ ంగా నియోజకవర్గ పరిధిలోని మహిళలు బీఆర్ఎస్ నేత శంభీపూర్ కృష్ణకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హైదరాబాద్
10
మంగళవారం | ఆగష్టు 20, 2024 | www.navatelangana.com

జూనియర్ వైద్యుల వినూత్న నిరసన..





నవతెలంగాణ-సుల్తాన్ బజార్
టీ జూడా ఇచ్చిన పిలుపుతో ఉస్మానియా మెడికల్ కాలేజీలో వివిధ రకాల హస్త ముద్రలతో, కాగితపు స్లిపులతో, వీ వాంట్ జస్టిస్ అనే పేరుతో జూడాలు నిలబడి నిరసన వ్యక్తం చేసిన జూడాలు..

దోమల నియంత్రణకు కృషి

- సీనియర్ ఎంటమాలజిస్ట్ రజిని

నవతెలంగాణ-సుల్తాన్ బజార్
మూసీ పరివాహక ప్రాంతాల్లో దోమల నియంత్రణకు కృషి చేస్తున్నామని జీహెచ్ఎంసీ సీనియర్ఎంటమాలజిస్ట్ రజిని అన్నారు. అబిడ్స్ లోని కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ ఆదేశాలమేరకు గోషామహల్, కార్వాన్ తదితర ప్రాంతాల్లోని మూసీలో దోమల బెడద లేకుండా చేసేందుకు గుర్రపు డెక్కను ఎంటమాలజీ సిబ్బందితో తొలగిస్తున్నామన్నారు. దోమలు వృద్ధి చెందకుండా స్ప్రే చేస్తున్నామన్నారు. డెంగ్యూ కేసులు గతం కంటే తక్కువగానే ఉన్నాయని తెలిపారు. దోమల నియంత్రణ పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలతో దోమలు ఉత్పత్తి జరుగుతుందని, వారానికోసారి ఇంట్లో డ్రమ్స్, బిందెలు, బకెట్లు తదితరాలలో నీటిని మార్చాలని సూచించారు. ప్రజలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

'వార్త చిత్రాలకు బలమైన భావోద్వేగాలను రేకెత్తించే శక్తి ఉంటుంది'

- రాష్ట్ర రెవిన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి



నవతెలంగాణ-హిమాయత్ నగర్
వార్త చిత్రాలకు బలమైన భావోద్వేగాలను రేకెత్తించే శక్తి ఉంటుందని, అవి పదాల కంటే వేగంగా ప్రజలను ప్రభావితం చేస్తాయని తెలంగాణ రాష్ట్ర రెవిన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.నేటి వార్తల చక్రంలో ఫోటో జర్నలిజం ఒక ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని, వార్తా పత్రికల పేజీలలో ఫోటోలు లేకపోవటం వల్ల ప్రచురణ నిస్తేజంగా, ఆకర్షణీయంగా ఉండదన్నారు. 185 ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా సోమవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ రాష్ట్ర ఫోటో జర్నలిస్టుల సంఘం రాష్ట్ర స్థాయి వార్త ఛాయా చిత్రాల ప్రదర్శనను నిర్వహించింది.ఈ ప్రదర్శనను మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించి, తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మెన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం అధ్యక్షులు కె.విరహత్ అలీ, ప్రధాన కార్యదర్శి కె.రామనారాయణ, ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ జాతీయ కార్యదర్శి వై.నరేందర్ రెడ్డిలతో కలిసి ఛాయా చిత్రాలను వీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పత్రికల్లో వార్తా కథనాలు మరచిపోయిన చాలా కాలం తర్వాత, గత సంఘటనల గురించి భవిష్యత్తు తరాలకు అవగాహన కల్పించే సామర్థ్యాన్ని చిత్రాలు కలిగి ఉంటాయని తెలిపారు. వార్తలను, సమాచారాన్ని సేకరించడం, విశ్లేషించడం, ప్రజలకు అందించడంలో జర్నలిస్టులు సమాజంలో కీలక పాత్ర పోషిస్తారని పేర్కొన్నారు. అనంతరం కె.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా న్యూస్ ఫోటో కాంటెస్ట్ ఫలితాలను ప్రదర్శిస్తూ, ఎగ్జిబిషన్ గత సంవత్సరంలో అత్యుత్తమ, అత్యంత ముఖ్యమైన ఫోటో జర్నలిజం, డాక్యుమెంటరీ ఫోటోగ్రఫీని ప్రదర్శించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఫోటో జర్నలిస్టుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎన్.హరి, ఉపాధ్యక్షులు పి.రాంమూర్తి, కోశాధికారి కర్ణకోటి అనిల్ కుమార్, కార్యవర్గ సభ్యులు నక్క శ్రీనివాస్, పి.మోహన చారి, ఎంఏ.సర్వర్, నగర గోపాల్, ఛాయా చిత్ర ప్రదర్శన కన్వీనర్ ఎ.మహేష్ కుమార్, సభ్యులు డి.సుమన్ రెడ్డి, ఎస్.శ్రీధర్, హరిప్రేమ్, సంజయ్ చారి తదితరులు పాల్గొన్నారు.

ట్రేడింగ్‌లో లాభాలొస్తాయని సైబర్ నేరస్తుల గాలం

- బ్యాంక్‌లు, స్నేహితుల వద్ద అప్పులు చేసి పెట్టుబడి పెడుతున్న బాధితులు
- ఓ మహిళ నుంచి రూ.8లక్షలకు పైగా దండుకున్న నేరస్తులు
- ట్రై కమిషనరేట్‌లో 50 మందికిపైగా ప్రతి రోజు మోసపోతున్న అమాయకులు



నవతెలంగాణ-సిటీబ్యూరో
సైబర్ నేరస్తులు రెచ్చిపోతున్నారు. అమాయకులను టార్గెట్ చేసుకుని మాయమటలతో అందినకాడికి దండుకుంటున్నారు. ఫేస్‌బుక్, టెలీగ్రామ్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ లాంటి సోషల్‌మీడియాలో ర్యాండమ్‌గా పోస్టులు పెడుతున్నారు. ఆన్‌లైన్ ఫోన్‌నెంబర్లను సేకరించి అమాయకులను టార్గెట్ చేస్తున్నారు. తాము చెప్పిన విధంగా ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెడితే అధిక లాభాలొస్తాయని నమ్మిస్తున్నారు. పెట్టుబడి పెట్టిన వారికి లాభాలు వచ్చినట్టు చూపిస్తున్న నేరస్తులు వాటిని విత్ డ్రా చేసుకోవాలంటే అధిక మొత్తంలో డిపాజిట్ చేస్తే తీసుకోవచ్చని, అప్పటి వరకు సిస్టమ్ ఓకే చేయ్యదని నమ్మిస్తున్నారు. ఆ తర్వాత అందినకాడికి దండుకుని ఫోన్లు స్విచ్ఛాఫ్ చేస్తున్నారు. ఇదే తరహాలో హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ ట్రై పోలీస్ కమిషనరేట్ల పరిధిలో ప్రతి రోజు 50 మందికిపైగా అమాయకులు సైబర్ నేరస్తుల బారినపడి మోసాలకు గురవుతున్నారు.

నకిలీ సభ్యులే లాభాలొచ్చాయని పోస్టులు
సైబర్ నేరస్తులు నకిలీ యాప్‌లను తయారు చేస్తున్నారు. కొన్ని వాట్సాప్ గ్రూప్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ఆ గ్రూప్‌లో 50 నుంచి 100 మంది సభ్యులున్నట్టు క్రియేట్ చేస్తున్నారు. (సైబర్ నేరస్తులు నకిలీ పేర్లతో సభ్యులుగా నమిస్తున్నారు). అమాయకులను టార్గెట్ చేసుకుని వారిని ఆ గ్రూప్‌లో చేర్చుతున్నారు. నకిలీ సభ్యులే తమకు లాభాలొచ్చినట్టు ఆ గ్రూప్‌లో పోస్టులు పెడుతుంటారు. ఈ కంపెనీ షేర్ బాగుందని చర్చిస్తుంటారు. కంపెనీ వారు చెప్పిన విధంగా పెట్టుబడులు పెడితే తనకు లక్షల్లో లాభాలు వచ్చాయని ఆ గ్రూప్‌లో షేర్ చేస్తుంటారు. ఆ పోస్టులకు ఆకర్షితులవుతున్న వారు లక్షల్లో పెట్టుబడులు పెడుతున్నారు. మరికొంత మంది తెలిసిన వారి వద్ద, స్నేహితుల వద్ద లేదా బ్యాంక్‌లో రుణాలు తీసుకుని పెట్టుబడి పెడుతున్నారు. మరికొన్ని సందర్భాలలో సైబర్ నేరస్తులే క్రెడిట్ కార్డులపై రుణాలు ఇప్పించి పెట్టుబడి పెట్టిస్తున్నారు. తీరా మోసపోయిన తర్వాత బాధితులు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. కొద్ది రోజుల క్రితం నగరంలోని ఓ కంపెనీ సీఈఓను కోటికిపైగా పెట్టుబడి పేరుతో దండుకున్నారు.

తెలిసిన వారు, స్నేహితుల వద్ద లోన్ తీసుకుని ట్రేడింగ్
తాజాగా నగరానికి చెందిన ఓ మహిళను సైబర్ నేరస్తులు టార్గెట్ చేశారు. టెలీగ్రామ్ ద్వారా ఫోన్‌చేసి తాము ట్రేడింగ్ కంపెనీ నుంచి మట్లాడుతున్నామని చెప్పారు. తాము చెప్పిన విధంగా ట్రేడింగ్ చేస్తే సులువుగా లాభాలు పొందవచ్చని నమ్మించారు. వెంటనే కొన్ని వాట్సాప్ గ్రూప్‌లల్లో ఆ మహిళను యాడ్ చేశారు. ఆ గ్రూప్‌లల్లో సభ్యులు పెట్టిన పోస్టులను చూసిన ఆ మహిళ ఆకర్షితురాలైంది. ఆవె కూడా ట్రేడింగ్ చేస్తానని కొంత డబ్బును డిపాజింట్ చేసింది. వాటికి లాభాలు వచ్చినట్టు నిందితులు ఆ గ్రూప్‌లో షేర్ చేయడంతో సదురు మహిళకు మరింత నమ్మకం కుదిరింది. దాంతో తెలిసిన వారి నుంచి, స్నేహితులు, బంధువుల వద్ద అప్పులు తీసుకొచ్చి దాదాపు రూ.8,17,428 వరకు ట్రేడింగ్‌లో పెట్టింది. లక్షల్లో లాభాలు వచ్చినట్టు స్క్రీన్‌పై చూసిన బాధితురాలు వాటిని విత్‌డ్రా చేసుకునే ప్రయత్నం చేసింది. డబ్బులు విత్‌డ్రా కాకపోవడంతో నిందితులను సంప్రదించింది. పెద్దమొత్తంలో డబ్బులు డిపాజిట్ చేస్తేనే కంప్యూటర్ విత్‌డ్రాకు అనుమతిస్తుందని, అప్పుడు లాభాలతోపాటు ఒకేసారీ డబ్బులు తీసుకొవచ్చని నమ్మించారు. వారి మాటలు నమ్మిన బాధితురాలు స్నేహితుల వద్ద, తెలిసిన వారి వద్ద తిరిగి అప్పుచేసేందుకు ప్రయత్నించింది. ఈ క్రమంలో విషయం తెలుసుకున్న ఆమె స్నేహితులు ఆమె మోసపోయినట్టు అవగాహన కల్పించారు. వెంటనే నిందితులను సంప్రదించేందుకు ప్రయత్నించడంతో వారి ఫోన్లు స్విచ్ఛాఫ్ రావడంతో పాటు యాప్‌లు పనిచేయకపోవడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ఇదే తరహాలో వందలాది మందిని మోసం చేస్తున్న సైబర్ నేరస్తులు కూర్చున్నచోటే లక్షలు సంపాదిస్తున్నారు.

సోషల్‌మీడియాలో మీ వ్యక్తిగత వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దు : సీసీఎస్
తెలియని వారి మాటలను నమ్మొద్దని సైబర్‌క్రైమ్ పోలీసులు తెలిపారు. ప్రకటనలు, పోస్టులను చూసి మోసపోవద్దన్నారు. ముఖ్యంగా సోషల్‌మీడియాలో మీ వ్యక్తిగత వివరాలను ఎవరితోను పంచుకోవద్దని తెలిపారు. సైబర్ నేరస్తుల చేతిలో మోసపోయినట్టు గుర్తిస్తే వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులను సంప్రదించాలని, లేదా 1930 ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు.

న్యాయ వాదులపై దాడి చేసిన పోలీసులను డిస్మిస్ చేయాలి

- సీటీ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్



నవతెలంగాణ-ధూల్‌పేట్
బోరబండ, జనగామ, సిద్ధిపేటలలో న్యాయ వాదులపై దాడి చేసిన పోలీసులను డిస్మిస్ చేయాలని సీటీ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రధాన కార్యదర్శిలు వై శ్రీనివాసచారి, హర్షవర్ధన్‌లు డిమాండ్ చేశారు. సోమవారం సీటీ సివిల్ కోర్టు న్యాయవాదులు విధులను బహిష్కరించారు. అనంతరం బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.. బోర బండ పోలీసులు యువ న్యాయవాదిని ఎలాంటి కారణం లేకుండ పోలీసుస్టేషన్ కు తీసుకోని వెళ్లి కొట్టడంతో గాయాలైయ్యాయన్నారు. న్యాయవాది పై దురుసుగా ప్రవర్తించిన ఎస్ఐ, కానిస్టేబుల్‌లను వెంటనే డిస్మిస్ చేయాలనీ లేనిచో తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన న్యాయవాదులు మరోసారి ఉద్యమం చెపడుతామన్నారు. ఈ నెల 24న సిటి సివిల్ కోర్టు లో న్యాయవాదుల దాడులపై నిరసనగా రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నామని తెలంగాణలోని అన్ని బార్ అసోసియేషన్ ప్రతినిధులు, సీనియర్ న్యాయవాదులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. తెలంగాణలోని బార్ అసోసియేషన్ ప్రతినిధులు, సీనియర్ న్యాయవాదులు పాల్గొని రౌండ్ టేబుల్ సమా వేశాన్ని జయప్రదం చేసి న్యాయవాదులపై దాడులు జరుగకుండా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని పిలుపునిచ్చా రు. ఈ కార్యక్రమంలో సిటి సివిల్ కోర్టు బార్ అసోసి యేషన్ ప్రతినిధులు బి.రాజేష్ కుమార్, అశోక్, బి అజయ్, మాణిక్ ప్రభు, శివ కుమార్ దాస్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రులలో ప్రత్యేక రక్షణ చర్యలు తీసుకోవాలి

- రాష్ట్ర జూడా అధ్యక్షులు డా. రాహుల్
- టీ జూడా ఆధ్వర్యంలో ఆరోగ్య మంత్రికి వినతి..



నవతెలంగాణ-ధూల్‌పేట్
ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది ప్రత్యేక రక్షణ చర్యలు తీసుకోవాలని తెలంగాణ జూనియర్ వైద్యుల అసోసియేషన్ (టీ జూడా) అధ్యక్షులు డాక్టర్ రాహుల్ డిమాండ్ చేశారు. టీ జూడా ఆధ్వర్యంలో ఆరోగ్య మంత్రి దామోదర్ రాజ నర్సింహతో కలిసి సమావేశమై వినతి అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తక్షణమే తెలంగాణ ప్రభుత్వం వైద్యుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. జీఓ ఎమ్మెస్ నంబర్ 103 ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా జీఓను సవరించాలన్నారు. డ్యూటీ రూమ్‌లు, రెస్ట్ రూమ్‌లకు సంబంధించి ప్రాధాన్యతగా తీసుకోవాలన్నారు. సీసీటీవి కెమెరాల జారీని సెక్యూరిటీ కల్పించి సమస్యను ప్రాధాన్యతగా తీసుకోవాలన్నారు. కమిటీలో జూడా సభ్యులను చేర్చాలన్నారు. ఆరోగ్య మంత్రి స్పందిస్తూ అమలు అయ్యేలా చూస్తానని తెలిపారన్నారు. కేంద్ర రక్షణ చట్టంపై తన ప్రాతినిధ్యాన్ని కేంద్ర ప్రభుత్వానికి పంపుతానని చెప్పారన్నారు. సమస్యను ప్రాధాన్యతగా తీసుకుని కమిటీలో జూడా సభ్యులను చేర్చేందుకు అంగీకరించారు. జూడా ప్యానల్ సభ్యులు యూనియన్ మంత్రి బండి సంజయ్ ను కలిసి సమస్యను పరిష్కరించాలని కోరామని తెలిపారు.

కేంద్ర ప్రభుత్వం వైద్యులకు రక్షణ చట్టం తీసుకురావాలి

నవతెలంగాణ -సుల్తాన్ బజార్
కోలకత్తాలో వైద్య విద్యార్థి పై జరిగిన దాడి హత్యపై ఐఎంఏ 24 గంటల బంద్‌ను విజయవంతం చేసినందుకు ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని ఇండియాన్ మెడికల్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ డాక్టర్ పి.ఖాళీ ప్రసాద్ రావు, ప్రధాన కార్యదర్శి జె విజయ్ రావులు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం వైద్యులకు రక్షణగా రక్షణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. అన్ని ఆస్పత్రుల్లో వైద్యులకు భద్రత కల్పించాలని కోరారు. అన్ని ఆస్పత్రుల్లో సీసీ కెమెరాలు, సెక్యూరిటీ, భద్రతపురమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కోల్‌కతా వైద్య విద్యార్థిని డాక్టర్ మౌమిత కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఐఎంఏ ఇచ్చిన బంద్‌కు సహకరించిన రాష్ట్ర కార్యవర్గానికి, రాష్ట్రంలోని అన్ని వైద్య సంఘాల కు, కృతజ్ఞతలు తెలుపుతున్నామని చెప్పారు. రానున్న రోజుల్లో మరింత సహకారం అందించాలని కోరారు.

ఎమ్మెల్సీగా ఎన్నికైన జనాబ్ ఆమిర్ అలిఖాన్‌ను కలిసిన ఆవాజ్ నాయకులు



నవతెలంగాణ-ధూల్ పేట్
ఆవాజ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీగా ఎన్నికైన సియాసత్ న్యూస్ ఎడిటర్ జనాబ్ ఆమిర్ అలి ఖాన్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపిన ఆవాజ్ సిటీ సెక్రటరీ అబ్దుల్ సత్తార్ ఆధ్వర్యంలోని నా యకులు మహబూబ్ అలీ, హఫీజ్ ఆఫ్తె ఖార్, అలీ అస్గర్, గులాం నసీర్, మొహమ్మద్ నసీర్, మ హమ్మద్ అసద్, ఎండి కలీముద్దీన్, తదితరులు

సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు చర్యలు..

- జోనల్ కమిషనర్ వెంకన్న



నవతెలంగాణ-ధూల్‌పేట్
స్థానిక ప్రజా సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ టీ. వెంకన్న అన్నారు. ఆయన పర్యవేక్షణలో చాంద్రాయణగుట్ట సర్కి ఫూల్‌బాగ్‌లోని జోనల్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారానికి సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో సంతోష్ నగర్ సర్కిల్ కి సంబందించిన ఆస్తి పన్ను, డ్రయినేజీ సమస్యలపై ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను పరిశీలించి వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్కడ నిర్లక్ష్యం చేయకుండా సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రతి సోమవారం నిర్వహించే కార్యక్రమంలో బస్తీ, కాలనీ వాసులు స్థానికంగా నెలకొన్న సమస్యలపై ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ (యూబిడి) అమీనా బీ, డిప్యూటీ డైరెక్టర్ (వెటర్నరీ) డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఏ యం సీ రాజారావు, ఎలక్ట్రికల్ ఈ ఈ రామారావు, బిల్ కలెక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరా పార్క్‌లో రాఖీ పౌర్ణమి వేడుకలు

- ఆడవారిని ఆనందంగా జీవించనివ్వండి
- యోగా గురు బి.సరోజని రామారావు, డా.గీత, డా.హిప్నో పద్మా కమలాకర్



నవతెలంగాణ-ముషీరాబాద్
ఆడవారిని ఆనందంగా జీవించేలా చేయడమే రాఖీ ఉద్దేశమని యోగా గురు బి.సరోజని రామారావు, డా.గీత, డా.హిప్నో పద్మా కమలాకర్ అన్నారు. ఇందిరా పార్క్ లో ఘనంగా రాఖీ వేడుకలు నిర్వహించారు. ప్రేమ ఆప్యాయతను కనబరచడానికి నీకు ఏ కష్టమొచ్చినా నేనున్నాను అని మగవారి నుండి అభయం తీసుకుంటుందన్నారు. చెప్పాలంటే ఇది మనుషుల మధ్య జరిగే ఆత్మీయ సంఘటన అని తెలిపారు. ఆడవారు ఆనందంగా ఉంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందని చెప్పారు. మనం భూమి మీద నుండి ఏమి తీసుకువెళ్ళలేము కేవలం ప్రేమను ఇవ్వడం తప్ప అని యోగా గురు బి రామారావు మహిళలకు చీరలు ఇవ్వడం జరిగింది. ఆయన మాట్లాడుతూ అందరికీ సంతోషాన్నిపంచితే మనం సంతోషంగా ఉంటామన్నారు. శ్రీలతా రాజేంద్ర మహిళలకు పర్సులు అందజేసారు.డా.హిప్నో పద్మా కమలాకర్ మాట్లాడుతూ గాంధీ ఆడవారికి అర్ధరాత్రి స్వతంత్రం కావాలన్నారు. కానీ నేటి సమాజంలో పగలు కూడా తిరగలేని దుస్థితి ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ రాజేంద్ర కుమార్, పవన్, వెంకటేష్, రాజా నరసింహ, శేఖర్ రెడ్డి, ప్రహ్లాదుడు,డా.గీత, పూర్ణ కుమారి, వాణిశ్రీ, జ్యోతి రాజా, పి.స్వరూపారాణి, యోగా సాధకులు పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలు



నవతెలంగాణ-అంబర్‌పేట:
గోల్నాక వీరన్నగుట్ట మహాశివాలయం వద్ద అంబర్‌పేట నియోజకవర్గం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో జంధ్యాల పౌర్ణమిని నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కండేయ పూజను జరిపి అందరు జంధ్యాలను మార్చుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు ఎనుగంటి నరేందర్, అధ్యక్షుడు వర్కాల కృష్ణ, సంఘం ప్రధాన కార్యదర్శి చిలక శివకుమార్, కోశాధికారి భీమనపల్లి అశోక్, ఉపాధ్యక్షులు కుందెన సత్యనారాయణ, గంగిశెట్టి సత్తయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ తీగల నరేందర్, ప్రతినిధులు పి. మధుసూధన్, గంగిశెట్టి మల్లేష్, డివిజన్ అధ్యక్షులు పి.దామోదర్, కడిగె శ్రీనివాస్, నక్క రమేష్, ఇడెం యాదగిరి, కమ్రలాజు, బింగి మల్లేశం, కోట వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

బహుజన నాయకుడు సర్దార్ సర్వాయి పాపన్న



నవతెలంగాణ-ధూల్‌పేట్
బహుజన నాయకుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సేవలు చిరస్మరణీయమని గౌండ్ల మఠం సూరబందేశ్వరా దేవాలయ ధర్మకర్తల పాలక మండలి అధ్యక్షులు గోడిశాల నరేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి కొత్త నవీన్ కుమార్ గౌడ్, ముఖ్య సలహాదారులు నిర్మల నీలకంఠం గౌడ్, బుర్ర భాస్కర్ గౌడ్, గోదా వెంకటేష్ గౌడ్ లు అన్నారు. ఈ మేరకు సోమవారం కౌండిన్య హాల్ లో సర్దార్ జయంతి ని పురస్కరించుకొని ఆయనకు ఘనంగా నివాలు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధక్షలు గడ్డమీది యాగ్నేశ్వర్ గౌడ్, కోశాధికారి నిర్మల మనుజేందర్ గౌడ్, కార్య నిర్వాహక కార్యదర్శి పంజలా అశోక్ కుమార్ గౌడ్, ధర్మ కర్తలు దేశం శంకర హరి ప్రసాద్ గౌడ్, సాయినాథ్ గౌడ్, కొత్త ప్రవీణ్ కుమార్ గౌడ్, మల్లం శివ కుమార్ గౌడ్, గడ్డమీది నాగేందర్ గౌడ్, సురబందేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ నేతలు ప్రజా సమస్యలపై పోరాడాలి'

- సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోద్రమోని పురుషోత్తం



నవతెలంగాణ-హిమాయత్‌నగర్
ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నాయకులు ప్రజా సమస్యలపై పోరాడాలని, కానీ కాంగ్రెస్ నేతలతో ఒకరినొకరు విమర్శించుకోవడం తగదని సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోద్రమోని పురుషోత్తం సూచించారు. సోమవారం నారాయణగూడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పురుషోత్తం మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం పేద ప్రజల ఓట్లతో గెలిచి పదేండ్లు అధికారంలో ఉండి నిరుపేదలు, రైతులకు చేసింది ఏమీ లేదని విమర్శించారు. పేదల భూములను హెచ్ఎండీఏ పేరుతో బలవంతంగా లాక్కొని వారిని రోడ్డుపై గాలికి వదిలేశారని ఆరోపించారు.ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామన్న గత బీఆర్ఎస్ ప్రభుత్వం కనీసం పదేండ్లలో లక్ష ఉద్యోగాలు భర్తీ చేయలేకపోయిందని విమర్శించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ నేతలకు బుద్ధి రావడం లేదని విమర్శించారు.ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గడచిన పది నెలల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీ హామీలను ఒకటొకటిగా నెరవేరుస్తుందని, అలాంటప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ నేతలు విమర్శించడం సరికాదన్నారు. అక్టోబర్ 17న సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర ప్రథమ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ వేడుకలను పురస్కరించుకుని దాదాపు వందలాది మందితో ప్రజా సమస్యలపై భారీ ర్యాలీగా పార్టీ రాష్ట్ర కార్యాలయం నుంచి ఆర్టీసీ క్రాస్ రోడ్ బస్ భవన్ మీదుగా ఆర్టీసీ కళ్యాణ మండపం, సుందరయ్య విజ్ఞాన కేంద్రం వరకు ర్యాలీగా వెళ్లి సభను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.ఈ సమావేశంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గంధం లక్ష్మీనారాయణ, మహిళ విభాగం రాష్ట్ర నాయకులు ఆర్.ఝాన్సీ, బి.సుజాత, సంధ్యారాణి, పి.జ్యోతి, నాగేంద్రమ్మ, నాయకులు భాను ప్రసాద్, గోవింద నాయక్, నరేష్, ఆర్.రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ముషీరాబాద్ నియోజకవర్గంలో రాఖీ సంబరాలు ఘనంగా జరిగాయి. పలువురు మహిళ నాయకులు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నగేష్ ముదిరాజుకు రాఖీని కట్టి తనపై ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు. నవతెలంగాణ-ముషీరాబాద్





రాఖీ పౌర్ణమి వేడుకల్లో పాల్గొన్న బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రమేష్ నాయక్, ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పద్మజ, శారద తదితరులు పాల్గొన్నారు.
నవతెలంగాణ-అంబర్‌పేట

రాఖీ పండుగను పురస్కరించుకొని సోమవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, కే.తారక రామరావు, నివాసంకు వెళ్లి శాలువా కప్పి రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపిన చార్మినార్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఇల్యాస్ ఖురేషి.
నవతెలంగాణ-ధూల్‌పేట్





ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ కీ రాఖి కట్టిన బ్రహ్మకుమారిలు సీనియర్ లీడర్ ప్రతిభ
నవతెలంగాణ-అంబర్‌పేట



రాఖి పండుగ వేడుకల్లో పాల్గొన్న గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్ దంపతులు
నవతెలంగాణ-అంబర్‌పేట



బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కేటీఆర్ కి రాఖీ పండుగని పురస్కరించుకొని రాఖీ కట్టిన బాగ్అంబర్‌పేట కార్పొరేటర్ పద్మా వెంకట్ రెడ్డి, సీనియర్ నాయకులు మిరియాల శ్రీనివాస్ తదితరులు
నవతెలంగాణ-అంబర్‌పేట



బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ కు రాఖీ కడుతున్న బీఆర్ఎస్ పార్టీ మహిళా నాయకురాలు శీలం సరస్వతి తదితరులు
నవతెలంగాణ-సుల్తాన్ బజార్

స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాఖీ సంబరాలు

నవతెలంగాణ-ముషీరాబాద్
స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో పండుగలకు నోచుకోకుండా రోడ్ల పక్కన జీవనం సాగిస్తున్న అనాథలు, నిరాశ్రయులకు రాఖీలు కట్టి ఆహారం అందించారు. పండగ సమయంలో కూడా విధులు నిర్వస్తున్న ట్రాఫిక్ పోలీస్ వారికి రాఖీలు కట్టి స్వీట్స్ పంపిణి చేశారు. అనాథలు, నిరాశ్రయులు స్కై ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. విధులు నిర్వహిస్తున్న సమయంలో కూడా రాఖీలు కట్టించుకోవడం చాల గొప్ప అనుభూతిని ఇచ్చిందని పోలీస్ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ డాక్టర్. వై. సంజీవ కుమార్, వైస్ ప్రెసిడెంట్ ఓ.పావని, సేవ సభ్యులు నేహా, శిరీష, రమాదేవి, అఖిల్, తదితరులున్నారు.

ఫొటోగ్రాఫర్ కిశోర్‌బాబుకు సన్మానం



నవతెలంగాణ-సిటీబ్యూరో

సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా సోమవారం బేగంపేట్ లోని గ్రీన్ పార్క్ హెూటల్లో ఉత్తమ ఫోటోగ్రాఫర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఫోటోగ్రాఫర్ కిషోర్ బాబును శాలువా, మెమొంటోతో సమాచారశాఖ కమిషనర్ ఎం. హనుమంతరావు సత్కరించారు.

దుగ్గిరాల సోమేశ్వర రావు నాటక రంగ సేవ సంస్మరణీయం



నవతెలంగాణ-కల్చరల్

నటునిగా దర్శకునిగా నాటక రంగం పై సాధికారత కల దుగ్గిరాల సోమేశ్వర రావు నాటక రంగ సేవ సంస్మరణీయ మని ప్రముఖ నాటక సంస్థ రస రంజని అధ్యక్షుడు డాక్టర్ కె వి రమణ నివాళులు అర్పించారు. రవీంద్ర భారతి లోని సమావేశ మందిరంలో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో రస రంజని నిర్వహణ లో ఇటీవల మృతి చెందిన సోమేస్వర రావు సంస్మరణ సభ నిర్వహించారు. పలువురు కళా కారులు పాల్గొని సోమేశ్వర రావు రస రంజని స్థాపన లో చేసిన కృషి గుర్తు చేసుకున్నారు దుగ్గిరాల శాస్త్రి, మోహన్ సేనాపతి, రామ కోటేశ్వర రావు, నట రాజ్ తదితరులు నివాళులు అర్పించిన వారిలో వున్నారు

నగరంలో భారీ వర్షం





● **రోడ్లు జలమయం**

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ లో సోమవారం భారీ వర్షం కురిసింది. రాఖీ పండుగ కావడంతో చాలా మంది బయటకు రాగా తడిసిముద్దయ్యారు. ట్రాఫిక్ జామ్ ఇరుక్కుని ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షం కురవడంతో పలు ప్రాంతాల్లో రోడ్లు జలమయం అయ్యాయి.మరో మూడు గంటల పాటు నగరంలో వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది.

జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, పంజాగుట్ట, కుత్బుల్లాపూర్, గాజులరామారం, జగద్గిరిగుట్ట, బహదూర్‌పల్లి, సూరారం, సుచిత్ర, పేట్ బషీర్‌బాద్, జీడిమెట్ల, బోయిన్‌పల్లి, అల్వాల్, బేగంపేట్, మారేడుపల్లి, కూకట్‌పల్లి, బాచుపల్లి, మూసాపేట్, కోఠి, మలక్‌పేట్, గచ్చిబౌలీ, మాదాపూర్, టోలీచౌకీతోపాటు తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. షేక్‌పేట ఫ్లైఓవర్‌పై వాహనాలు నిలిచిపోగా... షేక్‌పేట, ఫిలింనగర్, గచ్చిబౌలి మార్గంలో, మెహదీపట్నం, టోలిచౌకి మార్గంలో ట్రాఫిక్ జామ్ అయ్యింది. రోడ్లపై నీరు చేరడంతో ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్ఎంసీ సిబ్బంది నీటిని తొలగించారు.



ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

గ్రేటర్ హైదరాబాద్‌లో సోమవారం రాఖీ పౌర్ణమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ప్రభుత్వ ప్రయివేటు కార్యాలయాల్లో ఉన్నతాధికారులు, తోటి అధికారులకు మహిళా ఉద్యోగులు రాఖీ కట్టి స్వీట్ తినిపించుకున్నారు. ఈ సందర్భంగా అన్నా, తమ్ముళ్లకు అక్కా చెల్లెళ్లు రాఖీలు కట్టి ఆనందంగా గడిపారు. ఒకరికొకరు అండగా, తోడుగా, రక్షణా ఉండాలనే భావనతో ఈ రక్షా బంధన్‌ను జరుపుకుంటారు.





మిస్ అండ్ మిసెస్ స్ట్రాంగ్ అండ్ బ్యూటిఫుల్



● **అక్టోబర్‌లో ప్రతిష్ఠాత్మక బ్యూటీ పేజెంట్ ఆడిషన్స్ ప్రారంభం**

నవతెలంగాణ-బంజారా హిల్స్

హైదరాబాద్ మహా నగర వేదికగా ప్రతిష్టాత్మకంగా మిస్ అండ్ మిసెస్ స్ట్రాంగ్ అండ్ బ్యూటిఫుల్ 2024- సీజన్ 1నీ రెండు తెలుగు రాష్ట్రాలు కలిసి నిర్వహించనున్నట్టు వ్యవస్థాపక నిర్వాహకులు కిరణ్మయి అలివేలు తెలిపారు. సోమవారం ఇందుకు సంబంధించిన మిస్ అండ్ మిసెస్ స్ట్రాంగ్ అండ్ బ్యూటిఫుల్ కర్టెన్ రైజర్‌ను మోడల్స్‌లో కలిసి ఆవిష్కరించి ఆమె మాట్లాడారు. ఇటు ఔత్సాహిత యువ వనితలకు..ఇటు నిత్య జీవితంలోని ఆలోచనలు, ఆశయాలకు పెండ్లి ముగింపు కాదనీ మరో అద్భుత ఆరంభమనీ అన్నారు.ప్రతి మగువ సౌందర్యాన్ని మరింత గ్రాండ్‌ను ప్రదర్శించడానికి ఈ పేజెంట్ ను నిర్వహిస్తున్నామని తెలిపారు.ఇప్పటి వరకు జాతీయ స్థాయిలో పలు పెజెంట్ లలో పాల్గొన్న అనుభవంతో, ఔత్సాహికులకు అవకాశాన్ని కల్పించాలనే లక్ష్యంతో ఈ వేదికను ఏర్పాటు చేశామన్నారు. అక్టోబర్ నుంచి ప్రారంభమయ్యే ఆడిషన్స్ లో పాల్గొనాలనుకునే ఔత్సాహికులు www.sbtribe.org లేదా https://sbtribe.org / వెబ్ సైట్ లో నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

రాఖీ పౌర్ణమి సందర్భంగా కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్,మాజీ కార్పొరేటర్ భారతీయ నాయక్‌తో పాటు నియోజకవర్గంలోని మహిళా సోదరీలు బిందియా జస్వాల్,కుమారి అనూష, సరస్వతి,కల,కుమారి చిట్టి,వనజలు మైనార్టీ మహిళలు భారీ సంఖ్యలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు రాఖీలు కట్టారు. వారందరికీ తేనేటి విందుతోపాటు ప్రత్యేక స్వీట్లు పాయసం పంపిణీ చేశారు. దానం నాగేందర్. అలాగే వారందరి ఆశీర్వాదాలు తీసుకున్నారు.

నవతెలంగాణ-బంజారాహిల్స్



శయన దృశ్యంలో పద్య లాపనలో పోటా పోటీ



నవతెలంగాణ-కల్చరల్

రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యం తో శ్రీ త్యాగరాయ గానసభ, శారద కళా నికేతన్ నిర్వహణ లో త్యాగరాయ గానసభ లోని కళా సుబ్బారావు కళా వేదిక పై తిరుపతి వెంకట కవులు రచించిన పాండవోద్యోగ విజయాలు లోని శయన దృశ్యం లో నటులు పోటా పోటీ పద్యా లాపనాతో ప్రేక్షకులను రంజింప జేశారు కృష్ణునిగా పున్నా రావు, దుర్యోధనుని గా సంజీవ రావు, అర్జునిగా నారాయణ స్వామి ల నటన పద్యాలాపన ఆకట్టుకున్నాయి. ప్రముఖ హార్మోనిస్ట్ రాజ బాబు సంగీత సహకారం తో నాటకాన్ని రక్తి కట్టించారు ఈ సందర్భంగా జరిగిన సభా కార్యక్రమంలో గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి పాల్గొని సంగీత నృత్య నాటక కార్యక్రమాలకు ఉచిత వేదిక నిత్య వేడుక లో భాగంగా రెండు రోజులు శారద కళా నికేతన్ వారికి వేదిక ఇచ్చామని తెలిపారు. రాజ బాబు విఖ్యాత గాయకుడు బాలసుబ్రహ్మణ్యం మెచ్చిన కళా కారుడు అని అభినందించారు.నిర్వాహకుడు రాజ బాబు మాట్లాడుతూ పౌరాణిక నాటకం ప్రదర్శనకు వేల ఖర్చు అవుతుందని ప్రేక్షకులు స్పందన లేకుంటే తెలుగు పద్య నాటకం మరుగై పోతుందనీ ఆవేదన వ్యక్తం చేశారు

సీఎంకు రాఖీ కట్టిన డిప్యూటీ మేయర్

నవతెలంగాణ-ఓయూ

రాఖీ పౌర్ణమి సందర్భంగా సోమవారంరాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వారి నివాసంలో గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి రాఖీ కట్టారు. ఈ సందర్భంగా సోదర సోదరీమణుల బంధం, సాంప్రదాయ విలువలను గుర్తు చేస్తూ, రక్షాబంధనం చేసుకుని తన సోదరుడిపై ప్రేమను, భద్రతను వ్యక్తం చేసింది.



ఓయూ జేఏసీ నేతకు రాఖీ కట్టిన సీతక్క

నవతెలంగాణ-ఓయూ

మంత్రి సీతక్క సోమవారం ఉస్మానియా యూనివర్సిటీలోని లా కాలేజీ వద్ద ఓయూ జేఏసీ చైర్మెన్ ,నిరుద్యోగ జేఏసీ ఫౌండర్ ఓరుగంటి కృష్ణకు రాఖీ కట్టారు. ఓరుగంటి కృష్ణ మాట్లాడుతూ సీతక్కతో తన అనుబంధం, రాఖీ పౌర్ణమి నాటి వెన్నెలంత చల్లనిదని, ఈ పండుగ వేళ రాఖీ కట్టిన సీతక్కతో పాటుగా రాష్ట్రంలోని ప్రతి ఆడబిడ్డ జీవితంలో పండు వెన్నెల లాంటి ఆనందాలు వెల్లివిరియాలని మనసారా కోరుకుంటున్నానన్నారు.



అర్ధరాత్రి బైక్‌ను ఢీకొన్న కారు

- యువకుడు మృతి

నవతెలంగాణ-జూబ్లీహిల్స్

ఎస్సార్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మైత్రివనం చౌరస్తాలో ఆదివారం అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో యువకుడు మృతి చెందాడు. ఎస్సార్ నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం, సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్న భావన ఆదివారం రాత్రి డ్యూటీ ముగించుకుని కారులో వెళ్తోంది. మైత్రివనం చౌరస్తా వద్ద టీఎస్09 ఎఫ్ఎన్ 6332 నెంబర్ గల బైక్‌పై ప్రసాద్ అనే యువకుడు వెళ్తున్నాడు.ఈ క్రమంలో కారు బైక్‌ను ఢీకొట్టింది. దాంతో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. కారు నడుపుతున్న భావన వెంటనే స్థానికుల సహాయంతో దగ్గరలోని ప్రైమ్ ఆస్పత్రికి బాధితుడిని తరలించింది. అయితే అప్పటికే యువకుడు మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. అనంతరం కారు నడిపిన మహిళ ఎస్సార్ నగర్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయింది. కేసు నమోదు చేసుకున్న సబ్ ఇన్‌స్పెక్టర్ రాజు రాథోడ్.. యువకుడి మృతదేహాన్ని గాంధీ హాస్పిటల్ తరలించి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పచెప్పారు. మహిళ మద్యం సేవించలేదని, ఆమెకు కారు డ్రైవింగ్ లైసెన్స్ కూడా ఉందని ఎస్సార్ నగర్ పోలీసులు తెలిపారు. మృతుడు వైఎంసీఏ కాలేజీలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడని తెలిసింది. అతని తల్లిదండ్రులు మెదక్ నుండి వచ్చి బేగంపేటలోని అపార్ట్మెంట్‌లో వాచ్మెన్‌గా ఉంటూ వారి కుమారుని చదివించుకుంటున్నారు.



ప్రమాదానికి కారణమైన కారు (ఇన్‌సెట్‌లో మృతుడి ఫైల్‌ఫోటో)

కుక్కల నియంత్రణకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం

నగరంలో నానాటికి శునకాల సంచారం రెట్టింపైంది. దాంతో రహదారుల వెంట, అపార్ట్‌మెంట్స్ వద్ద పలుచోట్ల కుక్కలు గుంపులు, గుంపులుగా వృద్ధులపై , చిన్నారులపై దాడులు చేస్తున్నాయి. దాడులు ఎక్కువగా కావడంతో నగర ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ జోన్ అసిస్టెంట్ డైరెక్టర్ వెటర్నరీ డాక్టర్ వై. సద్గుణ దేవి ప్రత్యేకంగా నవతెలంగాణతో కుక్కల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు, పలు అంశాలపై మాట్లాడారు.

- చెవి కత్తిరించని కుక్కలుంటే అధికారుల దృష్టికి తేవాలి
- 90,000 కుక్కలుంటే ఇప్పటి వరకు 49,300 కుక్కలకు కు.ని. ఆపరేషన్
- ఈ సంవత్సరంలో 3,377 యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్‌లు
- చిన్నారులను ఆరుబయటకు పంపరాదు..
- పెంపుడు కుక్కలకు రిజిస్ట్రేషన్ చేసుకోకపోతే నోటీసులు జారీ చేస్తాం..
- సికింద్రాబాద్ జోన్ అసిస్టెంట్ డెరైక్టర్ వెటర్నరీ డా.వై.సద్గుణ దేవి

నవతెలంగాణ : మీ పరిధిలో ఏ సర్కిల్స్ ఉన్నాయి ? ఏ సర్కిల్ పరిధిలో కుక్కల సంచారం ఎక్కువు గా ఉన్నాయి ?

నవతెలంగాణ-ఓయూ

డాక్టర్ వై. సద్గుణ దేవి : మా పరిధిలో ఐదు సర్కిల్స్ అంబర్‌పేట్, ముషీరాబాద్ , సికింద్రాబాద్ ,బేగంపేట్ ,మల్కాజిగిరి ఉన్నాయి. వీటిలో మల్కాజిగిరి సర్కిల్ పరిధి లో కుక్కలు ఎక్కువగా ఉన్నాయి. సరిహద్దు ప్రాంతం కాబట్టి ఇక్కడ వీటి సంచారం ఎక్కువగా ఉంది.

నవతెలంగాణ :కుక్కల నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

డాక్టర్ : సుప్రీంకోర్టు 2010 ఆదేశాల ప్రకారం కుక్కలకు ఆపరేషన్స్ చేసి యాంటీ రాబిస్ వ్యాక్సిన్ ఇస్తున్నాము. ఎక్కడైతే కుక్కని పట్టుకున్నామో ఆపరేషన్ పూర్తయ్యాక తిరిగి అక్కడే కుక్కలను వదిలేస్తున్నాం. 90, 000 కుక్క లుంటే ఇప్పటివరకు 49 వేల 300 కుక్కలకు ఆపరేషన్ పూ ర్తయింది. ఇంకా 40,000 కుక్కలకు ఆపరేషన్ చేయాలి .



న.తె : కుక్కల నుంచి రక్షణ పొందడానికి మిరిస్తున్న సలహాలు సూచనలు ?

డాక్టర్ : కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేసిన కుక్కలకు కుడిచెవికి యూ షేప్ లో " కట్ చేసి ఉంటుంది. అలా కట్ చేసి లేకుండా కుక్కులుంటే సికింద్రాబాద్ జోన్ అధికారుల దృష్టికి తీసుకురావాలి. పలువురు డాగ్స్ ఫీడర్స్ ఫీడ్ చేసిన వెంటనే ఆ ప్రాంతంలో ఆహార పదార్థాల వ్యర్థాలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నాం. కాలనీలలో రా ఫీడింగ్ చేస్తే మా దష్టికి తేవాలి. చిన్నపిల్లలు ఆరుబయటకు పంపకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి. గుంపులు గుంపులు సమూహంగా కుక్కలుంటే అక్కడికి వెళ్లకుండా ఉండాలి.

న.తె : ఏ ఏరియాలో కుక్కలు ఎక్కువగా ఉన్నాయి ?

డాక్టర్ : మల్కాజిగిరి , యాప్రాల్ , మౌలాలి ప్రాంతాల్లో గుట్టలు ఓపెన్ ప్రాంతాలు ఉండటం వల్ల కుక్కలు ఎక్కువగా ఉన్నాయి. ఇక తుకారం గేట్ రైల్వే ట్రాక్స్ సమీపం లో ఉండడంతో ఇక్కడ ఎక్కువ ఉన్నాయి. అంబర్‌పేట్ మూసీ పరివాహక ప్రాంతం కావడంతో ఇక్కడ కూడా కుక్క ల సంచారం ఉంది. నియంత్రణకు ఇలాంటి ప్రాంతాల్లో కాస్త కష్టతరంగా మారింది.



న.తె : ఎలాంటి అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు ?

డాక్టర్ : కుక్క కనపడితే నిలబడాలి, ఒక్కరే వస్తే కుక్కలు కనిపిస్తే పరిగెత్తరాదు. కుక్కల సమీపంలోకి వెళ్లే సమయంలో బైకులు కాస్త స్లోగా వెళ్లాలి. అన్నం తింటున్న, నిద్రపోతున్న సమయంలో కుక్కల జోలికి ,సమీపంలోకి వెళ్లకుండా ఉండాలి. పిల్ల తల్లులైన కుక్కల సమీపానికి వెళ్లవద్దు. ప్రధానంగా వాటిని కట్టెలు రాళ్లతో కొడితే అవి తిరుగుబాటు చేస్తాయి. ఈ జాగ్రత్తలు తీసుకోవడం కొంతవరకు శ్రేయస్కరం.

న.తె : జోన్ పరిధిలో ఎంత మంది ఉద్యోగులు పని చేస్తున్నారు ?

డాక్టర్ : ఇద్దరు వెటర్నరీ ఆఫీసర్లు, 25 మంది డాగ్స్ క్యాచెస్ ఉన్నారు. ఐదు వ్యాన్‌లు ఉండగా ఒక్కొక్క వ్యాన్‌కు ఐదుగురు డాగ్స్ క్యాచర్‌లు ఉంటారు. పట్టుకున్న కుక్కలను మా సిబ్బంది గాజుల రామారాంలోని యానిమల్ కేర్ సెంటర్‌లకు తీసుకువెళ్లి కు.ని. ఆపరేషన్ చేస్తారు. ఐదు లేదా వారం రోజులపాటు వాటిని వారి పర్యవేక్షణలో కుక్కలు ఉంటాయి. తర్వాత పట్టుకున్న చోట వదిలేస్తు న్నాము. అక్కడ ఒక షెల్టర్ మేనేజర్, ముగ్గురు కాంపౌం డర్స్ , లేబర్స్ పనిచేస్తున్నారు. కుక్కల జనన నియంత్రణ లో భాగంగా కుక్కలకు పూర్తిస్థాయిలో వషణాలు(టెస్ట్ కిల్స్) తొలిగించడం జరుగుతుంది. ఆడ కుక్కల్లో అయితే అండాశయాలు, అండవాహికలు, యూటీరస్ తొలగించడం జరుగుతుంది. కుని ఆపరేషన్స్‌తో డాగ్ బైట్స్ తగ్గుతున్నాయి. ఈ సంవత్సరం 3,377 యాంటీ రెబిస్ వ్యాక్సిన్స్ ఇచ్చాము. దీనివల్ల కుక్క కరిచిన రాబిస్ సోకదు.

న.తె : పెంపుడు కుక్కల యజమానులకు ఎలాంటి సలహాలు సూచనలు ఇస్తారు ?

డాక్టర్ : తప్పనిసరిగా పెంపుడు కుక్కలకు యజమానులు లైసెన్స్ పొంది ఉండాలి. సదరు పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ ప్రతి సంవత్సరం ఇప్పించాలలి. పెంచుకుంటున్న పెంపుడు కుక్కలను ఆరుబయట మలమూత్ర విసర్జనలు చేస్తే స్థానికులు ఫిర్యాదు చేస్తే తప్పకుండా సదరు కుక్కలకు సంబంధించిన యజమానిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాము. అలాంటి కుక్కలను బయటకు తీసుకెళ్లే సమయంలో తప్పనిసరిగా ఇతరులను కరవకుండా చర్యలు తీసుకోవాలి. పెంపుడు కుక్కలకు రిజిస్ట్రేషన్ చేసుకోకపోతే నోటీసులు జారీ చేస్తాం.





గణపతి ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-బేగంపేట్

సికింద్రాబాద్ గణేష్ ఆలయంలో సోమవారం ఎమ్మెల్యే శ్రీగణేష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహా కుంభాభిషేకంలో పాల్గొన్నారు. అంతకు ముందు ఆయనకు వేదమంత్రాలు, మంగళ వాయిద్యాలతో స్వాగతం ఆలయ అర్చకులు, అధికారులు స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని ఎమ్మెల్యే దర్శనం చేసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మహా కుంభాభిషేకంలో పాల్గొనడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భగవంతున్ని ప్రార్థించానన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మెన్ సత్యనారాయణ, సదానంద గౌడ్, అశోక్, వినోద్, శ్రీశైలం,బద్రీనాథ్ యాదవ్, తేజ్పాల్, ఆర్ది నగేష్ యాదవ్, సంతోష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



అన్నగా అన్నివేళలా అండగా ఉంటా..

- జంపన ప్రతాప్

నవతెలంగాణ-కంటోన్మెంట్

న్యూ బోయిన్‌పల్లి న్యూ సిటీ కాలనీలోని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్ నివాసంలో సోమవారం రక్షాబంధన్ వేడుకలు ఘనంగా జారిగాయి. జంపన ప్రతాప్‌తో పాటు జంపన రవికి సోదరీ మణులు సక్కు.. సరోజలు రాఖీ కట్టి మిఠాయిలు తినిపించారు. అనంతరం జంపన సోదరీమణులకు పాదాభివందనం చేసి ఆశీర్వాదం తీసుకు న్నారు. అదే విధంగా మెప్మాలో విధులు నిర్వహిస్తున్న ఒకటో, మూడో, ఆరో వార్డులకు చెందిన పలువురు ఆర్పీలు ప్రతాప్‌కు తిలకము దిద్ది రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా జంపన ప్రతాప్ మాట్లాడుతూ తన సోదరీమణు లతో పాటు ఆర్పీలకు మహిళా సంఘాల సభ్యులకు, మహిళలకు అన్నగా ఎల్ల వేళలా అండగా ఉంటానన్నారు. మంజుల. ఇతర ఆర్పీలు పాల్గొన్నారు. .

హిందుస్థానీ అవామ్ మోర్చా (సెక్యులర్) రాష్ట్ర కన్వీనర్‌గా జాగీర్దార్ గ్యార ప్రతాప్ పటేల్

నవతెలంగాణ-సిటీబ్యూరో

కేంద్ర సూక్ష్మ, చిన్నమధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి జితన్ రాం మాంఝీ స్థాపించిన హిందుస్థానీ అవామ్ మోర్చా (సెక్యులర్) రాష్ట్ర కన్వీనర్‌గా జాగీర్దార్ గ్యార ప్రతాప్ పటేల్ నియామితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు, బీహార్ మంత్రి డాక్టర్ సంతోష్ సుమన్ మాంఝీ ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేసి ప్రజా సమస్యల పరిష్కారం, బడుగు, బలహీన అభివృద్ధికి, కార్మిక, కర్షక సంక్షేమానికి కృషి చేయాలని ఆయన సూచించారు.ఈ సందర్భంగా జాగీర్దార్ గ్యార ప్రతాప్ పటేల్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో రాష్ట్ర పగ్గాలు అప్పగించిన వ్యవస్థాపకుడు జితన్ రామ్ మాంఝీ, జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సంతోష్ సుమన్ మాంఝీలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీని బలోపేతం చేసేందుకు త్వరలో రాష్ట్ర, జిల్లా స్థాయి అడహక్ కమిటీలు వేయనున్నటు ఆయన ప్రకటించారు. కేంద్ర మంత్రి సహకారంతో సూక్ష్మ చిన్నమధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి, కార్మికుల సంక్షేమం కోసం తన వంతు కృషి చేస్తానని వెల్లడించారు.





జూబ్లీహిల్స్ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్‌కు ఫిల్మ్ నగర్‌లోని 18 బస్తీలు, ఇంద్ర నగర్ వివిధ బస్తీలకు చెందిన ఆడపడుచులు, పారిశుధ్య కార్మికులు, జీహెచ్ఎంసీ సిబ్బంది తదితరులు రాఖీలు కట్టారు. అనంతరం కార్పొరేటర్ వారందరికీ రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

నవతెలంగాణ-బంజారాహిల్స్

అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్



- కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్

నవతెలంగాణ-కంటోన్మెంట్

అన్నా చెల్లెల్లు, అక్కా తమ్ముళ్ల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్ అనిఎమ్మెల్యే శ్రీ గణేష్ అన్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా మహిళలు సోమవారం భారీ సంఖ్యలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వచ్చి ఎమ్మెల్యే రాఖీ కట్టారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన మహిళలతో పాటు బ్రహ్మకుమారి ప్రతినిధులు విచ్చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ మహిళలను తమ సోదరీమణులుగా భావించి, అండగా ఉన్నప్పుడే అందరికి నిజమైన సార్థకత లభిస్తుందన్నారు. తన సోదరుడు గొప్పగా ఉండాలని, తనకు కొండంత అండగా నిలవాలని ఆకాంక్షిస్తూ సోదరి కట్టే రక్ష ఈ రాఖీ అని.. సమాజంలో సోదర భావాన్ని పెంపొందించి, ప్రేమానుబంధాలను పెంచేది రాఖీపండగ అని శుభాకాంక్షలు తెలియజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు అండగా ఉందని, మహిళల సంక్షేమానికి కట్టుబడి అనేక పథకాలు రూపొందించిందని తెలిపారు. ఇప్పటికే ఉచిత బస్సు, 500లకే గ్యాస్, వడ్డీ లేకుండా డ్వాక్రా రుణాలు అందిస్తున్నదని చెప్పారు.

క్రీడాకారులకు చేయూతనందించి ప్రోత్సహించాలి

- తలసాని సాయి కిరణ్ యాదవ్

నవతెలంగాణ-బేగంపేట్

క్రీడాకారులకు చేయూతనందించడం ద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా ప్రోత్సహించాలని యువనేత తలసాని సాయి కిరణ్ యాదవ్ కోరారు. సోమవారం వెస్ట్ మారేడ్ పల్లిలోని తమ నివాసం వద్ద మహిళా పవర్ లిఫ్టర్ వైష్ణవి మహేష్‌కు తలసాని ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ. 2 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అక్టోబర్ 4 నుంచి 13 వ తేదీ వరకు దక్షిణాఫ్రికాలో జరిగే కామన్వెల్త్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు వైష్ణవి మహేష్ ఎంపికైంది. ఈ పోటీలకు హాజరయ్యేం దుకు ఆర్థికంగా ఆమె కొంత ఇబ్బందిపడుతున్న విషయాన్ని తెలుసుకున్న తలసాని సాయి కిరణ్ యాదవ్.. తలసాని ట్రస్ట్ ద్వారా సాయం చేశారు. అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల ఆమెకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ అనేకమంది నైపుణ్యం కలిగిన క్రీడాకారులు ఉన్నప్పటికీ, వారికి సరైన ప్రోత్సాహం లభించకపోవడం వల్ల రాణించలేకపోతున్నారని విచారం వ్యక్తం చేశారు. వైష్ణవి మహేష్‌కు 4, 5 సంవత్సరాల నుండి పవర్ లిఫ్టర్‌గా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో ప్రతిభ చాటే విధంగా ప్రోత్సహిస్తూ వచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఎప్పటికైనా అంతర్జాతీయ వేదికలపై వైష్ణవి మహేష్‌కు తన సత్తా చాటే అవకాశం లభిస్తుందనే పూర్తి నమ్మకం తనకు ఉందని, అది నిజం కాబోతుందని స్పష్టం చేశారు. ఎంతో కష్టపడి రాష్ట్ర, జాతీయ స్థాయిలలో మెడల్స్‌ను సాధిం చిందని చెప్పారు.కామన్వెల్త్ పోటీలలో కూడా తన ప్రతిభను చాటుతుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. రక్షాబంధన్‌ను పురస్కరించుకుని సాయి కిరణ్ యాదవ్ కు వైష్ణవి రాఖీ కట్టింది.





ప్రోత్సాహాన్ని మరువలేను : వైష్ణవి

పవర్ లిఫ్టింగ్‌లో తాను అంతర్జాతీయ స్థాయిలో రాణించే విధంగా తలసాని ట్రస్ట్, తలసాని సాయి కిరణ్ యాదవ్ అందించిన సాయం, ప్రోత్సాహాన్ని ఎన్నటికీ మరువలేనని పవర్ లిఫ్టర్ వైష్ణవి మహేష్ అన్నారు. తాను పవర్ లిఫ్టర్‌గా కెరియర్ ను ప్రారంభించిన నాటి నుంచి అనేక సందర్భాలలో అన్ని విధాలుగా సహాయం అందిస్తూ వస్తున్నారని, అందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. కామన్వెల్త్ పోటీలలో మెడల్‌ను సాధిస్తానని ధీమా వ్యక్తం చేసింది.

కార్పొరేటర్‌కు రాఖీ కట్టిన మహిళలు

నవతెలంగాణ-కంటోన్మెంట్

ఓల్డ్ బోయిన్పల్లి కార్పొరేటర్ నరసింహ యాదవ్ కార్యాలయంలో రక్షాబంధన్ కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. నరసింహ యాదవ్ కు మహిళలు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించారు. అలాగే బ్రహ్మకుమారి ప్రతిని ధులు కూడా కార్పొరేటర్‌కు రాఖీ కట్టారు. బీఆర్ఎస్ పార్టీ మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు భారీ సంఖ్యలో విచ్చేశారు.





బోరబండ డివిజన్‌లోని వినాయకరావు బస్తిలో యూత్ కమిటీ ఏర్పాటైంది. ఈ సంద ర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ హాజరై మాట్లాడుతూ, యువతకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం వినాయకరావు నగర్ యూత్ ప్రెసిడెంట్ - లఖన్ నాయక్, వైస్ ప్రెసిడెంట్ - గంధం రాకేష్, జనరల్ సెక్రటరిగా - సంతోష్ కుమార్, ట్రెజరర్ - నరేష్ ని అనౌన్స్ చేశారు. వినాయకరావు నగర్ బస్తీ ప్రెసిడెంట్ అనంద్, బండారి కుమార్, రామకృష్ణ, మహేందర్ గౌడ్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ - జూబ్లీహిల్స్

ఎమ్మెల్యే నివాసంలో సందడిగా రక్షా బంధన్ వేడుకలు

నవతెలంగాణ-ఓయూ

మోండా మార్కెట్ లోని టకార బస్తీలోని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుళ్ల పద్మారావు గౌడ్ నివాసంలో సోమవారం రక్షా బంధన్ వేడుకలు కోలాహలంగా జరిగాయి. ఆయన సోదరి శకుంతలమ్మ ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ కు రాఖీ కట్టి ఆశీర్వదించారు. పద్మారావు గౌడ్‌కు పలువురు అభిమానులు కూడా ఈ సందర్భంగా రాఖీలు కట్టగా, ఆయన స్వీట్లు పంచారు. అక్కా తమ్ముళ్ల, అన్నా చెల్లెళ్ల అనురాగానికి రక్షా బంధన్ ప్రతీకగా నిలుస్తుందని, వివిధ సంప్రదాయాలను భావి తరాలకు అందించాల్సి ఉందని పద్మారావు గౌడ్ ఈ సందర్భంగా తెలిపారు.



ఆర్మీ మిలిటరీ ఆస్పత్రిలో రక్షాబంధన్



నవతెలంగాణ-కంటోన్మెంట్

కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి సతీమణి కావ్య రెడ్డి సోమవారం తిరుమలగిరిలోని మిలిటరీ హాస్పిటల్‌లో రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. దేశ రక్షణ కోసం పాటుపడే సైనికుల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు రాఖీలు కట్టి స్వీటు తినిపించి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు. దేశానికి రక్షణగా సైనికులు మనకు తోడుగా నిలిచారని, రోగులకు రక్షణగా ఆస్పత్రి వైద్యులు నిలిచారని అందరికీ రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు.

వాన పడితే చెరువులుగా మారుతున్న రోడ్లు..

నవతెలంగాణ-కంటోన్మెంట్

ఓల్డ్ బోయిన్పల్లి డివిజన్ సమతా నగర్‌లో వర్షం పడిన ప్రతిసారీ రోడ్ నెంబర్ 5,6,7లలో రోడ్లపై నీరు చేరి చెరువుల్లా తయారవుతున్నాయి . రోడ్ నెంబర్ 5 లో వర్షపు నీరు పోవడానికి దాదాపు 10 ఏండ్ల కింద వేసిన భూగర్భ వరద కాలువ మట్టితో నిండిపోయిందని.. దీంతో నీరు లోపలికి వెళ్లక మోకాళ్ళ లోతు వరకు నీరు నిలుస్తోంది ఫలితంగా పక్కనే ఉన్న ఇండ్లలోకి నీరు వెళుతున్నది . దాదాపు ఒక గంట సేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుండడంతో వాహనదారులు, స్థానికులు ఆగ్రహిస్తున్నారు. తక్షణమే అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



స్టాన్లీ కళాశాలలో ఘనంగా ఓరియెంటెషన్ డే




- విద్యార్థులకు జ్ఞానంతో పాటుగా సాంకేతిక నైపుణ్యాలు అవసరం : హేమలత
- మార్క్స్ కాకుండా సబ్జెక్ట్స్‌పై పరిజ్ఞానం అవసరం : జి.శ్రీ రామ్

నవతెలంగాణ-ఓయూ

స్టాన్లీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఫర్ వుమెన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ఓరియంటేషన్ డే కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హేమలత , హెచ్‌పీఈ సీనియర్ హెచ్.ఆర్ మేనేజర్ జి. శ్రీ రామ్, టీ టెక్, సీనియర్ హెచ్.ఆర్ మేనేజర్ , ఐజాజ్ , సీఈఓ, టాలెంట్ ట్రెనింగ్ హాజరయ్యారు. స్టాన్లీ కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ కే. కృష్ణారావు మేనేజ్మెంట్ సభ్యులు టి.రాకేష్ రెడ్డి, ఆర్ .ప్రదీప్ రెడ్డి , కళాశాల డీన్, అకాడమిక్స్ ప్రొఫెసర్ ఏ. వినయ్ బాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ సత్యప్రసాద్ లంక , డైరెక్టర్ డా. వి అనురాధ, ఆర్ అండ్ డి డైరెక్టర్ డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ఏ రమేష్ పాల్గొన్నారు. ఓరియంటేషన్ కార్యక్రమానికి డాక్టర్ వి.అనురాధ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన హేమలత మాట్లాడుతూ. విద్యార్థులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని చెప్పారు. జ్ఞానంతో పాటు సాంకేతిక నైపుణ్యాలు ముఖ్యమని తెలియజేశారు. నేడు అనేక కంపెనీలు, పరిశ్రమలు సాంకేతిక నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను ప్రోత్సహిస్తున్నాయని చెప్పారు. ప్రొఫెషనల్ విద్య గతంలో చదివిన ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కంటే భిన్నంగా ఉంటుందని ఈ విద్యా విధానానికి అలవాటు పడాలని గుర్తు చేశారు. భట్టీ పట్టే విధానానికి స్వస్తి చెప్పి విషయాలను అర్థం చేసుకొని జ్ఞానార్జన చేయాలని కోరారు. మరొక ముఖ్య వక్తగా హాజరైన జి.శ్రీ రామ్ మాట్లాడుతూ. విద్యార్థులు శాస్త్రీయ పద్ధతిని అనుసరించి విషయాలను చూడాలని చెప్పారు. కేవలం మార్కుల కోసమే కాకుండా జ్ఞానం కోసం సబ్జెక్టును చదవాలని, చదివిన విషయాలను అర్థం చేసుకోవాలని సూచించారు. ఒక దేశం భివృద్ధి ఆ దేశంలో ఉన్న విద్యార్థులు, యువతీ యువకుల పైన ఉంటుందని తెలిపారు. విద్యార్థులు తాము నేర్చుకున్న శాస్త్ర, సాంకేతిక నైపుణ్యాలను సమాజానికి ఉపయోగపడే విధంగా వినియోగించాలని కోరారు. నేర్చుకున్న అంశాలను వ్యక్తం చేయడానికి మంచి కమ్యూనికేషన్ నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి మొదటి సంవత్సరం నుంచే కృషి చేయాలని అన్నారు. ఇంజినీరింగ్ నందు అన్ని కోర్సులు సమానమేనని, విద్యార్థులు కేవలం ఆ కోర్సుకు సంబంధించిన సంపూర్ణమైన జ్ఞానాన్ని పెంపొందించుకునే విషయం పట్ల దృష్టి సారించాలని చెప్పారు. జ్ఞానముతో పాటు మంచి నైపుణ్యాన్ని సాధించినట్లయితే ప్రాంగణ నియామకాలలో ఉత్తీర్ణులు అవ్వడం సులభమని గుర్తు చేశారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య లాంటి ఇంజినీర్లను ఆదర్శంగా తీసుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు,అధ్యాపకేతర సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థులు డాక్టర్ వి.అనురాధ పాల్గొన్నారు.



స్త్రీ, పురుష భేదాలను ఆమె సహించరు. కులం, మతం, ప్రాంతీయ భేదాలను ఒప్పుకోరు. ధనిక, పేద తారతమ్యాలు అంతం కావాలంటారు. స్త్రీని వ్యాపార వస్తువుగా చూడటాన్ని ఆమె ఖండిస్తారు. వేధింపులను వ్యతిరేకిస్తారు. అమానవీయ ఘటనలపై తన రచనల ద్వారా దునుమాడుతారు. ప్రయివేటీకరణ దుష్పరిణామాలను తీవ్రంగా వ్యతిరేకిస్తారు. ఓ పాత్రికేయురాలిగా, సినీ గేయ రచయితగా, సామాజిక కార్యకర్తగా సమసమాజం కోసం నిత్యం తపిస్తూనే ఉంటారు. ఆమే **చైతన్య పింగళి**. ఊహల్లోని కథలను అద్భుతంగా దృశ్యరూపకం చేసే సృజనాత్మకత ఆమె సొంతం. అన్యాయం అనుకుంటే ఎదురిస్తారు. అందుకే మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న దురాగతాలపై త్వరలో ఓ పుస్తకాన్ని ముద్రించబోతున్న ఆమె పరిచయం నేటి మానవిలో...



సాహిత్యంతో చైతన్యం





భారత దేశ జాతీయ పతాక రూపశిల్పి స్వాతంత్ర్య సమరయోధుడు పింగళి వెంకయ్యకు చైతన్య పింగళి మునిమనుమరాలు. పింగళి హేరంబా, వెంకట చలపతిరావుల కొడుకు దశరథరామయ్య, సుశీల దంపతుల కుమార్తె ఈమె. చైతన్య పుట్టింది విజయవాడలో అయినా పెరిగింది మాత్రం నందిగామలో. బాల్యం నుంచే సాహిత్యం పట్ల ఆసక్తితో ఉండేవారు. శ్రీశ్రీ, చలం సాహిత్యాని బాగా చదివేవారు. వారి స్ఫూర్తితోనే రాయడం మొదలుపెట్టారు. ప్రస్తుతం ఆమె సినిమా మాటలు, పాటల రచయితగా కొనసాగుతున్నారు. స్క్రీన్‌ప్లేలో సరికొత్తదనానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. కొంతకాలం పాత్రికేయురాలిగా కూడా పనిచేశారు.

రచయితగా ప్రస్థానం...

చైతన్య గర్భవతిగా ఉన్నప్పుడు 'చిట్టగాంగ్ అప్రైసింగ్' అనే పుస్తకం ద్వారా చిట్టగాంగ్ మహిళల గురించి తెలుసుకున్నారు. అదే సమయంలో 'నిర్భయ' ఘటన జరగడంతో చిట్టగాంగ్ మహిళల స్ఫూర్తిని ఈ తరానికి అందించాల్సిన అవసరం ఉందని గుర్తించి ఎలాగైనా పుస్తకం రాయాలని నిర్ణయించుకున్నారు. పూర్తిస్థాయిలో సమాచారం దొరికిన పదిమంది గురించి రాశారు. పుస్తకం రాసేందుకు అవసరమైన సమాచారం కోసం ఆమె ఈశాన్య రాష్ట్రాలతోపాటుగా బంగ్లాదేశ్‌లో కూడా పర్యటించారు. అదే తరహాలో ప్రస్తుతం మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న దురాగతాలపై కొత్త పుస్తకాన్ని రాస్తున్నారు. దీనికోసం ఆమె ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో కొన్ని రోజులపాటు ఉండి వచ్చి అక్కడి వాస్తవిక గాథలను తెలుసుకున్నారు.



యువ పురస్కారం

ఆమె రాసిన 'చిట్టగాంగ్ విప్లవ వనితలు' అనే కథల సంపుటి కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం అవార్డు-2016కు ఎంపికైంది. ఆమె ప్రయోగాత్మక కథా రచనలో విమర్శకుల నుంచి ప్రశంసలను అందుకున్నారు. అప్పట్లో దేశవ్యాప్తంగా 24 భాషలకు సంబంధించి 24 మంది యువ రచయితలకు ఈ పురస్కారాన్ని ప్రకటించారు. వారిలో చైతన్య ఒకరు కావడం గర్వించదగ్గ విషయం. 'మనసులో వెన్నెల' పుస్తకాన్ని కూడా ఆమె రాశారు.

సినిమాల్లో అవకాశం

'గోదావరి' సినిమా ఆడిషన్స్ జరిగిన సమయంలో చైతన్య కూడా వెళ్లారు. ఆ క్రమంలో రచయితగా ఆమె శేఖర్‌కమ్ములను పరిచయం చేసుకున్నారు. ఆ సినిమా షూటింగ్ మొత్తం పరిశీలించి, సలహాలు ఇవ్వాలని శేఖర్ కమ్ముల ఆమెను కోరారు. తనవంతుగా కొన్ని సలహాలు, ఇతరత్రా సూచనలు సైతం చేశారు. ఆ సమయంలోనే చైతన్య రాసిన పుస్తకాలు, ఆర్టికల్స్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆమెలోని టాలెంట్‌కు మరింత ప్రోత్సాహాన్ని ఇవ్వాలని ఆయన నిర్ణయించుకున్నారు. అలా గత పదమూడు ఏండ్లుగా ఆమె శేఖర్ కమ్ముల వద్ద పనిచేస్తున్నారు.

కో రైటర్‌గా...

వరుణ్‌తేజ్ నటించిన 'ఫిదా' సినిమాకు శేఖర్ కమ్ముల ఆమెకు కోరైటర్‌గా అవకాశం ఇచ్చారు. ఈ సినిమాలో 'ఊసుపోదు ఊరుకోదు... ఉండనీదు వెళ్ళనీదు...', 'ఫిదా ఫిదా', పాటలు ఆమె రచించారు. ఈ సాహిత్యం సరికొత్త పంథాలో...లోతైన జీవన చిత్రణకు రూపమిచ్చింది. నేల టిక్కెట్ సినిమాలో 'బిజిలి', 'విన్నానులే', 'లవ్‌స్టోరీ (2020)' సినిమాలో 'ఏరు పిల్ల', మసూద (2022)లో 'దాచి దాచి' వంటి పాటలు రాశారు. ప్రస్తుతం శేఖర్‌కమ్ముల చేసే సినిమాలకు ఆమె కోరైటర్‌గా పనిచేస్తున్నారు. కోలీవుడ్ హీరో ధనుష్ 51 సినిమాగా 'డిఎన్ఎస్' వర్కింగ్ టైటిల్‌లో తెరకెక్కుతున్న చిత్రానికి ఆమె అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. చాలా షార్ట్‌ఫిలిమ్స్‌కు మాటలు, పాటలు రాశారు. ప్రస్తుతం మరో రెండు సినిమాలకు పాటలు రాస్తున్నారు.

అన్యాయాన్ని ప్రశ్నిస్తూ...

ఎక్కడ అన్యాయం జరిగినా స్పందించేందుకు సిద్ధంగా ఉండే చైతన్య 'ఆంధ్రుల హక్కు...విశాఖ ఉక్కు' పేరుతో విశాఖ ఉక్కు పరిరక్షణ ఉద్యమానికి మద్దతు పలికారు. ప్రజల పక్షాన నిలిచే ఇరోం షర్మిలా, సాయిబాబా వంటి హక్కుల కార్యకర్తలపై పెట్టిన దేశద్రోహ కేసులను ఆమె తీవ్రంగా వ్యతిరేకించారు. మహిళలపై జరిగే అఘాయిత్యాలకు వ్యతిరేకంగా జరిగే ఉద్యమాలకు ఆమె సంఘీభావాన్ని ఎప్పుడూ తెలియజేస్తుంటారు. సోషల్‌మీడియా ద్వారా తన గొంతును నిర్భయంగా వినిపిస్తుంటారు.

- యడవల్లి శ్రీనివాసరావు

పిల్లల్లో ఈ లక్షణాలు కనిపిస్తే..?

నవ్వుతూ జాలీగా ఆటలు ఆడుతూ సంతోషంగా గడపాల్సిన చిన్నారులు ఇప్పుడు స్మార్ట్ ఫోన్‌లతో కుస్తీలు పడుతున్నారు. ఒకప్పుడు స్కూల్ నుంచి వచ్చి గ్రౌండ్‌కి వెళ్లి ఆడుకునే వారు ఇప్పుడు ఫోనుల్లో, టీవీల్లో యూట్యూబ్ వీడియోలు చూస్తున్నారు. అయితే ఇది చిన్నారుల మానసిక స్థితిపై ప్రభావం చూపుతుందని నిపుణులు చెబుతున్నారు. చిన్నారుల్లో డిప్రెషన్‌ను కొన్ని లక్షణాల ఆధారంగా ముందుగానే గుర్తించొచ్చుంటున్నారు.

ఒత్తిడితో కూడుకున్న జీవితం కారణంగా చాలా మంది డిప్రెషన్‌తో సతమతమవుతున్నారు. అయితే ఇది కేవలం పెద్దలకే అనుకుంటే పొరబడినట్లే, చిన్నారులు కూడా డిప్రెషన్ బారిన పడుతున్నారు.

- మీ చిన్నారులు కొన్ని రోజుల నుంచి విచారంగా ఉన్నా, ఇతరులతో కలవడానికి ఆసక్తి చూపించకపోయినా డిప్రెషన్‌తో బాధపడుతున్నట్లే అర్థం చేసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. ఎక్కువసేపు ఒంటరిగా



ఉండడానికి ఆసక్తి చూపిస్తున్న చిన్నారుల విషయంలో జాగ్రత్త పడాలని సూచిస్తున్నారు.
- ఇక పిల్లలు తమలో తాము మాట్లాడుకుంటున్నా, ఒంటరిగా కూర్చొని తామే ప్రశ్నలు వేసుకొని, తామే సమాధానాలు చెబుతుంటే కూడా పిల్లల మానసిక స్థితిలో మార్పు వచ్చినట్లు గుర్తించాలి. వెంటనే మానసిక నిపుణులను సంప్రదించాలి.
- ఏ కారణం లేకపోయినా చిరాకు పడుతున్నా, చిటికిమాటికి కోపంగా ఉంటున్నా, చేతిలోని వస్తువులను విసిరిగొడుతున్నా ఇవి చిన్నారుల్లో డిప్రెషన్ తాలుకు లక్షణాలుగా భావించాలి.
- ఇక చిన్నారులు నిత్యం నిద్రపోతున్నా, ఏ పనిపై ఆసక్తి చూపించకపోతున్నా ఇది డిప్రెషన్ లక్షణంగా భావించాని నిపుణులు చెబుతున్నారు.

ఇవి పాటించండి..

చిన్నారులు డిప్రెషన్ బారిన పడకుండా ఉండాలంటే కచ్చితంగా వారిని స్మార్ట్ గ్యాడ్జెట్లకు దూరంగా ఉంచాలని నిపుణులు చెబుతున్నారు. వీలైనంత వరకు బయట ఆడుకునేలా ఎంకరేజ్ చేయాలి. అలాగే పెద్దలు సైతం చిన్నారులతో నాణ్యమైన సమయాన్ని గడపాలని సూచిస్తున్నారు. పార్కులకు ఎగ్జిబిషన్స్ వంటి వాటికి తీసుకెళ్తుండాలి.

ప్రతి ఆడబిడ్డను గౌరవించాలి

(మొదటిపేజీ తరువాయి)

పక్కనపెట్టి వందల మంది సామాన్యులకు మంత్రి సీతక్క రాఖీలు కడుతూ అమ్మాయిలను గౌరవించాల్సిన అవసరాన్ని వివరించారు. సోదరీ సోదరుల మధ్య అనురాగాలు, ఆప్యాయతలకు ప్రతీక రాఖీ పండుగ నిలుస్తుందని ఆమె గుర్తు చేశారు. అమ్మాయిలను గౌరవించుకోవాల్సిన అవసరాన్ని రాఖీ పండుగ చాటి చెబుతుందని తెలిపారు. మహిళల భద్రతకు పాటుపడదామని రాఖీ పండుగ సందర్భంగా అందరూ ప్రతినభూనాలని కోరారు. సోదరులందరూ బాగుండాలని ప్రతి ఆడబిడ్డ కోరుకుంటుందని చెప్పారు. సమాజంలో వస్తున్న రకరకాల మార్పుల వల్ల మహిళల పట్ల అనేక రకాల హింస జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి సోదరుడు తన సోదరికి సమాజంలో మంచి భద్రత, గౌరవం దక్కాలని ఎలా కోరుకుంటారో....అలానే సమాజంలో ప్రతి ఆడబిడ్డను గౌరవించాలని కోరారు. ప్రతి మహిళ ను మన ఇంటి బిడ్డగా చూస్తే అఘాయిత్యాలు, అత్యాచారాలు జరగవని హితవు పలికారు. ఆడబిడ్డల మీద ఆంక్షలు పెట్టకుండా..స్వేచ్ఛగా తిరిగే అవకాశం ఇచ్చి వారిని ఎదగనీయాలని కోరారు. సీఎంకు రాఖీ కట్టి పండగ శుభాకాంక్షలు తెలిపడం సంతోషంగా ఉందన్నారు.

ఫొటో మధుర జ్ఞాపకాలకు ప్రతీక

(మొదటిపేజీ తరువాయి)

ఫొటోది ఏముందిలే అన్నట్టుగా కొందు చూస్తారుగానీ..ఆ ఫొటో భావాన్ని పలికిస్తుందని చెప్పారు. ఒక ఫొటో గ్రాఫర్ కుతూహలంతో, శ్రద్ధపెట్టి జీవం ఉట్టిపడేలా ఆ ఛాయా చిత్రాన్ని బంధిస్తాడంటూ, వారు పడుతున్న కష్టాలను వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎనిమిదినెల్ల కార్యక్రమాలు, ఇందిరమ్మ రాజ్యంలో ప్రజలకు అందిస్తున్న పథకాలు, సేవలు ఫొటో ఎగ్జిబిషన్‌లో కనిపించాయన్నారు. అయితే..పది నిముషాల్లో ఎనిమిదినెల్ల కష్టాన్నీ, ఆ జ్ఞాపకాలను నెమరువేసుకునేలా కండ్లకు కట్టినట్టుగా చిత్రించటం మధుర జ్ఞాపకాలు కాకపోతే మరేమిటని ప్రశ్నించారు. ఫొటో గ్రాఫర్ల కృషిని గుర్తించి వారి ప్రతిభకు అవార్డులు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం భావించిందని గుర్తు చేశారు. ఈ పని గత ప్రభుత్వం విస్మరించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫొటో గ్రాఫర్ శ్రమతోనే ఫొటో..ఫొటోలాగా కనిపిస్తుందన్నారు. బాధ్యతగా ఆలోచించినప్పుడే దీన్ని గుర్తిస్తామన్నారు. మార్పురావాలని ఇందిరిమ్మ రాజ్యంలో అందరం కష్టపడుతున్నామని గుర్తు చేశారు. అభయ హస్తంలో భాగంగా ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండూ రెండు కండ్లుగా భావించి ప్రభుత్వం అందుకు తగిన కృషి ప్రారంభించిందని చెప్పారు. ప్రపంచం వేగంగా మారుతుందనీ, అంతే వేగంతో వృత్తి నైపుణ్యాన్ని పెంచుకుంటేనే ముందుకు సాగుతామని సూచించారు. వృత్తిపరంగా ఫొటో గ్రాఫర్లు అనేక సమస్యలతో ఉన్నారనీ, వాటిని ప్రభుత్వం తప్పకుండా పరిష్కరిస్తుందని హామీ ఇచ్చారు. మీడియా అకాడమి చైర్మెన్ కె శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఫొటో జర్నలిస్టుల కృషి గొప్పదన్నారు.వారు క్షేత్ర స్థాయిలో ఉంటేనే నిజమైన ఫొటోలు వస్తాయన్నారు. ఫొటోస్ లేకుంటే న్యూస్ పేపరే లేదన్నారు. సమాచార పౌర సంబంధాల శాఖ కమీషనర్ హన్మంతరావు మాట్లాడుతూ సమాచార శాఖ అధికారులు, సిబ్బంది అహర్నిశలు కష్టపడుతూ ప్రభుత్వానికి మంచి పేరు తేవడం చాలా అభినందనీయమని కోనియాడారు. ఫొటోగ్రాఫర్ల శ్రమ చెప్పలేనిదన్నారు. ప్రతి ఫొటో అమూల్యమైందేనన్నారు. 101 మంది ఫొటోగ్రాఫర్లు 990 ఫొటోలు పంపారనీ, అందులో 40మందిని ఆయా కోణాల్లో పరిశీలించి అవార్డులకు ఎంపిక చేశారని వివరించారు. ఈ సందర్భంగా ఎంపికైన ఫొటో గ్రాఫర్లకు తమ ప్రతిభకు గుర్తింపుగా నగదుతో పాటు జ్ఞాపికలను అందజేశారు.

రాజ్యసభ అభ్యర్థిగా సింఘ్వీ నామినేషన్

(మొదటిపేజీ తరువాయి)

జరగనున్న సంగతి తెలిసిందే. ఈ ఉప ఎన్నికల నామినేషన్ల సమర్పణకు ఈ నెల 21వ తేదీ వరకు గడువుంది.అభిషేక్ మను సింఘ్వీ 2001 నుంచి కాంగ్రెస్ జాతీయ అధికార ప్రతినిధిగా పనిచేస్తున్నారు. రెండు దఫాలు(2006, 2018)గా రాజ్యసభ సభ్యునిగా కొనసాగారు. ఈ ఏడాది మార్చిలో జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో హిమాచల్‌ప్రదేశ్ నుంచి పోటీచేసి బీజేపీ చేతిలో ఓడిపోయారు. తెలంగాణ నుంచి రాజ్యసభ సభ్యత్వం కోసం స్థానిక నాయకులు కొందరు ప్రయత్నించినా జాతీయ రాజకీయాల్లో సింఘ్వీ సేవలు కాంగ్రెస్‌కు కీలకమైనందున ఆయన్నే అభ్యర్థిగా ఖరారు చేసినట్లు పార్టీ నేతలు తెలిపారు.

నేరచరితులపై కేంద్రం ఆరా

నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

క్రిమినల్ కేసులను త్వరితగతిన విచారించేందుకు ఏర్పాటైన ప్రత్యేక కోర్టుల సమగ్ర పనితీరుపై ఐఐఎంలు, ఐఐటీలు, న్యాయ విశ్వవిద్యాలయాలు, జ్యుడిషియల్ అకాడమీలతో సహా అత్యున్నత సంస్థల నుంచి ప్రతిపాదనలను కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ ఆహ్వానించింది. ఎంపీ, ఎమ్మెల్యేలకు సంబంధించిన క్రిమినల్ కేసుల విచారణకు ఏర్పాటు చేసిన కోర్టుల కార్యాచరణ, సమర్థత, మొత్తం ప్రభావాన్ని అంచనా వేయనున్నారు. న్యాయమంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పనిచేసే 'స్కీమ్ ఫర్ యాక్షన్ రీసెర్చ్ అండ్ స్టడీస్ ఆన్ జ్యుడీషియల్ రిఫార్మ్' కింద ప్రతిపాదనలు ఆహ్వానించింది.

2017లో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఎంపీలు, ఎమ్మెల్యేలకు సంబంధించిన క్రిమినల్ కేసుల త్వరిత విచారణకు రాష్ట్రాల్లో 12 ప్రత్యేక కోర్టుల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. దీని ప్రకారం ఢిల్లీలో రెండు, ఉత్తరప్రదేశ్, బీహార్, పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, కర్నాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళలో ఒక్కో కోర్టు చొప్పున మొత్తం 12 కోర్టులు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం తొమ్మిది రాష్ట్రాల్లోని పది కోర్టులు పనిచేస్తున్నాయి. 2018 డిసెంబర్‌లో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు బీహార్, కేరళ ప్రత్యేక కోర్టులు నిలిపివేయబడ్డాయి. ఈ ప్రత్యేక కోర్టుల పనితీరును సుప్రీంకోర్టు పర్యవేక్షిస్తోంది.

డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్ జారీ చేసిన ప్రతిపాదనల ప్రకారం "ఈ అధ్యయనం ప్రత్యేక కోర్టుల పనితీరు, సమర్థత, మొత్తం ప్రభావాన్ని అంచనా వేయడానికి, సమగ్ర మూల్యాంకనాన్ని నిర్వహించడానికి ఉపయోగపడుతుంది. ఎందుకంటే వాటి పనితీరును సుప్రీంకోర్టు పర్యవేక్షిస్తుంది. దీనికి కేంద్ర ప్రభుత్వం నిధులు సమకూరుస్తుంది" అని తెలిపింది. అందుబాటులో ఉన్న ప్రత్యేక కోర్టుల సమాచారం ప్రకారం, ఢిల్లీలోని రెండు ప్రత్యేక కోర్టుల్లో కేసులు ఉన్నా, ఏ ఒక్క కేసు కూడా పరిష్కరించలేదు. అదేవిధంగా, ఉత్తరప్రదేశ్ కోర్టు 50 కేసులు పరిష్కరించింది. 1,137 పెండింగ్‌లో ఉన్నాయి. మధ్యప్రదేశ్‌లో ఐదు కేసులు పరిష్కారమై, 319 పెండింగ్‌లో ఉన్నాయి. మహారాష్ట్రలో 419 పెండింగ్‌లో ఉండగా, 13 కేసులు కోర్టు పరిష్కరించింది. ప్రత్యేక ఎంపీ, ఎమ్మెల్యే కోర్టులు, ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు, గ్రామ న్యాయాలయాలు (విలేజ్ కోర్టులు), టెలీ-లా స్కీమ్‌ల పనితీరును అధ్యయనం చేయడానికి కూడా న్యాయశాఖ ప్రతిపాదనలను ఆహ్వానించింది.

కాళేశ్వరంలో అవకతవకలు నిజమే

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

కాళేశ్వరంలో సాగునీటి ప్రాజెక్టు నిర్మాణంలో భారీ అవకతవకలు జరిగినట్టుగా వచ్చిన ఆరోపణలు, విమర్శలు నిజమేనని తెలిసింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో లోపాలు ఉన్నట్టుగా స్పష్టమైనట్టు సమాచారం. దీనిపై గత ఆరు నెలలకుపైగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు డైరెక్టరేట్ విచారణ చేస్తున్న విషయం విదితమే. సోమవారం విజలెన్స్ శాఖ డైరెక్టర్ జనరల్ సీవీ ఆనంద్ హైదరాబాద్‌లోని బీఆర్‌కే భవన్‌లో కాళేశ్వరం న్యాయ విచారణ కమిషన్ చైర్మెన్ పీసీ ఘోష్‌ను కలిశారు. దాదాపు గంటపాటు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా అనేక అంశాలను సీవీ ఆనందర్ చైర్మెన్ ఘోష్‌కు చర్చించినట్టు సమాచారం. తొలి నివేదికను దివంగత ఐపీఎస్ అధికారి రాజీవ్‌రతన్ ప్రభుత్వానికి ఇచ్చిన సంగతి తెలిసిందే. ఆయన మరణించాక సీవీ ఆనంద్ బృందం కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం, డిజైన్లు, స్థలం, సాంకేతిక అంశాలపై విచారణ కొనసాగిస్తూనే ఉంది. ఘోష్ కమిషన్‌కు ఇచ్చిన నివేదికలో పలు కీలకమైన విషయాలు పొందుపరిచినట్టు సమాచారం. నివేదికను నేరుగా చైర్మెన్‌కు అందజేసినప్పటికీ, తొలి నివేదికకు, మధ్యంతర నివేదికతో బలం చేకూరినట్టు సమాచారం. రాజీవరతన్ నివేదికలో కాళేశ్వరం అవినీతి,అ వకతవకలు జరిగినట్టుగా ప్రాథమిక నివేదిక ఇచ్చారు. గత బీఆర్ఎస్ సర్కారు నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు బ్యారేజీల నిర్మాణాల్లో స్పష్టమైన లోపాలు విజిలెన్స్ గుర్తించినట్టు తెలిసింది. దీనిపై ఘోష్, సీవీ ఆనంద్‌తో ఆయా అంశాలపై చర్చిస్తూ త్వరలో విచారణ పూర్తిచేసి తనకు, ప్రభుత్వానికి పూర్తిస్థాయి నివేదికను అందజేయాలని ఆదేశించారు. మేడిగడ్డ పిల్లర్ల కుంగుబాటు, మిగతా బ్యారేజీల్లో బుంగ(సీపేజీ)లు రావడం వెనుక సాంకేతిక, నాణ్యత సమస్యలే కారణమని నివేదికలో పొందుపరిచినట్టు సమాచారం. కాళేశ్వరం ప్రాజెక్టు కోసం ఇప్పటివరకు 'కాగ్' లెక్కల ప్రకారం రూ. 96 వేల కోట్లు ఖర్చుపెట్టారు. అలాగే మరో రూ. 45 వేల కోట్లు కావాల్సి ఉంది.

ఇందులో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల కోసం సుమారు రూ. 9 నుంచి రూ. 12 వేల కోట్ల వరకు వ్యయమైనట్టు సమాచారం. మరిన్నీ నిధులు ఖర్చుపెడితేగాని ప్రాజెక్టు వినియోగంలోకి వచ్చే పరిస్థితి లేదని ఇప్పటికే తేలిపోయింది. ఈ విషయాన్ని జాతీయ డ్యామ్ భద్రతా సంస్థ(ఎన్‌డీఎస్ఏ) స్పష్టం చేసింది కూడా. తాత్కాలిక, శాశ్వత ప్రాతిపదికన మరమ్మత్తులు చేసినా మేడిగడ్డ డ్యామ్ ప్రమాదం నుంచి బయటపడినట్టుగా చెప్పలేమని ఎన్‌డీఎస్ఏ పేర్కొన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలోనే తాజా బారీ వర్షాలు వచ్చినా మేడిగడ్డ బ్యారేజీలో నీటిని నిలువ చేయకుండా గేట్లు ఎత్తి ఉంచారు. దీంతో లక్షలాధి క్యూసెక్కుల నీరు సముద్రంలోకి వృధాగా వదలాల్సి వచ్చిన సంగతి తెలిసిందే.

స్వాతంత్ర్య సమరయోధుల పేరుతో భూదోపిడీ

(మొదటిపేజీ తరువాయి)

కల్పుతున్నాయి. పెద్ద మొత్తంలో అధికారులకు తాయిలాలు ముట్టడంతో అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి

నకిలీ డాక్యుమెంట్లతో రుణాలు

స్వాతంత్ర్య సమరయోధుల పేర్లతో భూములను ఆక్రమించుకున్న కబ్జాదారులు నకిలీ డాక్యుమెంట్లతో బ్యాంకు రుణాలు కూడా పొందారు. రెవెన్యూ అధికారుల అండదండలతో తప్పుడు డాక్యుమెంట్లు పొంది నకిలీ రిజిస్ట్రేషన్లు చేయించుకొని బ్యాంకుల ద్వారా రుణాలు పొందినట్టు ఆరోపణలు ఉన్నాయి. దామరచర్ల పీఏసీఎస్‌లో 12 మంది నకిలీ డాక్యుమెంట్లు పెట్టి 2013లో రూ.50లక్షలకు పైగా రుణాలు పొందినట్టు తెలుస్తోంది. ఇందులో అప్పటి పీఏసీఎస్‌లో పనిచేస్తున్న సిబ్బంది సైతం ఉన్నట్టు ఆరోపణలు ఉన్నాయి. డాక్యుమెంట్ నెంబర్ 4976/ 2017 ద్వారా ఎస్‌బీఐ వజీరాబాద్‌లో రూ.7లక్షలు, డాక్యుమెంట్ 8500/2019 ద్వారా సిండికేట్ బ్యాంకులో రూ.2.31 లక్షలు, డాక్యుమెంట్ 3743/ 2020 ద్వారా కెనరా బ్యాంక్‌లో 90వేలు, డాక్యుమెంట్ 2178/ 2022 ద్వారా రాయల్ వాల్‌టెంక్ లిమిటెడ్ ద్వారా రూ.12లక్షలు.. ఇలా దాదాపు18 డాక్యుమెంట్ల ద్వారా కోట్ల రూపాయల రుణాలు పొందినట్టు సమాచారం.ఉల్సాయిపాలెం పరిధిలో గల సర్వే నెం.145లో రెవెన్యూ అధికారులు కొంతమందికి పట్టాలు ఇచ్చారు. దీంతో కొద్ది రోజుల కిందట స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవోకు ఫిర్యాదు చేసేందుకు రైతులు రాగా.. రెవెన్యూ సిబ్బంది "మీ సమస్యను పరిష్కరిస్తాం" అని చెప్పి వారిని అక్కడ నుంచి తీసుకెళ్లినట్టు సమాచారం. అనధికారికంగా పట్టాలు పొందిన వారి నుంచి వేలాది రూపాయలు రెవెన్యూ అధికారులు దండుకున్నట్టు ఆరోపణలున్నాయి.

ఫిర్యాదులు, ఉద్యమాలు చేసినా ఫలితం శూన్యం

ప్రభుత్వ భూముల ఆక్రమణలపై దామరచర్ల మండల పరిధిలోని పలువురు సామాజికవేత్తలు రెవెన్యూ ఉన్నతాధికారులకు, లోకాయుక్తకు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం. వేల ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడటంలో రెవెన్యూ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ భూముల కబ్జాపై సమగ్ర విచారణ చేపట్టి ఆ భూములను కాపాడి కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ప్రభుత్వ భూములను కాపాడుతాం
శ్రీనివాస్ ఆర్డీవో, మిర్యాలగూడ

ప్రభుత్వ, అసైన్డ్ భూములను ఎవరు ఆక్రమించుకున్నా ఉపేక్షించేది లేదు. ఇప్పటికే ప్రభుత్వ భూములపై సర్వే చేస్తున్నాం. ఆక్రమణలపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ భూములను గుర్తించి ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తాం. లోకాయుక్తకు ఫిర్యాదులందాయి. అక్రమార్కులు ఎవరున్నా ఊరుకోబోం.

తెలంగాణ తల్లి స్థానంలో రాజీవ్ విగ్రహమా ?

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. పదేండ్ల కాలంలో ఏనాడూ తమ ప్రభుత్వం గతంలో ఉన్నవారి పేర్లను మార్చలేదని తెలిపారు. తెలంగాణ తల్లికి, అస్తిత్వానికి, గౌరవానికి కాంగ్రెస్ పార్టీ చేసిన అవమానాన్ని తెలంగాణ సమాజం మర్చిపోదని హెచ్చరించారు. భవిష్యత్తులో రాష్ట్రంలో కాంగ్రెస్ నేతలు రాజీవ్‌గాంధీ, ఇందిరాగాంధీ పేర్లతో ఉన్న పథకాలు, ప్రాంతాల పేర్లను కూడా మారుస్తామని స్పష్టం చేశారు. హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి తెలంగాణ మహనీయుడి పేరు పెడతామని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఏనాడూ జై తెలంగాణ అని అనలేదని విమర్శించారు. అంబేద్కర్ మహనీయుడికి కనీసం పూలదండ వేయలేదని పేర్కొన్నారు. అధిష్టానం దగ్గర మెప్పు పొందాలంటే గాంధీభవన్‌లోనో, రేవంత్ రెడ్డి ఇంట్లోనో రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టుకోవాలని ఎద్దేవా చేశారు.

కవిత రాఖీ కట్టలేకపోయినందుకు బాధగా ఉంది

తన సోదరి కవిత రాఖీ కట్టలేకపోయినందుకు బాధగా ఉందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కేటీఆర్ అన్నారు. 155 రోజులుగా ఆమె జైళ్లో ఎంత వేదనను అనుభవిస్తున్నారోనని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టులో కవితకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో రాఖీ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు.రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మహిళా నాయకులు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్లు, కార్పొరేటర్లు, తదితరులు ఆయనకు రాఖీలు కట్టారు. తనకు రాఖీలు కట్టిన ప్రతి ఒక్కరికీ కేటీఆర్ పేరుపేరున ధన్యవాదాలు తెలిపారు.

వైద్య సిబ్బంది రక్షణకు సమగ్ర చట్టం తేవాలి

(మొదటిపేజీ తరువాయి)

వ్యాఖ్యానించింది. వైద్య వర్గాలతో చర్చలు, సంప్రదింపులు జరిపి ఇక ఏ మాత్రం జాప్యం లేకుండా చట్టాన్ని రూపొందించాల్సి వుందని డిమాండ్ చేసింది. ఈ కేసును సుప్రీం కోర్టు సుమోటోగా తీసుకున్నా తగు శాసనాన్ని రూపొదించడమనేది కేంద్ర ప్రభుత్వ పరిధిలోనే వుంది. బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించినంతవరకు, న్యాయ ప్రక్రియను ధ్వంసం చేయడానికి చేస్తున్న ప్రయత్నాలకు సంబంధించి తాజా సాక్ష్యాధారాలు బయటకు వస్తున్నాయని, అలాగే ప్రశ్నలు లేవనెత్తేవారికి బెదిరింపులు వస్తున్నాయని పొలిట్‌బ్యూరో పేర్కొంది. ముఖ్యమంత్రి పట్ల, ప్రభుత్వం పట్ల తమకు ఎలాంటి నమ్మకం లేదని బాధితురాలి తండ్రి చేసిన ప్రకటన, ప్రజలు కూడా అవే భావాలను వ్యక్తం చేయడం చూస్తుంటే ప్రతి దశలోనూ వాస్తవాలను మరుగుపరిచే వాస్తవికత ప్రతిబింబిస్తోందని పేర్కొంది. తక్షణమే కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో స్పందించి తగు చట్టాన్ని రూపొందించాల్సిన అవసరం వుందని పొలిట్‌బ్యూరో పేర్కొంది. ఇంతటి ఆటవికమైన నేరానికి పాల్పడిన నేరస్తులు ముఠాను కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను తీవ్రంగా ఖండించింది. బాధితురాలుకు, ఆమె కుటుంబానికి న్యాయం జరగాలని డిమాండ్ చేసింది.

సహకారం, వ్యూహాత్మక భాగస్వామ్యానికి ప్రాధాన్యత

వియత్నాం అధ్యక్షుడితో చైనా నేత జిన్‌పింగ్ భేటీ

కలిసి పనిచేసేందుకు ఎదురుచూస్తున్నానన్న లామ్

బీజింగ్ : పునరుజ్జీవం, సోషలిజం నిర్మాణంలో మరిన్ని విజయాలు సాధించేందుకు గానూ ఇటీవల కన్నుమూసిన వియత్నాం కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి ట్రాంగ్ వారసత్వాన్ని వియత్నాం ప్రభుత్వం, పార్టీ పరిరక్షించగలవన్న విశ్వాసాన్ని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ వ్యక్తం చేశారు. వియత్నాం అధ్యక్షుడు, కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి లామ్ ప్రస్తుతం బీజింగ్‌లో పర్యటిస్తున్నారు. వియత్నాం విప్లవ ప్రయోజనాలకు చైనా-వియత్నాం సంబంధాలకు, ప్రపంచవ్యాప్తంగా సోషలిజం అభివృద్ధికి గణనీయమైన రీతిలో సేవలందించిన గుయెన్ ఫూ ట్రాంగ్ మృతికి జిన్‌పింగ్ మరోసారి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను నూతన స్థాయికి తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. ఆ సమయం ఇప్పుడు ఆసన్నమైందన్నారు. చైనా విదేశాంగ విధానంలో వియత్నాంకు ఎప్పుడూ అధిక ప్రాధాన్యత వుంటుందన్నారు. పార్టీ నాయకత్వంలో పట్టుదలకు, సోషలిజం నిర్మాణాన్ని ప్రోత్సహించడానికి చైనా మద్దతునిస్తుందన్నారు.

రాబోయే ఒలింపిక్సే లక్ష్యం

- స్పోర్ట్స్ యూనివర్సిటీ పరిధిలోకే అన్ని క్రీడా విభాగాలు, శిక్షణా సంస్థలు
- క్రీడలకు కేంద్ర బిందువుగా, యంగ్ ఇండియా బ్రాండ్‌గా తెలంగాణ : ఉన్నతాధికారులతో సీఎం రేవంత్
- ఒలింపిక్స్‌ను నిర్వహించే స్థాయికి హైదరాబాద్‌ను తీర్చిదిద్దుతామని వ్యాఖ్య



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని అన్ని రకాల క్రీడలను, వాటి శిక్షణా సంస్థలను ప్రభుత్వం ఏర్పాటు చేయబోయే యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ పరిధిలోకే (ఒకే గొడుగు కిందికి) తెస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. తద్వారా ప్రతీ క్రీడకూ ప్రాధాన్యతనిస్తామని ఆయన తెలిపారు. దేశ క్రీడా రంగానికి తెలంగాణ కేంద్ర బిందువుగా మారాలని ఆకాంక్షించారు. ఇందుకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో సీఎం, ఉన్నతాధికారులతో భేటి అయ్యారు. స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుపై వారితో చర్చించారు. ఫోర్త్ సిటీలో భాగంగా నిర్మించబోయే క్రీడా విశ్వవిద్యాలయం ఏ విధంగా ఉండాలనే దానిపై సమాలోచనలు చేశారు.

మనదేశంతోపాటు తెలంగాణలోని భౌగోళిక పరిస్థితులు, మన శరీర నిర్మాణ తీరుకు అనువైన క్రీడలను, వాటిపై ఉత్సాహం ఉన్న వారిని గుర్తించి ప్రోత్సహించాలని ఈ సందర్భంగా రేవంత్ సూచించారు. దశాబ్దాల క్రితమే ఆఫ్రో-ఏషియన్, కామన్‌వెల్త్ గేమ్స్‌కు ఆతిథ్యమిచ్చిన హైదరాబాద్‌ను భవిష్యత్తులో ఒలింపిక్స్‌కు వేదికగా మార్చాలని అన్నారు. హైదరాబాద్‌లో ఒలింపిక్స్‌ను నిర్వహించడమే కాకుండా ప్రతీ క్రీడలో మన క్రీడాకారులకు పతకాలు దక్కేలా వారిని తీర్చిదిద్దాలని సూచించారు. అందులో మన స్పోర్ట్స్ యూనివర్సిటీ క్రీడాకారులు కచ్చితంగా ఉండాల్సిందేనని సీఎం స్పష్టం చేశారు. ఇందుకోసం వారికి నిపుణులతో శిక్షణనిప్పిస్తామని తెలిపారు. తద్వారా ఒలింపిక్స్‌లోని రెజ్లింగ్, బాక్సింగ్, ఆర్చరీ, జావెలిన్ త్రో, హాకీ తదితర క్రీడల్లో రాణించే విధంగా వారిని తయారు చేస్తామని చెప్పారు. అందుకనుగుణంగా స్పోర్ట్స్ యూనివర్సిటీలో అంతర్జాతీయ ప్రమాణాలతో మౌలిక వసతులు కల్పించాలని దిశా నిర్దేశం చేశారు.

విద్యార్థుల్లోని క్రీడా నైపుణ్యాలు, వారికి ఏయే ఆటలపై మక్కువుందనే విషయాలను గుర్తించాలంటూ ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు సూచించారు. అలాంటి పిల్లలకు శిక్షణనిచ్చేందుకు వీలుగా ప్రతీ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఒక స్పోర్ట్స్ స్కూల్‌ను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ఆయా పాఠశాలల్లో చదువు కంటే ఎక్కువగా క్రీడలకు ప్రాధాన్యతనివ్వాలని అన్నారు. ఇటీవల ఒలింపిక్స్‌లో పతకాలు సాధించిన దేశాలు, క్రీడాకారుల వివరాలను సేకరించి, వారు పతకాల సాధనకు శ్రమించిన తీరును, ఆయా దేశాలు వారిని ప్రోత్సహించిన తీరును, ఇచ్చిన శిక్షణ తదితరాంశాలపై అధ్యయనం చేసి సమగ్ర నివేదికను సమర్పించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఇప్పటికే స్కిల్ యూనివర్సిటీకి యంగ్ ఇండియా అనే పేరును పెట్టామని, స్పోర్ట్స్ యూనివర్సిటీకి కూడా అదే పేరును ఖరారు చేశామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేయబోయే సమీకృత పాఠశాలలకు కూడా యంగ్ ఇండియా స్కూల్స్ అనే పేర్లనే పెడతామని తెలిపారు. ఈ రకంగా ప్రతీ విషయంలోనూ తెలంగాణ యంగ్ ఇండియాకు బ్రాండ్‌గా మారాలని ఆయన ఆకాంక్షించారు. క్రీడా నైపుణ్యాల్లో తెలంగాణ ఒక శక్తిమంతమైన రాష్ట్రంగా గుర్తింపు పొందడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలంటూ సీఎం ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు.



ఆల్‌రౌండర్లు కీలకం

భారత్‌తో టెస్టు సిరీస్‌పై పాట్ కమిన్స్

సిడ్నీ (ఆస్ట్రేలియా) : ప్రపంచ క్రికెట్‌లో ఆస్ట్రేలియా మళ్లీ అగ్రస్థానంలోకి చేరుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తోంది. 2023 వన్డే వరల్డ్‌కప్, 2023 ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ సహా 2021 టీ20 ప్రపంచకప్‌ను కంగారూలు కైవసం చేసుకున్నారు. టెస్టు, వన్డే, టీ20 ఫార్మాట్‌లో వరుసగా ఐసీసీ టైటిళ్లు సాధించిన ఆస్ట్రేలియా ఆధిపత్యం నిరూపించుకుంది. కానీ, గత పదేండ్లలో ఆస్ట్రేలియాకు బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ అందని ద్రాక్షగా మిగిలింది. 2014లో చివరగా బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని దక్కించుకున్న ఆస్ట్రేలియా.. ఆ తర్వాత ప్రతిష్టాత్మక టెస్టు సిరీస్‌పై పట్టు సాధించలేదు. ఇంగ్లాండ్‌తో యాషెస్ సిరీస్‌లోనూ పైచేయి సాధించినా.. భారత్‌ను టెస్టు ఫార్మాట్‌లో ఓడించటం కంగారూలకు కత్తి మీద సాముగా తయారైంది.

ఈ ఏడాది నవంబర్‌లో బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ ఆరంభం కానుంది. భారత్, ఆస్ట్రేలియా తొలిసారి టెస్టు సిరీస్‌లో ఐదు టెస్టుల్లో పోటీపడనున్నాయి. ఈ నేపథ్యంలో ఆస్ట్రేలియా క్రికెటర్లు వరుసగా భారత్‌తో టెస్టు సిరీస్ సవాల్‌పై పెదవి విప్పుతున్నారు. గతంలో క్రికెటర్ల మధ్య సిరీస్ ముంగిట మాటల యుద్ధం కనిపించగా.. ఇప్పుడు భిన్నంగా ఆసక్తికర అభిప్రాయాలు, అంచనాలను పంచుకుంటున్నారు. ఈ జాబితాలోకి ఆస్ట్రేలియా కెప్టెన్ పాట్ కమిన్స్ సైతం చేరారు. సోమవారం ఓ కార్యక్రమంలో పాల్గొన్న పాట్ కమిన్స్ రానున్న బోర్డర్ గవాస్కర్ టెస్టు సిరీస్‌పై ఆసక్తికర అంశాలను వెల్లడించారు.

గ్రీన్, మార్ష్ అదనపు బలం! : 'జట్టులో ఆల్‌రౌండర్లు ఉండటం అతిపెద్ద అనుకూలత. నిజానికి ఆల్‌రౌండర్లను మేము అనుకున్న ప్రణాళికలకు అనుగుణంగా ఉపయోగించలేదు. గత రెండు టెస్టు సీజన్లలో మ్యాచులు కాస్త తేలిగ్గానే సాగాయి. కానీ ఈ వేసవి అందుకు భిన్నంగా ఉండబోతుంది. కామెరూన్ గ్రీన్, మిచెల్ మార్ష్ నుంచి మరింత ఎక్కువగా ఆశించనున్నాం. నిజానికి కామెరూన్ గ్రీన్, మిచెల్ మార్ష్ బ్యాటింగ్ నైపుణ్యంతోనే తుది జట్టులో నిలువగలరు. ఈ ఇద్దరు జట్టులో ఉండటం మాకు అదనపు బలం. కామెరూన్ గ్రీన్ కెరీర్‌ను బౌలర్‌గానే మొదలెట్టాడు. కానీ టెస్టుల్లో మెగా స్పెల్స్‌లో బౌలింగ్ చేయలేదు. ఈ సీజన్‌లో కామెరూన్ గ్రీన్‌పై కాస్త ఎక్కువ ఆధారపడనున్నాం. తుది జట్టులో టాప్-6 ఆటగాళ్లు బ్యాటింగ్ నైపుణ్యంతో చోటు సాధిస్తారు. ఇందులో ఎటువంటి అనుమానం లేదు. నాథన్ లయాన్ జట్టులో ఉండటం మా అదృష్టం. అతడు మెజార్టీ ఓవర్లు వేయగల సమర్థుడు. జట్టుకు ఐదో బౌలింగ్ ఆప్షన్ ఉండటం.. వ్యత్యాసం చూపిస్తుంది. కామెరూన్ గ్రీన్, మిచెల్ మార్ష్ రూపంలో మాకు ఆరు బౌలింగ్ ఆప్షన్లు ఉండనున్నాయి' అని పాట్ కమిన్స్ అన్నాడు.

గత సీజన్‌లో ఆస్ట్రేలియా ఆడిన టెస్టులు ఎక్కువగా నాలుగు రోజుల్లోపే ముగిశాయి. పేస్ ఆల్‌రౌండర్లు జట్టులో ఉండటంతో ప్రధాన పేసర్లపై పని భారం గణనీయంగా తగ్గింది. మిచెల్ స్టార్క్, జోశ్ హేజిల్‌వుడ్, పాట్ కమిన్స్‌లు ప్రతి టెస్టులోనూ ఆడగలిగారు. పాకిస్థాన్, న్యూజిలాండ్, వెస్టిండీస్‌లపై పేస్ ఆల్‌రౌండర్లను ప్రయోగించిన ఆస్ట్రేలియా.. ప్రధాన పేస్ దళం ఫిట్‌నెస్‌ను కాపాడుకుంది. భారత్‌తో టెస్టు సిరీస్‌లోనూ ఆస్ట్రేలియా ఇదే ఫార్ములా అమలు చేసేందుకు సిద్ధమవుతోంది. కామెరూన్ గ్రీన్, మిచెల్ మార్ష్‌లు పేస్ బాధ్యతలు పంచుకుంటే.. ముగ్గురు ప్రధాన పేసర్లు స్టార్క్, హాజిల్‌వుడ్, కమిన్స్‌లు ఐదు టెస్టుల్లోనూ ఉత్సాహంగా బరిలోకి దిగేందుకు అవకాశం ఉంటుంది.

ట్రిపుల్ తలాక్ నేరమే



- చట్టం తీసుకురావడం సరైనదే : సుప్రీంలో సమర్థించుకున్న కేంద్రం

న్యూఢిల్లీ : మూడుసార్లు తలాక్ చెప్పడాన్ని నేరంగా పరిగణిస్తూ కేంద్ర ప్రభుత్వం చట్టం తీసుకురావడాన్ని సుప్రీం కోర్టులో ప్రభుత్వం సమర్థించుకుంది. ముస్లిం భర్తలు తమ భార్యలను అన్యాయంగా వదిలివేయడాన్ని ఈ పద్ధతి చట్టబద్ధం చేస్తోంది. వ్యవస్థాగతం చేస్తోంది, ఇదేమీ ఇస్లామిక్ కాదు, చట్టబద్ధమైనది కాదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు 433 పేజీల కౌంటర్ అఫిడవిట్‌ను కేంద్రం కోర్టులో దాఖలు చేసింది. ట్రిపుల్ తలాక్ ఏకపక్షంగా వుంటుందని షాయారా బానో కేసులో 2017లో సుప్రీం రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పును ఈ సందర్భంగా గుర్తు చేసింది.

మూడుసార్లు తలాక్ అని చెప్పి ఒక మహిళకు విడాకులు ఇవ్వడమనేది ప్రయివేటుగా జరుగుతున్న తప్పు కాదు, బహిరంగంగా జరుగుతోంది. దీనివల్ల మహిళలు హక్కులు దెబ్బతింటున్నాయి. వివాహ వ్యవస్థ దారుణంగా దెబ్బతింటోందని ప్రభుత్వం పేర్కొంది. దేశ రాజకీయ, ఆర్థిక, సామాజిక వ్యవస్థలో మార్పు వచ్చినప్పుడల్లా ఈ నేర భావన కూడా మారుతోందని కేంద్రం పేర్కొంది. ఎలాంటి చట్టబద్ధ లేదా మత బద్ధత లేని ఈ పద్ధతి వివాహితులైన ముస్లిం మహిళల పట్ల వివక్ష చూపుతోందని, ఇది నేరమని 2019లో తీసుకువచ్చిన చట్టం పేర్కొంటోంది. వివాహ వ్యవస్థ పవిత్రతను కాపాడేందుకు కావాలంటే ప్రభుత్వం క్రిమినల్ చట్టాన్ని ఆశ్రయించవచ్చని కోర్టు పేర్కొంది. వివాహాలు పర్సనల్ లా కిందకు వస్తాయనడంలో ఎలాంటి ప్రాతిపదిక లేదు. సాధారణ క్రిమినల్ చట్టం వర్తింపు నుండి కూడా వాటిని మినహాయించారు. వివాహమనేది సామాజిక వ్యవస్థ. దీన్ని పరిరక్షించడంలో ప్రభుత్వానికి ప్రత్యేక ప్రయోజనం వుంటుందని కేంద్రం పేర్కొంది. క్రిమినల్ చట్టానికి సంబంధించిన ఇతర సాధనాలు అంటే ఉదాహరణకు గృహ హింస చట్టం, వరకట్న నిషేధ చట్టం వంటి వాటిని ఉపయోగించి వివాహాల సుస్థిరతను ప్రభుత్వం కాపాడవచ్చని కేంద్రం వాదించింది.

ట్రిపుల్ తలాక్ విధానం చెల్లుబాటు కాదని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేయనందున దానిని నేరంగా పరిగణించాల్సిన అవసరం లేదన్న పిటిషన్‌పై కేంద్రం కౌంటర్ అఫిడవిట్‌ను దాఖలు చేసింది.


మహ్మద్ షమి అవుట్?

బంగ్లాదేశ్‌తో టెస్టు సిరీస్‌కు అనుమానం



బెంగళూర్ : భారత స్టార్ పేసర్ మహ్మద్ షమి స్వదేశీ సీజన్‌లో తొలి టెస్టు సిరీస్‌కు దూరం కానున్నాడు!. చీలమండ గాయానికి శస్త్రచికిత్స అనంతరం బెంగళూర్‌లోని జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)లో రిహాబిలిటేషన్‌లో ఉన్న మహ్మద్ షమి బంగ్లాదేశ్‌తో టెస్టు సిరీస్‌కు అందుబాటులో ఉండటం అనుమానంగా మారింది. ఎన్‌సీఏ వర్గాలు తొలుత షమి బంగ్లాదేశ్‌తో సిరీస్‌కు సిద్ధంగా ఉంటాడని ఆశించారు. సెప్టెంబర్ 19న కాన్పూర్‌లో, అక్టోబర్ 6న గ్వాలియర్‌లో భారత్, బంగ్లాదేశ్ టెస్టు సిరీస్ జరుగనుంది. కానీ టీమ్ ఇండియా మహ్మద్ షమి సేవలను కీలక ఆస్ట్రేలియాతో ఐదు టెస్టుల సిరీస్‌లో వినియోగించుకోవాలని అనుకుంటుంది. అక్టోబర్ 16న న్యూజిలాండ్‌తో తొలి టెస్టులో మహ్మద్ షమి బరిలోకి దిగే అవకాశం ఉంది. భారత్, ఆస్ట్రేలియా బోర్డర్ గవాస్కర్ టెస్టు సిరీస్ నవంబర్ 22న పెర్త్ టెస్టుతో ఆరంభం కానున్న సంగతి తెలిసిందే. మ్యాచ్ ఫిట్‌నెస్ నిరూపించుకునేందుకు అవసరమైతే బెంగాల్ తరఫున రంజీ ట్రోఫీలోనూ బరిలోకి దిగేందుకు మహ్మద్ షమి సిద్ధంగా ఉన్నట్టు తెలుస్తోంది.

అమన్ వరల్డ్ నం.2



న్యూఢిల్లీ : భారత రెజ్లర్, పారిస్ ఒలింపిక్స్ పతక విజేత అమన్ షెరావత్ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో కెరీర్ అత్యుత్తమ స్థానం సాధించాడు. మెన్స్ ఫ్రీ స్టయిల్ 57 కేజీల విభాగంలో ఒలింపిక్ కాంస్య పతకం సాధించిన అమన్ షెరావత్.. యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ (యుడబ్ల్యూడబ్ల్యూ) తాజాగా విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో నాలుగు స్థానాలు ఎగబాకి రెండో స్థానంలో నిలిచాడు. పారిస్ ఒలింపిక్స్‌లో పతకం సాధించిన ఏకైక భారత రెజ్లర్‌గా నిలిచిన అమన్ షెరావత్ 51600 పాయింట్లు సాధించాడు. జపాన్ రెజ్లర్ 59000 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచాడు.

నవచిత్రం

కమిటీ కుర్రోళ్ళకి మెగాస్టార్ ప్రశంసలు



నిహారిక, చిరంజీవి, యదు వంశీ

నిహారిక కొణిదెల సమర్పణలో పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ ఎల్.ఎల్.పి, శ్రీరాధా దామోదర్ స్టూడియోస్ బ్యానర్స్‌పై రూపొందిన చిత్రం 'కమిటీ కుర్రోళ్ళు'.

సీనియర్ నటీనటులతో పాటు 11 మంది హీరోలు, నలుగురు హీరోయిన్స్‌ను పరిచయం చేస్తూ ఈ చిత్రానికి యదు వంశీ దర్శకత్వం వహించారు.

ఈనెల 9న ఈ చిత్రం విడుదల అవ్వగా. డిఫరెంట్ కంటెంట్‌తో అన్ని వర్గాల వారిని ఆకట్టుకుని మంచి వసూళ్లను రాబడుతోంది.

అలాగే ప్రేక్షకులతో పాటు విమర్శకుల ప్రశంసలను అందుకున్న ఈ సినిమాకు సెలబ్రిటీల నుంచీ అభినందనలు దక్కుతున్నాయి. ఇప్పటికే మహేష్‌బాబు. రామ్ చరణ్, దర్శకులు ఎస్.ఎస్.రాజమౌళి, సుకుమార్, క్రిష్, సంగీత దర్శకుడు దేవిశ్రీప్రసాద్ తదితరులు ఈ చిత్ర టీమ్‌ను అభినందించారు. తాజాగా చిరంజీవి ఈ సినిమాను ప్రత్యేకంగా వీక్షించి, ఎంటైర్ టీమ్‌ను ప్రత్యేకంగా కలుసుకున్నారు.

ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ,' సినిమా చాలా చక్కగా ఉంది. అందరూ కొత్త కుర్రాళ్లే. చాలా బాగా చేశారు. ఎమోషనల్ సీన్స్ చాలా చక్కగా పండాయి. సినిమాను నేచురల్‌గా చిత్రీకరించటం ఎంటైర్ టీమ్ పడ్డ కష్టం గురించి ఎంత చెప్పినా తక్కువే, అది తెరపై కనిపించింది. రీజనబుల్ బడ్జెట్‌లో సినిమాను తెరకెక్కించిన దర్శకుడు యదువంశీకి ప్రత్యేకమైన అభినందనలు. రీసెంట్‌గా విడుదలైన సినిమాల్లో ఇది ముందంజలో ఉంటూ మంచి వసూళ్లను రాబడుతోంది' అని అన్నారు.

ప్రేక్షకుల్ని నవ్వించే పాత్ర చేశా..




రమ్య పసుపులేటి

రావు రమేష్, ఇంద్రజ జంటగా నటించిన సినిమా 'మారుతీ నగర్ సుబ్రమణ్యం'. లక్ష్మణ్ కార్య దర్శకత్వం వహించారు. అంకిత్ కొయ్య, రమ్య పసుపులేటి నాయకానాయికలు. పీబీఆర్ సినిమాస్, లోకమాత్రే సినిమాటిక్స్ సంస్థలపై బుజ్జి రాయుడు పెంట్యాల, మోహన్ కార్య నిర్మించారు. దర్శకుడు సుకుమార్ భార్య తబిత సమర్పణలో ఈ శుక్రవారం సినిమా విడుదల అవుతోంది. ఈ సందర్భంగా రమ్య పసుపులేటి మీడియాతో ముచ్చటించారు.

నాకు నాలుగైదేళ్ల వయసు ఉన్నప్పటి నుంచి యాడ్స్ చేస్తున్నాను. అనుష్క 'పంచాక్షరీ'లో బాలనటిగా చేశా. మహేష్ బాబు స్పైడర్'లోనూ ఓ రోల్ చేశా. ఆ తర్వాత చదువుకోవాలని గ్యాప్ తీసుకున్నాను. ప్రజలకు నేను బాగా రీచ్ అవ్వడానికి ఇన్‌స్టాగ్రామ్ హెల్ప్ అయ్యింది. దర్శకుడు లక్ష్మణ్ కార్య నన్ను ఇన్‌స్టాగ్రామ్‌లో చూశారట. ఆడిషన్‌లో నా పెర్ఫార్మన్స్ నచ్చడంతో ఎంపిక చేశారు. చాలా రోజుల తర్వాత మంచి అవకాశం రావడంతో హ్యాపీగా ఫీలయ్యాను. నవ్వించడం కష్టం. ప్రేక్షకుల్ని నవ్వించగలిగితే క్యారెక్టర్ పండినట్టు. ఇందులో నా పాత్ర ద్వారా నవ్వించే అవకాశం వచ్చింది. సినిమా చూసిన వాళ్లు అందరికీ నా రోల్ బాగా నచ్చుతుంది. ట్రైలర్ చూస్తే గ్లామర్, ట్రెడిషనల్... రెండు విధాలుగా కనిపిస్తా. 'మేడమ్ సార్ మేడమ్' సాంగ్ చూస్తే... నన్ను అన్ని విధాలుగా చూపించారు. నేను 18 ఇయర్స్ ఓల్డ్ అమ్మాయి రోల్ చేశా. క్యూట్ అండ్ క్రింజ్ లవ్ స్టోరీ ఉంటుంది. గ్లామర్, ట్రెడిషనల్... రెండు విధాలుగా కనిపిస్తా. ఇందులో నేను బబ్లీ, క్యూట్ అండ్ ఇన్నోసెంట్ అమ్మాయిని. కొంచెం తింగరితనం ఉంటుంది. కానీ, చాలా నవ్విస్తా. అంకిత్ కొయ్య వెరీ అమేజింగ్ కో యాక్టర్. మా ఇద్దరి మధ్య సన్నివేశాలు చాలా బావుంటాయి. రావు రమేష్, ఇంద్రజ వంటి సీనియర్లతో స్క్రీన్ షేర్ చేసుకోవడం చాలా సంతోషంగా ఉంది' అని రమ్య పసుపులేటి చెప్పారు.

అక్టోబర్ 10న రిలీజ్



రజనీకాంత్

రజనీకాంత్ హీరోగా లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రూపొందుతోన్న భారీ బడ్జెట్ చిత్రం 'వేట్టైయాన్'. దర్శకుడు టి.జె. జ్ఞానవేల్ తెరకెక్కిస్తున్న ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా అక్టోబర్ 10న భారీ ఎత్తున విడుదల చేస్తున్నారు.

బ్లాక్ బస్టర్ చిత్రాలు '2.0, దర్బార్, లాల్ సలామ్' వంటి చిత్రాల తర్వాత రజినీకాంత్, లైకా ప్రొడక్షన్ కలయికలో రాబోతున్న నాలుగో సినిమా ఇది. అలాగే పేట, దర్బార్, జైలర్ చిత్రాల తర్వాత రజినీకాంత్, అనిరుద్ రవిచందర్ కలయికలోనూ రానున్న నాలుగో సినిమా కూడా ఇదే కావటం విశేషం. భారీతారాణం కూడా నటిస్తుండటంతో సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. అమితాబ్ బచ్చన్ ఇందులో కీలక పాత్రలో నటిస్తున్నారు. అలాగే 'అంధాకానూన్, గిరఫ్తార్, హమ్' సినిమాల తర్వాత రజనీకాంత్, అమితాబ్ కలిసి నటిస్తోన్న నాలుగో సినిమా ఇది కావడం మరో విశేషం. మంజు వారియర్, ఫహాద్ ఫాజిల్, రానా దగ్గుబాటి, రితికా సింగ్, దుషరా విజయన్, రోహిణి, అభిరామి తదితరులు ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. లైకా ప్రొడక్షన్స్ హెడ్ జీకెఎం. తమిళ్ కుమరన్ ఆధ్వర్యంలో ఈ చిత్ర పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ పాన్ ఇండియా సినిమాను తమిళ, తెలుగు, హిందీ, కన్నడ భాషల్లో రిలీజ్ చేయబోతున్నారు.

నా ఫేవరేట్ నా పెళ్ళాం..



సుహాస్, సంగీర్తన


దిల్ రాజు ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రూపొందుతోన్న తాజా చిత్రం 'జనక అయితే గనక'. శిరీష్ సమర్పణలో హర్షిత్ రెడ్డి, హన్షిత ఈ సినిమాను నిర్మించారు.

సుహాస్ హీరోగా నటించిన ఈ చిత్రాన్ని సందీర్ రెడ్డి బండ్ల డైరెక్ట్ చేశారు. సెప్టెంబర్ 7న ఈ సినిమా గ్రాండ్ రిలీజ్ కానుంది.

హీరో సుహాస్ పుట్టినరోజు సందర్భంగా సోమవారం ఈ సినిమా నుంచి 'నా ఫేవరేట్ నా పెళ్లాం' సాంగ్‌ను లాంచ్ చేశారు. సంగీత దర్శకుడు విజయ్ బుల్గానిన్ స్వరాలు సమకూర్చిన ఈ పాటకు కృష్ణకాంత్ సాహిత్యం అందించారు.

నిర్మాత హర్షిత్ రెడ్డి మాట్లాడుతూ, 'యూనిక్ పాయింట్‌తో రాబోతున్న ఇంట్రెస్టింగ్ స్టోరీ ఇది. ప్రతీ భర్త తన భార్యకు డేడికేట్ చేయాల్సిన పాటే ' అని అన్నారు. 'ఈ స్టోరీని నాకు వినిపించిన హర్షిత్, హన్షితకి, జీవితంలో మరచిపోలేని సినిమా ఇచ్చిన మా డైరెక్టర్‌కి థ్యాంక్స్' అని హీరో సుహాస్ చెప్పారు. నిర్మాత దిల్‌రాజు మాట్లాడుతూ,'మిడిల్ క్లాస్ అబ్బాయి.. పెళ్లి చేసుకున్న తర్వాత పిల్లలు వద్దనుకుంటాడు. ఎందుకు పిల్లలు వద్దనుకుంటున్నాడు అనేదే ఈ కథ. డైరెక్టర్ తన రియల్ లైఫ్‌లో చూసిన ఇన్సిడెన్స్‌ను బేస్ చేసుకుని కథను రాశారు. సినిమా చూశాను. ఓ మంచి సినిమాను మీరు చూడబోతున్నారనే నమ్మకంతో ఉన్నాం' అని తెలిపారు.

వరల్డ్ ఆఫ్ వాసుదేవ్



కిరణ్ అబ్బవరం

హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న భారీ పీరియాడిక్ థ్రిల్లర్ సినిమా 'క'. ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ 'వరల్డ్ ఆఫ్ వాసుదేవ్..' ను మేకర్స్ సోమవారం రిలీజ్ చేశారు.

ఈ పాట వాసుదేవ్‌గా నటిస్తున్న హీరో క్యారెక్టరైజేషన్‌ను ఆవిష్కరించింది. ఈ పాటకు సనాపతి భరద్వాజ పాత్రుడు లిరిక్స్ రాయగా, సామ్ సీఎస్ బ్యూటిఫుల్‌గా కంపోజ్ చేశారు. కపిల్ కపిలన్ ఆకట్టుకునేలా పాడారు.

'ఏ మొదలు తుదలు లేని ప్రయాణం. ఏ అలుపూ సొలుపు లేని విహారం. ఏ చెరలు తెరలు తెలియని పాదం..ఈ మజిలీ ఒడిలో ఒదిగిన వైనం, నిన్న మొన్న ఉన్న నన్ను చూశారా..వెన్ను దన్ను అంటూ ఏముంది. ఒంటరివాడినని అంటారా నాతో పాటు ఊరుంది...' అంటూ హీరో వాసుదేవ్ పాత్రను ప్రతిబింబిస్తూ 'వరల్డ్ ఆఫ్ వాసుదేవ్..' పాట సాగటం విశేషం. ఈ సినిమాలో నయన్ సారిక, తన్వీ రామ్ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. చింతా వరలక్ష్మి సమర్పణలో శ్రీచక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్ పై చింతా గోపాలకృష్ణ రెడ్డి నిర్మిస్తున్నారు. దర్శక ద్వయం సుజీత్, సందీప్ విలేజ్ బ్యాక్‌డ్రాప్ యాక్షన్ థ్రిల్లర్ కథతో ఈ సినిమాను రూపొందిస్తున్నారు. ఈ సినిమా తెలుగుతో పాటు తమిళ, మలయాళ, కన్నడలో రిలీజ్ కానుంది.

ఆకాష్ జగన్నాథ్ హీరోగా తల్వార్



విజయేంద్రప్రసాద్, ఆకాష్ జగన్నాథ్

హీరో ఆకాష్ జగన్నాథ్ నటించబోయే యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రం 'తల్వార్'.

ఈ సినిమా సోమవారం హైదరాబాద్‌లో పూజతో లాంఛనంగా ప్రారంభమైంది. ఈ సినిమాను వార్నిక్ స్టూడియోస్ బ్యానర్ పై భాస్కర్ ఇ.ఎల్.వి నిర్మిస్తున్నారు. కొత్త దర్శకుడు కాశీ పరశురామ్ రూపొందిస్తున్నారు.

రచయిత విజయేంద్రప్రసాద్ ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ నివ్వగా, హీరో కార్తికేయ స్క్రిప్ట్ హ్యాండోవర్ చేశారు. డైరెక్టర్ బాబీ కెమెరా స్విచ్చాన్ చేయగా, డైరెక్టర్ బుచ్చిబాబు సాన ఫస్ట్ షాట్ డైరెక్షన్ చేశారు. త్వరలోనే ఈ సినిమా రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభించుకోనుంది. ఈ చిత్రంలో భారీ తారాగణం నటించబోతున్నారు. వారి వివరాలను త్వరలో వెల్లడించనున్నారు. ఈ చిత్రానికి ఆర్ట్ డైరెక్టర్ - విఠల్, ఎడిటర్ - ఐల శ్రీనివాసరావు, సినిమాటోగ్రఫీ - త్రిలోక్ సిద్ధు, మ్యూజిక్ డైరెక్టర్ - కేశవ కిరణ్.

హిట్ జంటతో క్రైమ్ కామెడీ థ్రిల్లర్



శివాజీ, లయ

శ్రీ శివాజీ ప్రొడక్షన్స్ బ్యానర్ పై ప్రొడక్షన్ నెం.2గా శివాజీ, లయ హీరో, హీరోయిన్లుగా ఓ సరికొత్త క్రైమ్ కామెడీ థ్రిల్లర్ రూపుదిద్దుకుంటోంది.

ఈ సినిమాతో సుధీర్ శ్రీరామ్ దర్శకుడిగా పరిచయం కాబోతున్నారు. ఈ సినిమాకి నిర్మాత కూడా శివాజీ కావడం మరో విశేషం. ఈ చిత్ర పూజా కార్యక్రమాలు ఇటీవలే నిర్వహించారు. ప్రొడ్యూసర్ దిల్ రాజు క్లాప్ కొట్టగా, శివాజీ కుమారుడు రిక్కీ కెమెరా స్విచ్ ఆన్ చేసారు. నిర్మాతలు బెక్కెం వేణుగోపాల్, దిల్ రాజు, దర్శకులు బోయపాటి శ్రీను చేతుల మీదుగా స్క్రిప్ట్‌ని అందుకోగా, ఫస్ట్ డైరెక్షన్ బోయపాటి శ్రీను చేశారు. గతంలో శివాజీ, లయ జంటగా కలిసి నటించిన 'మిస్సమ్మ', 'టాటా బిర్లా మధ్యలో లైలా', 'అదిరిందయ్యా చంద్రం' చిత్రాలు బాక్సాఫీస్ వద్ద భారీ విజయం సాధించడమే కాకుండా ఇద్దరికీ హిట్ పెయిర్ అనే ట్యాగ్‌ని కూడా అందించాయి. మళ్ళీ వీరు జంటగా నటించనుండటంతో అటు పరిశ్రమలో, ఇటు ప్రేక్షకుల్లో అమితాసక్తి నెలకొంది. ఈ నెల 20 నుండి ఈ చిత్ర రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభం కానుంది.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

జమ్ముకాశ్మీర్‌కు రాష్ట్రహోదా

- 12 హామీలతో ఎన్‌సి మ్యానిఫెస్టో విడుదల



శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలు నేపథ్యంలో నేషనల్ కాన్ఫరెన్స్ సోమవారం తన మ్యానిఫెస్టో విడుదల చేసింది. ఆర్టికల్ 370 పునరుద్ధరణ, జమ్ముకాశ్మీర్‌కు రాష్ట్ర హోదా, 2000లో అప్పటి అసెంబ్లీ ఆమోదించిన స్వయం ప్రతిపత్తి తీర్మానాన్ని అమలు చేయడం.. వంటి 12 హామీలను మ్యానిఫెస్టోలో పొందుపర్చింది. పార్టీ కార్యాలయంలో ఇతర నాయకులతో కలిసి పార్టీ ఉపాధ్యక్షులు ఒమర్ అబ్దుల్లా మ్యానిఫెస్టోను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పార్టీ నెరవేర్చగల హామీలను మాత్రమే ఇస్తుందని అన్నారు. జమ్ముకాశ్మీర్‌లో సెప్టెంబరు 18, సెప్టెంబరు 25, అక్టోబర్ 1న మూడు దశల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. అక్టోబర్ 4న ఫలితాలు ప్రకటించనున్నారు.

విస్తృత సంప్రదింపుల తరువాతే

- బ్రాడ్‌కాస్టింగ్ బిల్లుపై ముందుకు : కేంద్ర మంత్రి

న్యూఢిల్లీ : డ్రాఫ్ట్ బ్రాడ్‌కాస్టింగ్ బిల్లు 2023ను తాత్కాలికంగా నిలిపివేశామని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ, ఐటి శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఇతర భాగస్వాములతో విస్తృత సంప్రదింపుల తరువాతే ఈ బిల్లుపై ముందుకు వెళతామని చెప్పారు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ కంటెంట్ సృష్టికర్తలను ప్రోత్సహించేందుకే ఈ బిల్లును తయారు చేస్తున్నామని, వేరే విధంగా అర్థం చేసుకోవద్దని చెప్పారు. ప్రస్తుతం ఈ డ్రాఫ్ట్ బిల్లును పబ్లిక్ డొమైన్‌లో ప్రభుత్వం అందుబాటులో ఉంది. ఈ బిల్లుపై సూచనలు, వ్యాఖ్యలకు అక్టోబర్ 15 వరకూ గడువు ఉంది. ఈ గడువు తరువాత కూడా విస్తృతంగా సంప్రదింపులు ఉంటాయని, అప్పటి వరకూ పార్లమెంట్‌లో కూడా ప్రవేశపెట్టబోమని మంత్రి తెలిపారు.

శాంతియుత పరిష్కారానికి సాయపడతాం

- ఉక్రెయిన్‌లో పర్యటనకు ముందు కేంద్రం ప్రతిపాదన

న్యూఢిల్లీ : ఉక్రెయిన్‌లో ఘర్షణలకు శాంతియుత పరిష్కారాన్ని కనుగొనడానికి సహాయపడేందుకు సిద్ధంగా వున్నట్లు భారత్ సోమవారం తెలిపింది. ఉక్రెయిన్‌లో ప్రధాని మోడీ పర్యటించడానికి కొద్ది రోజులు ముందుగా భారత ప్రభుత్వం ఈ ప్రతిపాదన చేసింది. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో చర్చలు జరిపేందుకు ఈ నెల 23న మోడీ కీవ్ (ఉక్రెయిన్ రాజధాని)కు వెళ్లనున్నారు. భారత్ ఎప్పుడూ దౌత్యాన్ని, చర్చల ప్రక్రియనే ప్రోత్సహిస్తుందని విదేశాంగ శాఖ కార్యదర్శి (పశ్చిమ) తన్మయ లాల్ మీడియా సమావేశంలో చెప్పారు. అధ్యక్షుడు జెలెన్‌స్కీతో భేటీలో దీనిపై కూడా చర్చ ఉంటుందని తెలిపారు. అటు రష్యా ఇటు ఉక్రెయిన్ రెండు దేశాలతో భారత్ సంబంధాలు కొనసాగిస్తోంది.

యుపి ఆసుప్రతిలో ఘోరం

- దళిత నర్సుపై డాక్టర్ అత్యాచారం

లక్నో : ఉత్తరప్రదేశ్‌లోని మొరాదాబాద్‌లోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో దారుణం జరిగింది. ఒక దళిత నర్సును నిర్బంధించి డాక్టర్ అత్యాచారానికి పాల్పడ్డాడు. మరో ఇద్దరు ఈ దారుణానికి సహకరించారు. ఆదివారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటనపై బాధితురాలి తండ్రి సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ కేసులో ముగ్గురిని అరెస్టు చేసినట్లు మొరాదాబాద్ పోలీసు సూపరింటెండెంట్ (రూరల్) సందీప్ కుమార్ మీనా సోమవారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం బాధితురాలు గత ఏడునెలల నుంచి ఈ ప్రైవేటు ఆసుపత్రిలో పని చేస్తోంది. ఆదివారం రాత్రి కూడా విధులకు వెళ్లింది. అర్ధరాత్రి సమయంలో మరో నర్సు మెహనాజ్ డాక్టర్ షానవాజ్‌ను ఆయన గదిలో కలవాలని కోరింది. బాధితురాలు అందుకు నిరాకరించడంతో మెహనాజ్, వార్డ్ బాయ్ జునైద్ ఆమెను బలవంతంగా ఆసుపత్రిపై అంతస్తులోని గదికి తీసుకెళ్లి బయట నుంచి తాళం వేశారు. తరువాత డాక్టర్ షానవాజ్ గదిలోకి వచ్చి ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. చంపేస్తానని బెదిరింపులకు, కుల దూషణలకు కూడా పాల్పడ్డాడు. ముగ్గురు నిందితుల్ని పోలీసులు అరెస్టు చేశారు. చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కులదీప్‌సింగ్ మార్గదర్శకాల మేరకు ఆసుపత్రిని సీజ్ చేశారు.

కలిసికట్టుగా పనిచేయండి

- పదోన్నతులు పొందిన విద్యుత్ అధికారులతో డిప్యూటీ సీఎం భట్టి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణ రాష్ట్ర దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్) లో పదోన్నతులు పొందిన అధికారులు, ఉద్యోగులు అంతా కలిసికట్టుగా పనిచేయాలని డిప్యూటీ సీఎం, విద్యుత్, ఆర్థిక శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మంచి పని వాతావరణం కల్పించడం కోసమే 2017 నుంచి పెండింగ్‌లో ఉన్న పదోన్నతుల్ని ఇచ్చామని చెప్పారు. సోమవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో టీజీఎస్పీడీసీఎల్‌లో పదోన్నతులు పొందిన అధికారులు, ఉద్యోగులు మంత్రిని కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల జీవితాల్లో మార్పు అంటే వారి జీవనస్థితిగతులు మారడం, కొనుగోలు శక్తి పెరగడం, రాష్ట్ర సంపదలో భాగస్వాములు కావడమేననీ, అప్పుడే పోరాడి తెచ్చుకున్న ప్రత్యేక రాష్ట్రానికి ఫలితం ఉంటుందని చెప్పారు. ఏడున్నరేండ్లుగా ప్రమోషన్ల కోసం ఎదురుచూస్తున్న విద్యుత్ ఉద్యోగులందరినీ ప్రజా ప్రభుత్వం గుర్తించిందనీ, వారికి పదోన్నతులు ఇవ్వాలని తనతోపాటు సీఎం, మంత్రిమండలి సభ్యులు నిర్ణయించారని తెలిపారు. ప్రజాసేవ కోసమే మనమంతా పనిచేస్తున్నామని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. ఉద్యోగుల కష్టసుఖాల్లో ప్రభుత్వం పూర్తిగా అండగా ఉంటుందన్నారు. అధికారులు, ఉద్యోగులు పెట్టే ప్రతి సంతకం, తీసుకునే ప్రతి నిర్ణయం, చేసే ప్రతి పని సామాన్యునికి ఉపయోగపడేలా ఉండాలనీ, పనిలో మానవీయకోణం ఉండాలని సూచించారు.

ఆస్కీ డైరెక్టర్‌గా డాక్టర్ ఎన్ రమేష్‌కుమార్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఆస్కీ) డైరెక్టర్‌గా డాక్టర్ ఎన్ రమేష్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. 1982 బ్యాచ్ ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు చెందిన ఆయన రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణ గవర్నర్‌కు ప్రిన్సిపల్ సెక్రటరీగా, ఆ తర్వాత స్పెషల్ చీఫ్ సెక్రటరీగా పనిచేసి రిటైర్ అయ్యారు. గతంలో ఆయన తిరుమల తిరుపతి దేవస్థానం జాయింట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా, వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్‌గా, వ్యవసాయం, సహకార, మార్కెటింగ్, హౌసింగ్ డిపార్ట్‌మెంట్ల ప్రధాన కార్యదర్శి, ఆర్థిక కార్యదర్శిగా విధులు నిర్వర్తించారు. పదవీ విరమణ తర్వాత 2016-21లో కొత్తగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించారు.

కేటీఆర్‌ను కలిసిన శ్రీలంక మంత్రి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

శ్రీలంక వాణిజ్య, పర్యావరణ శాఖల మంత్రి సతాశివన్ వియలందేరన్ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కే తారకరామారావు (కేటిఆర్)ను మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రపంచవ్యాప్తంగా నిరుద్యోగ సమస్య పెరిగుతుంటే, పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో హైదరాబాద్‌లో అనేక కొత్త ఉద్యోగాలను సృష్టించారని కొనియాడారు. అన్నిరంగాల పరిశ్రమలకు సమాన అవకాశాలు కల్పిస్తూ, సమ్మిళిత అభివృద్ధిని సాధించారని చెప్తూ, మాజీ మంత్రి కేటీఆర్‌ను అభినందించారు. ఈ సందర్భంగా శ్రీలంక మంత్రిని కేటీఆర్ శాలువతో సత్కరించి, జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, పార్టీ నాయకులు జాజుల సురేందర్, దాసోజు శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా కాలుష్య కుంపటి!

20 వేల ఎకరాల్లో 10 క్లస్టర్లు

- సంగారెడ్డిలో 2003.. మెదక్‌లో 900 ఎకరాలు
- దప్పూరులోనే 1465 ఎకరాల పంట భూములు మాయం
- ప్రాణాలు పోయినా భూములివ్వబోమంటున్న రైతులు
- రెండు పంటలు పండే భూములుపోతే బతికేదెట్ల..
- నిమ్జ్ పేర రాని కంపెనీలకు వేల ఎకరాలు లాక్కుంద్రు
- ఇప్పటికే కాలుష్యభూతంలో సంగారెడ్డి జిల్లా
- నవతెలంగాణ బృందం పరిశీలన...



'ఏటా రెండు పంటలు పండే బంగారం లాంటి నల్లరేగడి భూమి మాది. 11 ఎకరాల్లో రెండు బావులు, ఒక బోరు ఉండటంతో పత్తి పండిస్త. పైరు ఏపుగా పెరిగిన సంబరంలో ఉండగా సర్వే అంటూ భూమిలోకి వచ్చిండ్రు. ఇదేమిటని అడిగితే ఇక్కడ కంపెనీలొస్తయి నీ భూమంతా తీసుకుంటరని చెప్పిండ్రు. తరాలుగా భూమే జీవనాధారంగా బతికే మాకు దాన్ని లేకుండా చేస్తే బతికేదెట్ల..? ప్రాణం పోయినా భూమివ్వం. ఎకరం కోటి పలుకుతోంది. రెండు పంటలు పండితే కుటుంబం గడుస్తుంది. ఎవడో కంపెనీ పెడ్తంటే మా భూములెందుకివ్వాలి' ఇదీ..! దప్పూరుకు చెందిన రైతు బుర్జు అరుణ్‌గౌడ్ ఆవేదన.

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

పసిడి పంటలు, పాడి పశువులతో ప్రకృతి ఒడిలో ప్రశాంతంగా ఉన్న పచ్చని పల్లెల్లో ఫార్మా కంపెనీల కాలుష్య కుంపటిని రగిలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూనుకుంది. దీనికోసం రెండు పంటలు పండే ఖరీదైన భూముల్ని అప్పనంగా లాగేసుకుంటారన్న వార్తలతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఇప్పటికే గత పాలకులు లేని కంపెనీలకు నిమ్జ్ పేర వేల ఎకరాల్ని లాక్కున్నారు. మళ్లీ అదే ప్రాంతంలో రెండు వేల ఎకరాల్ని సేకరించేందుకు ప్రస్తుత పాలకులు సర్వే చేపట్టారు. ఇప్పటికే ఫార్మా కంపెనీలు వెదజల్లే కాలుష్యంతో సంగారెడ్డి, పటాన్‌చెరు ప్రాంత ప్రజలకు ఊపిరాడటం లేదు. తాజాగా జహీరాబాద్ ప్రాంతంలో కంపెనీల పేర మూడూర్లను మింగనున్నారు. సంగారెడ్డి జిల్లాలో 2003, మెదక్ జిల్లాలో 900 ఎకరాల్ని ఫార్మా క్లస్టర్ల కోసం సేకరించాలని అధికారులు ప్రతిపాదించారు. భూముల్ని గుర్తించేందుకు సర్వే చేపట్టారు. ఏండ్ల తరబడి మట్టినే నమ్ముకొని బతుకుతున్న తమను కంపెనీలు పెట్టి వెళ్లగొడితే బతికేదెట్ల..? అని ఆ ప్రాంతాన్ని నవ తెలంగాణ బృందం సందర్శించినప్పుడు రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

10 ఫార్మా క్లస్టర్లు.. 20 వేల ఎకరాలు

రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ ఫీల్డ్ ఫార్మా క్లస్టర్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో 9 జిల్లాల్లో 20 వేల ఎకరాల్ని సేకరించి 10 ఫార్మా క్లస్టర్లను ఏర్పాటు చేయనుంది. వికారాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, మేడ్చల్, మల్కాజిగిరి, యాదాద్రిభువనగిరి, నల్లగొండ జిల్లాల్లో ఫార్మా క్లస్టర్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. విదేశీ పర్యటనలో అంతర్జాతీయ ఫార్మా కంపెనీల ప్రతినిధులతో చర్చలు జరిపిన సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు కావాల్సిన భూముల్ని సమకూర్చుతామని హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. అంతర్జాతీయ విమానాశ్రయానికి 60 కిలో మీటర్లలోపే భూముల్ని సేకరించే పనిలో అధికారులు సిద్ధమయ్యారు. ఇప్పటికే వికారాబాద్ జిల్లాలోని కొడంగల్ నియోజకవర్గంలో భూ సేకరణ షురూ చేశారు. రంగారెడ్డి జిల్లా ముచ్చర్లలో 20 వేల ఎకరాల్లో ఫార్మా సిటీ పెట్టాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రభుత్వం దాన్ని రద్దు చేసింది. ఒకే చోట ఫార్మా సిటీ పెడితే వ్యతిరేకత వస్తున్నందున రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో 10 క్లస్టర్లు ఏర్పాటు చేయబోతుంది. ఒక క్లస్టర్‌లో మూడు, నాలుగు ఫార్మా విలేజీలుంటాయి. రంగారెడ్డి జిల్లా ముచ్చర్లలో ఇప్పటికే 9 వేల ఎకరాలు అందుబాటులో ఉండగా, నల్లగొండ జిల్లాలో 1300, వికారాబాద్ జిల్లాలో 1373 ఎకరాలు సేకరించనున్నారు. మెదక్ జిల్లాలో 900, సంగారెడ్డి జిల్లాలో మూడు గ్రామాల్లోనే 2003 ఎకరాలు సేకరిస్తున్నారు.

మూడు ఊర్లు.. 2003 ఎకరాలు

సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలోని డప్పూర్, వడ్డి, మాల్గి మూడు ఊర్లలో 2003 ఎకరాల్ని సేకరించాలని గుర్తించారు. డప్పూర్‌లోనే 1465.25 ఎకరాలకు గాను ప్రభుత్వ భూమి 491.24 ఎకరాలు, పట్టా భూమి 974.01 ఎకరాలు సేకరిస్తారు. ఊర్లో 450 కుటుంబాలున్నాయి. 3 వేల ఎకరాల భూములుండగా చెర్వు, కుంటలు, వాగులు, గుట్టలు, ఊరు, రోడ్లు పోగా మిగిలింది రెండు వేల ఎకరాలు. ఆ భూమంతా నీటి లభ్యత ఉండటంతో బోర్లు, బావులు తవ్వి పత్తి, చెరకు, కూరగాయలు, ఇతర వాణిజ్య పంటల్ని పండిస్తున్నారు. రెండు పంటలు పుష్కలంగా పండటంతో రైతులు ప్రశాంతంగా జీవిస్తున్నారు. ఉన్నట్టుండి పొలాల్లో సర్వేయర్లు దిగడంతో రైతుల్లో దిగులు మొదలైంది. కురుబొద్దీన్, లాల్‌మహ్మద్, నన్నేసాబ్ మూడు కుటుంబాలకున్న 30 ఎకరాలు పోతుంది. జానిపాషకు ఆరు ఎకరాలు, లసుముకొండకున్న 5.10 ఎకరాలు పోనుంది.

భూమి పోతే పిల్లలు బతికేదెట్ల అని నవతెలంగాణ బృందం ఎదుట కన్నీరు పెడుతున్నారు. ఇలా ఆ ఊరిలో ఒక్కరా.. ఇద్దరా.. 200 కుటుంబాలకు చెందిన 93 సర్వే నెంబర్లలో ఉన్న వెయ్యి ఎకరాల పట్టా భూములు పోనున్నాయి. వడ్డీ గ్రామంలోనూ 11 సర్వే నెంబర్లలో ఉన్న 282.13 ఎకరాలకు గాను 220.23 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. మరో 61.30 ఎకరాల పట్టా భూముల్ని సేకరిస్తారు. మాల్గి గ్రామంలోనూ 256.01 ఎకరాలకు గాను 195.10 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా.. మరో 60.31 ఎకరాల పట్టా భూములు పోనున్నాయి. మూడు గ్రామాల్లో కలిపి 1096 ఎకరాల్ని కంపెనీల పేర లాక్కోనున్నారు. మెదక్ జిల్లాలోని మాసాయిపేట మండలంలోని అచ్చంపేటలో 60 నుంచి 86 వరకు, 115,129,130 సర్వే నెంబర్లలో 629 ఎకరాలు, హకీంపేటలోని 12,17,19,20, 95 సర్వే నెంబర్ల నుంచి 150 ఎకరాలు, రామంతాపూర్‌లో 389 సర్వే నెంబర్‌లో 120 ఎకరాల్ని సేకరిస్తున్నారు.

పల్లెల్లో కాలుష్య కుంపటి..

పచ్చని పొలాలు, అడవులతో విరాజిల్లే పల్లెల్లో ఫార్మా కంపెనీలు పెట్టడం వల్ల పర్యావరణం విధ్వంసం అవ్వద్ది. కంపెనీలు వదిలే కాలుష్య జలాలతో భూగర్భ జలాలు కలుషితమై పంటలే కాదు జీవరాసులూ బతికే పరిస్థితి ఉండదు. విష వాయువుల వల్ల చుట్టూ పాతిక కిలోమీటర్ల వరకు ఊపిరి పీల్చడమే కష్టమవుద్దని పర్యావరణ వేత్తలు అంటున్నారు. సంగారెడ్డి, పటాన్‌చెరు, హత్నూర, జిన్నారం, ఖాజీపల్లిలో నెలకొన్న ఫార్మా కంపెనీల నుంచి నిత్యం వెలువడే వాయు, జల, వ్యర్థ కాలుష్యంతో ప్రజలు ఊపిరాడక చస్తూ బతుకుతున్నారు. పంటలు సైతం పాడైపోతున్నాయి. తాజాగా న్యాల్‌కల్ మండంలోని డప్పూర్, వడ్డీ, మాల్గి గ్రామాల్లోనూ ఫార్మా కంపెనీలు రాబోతున్నట్టు అధికారిక వర్గాల సమాచారం.

భూములు లాక్కోవద్దంటూ వినతి

ఫార్మా కంపెనీల కోసం తమ భూముల్ని లాక్కోవద్దంటూ మూడు ఊర్ల రైతులు తహసీల్దార్‌కు విన్నవించారు. వందలాది మంది రైతులు న్యాల్‌కల్ మండల కేంద్రంలో నిరసన తెలిపారు. ప్రాణంలాంటి భూముల్ని లాక్కుంటే మా ప్రాణం పోయినట్టేనని, మమ్మల్ని చంపి కంపెనీలకు భూములు తీసుకోండి అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. సర్వే చేయొద్దంటూ వేడుకున్నారు.

బలవంతపు భూసేకరణ ఆపాలి: రామచంద్రం, సీపీఐ(ఎం) జిల్లా నాయకులు

న్యాల్‌కల్ మండలంలో రెండు వేల ఎకరాల పంట భూముల్ని బలవంతంగా లాక్కోవడం ఆపాలి. ఫార్మా కంపెనీల పేర రైతుల్ని రోడ్డున పడేయొద్దు. ఇప్పటికే నిమ్జ్ పేర వేల ఎకరాల్ని తీసుకున్నారు. మళ్లీ మూడు ఊర్లల్లో రెండు వేల ఎకరాల్ని తీసుకుంటే ఆ ఊర్ల ప్రజలు ఏం చేసి బతకాలి. నిర్వాసితుల పక్షాన సీపీఐ(ఎం) పోరాడుతుంది.

భూముల్ని లాక్కుంటే రైతేం కావాలి



భూముల్ని లాక్కుంటే రైతులేం కావాలి. పడావు ప్రభుత్వ భూముల్లో కంపెనీలు పెట్టాలి. పంటలు పండే పట్టా భూముల్ని కంపెనీలకిస్తే రైతులంతా పట్టణాలకెళ్లి కూలీలుగా బతకాల్నా..? మా భూముల్ని అన్యాయంగా తీసుకుంటే సహించం. మాకు భూమే జీవనాధరం. భూమికి భూమి ఇస్తే తప్ప మాకు న్యాయం జరగదు.

– ఎండీ అజీమ్, మాల్గి

భూమి పోతే ఏం చేసి బతకాలి



పంట భూములు పోతే మేం ఏం చేసి బతకాలి. రెండు పంటలు పండే భూముల్ని కంపెనీలకు తీసుకోవడం దారుణం. మార్కెట్‌లో ఎకరం ధర కోటి ఉంది. సర్కార్ మొక్కుబడిగా ఇస్తమంటే మేమెట్ల భూమి ఇస్తం. సర్వే పనుల్ని అడ్డుకుంటాం. మా భూముల్లో కంపెనీలు పెట్టి మమ్ముల్ని ఊర్లోంచి వెళ్లగొట్టే కుట్ర సరైంది కాదు.

– శివరాజ్: దప్పూర్, రైతు

చికాగోలో పాలస్తీనాకు సంఘీభావంగా భారీ ర్యాలీ



చికాగోలో సోమవారం డెమొక్రాటిక్ నేషనల్ కన్వెన్షన్ హాలుకి వెలుపల పాలస్తీనాకు సంఘీభావంగా నిర్వహించిన భారీ ప్రదర్శన. గాజాలో తక్షణమే కాల్పుల విరమణకు డిమాండ్ చేస్తూ సాగిన ఈ ప్రదర్శనలో 40 వేల మంది వరకూ పాల్గొన్నారు.

విస్తరించిన దాడులు !

- శిధిలాల్లోనే పాలస్తీనియన్ల జీవనం
- అంతర్జాతీయ కార్యాచరణకు పిలుపిచ్చిన హమాస్

గాజా : ఇప్పటివరకు పదాతి దాడులు జరగని సెంట్రల్ డేర్ అల్ బాలాహ్‌లో తమ సైన్యం దాడులకు ఉపక్రమించిందని మిలటరీ ప్రకటించింది. అక్కడ నుండి ఖాళీ చేయాల్సిందిగా పాలస్తీనియన్లను ఆదేశించింది. కాగా పాలస్తీనియన్లు కేవలం శిధిలాల్లోనే జీవిస్తున్నారని ఐక్యరాజ్య సమితి పాలస్తీనా శరణార్థుల సంస్థ (యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎ) ప్రతినిధి లూయిస్ వాటరిడ్జ్ వ్యాఖ్యానించారు. ఎక్కడికక్కడ ఖాళీ చేయాలని, ఇతర ప్రాంతాలకు తరలిపోవాలని ఆదేశాలు జారీ చేస్తున్న నేపథ్యంలో వారికి ఆ శిధిలాల్లో నివసించడం మినహా మరో అవకాశం లేకుండా పోయిందని అన్నారు. దాడులు అడ్డూ అదుపు లేకుండా కొనసాగుతునే వున్నాయని అన్నారు.

ప్రాంతీయ ఉద్రిక్తతలు పెచ్చరిల్లుతున్న తరుణంలో మధ్యప్రాచ్యానికి పలు ఎయిర్‌లైన్స్ సంస్థలు మరిన్ని విమానాలను రద్దు చేశాయి.

సహాయక కార్యకలాపాలు చేపట్టే కార్యకర్తలపై ఇజ్రాయిల్ జరుపుతున్న దాడులకు వ్యతిరేకంగా అంతర్జాతీయ కార్యాచరణకు హమాస్ పిలుపిచ్చింది. గాజాలో ఇజ్రాయిల్ సాగిస్తున్న దాడులను, ఊచకోతలను నేరపూరితమైన చర్యలుగా, ఉల్లంఘనలుగా పరిగణించాలని అన్ని దేశాలను కోరింది. ఆధునిక చరిత్రలోనే అత్యంత హేయమైన ఊచకోతను తమ ప్రజలు గత పది మాసాలుగా అనుభవిస్తున్నారని హమాస్ ఒక ప్రకటనలో పేర్కొంది. ప్రపంచ మానవతా దినోత్సవం సందర్భంగా ఈ ప్రకటన జారీ చేసింది.

గాజాలో కాల్పుల విరమణ ఒప్పందానికి ఇదే చివరి అవకాశం : బ్లింకెన్

టెల్ అవీవ్ : గాజాలో కాల్పుల విరమణ ఒప్పందానికి ఇదే చివరి అవకాశమని అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ సోమవారం వ్యాఖ్యానించారు. ఈ ఒప్పందం కోసమే బ్లింకెన్ ఆదివారం టెల్‌అవీవ్ చేరుకున్నారు.

గాజా కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇక ఖరారు చేయాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. ఈ ఒప్పందం పూర్తయి, హమాస్ చేతిలో ఉన్న బందీలను ఇజ్రాయిల్‌కు అప్పగిస్తే, గాజాలో గత 10 నెలలుగా సాగుతున్న ఊచకోతలు, దాడులు నుండి పాలస్తీనియన్లకు ఉపశమనం కలుగుతుందన్నారు.

"ఇది నిర్ణయాత్మకమైన క్షణం. బందీలను ఇంటికి చేర్చడానికి, కాల్పుల విరమణకు, శాంతి భద్రతలు కల్పించడానికి, ప్రతి ఒక్కరినీ మెరుగైన స్థితిలో వుంచేందుకు ఇదే ఉత్తమమైనది. చివరిది కావచ్చు" అని ఇజ్రాయిల్ అధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్‌తో చర్చల అనంతరం బ్లింకెన్ వ్యాఖ్యానించారు. ఈ ప్రక్రియను నిర్వీర్యం చేసేందుకు ఎవరూ ఎలాంటి చర్యలు తీసుకోకుండా చూసుకోవాల్సిన సమయం కూడా ఇదేనని అన్నారు.

గాజాలో దాడులు ప్రారంభమైనప్పటి నుండి బ్లింకెన్ మధ్యప్రాచ్యంలో పర్యటించడం ఇది తొమ్మిదవసారి. కాల్పుల విరమణ ఒప్పందంపై చర్చలు జరిపేందుకు మధ్యవర్తిత్వం నెరుపుతున్న దేశాల ప్రతినిధులు ఈ వారంలో కైరోలో సమావేశం కానున్నారు. ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూ, రక్షణ మంత్రిలతో చర్చల అనంతరం బ్లింకెన్ మంగళవారం ఈజిప్ట్ వెళ్లనున్నారు. కాగా ఈ తాజా ప్రతిపాదనపై హమాస్ తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది.

గ్రాట్యుటీ ఉద్యోగి హక్కు : హైకోర్టు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పదవి విరమణ పొందిన ఉద్యోగికి ఇచ్చే గ్రాట్యుటీ వాళ్ల హక్కనీ, అదెవరి దయాదాక్షిణ్యాలపై ఇచ్చేది కాదని హైకోర్టు మరోసారి తీర్పు చెప్పింది. గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును తాజాగా డివిజన్ బెంచ్ ఆమోదించింది. ఈసీఐఎల్ దాఖలు చేసిన అప్పీల్‌ను కొట్టేసింది. పెంచిన గ్రాట్యుటీకి ఉద్యోగులు అర్హులంటూ ప్రావిడెంట్ ఫండ్ అప్పీలేట్ అథారిటీ తీర్పును ఆ సంస్థ హైకోర్టులో సవాల్ చేస్తే సింగిల్ జడ్జి కొట్టేశారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ అప్పీల్ దాఖలు చేయగా, ఈ పిటిషన్‌ను కూడా చీఫ్ జస్టిస్ బెంచ్ సోమవారం డిస్మిస్ చేసింది. 2007 నుంచి10 వరకు పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు రూ.3.5 లక్షలు కాకుండా రూ.10 లక్షలు చెల్లించాలన్న అథారిటీ తీర్పును ఆమోదించిన సింగిల్ జడ్జి తీర్పులో జోక్యం చేసుకునేందుకు నిరాకరించింది. గ్రాట్యుటీ మొత్తాన్ని రూ.10 లక్షలకు పెంచుతూ 2007నే బోర్డు ఆఫ్ డైరెక్టర్లు తీర్మానం మేరకు చెల్లించాలని తీర్పు చెప్పింది.

బాధితురాలి ఇంటి వద్దే వాంగ్మూలం తీసుకోవాలి

అత్యాచారానికి గురై తీవ్ర భయభ్రాంతుల్లో ఉన్న అంధ బాలిక వాంగ్మూలాన్ని ఆమె ఇంటి వద్దే తీసుకోవాలని జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు

. హైదరాబాద్ మలక్‌పేట్‌లోని అంధ బాలికల హాస్టల్ బాలికపై బాత్‌రూమ్‌లు కడిగేందుకు వచ్చిన నరేశ్ అత్యాచారం చేశాడు. ఈ కేసులో మేజిస్ట్రేట్ ముందుకు వచ్చి వాంగ్మూలం ఇవ్వాలని బాలికపై దర్యాప్తు అధికారి ఒత్తిడి తెస్తున్నారంటూ ఆమె తల్లి హైకోర్టును ఆశ్రయించారు. బాలికకు ఇబ్బంది కలుగకుండా వాంగ్మూలం ఇంటి వద్దే తీసుకొని, సమీపంలోని మేజిస్ట్రేట్ ద్వారా వాంగ్మూనం నమోదు చేయాలని దర్యాప్తు అధికారులను న్యాయమూర్తి ఆదేశించారు

జీపీల తొలగింపు సరైనదే

జిల్లా కోర్టుల్లో ప్రభుత్వ న్యాయవాదులను తొలగిస్తూ ప్రభుత్వ ఇచ్చిన జీవో చట్టబద్ధమేనని హైకోర్టు తీర్పు చెప్పింది.గత ప్రభుత్వంలో నియమితులైన జీపీలు, ఏజీపీ, ఏపీపీ, ప్రత్యేక లాయర్ల నియామకాలు చేసిన వాళ్లను తొలగిస్తూ గత జూన్ 26న న్యాయ శాఖ జీవో 354ను రద్దు చేయాలని భువనగిరికి చెందిన జీపీ నాగారం అంజయ్య ఇతరులు ఆశ్రయించారు. పిటిషన్లను డిస్మిస్ చేసిన హైకోర్టు, ప్రభుత్వ జీవో చట్టబద్ధమేనని తేల్చింది

ఆర్డీవోకు అధికారం లేదు

భూ రికార్డులను సవరించడానికి రెవెన్యూ డివిజనల్ అధికారి(ఆర్డీవో)కి అధికారం లేదని హైకోర్టు స్పష్టం చేసింది. భూవివాదంపై అభ్యంతరాలుంటే జిల్లా కలెక్టర్ చట్ట ప్రకారం తిరిగి ఆ ప్రక్రియను చేపట్టవచ్చునని చెప్పింది. మెదక్ జిల్లా నాల్కల్ మండలం మామిడ్గిలో 50 ఎకరాల చెరువు పరిధిలోని భూమిపై తమకు హక్కులున్నాయంటూ అనిత ఇతరులు హైకోర్టును ఆశ్రయించారు.

భూ రికార్డులను సవరించిన మేరకు తహసీల్దార్ చర్యలు తీసుకోలేదన్న మరో పిటిషన్ వేశారు. నాల్కల్ మండలం మామిడ్గి చెరువు శిఖం భూమి విషయంలో ఆర్డీవో సుమోటోగా రికార్డులను మార్పు చేయడాన్ని హైకోర్టు ఆక్షేపించింది. వాటిని పూర్వపు స్థితిలోకి మార్పు చేయాలని ఆదేశించింది. ఈ మేరకు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే బెంచ్, ఆర్డీవో ఇచ్చిన ఆదేశాలను డిస్మిస్ చేసింది.

గోదావరిలో నీళ్లు మాయం

- గతంలోనే నిపుణుల నివేదిక
- ఏపీ ముఖ్యమంత్రికి రాఘవులు లేఖ
- దయాఫ్రం వాల్ నిర్మాణంపై ఉన్నతస్థాయి కమిటీ
- నిర్వాసితులకు ఉదారంగా పరిహారం, పునరావాసం కల్పించాలి



అమరావతి : గోదావరిలో ప్రవహించే నీరు పెద్ద మొత్తంలో మాయమవుతోందంటూ నిపుణులు గతంలోనే ఇచ్చిన నివేదికపై ప్రభుత్వ వైఖరేమిటో తెలియజేయాలని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు కోరారు. ఈ మేరకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఆయన సోమవారం ఒక లేఖ రాశారు. ముఖ్యమైన ఈ సాంకేతిక విషయాన్ని ప్రభుత్వం విస్మరిస్తుండటంతో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు. గోదావరిలో ప్రవహించే నీటిలో భారీ మొత్తంలో కోయిదా-పోలవరం మధ్య మాయవుతున్నట్లు, దీనిని నిరోధించకపోతే ప్రాజెక్టు పూర్తిచేసినా రిజర్వాయర్ నీరు కొన్ని రోజుల్లోనే ఇంకిపోతాయని నీటిపారుదలరంగ నిపుణులు గతంలోనే హెచ్చరించిన విషయాన్ని రాఘవులు ప్రస్తావించారు. ఈ సమస్యపై ప్రభుత్వ ఆదేశాల మేరకు పరిశోధన చేసిన భౌగోళిక నిపుణులు ఉపరితలంలో ఎక్కడా లీకు కావడం లేదని, నదీగర్భంలో లీకు జరుగుతుందే మోనని పరిశీలించాలని నివేదించారని తెలిపారు. ఈ అంశంపై ప్రభుత్వాలు ఇప్పటివరకూ అవసరమైన చర్యలు తీసుకోలేదని తెలిపారు. తీసుకునిఉంటే నిర్ధారణలేమిటో బయటపెట్టాలని కోరారు. లీకేజీ నిజమయితే కొత్త డయాఫ్రం వాల్ వల్ల ప్రయోజనం ఏమీ ఉండదని పేర్కొన్నారు. ఈ విషయాలను కీర్తిశేషులు ప్రొఫెసర్ శివాజీరావు, విశ్రాంత నీటిపారుదల ఇంజనీరు సుబ్బారాయుడు ప్రభుత్వం దృష్టికి గతంలోనే తెచ్చారని, ఈ విషయంపై ప్రభుత్వ వైఖరి ఏమిటో స్పష్టం చేయాలని ఆయన కోరారు.

పోలవరం ప్రాజెక్టు కార్యాలయంలో ఫైళ్లు దహనం అయ్యాయన్న వార్త దిగ్భ్రాంతిని కలిగించిందని పేర్కొన్నారు. దగ్ధమైన ఫైళ్లు భూనిర్వాసితుల పరిహారం చెల్లింపులకు సంబంధించినవని, చెల్లింపుల్లో జరిగిన అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకు ఫైళ్లను కాల్చివేశారని మీడియాలో కథనాలు వచ్చాయని, ఇది మరింత ఆందోళన కలిగించే అంశమని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు వల్ల ప్రత్యక్షంగా గిరిజనులకు ఏమాత్రమూ ప్రయోజనం లేకపోయినా కొంప, గోడు, భూములు సర్వస్వాన్ని త్యాగం చేశారని గుర్తుచేశారు. దీనిని దృష్టిలో ఉంచుకుని గిరిజన నిర్వాసితులకు ఎవరికన్నా ఎక్కువగా పరిహారం ఇచ్చి, పునరావాసం కల్పించడం ప్రభుత్వ ధర్మమని తెలిపారు. ఇప్పటి వరకూ నిర్వాసితుల సమస్యలను ప్రభుత్వాలు నిర్లక్ష్యంచేస్తూ వచ్చాయని పేర్కొన్నారు.

శాంతియుత పరిష్కారానికి సాయపడతాం

- కీవ్‌లో పర్యటనకు ముందు కేంద్రం ప్రతిపాదన

న్యూఢిల్లీ : ఉక్రెయిన్‌లో ఘర్షణలకు శాంతియుత పరిష్కారాన్ని కనుగొనడానికి సహాయపడేందుకు సిద్ధంగా వున్నట్లు భారత్ సోమవారం తెలిపింది. కీవ్‌లో ప్రధాని మోడీ పర్యటించడానికి కొద్ది రోజులు ముందుగా భారత ప్రభుత్వం ఈ ప్రతిపాదన చేసింది. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో చర్చలు జరిపేందుకు ఈ నెల 23న మోడీ కీవ్ వెళ్లనున్నారు. భారత్ ఎప్పుడూ దౌత్యాన్ని, చర్చల ప్రక్రియనే ప్రోత్సహిస్తుందని విదేశాంగ శాఖ కార్యదర్శి (పశ్చిమ) తన్మయ లాల్ మీడియా సమావేశంలో చెప్పారు. అధ్యక్షుడితో చర్చల్లో దీనిపై కూడా చర్చ జరుగుతుందని తెలిపారు. అటు రష్యా ఇటు ఉక్రెయిన్ రెండు దేశాలతో భారత్ సంబంధాలు కొనసాగిస్తోంది.

రాష్ట్రంలోనే ఉంటాం : కేన్స్ టెక్నాలజీ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తమ సంస్థ తెలంగాణలోనే కొనసాగుతుందని సెమీకండక్టర్ల తయారీ సంస్థ కేన్స్ టెక్నాలజీ సీఈవో రఘు పణికర్ స్పష్టం చేశారు. ఈ నెల 23న కొంగరకలాన్‌లో కేన్స్ సంస్థ అడ్వాన్స్ ఎలక్ట్రానిక్ యూనిట్‌ను ప్రారంభించబోతున్నదని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ముఖ్యఅతిథిగా ఆహ్వానించేందుకు సోమవారంనాడాయన సచివాలయానికి వచ్చారు. సీఎంను కలిసి ఆహ్వానపత్రం అందించారు. తమ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న 'ఓశాట్' యూనిట్ ఇండియన్ సెమికండక్టర్ మిషన్ పరిశీలనలో ఉన్నదనీ, ఐఎస్ఎం అనుమతి రాగానే దీని ఆపరేషన్స్ ప్రారంభిస్తామని చెప్పారు.